తుమ్మలను వదులుకోవడం..
కేసీఆర్ తప్పే
ఆ ప్రభావం వల్లే రాష్ట్రంలో బీఆర్ఎస్ ఓటమి
పార్టీ పెడితే.. వజ్రాయుధం లాంటి పార్టీ పెడతా
యువత, మహిళలకు అవకాశం ఇస్తా
ఆడబిడ్డల ఆత్మాభిమానం దెబ్బ తీయడం వల్లే
తిరుగుబాట్లు: ఖమ్మంలో మీడియాతో కవిత
10

www.andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI




బుధవారం | 19-11-2025 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 23 సంచిక (Issue) : 231
శ్రీ విశ్వావసునామ సంవత్సరం, దక్షిణాయనం, శరదృతువు, కార్తీకమాసం, బహుళపక్షం, తిథి: చతుర్దశి ఉ.9.44 తదుపరి అమావాస్య, నక్షత్రం: స్వాతి ఉ.7.59 తదుపరి విశాఖ, వర్జ్యం: మ.2.17 - 4.05, దుర్ముహూర్తం: ఉ.11.38-12.22, అమృతఘడియలు: రా.1.05 -2.53, రాహుకాలం: మ.12.00-1.30, సూర్యోదయం: 6.26, సూర్యాస్తమయం: 5.34
వరంగల్
Warangal | Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

ప్రజల సమాచారం..
బీఆర్ఎస్ పరం!
రాజకీయ లబ్ధికి వాడుకున్న గత సర్కారు.. ఇది తీవ్రమైన నేరం
సమగ్ర విచారణ జరిపిస్తాం
బాధ్యులపై కఠిన చర్యలు
'ఆంధ్రజ్యోతి'తో మంత్రి దుద్దిళ్ల
మీసేవ వాట్సాప్ సేవలు ప్రారంభం
14

మెట్రోలో భాగస్వామిగా
కేంద్రం
రెండో దశ విస్తరణపై వచ్చే ఏడాది మార్చి కల్లా నిర్ణయం
మూసీ పునరుజ్జీవంలో తొలివిడత 9 కి.మీ.ల పనులు
కేంద్ర మంత్రి మనోహర్‌లాల్ ఖట్టర్
14

2019 నాటి గ్రూప్-2
ఫలితాలు రద్దు
పార్ట్-బీ ట్యాపరింగ్ చేసిన వారి ఎంపిక తప్పు
మళ్లీ దిద్ది ఫలితాలు వెలువర్చండి
8 వారాల్లో నియామకాలు
టీజీపీఎస్సీకి హైకోర్టు ఆదేశాలు
10



హిడ్మా ఎన్‌కౌంటర్

ముగిసిన 'మోస్ట్ వాంటెడ్' నేత శకం


మాడ్వి హిడ్మా (ఫైల్)

గెరిల్లా గుండెలయ
దండకారణ్యంలో అలజడి రేపిన ఆదివాసీ నేత హిడ్మా
చదివింది 5వ తరగతి వరకే..
17 ఏళ్లకే దళంలోకి చేరిక
గెరిల్లా దాడుల్లో గట్టిపట్టు
వ్యూహం పన్నాడంటే టార్గెట్ ఫినిష్
పీఎల్‌జీఏ సేనానిగా పలు దాడులు
దళాలకు టీచర్.. భర్తకు చేదోడుగా
హిడ్మా భార్య రాజే ప్రస్థానం
ఆయనతోపాటే మృతి
13

అతనంటేనే...
మెరుపు దాడులకు మారు పేరు!
భద్రతా దళాలకు చిక్కడు...
ఎంత గాలించినా దొరకడు!

కూంబింగ్‌కు వెళ్లిన ప్రతిసారీ, 'అతను దొరకాలి' అని ఒకవైపు... 'అతని ఎరకు దొరకొద్దు' అని ఇంకోవైపు సాయుధ బలగాలు గట్టిగా కోరుకునే మావోయిస్టు నాయకుడు!


హిడ్మా భార్య రాజే

మావోయిస్టు పార్టీ కార్యదర్శి స్థాయి నేతలు, కేంద్ర కమిటీ సభ్యులు, కమాండర్లు... ఎందరు దొరుకుతున్నా... ఎందరు ఎన్‌కౌంటర్లలో తలవాలుస్తున్నా... 'అతడు కావాలి. అతడు దొరికితే చాలు' అని పోలీసులు పదేపదే పలవరించారు!

ఛత్తీస్‌గఢ్, ఒడిశా, తెలంగాణ.... ఇలా అనేక రాష్ట్రాల పోలీసులకు 'మోస్ట్ వాంటెడ్'... ఎట్టకేలకు, ఇన్నేళ్లకు ఆంధ్రప్రదేశ్ బలగాల చేతిలో ఎన్‌కౌంటర్ అయ్యాడు! ఆయనే... హిడ్మా! మావోయిస్టు పార్టీలో అతడే ఒక సైన్యం... పార్టీ అగ్రశ్రేణి సాయుధ దళానికి అతడే సారథి. '2025 నవంబరు 30లోపు హిడ్మాను మట్టుపెట్టాలి' అని కేంద్రం పెట్టుకున్న డెడ్‌లైన్‌కు ముందుగానే.. ఏపీ బలగాలు ఆ పని చేసేశాయి!

అల్లూరి సీతారామరాజు జిల్లా మారేడుమిల్లి అడవుల్లో మంగళవారం జరిగిన ఎన్‌కౌంటర్‌లో హిడ్మా, ఆయన సహచరి మడకం రాజే అలియాస్ రాజక్కతోపాటు మరో నలుగురు మరణించారు! 'ఆపరేషన్ కగార్'లో ఇదో కీలక మలుపు! ఆదివాసీ కుటుంబంలో పుట్టి... బాలుడిగానే ఆయుధం పట్టి... మావోయిస్టు పార్టీ అగ్రనేతల్లో ఒకరిగా ఎదిగిన మాడ్వి హిడ్మా మరణం మావోయిస్టు పార్టీకే పెద్ద దెబ్బగా విశ్లేషకులు అభివర్ణిస్తున్నారు.

ఏపీలోని మారేడుమిల్లి అడవుల్లో భారీ ఎన్‌కౌంటర్
మాడ్వి హిడ్మా, ఆయన భార్య సహా ఆరుగురి మృతి
'సేఫ్ జోన్' కోసం దండకారణ్యం దాటిన దళం
మారేడుమిల్లి మీదుగా ఒడిసా వెళ్లాలనే వ్యూహం
హిడ్మా ఉనికిపై ఏపీ పోలీసులకు పక్కా సమాచారం
నాలుగు రోజులుగా బలగాలతో కూంబింగ్
తెల్లవారుజామున ఎన్‌కౌంటర్.. ఆరుగురి మృతి
తప్పించుకున్న మరికొందరు మావోయిస్టులు
ఆయుధాలు, పేలుడు సామగ్రి స్వాధీనం

కాకినాడ/రంపచోడవరం/మారేడుమిల్లి, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): మావోయిస్టు పార్టీ 'మోస్ట్ వాంటెడ్' అగ్రనేత, గురితప్పని దాడుల వ్యూహకర్త, పీపుల్స్ లిబరేషన్ గెరిల్లా ఆర్మీ (పీఎల్‌జీఏ) కమాండర్ హిడ్మా (43) శకం ముగిసింది. మంగళవారం అల్లూరి సీతారామరాజు జిల్లా మారేడుమిల్లి అడవుల్లో జరిగిన ఎన్‌కౌంటర్‌లో... ఏపీ పోలీసుల చేతిలో హిడ్మా మరణించాడు. ఆయన జీవన సహచరి తోపాటు మరో నలుగురు నక్సల్స్ ఇదే ఎన్‌కౌంటర్‌లో చనిపోయారు. పోలీసు వర్గాలు అందించిన సమాచారం ప్రకారం... 'ఆపరేషన్ కగార్' పేరుతో కేంద్రం వేట... ఛత్తీస్‌గఢ్ అడవుల్లో వేలమంది బలగాలతో భారీ కూంబింగ్... అగ్రనేతల లొంగుబాటు, ఎన్‌కౌంటర్లతో ఉక్కిరిబిక్కిరి అవుతున్న మావోయిస్టులు...

మిగతా 13వ పేజీలో...


ఎన్‌కౌంటర్‌లో మరణించిన హిడ్మా

50 మంది నక్సల్స్ అరెస్టు
ఒకేరోజు ఏపీలోని 5 జిల్లాల్లో అదుపులోకి
బెజవాడ సమీపాన 32 మంది.. ఏలూరు, కొవ్వూరు, అమలాపురంలో 18 మంది
న్యూ ఆటోనగర్‌లో తలదాచుకున్న నక్సల్స్
8 గంటలపాటు ఆపరేషన్.. అరెస్టు
వీరంతా హిడ్మా, అగ్రనేత దేవ్‌జీ రక్షణ సిబ్బందే
ఏపీలో దాడులకు నక్సల్స్ ప్రణాళిక!?
11

ఇది బూటకపు ఎన్‌కౌంటర్!
హిడ్మాను పట్టుకొని.. కాల్చిచంపారు
విచారణ జరపాలి: ప్రజాసంఘాలు
ఖనిజ వనరులను కార్పొరేట్లకు అప్పగించే కుట్ర: హరగోపాల్
జంగిల్‌రాజ్‌కు పరాకాష్ఠ: కూనంనేని
'డెడ్‌లైన్'కు ముందే ఎన్‌కౌంటర్
ఈనెల 30లోపే ముగించాలన్న షా
మావోయిస్టులకు కోలుకోలేని దెబ్బ
చివరి దశకు 'ఆపరేషన్ కగార్'
దేవ్‌జీ @ తిరుపతి ఎక్కడ?..
13



ఆ దేశపు మూర్ఖులపై అరిచా..

» అందుకే గొంతు బొంగురుపోయింది : ట్రంప్



వాషింగ్టన్, నవంబరు 18: ఓ దేశంతో వాణిజ్య చర్చల సందర్భంగా మూర్ఖపు వ్యక్తులపై గట్టిగా అరిచానని, దానితో తన గొంతు బొంగురుపోయిందని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ వ్యాఖ్యానించారు. అయితే ఆ దేశం ఏదో చెప్పడానికి నిరాకరించారు. సోమవారం అధ్యక్ష కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. ఈ సమయంలో తన గొంతు బొంగురుపోవడాన్ని ప్రస్తావిస్తూ.. "వాణిజ్యం, సుంకాల అంశంపై చర్చల సందర్భంగా ఓ దేశపు వారిపై గట్టిగా అరిచాను. ఎందుకంటే వారు మూర్ఖులు. ఒప్పందంపై పునఃసంప్రదింపులకు ఆ దేశం ప్రయత్నం చేస్తోంది. దాంతో చిరాకు వేసింది. వారికి నా అభిప్రాయాన్ని గట్టిగా కుండబద్దలు కొట్టినట్టు చెప్పాను" అని ట్రంప్ పేర్కొన్నారు. అమెరికాతో వాణిజ్య ఒప్పందంపై భారత్ సహా పలు ఆసియా, లాటిన్ అమెరికా దేశాలు చర్చలు జరుపుతున్నాయి. ఇదిలా ఉండగా, అమెరికా, భారత్ మధ్య వాణిజ్య ఒప్పందంపై చర్చలు కొలిక్కి వస్తున్నాయని, త్వరలోనే శుభవార్త వినొచ్చని కేంద్ర వాణిజ్య మంత్రి గోయల్ పేర్కొన్నారు.

శబరిమలకు ఒక్కరోజే 2 లక్షల మంది భక్తులు



పథనంతిట్ట, నవంబరు 18: శబరిమల అయ్యప్ప ఆలయానికి భక్తులు పోటెత్తుతున్నారు. మంగళవారం దాదాపు 2 లక్షల భక్తులు రావడంతో ఆలయ పరిసరాలు కిటకిటలాడాయి. పంబా నుంచి సన్నిధానం వరకూ దారి పొడవునా భక్తులు బారులుతీరారు. రద్దీని అదుపు చేయడానికి ఏర్పాటుచేసిన బ్యారికేడ్లపైకి చాలామంది ఎక్కగా, వీరిని నియంత్రించడంలో పోలీసులు పూర్తిగా విఫలమయ్యారు. శబరిమలకు ఇంత పెద్దసంఖ్యలో భక్తులు రావడాన్ని ఇప్పటివరకూ చూడలేదని ట్రావెన్‌కోర్ దేవస్థానం బోర్డు (టీడీబీ) అధ్యక్షుడు కె. జయకుమార్ అన్నారు. భక్తులు స్పాట్ బుకింగ్ కోసం పంబాకు రావాల్సిన అవసరం లేకుండా నీలక్కల్‌లోనే ఏడు అదనపు కౌంటర్లు ఏర్పాటు చేస్తామని వెల్లడించారు. శబరిమలకు ప్రవేశాన్ని రోజుకు లక్ష మంది పరిమితం చేస్తామన్నారు. అలాగే స్పాట్ బుకింగ్ 20 వేల మందికి మాత్రమే అనుమతిస్తామని స్పష్టం చేశారు.

జంతువుల దాడితో దెబ్బతిన్న పంటలకూ బీమా

న్యూఢిల్లీ, నవంబరు 18: అటవీ జంతువుల దాడితో దెబ్బతిన్న పంటలకు కూడా వచ్చే ఖరీఫ్ సీజన్(2026 వానాకాలం) నుంచి ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన వర్తించనుంది. ఈ మేరకు కేంద్రప్రభుత్వం మంగళవారం ప్రకటన విడుదల చేసింది. దీంతో పాటు వర్షాలు, వరదలతో మునిగిపోయిన వరిపంటకు కూడా ఈ పథకం వర్తిస్తుందని తెలిపింది. అడవులు ఎక్కువగా ఉన్న కేరళ లాంటి రాష్ట్రాల్లో ఏనుగులు, పలు రాష్ట్రాల్లో అడవి పందులు, కోతులు పంటలను తీవ్ర దెబ్బతీస్తున్నాయి. ఈ నేపథ్యంలోనే కేంద్రం తాజా నిర్ణయం తీసుకొంది. అయితే, ఫసల్ బీమా పరిధిలోకి వచ్చే అటవీ జంతువులు ఏవనేది తమ భౌగోళిక పరిస్థితులను బట్టి ఆయా రాష్ట్రాలు నోటిఫై చేస్తాయని కేంద్రం తెలిపింది.

శిశువుల అదృశ్యం ఆందోళనకరం: సుప్రీంకోర్టు

న్యూఢిల్లీ, నవంబరు 18: దేశంలో శిశువుల అదృశ్యంపై సుప్రీంకోర్టు ఆందోళన వ్యక్తం చేసింది. ఇది తీవ్రమైన సమస్య అని మౌఖికంగా వ్యాఖ్యానించింది. పిల్లల అదృశ్యానికి సంబంధించిన కేసులు పరిష్కారం కావడం లేదని పేర్కొంటూ గురియా స్వయం సేవీ సంస్థాన్ అనే స్వచ్ఛంద సంస్థ దాఖలు చేసిన పిటిషన్‌పై మంగళవారం విచారణ జరిపింది. ఈ సందర్భంగా జస్టిస్ నాగరత్న మాట్లాడుతూ "దేశంలో ప్రతి 8నిమిషాలకు ఒక శిశువు అదృశ్యమవుతున్నట్టు ఓ పత్రికలో చదివాను. ఇది చాలా తీవ్రమైన సమస్య" అని పేర్కొన్నారు. దేశంలో దత్తత ప్రక్రియ సంక్లిష్టంగా ఉందని, ఆ కారణంగానే అక్రమంగా పిల్లలను పెంపకానికి తీసుకుంటున్నారని చెప్పారు. పిల్లల అదృశ్యంపై నమోదైన కేసుల దర్యాప్తు కోసం అన్ని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలు నోడల్ అధికారులను నియమించాలన్న ఆదేశాలు అమలుకాకపోవడంపై ప్రశ్నించింది. కేంద్రం ఆరు వారాల గడువు ఇవ్వాలని కోరగా, ధర్మాసనం తిరస్కరించింది. డిసెంబరు 9లోగా ఈ ప్రక్రియను పూర్తి చేయాలంది.

బంగ్లాదేశ్‌లో నిరసనలు.. ఇద్దరి మృతి

ఢాకా, నవంబరు 18: అవామీ లీగ్ మద్దతుదారుల నిరసనలతో బంగ్లాదేశ్ అట్టుడికిపోతోంది. బంగ్లాదేశ్ మాజీ ప్రధాని షేక్ హసీనాకు ఇంటర్నేషనల్ క్రైమ్స్ ట్రైబ్యునల్ (ఐసీటీ) మరణశిక్ష విధించడాన్ని వ్యతిరేకిస్తూ ఆందోళనకారులు దేశవ్యాప్తంగా ధర్నాలు, రాస్తారోకోలు చేస్తున్నారు. పలు హైవేలను దిగ్బంధించారు. పోలీసులతో ఘర్షణలకు దిగారు. ఢాకాలో పెద్ద సంఖ్యలో నిరసనకారులు వీధుల్లోకి చేరారు. కొన్ని చోట్ల నిరసనలు హింసాత్మకంగా మారాయి. ఆందోళనకారులను చెదరగొట్టేందుకు పోలీసులు లాఠీచార్జితో పాటు బాష్పవాయువును ప్రయోగించారు. ఈ అల్లర్లలో ఇద్దరు మరణించినట్లు స్థానిక మీడియా కథనాలు వెల్లడించాయి.

ప్రాజెక్టులు పూర్తయ్యాకా పర్యావరణ అనుమతులు!


తీసుకోవచ్చన్న అత్యున్నత న్యాయస్థానం



» అలా అనుమతించడాన్ని నిషేధిస్తూ గతంలో ఇచ్చిన తీర్పు ఉపసంహరణ

న్యూఢిల్లీ, నవంబరు 18: రియల్ ఎస్టేట్, మైనింగ్ తదితర ప్రాజెక్టులకు 'ఎక్స్ పోస్ట్ ఫ్యాక్టో (పూర్తయ్యా)' పర్యావరణ అనుమతులు ఇవ్వడాన్ని నిషేధిస్తూ గతంలో జస్టిస్ అభయ్ ఎస్ ఓకా, జస్టిస్ ఉజ్జల్ భయాన్ ధర్మాసనం ఇచ్చిన తీర్పును.. తాజాగా సీజేఐ నేతృత్వంలోని త్రిసభ్య ధర్మాసనం 2:1 మెజారిటీతో ఉపసంహరించింది. ఈ ధర్మాసనంలోనూ ఉన్న న్యాయమూర్తి జస్టిస్ ఉజ్జల్ భయాన్ మాత్రం తాను గతంలో ఇచ్చిన తీర్పునకే కట్టుబడి ఉన్నారు. మిగతా ఇద్దరు న్యాయమూర్తుల తీర్పుతో ఆయన విభేదించారు. ఎలాంటి అనుమతులూ లేకుండా ప్రాజెక్టులు చేపట్టి.. అవి పూర్తయ్యాక పర్యావరణ అనుమతులు (ఎక్స్ పోస్ట్ ఫ్యాక్టో) తీసుకుంటామనడం పర్యావరణచట్టానికి విరుద్ధమని ఈ ఏడాది మేలో జస్టిస్ అభయ్ ఎస్ ఓకా, జస్టిస్ ఉజ్జల్ భయాన్ ధర్మాసనం తీర్పునిచ్చింది. దీనికి సంబంధించి.. 'ముందు కట్టేసినా తర్వాత అనుమతులు ఇస్తాం' అనే మార్గదర్శకాలతో కేంద్ర ప్రభుత్వం జారీ చేసిన 2017, 2021 నాటి ఆఫీస్ మెమొరాండాలను, ఒక నోటిఫికేషన్‌ను కొట్టివేసింది. భవిష్యత్తులో ఏ ప్రాజెక్టుకూ పోస్ట్-ఫ్యాక్టో పర్యావరణ అనుమతులు ఇవ్వరాదని తేల్చిచెప్పింది. అయితే, ఆ తీర్పు వల్ల ఎన్నో ప్రాజెక్టులను కూల్చేయాల్సి వస్తుంది, దీనివల్ల రూ.వేల కోట్ల నష్టం వాటిల్లుతుందని పేర్కొంటూ.. పలు కంపెనీలు సుప్రీంకోర్టులో రివ్యూ పిటిషన్ వేశాయి. దానిపై సీజేఐ జస్టిస్ బీఆర్ గవాయ్, జస్టిస్ ఉజ్జల్ భయాన్, జస్టిస్ కె.వినోద్ చంద్రన్‌లతో కూడిన త్రిసభ్య ధర్మాసనం విచారణ జరిపి.. ఆ తీర్పును రీకాల్ చేసింది. 2020లో అలెంబిక్ ఫార్మాస్యూటికల్స్ లిమిటెడ్ కేసును విచారించిన సుప్రీం ద్విసభ్య ధర్మాసనం.. పోస్ట్ ఫ్యాక్టో పర్యావరణ అనుమతులు ఇవ్వకూడదని చెప్పినప్పటికీ, అప్పటికే ఇచ్చిన అనుమతులను రద్దు చేయలేదని, జరిమానా వేసి ఆ అనుమతులను క్రమబద్ధీకరించిందని సీజేఐ జస్టిస్ గవాయ్ తన తీర్పులో గుర్తుచేశారు. అలాగే డాక్టర్ స్వామి వర్సెస్ కర్ణాటక కాలుష్య నియంత్రణ బోర్డు, ఎలక్ట్రోస్టీల్ స్టీల్స్ లిమిటెడ్ వర్సెస్ యూనియన్ ఆఫ్ ఇండియా, పహ్వా ప్లాస్టిక్స్ కేసుల్లో సైతం.. అసాధారణ సందర్భాల్లో పోస్ట్ ఫ్యాక్టో అనుమతులు ఇవ్వొచ్చని తీర్పులు వచ్చిన సంగతి గుర్తుచేశారు. ఈ కేసులు వేటినీ పరిగణనలోకి తీసుకోకుండా వనశక్తి కేసులో ద్విసభ్య ధర్మాసనం తీర్పునిచ్చిందని ఆయన అభిప్రాయపడ్డారు. 2017, 2021లో కేంద్రం జారీ చేసిన ఆఫీస్ మెమొరాండాల్లో.. అనుమతించదగ్గ ప్రాజెక్టులకు మాత్రమే పోస్ట్ ఫ్యాక్టో అనుమతులు ఇవ్వొచ్చని ఉందని కూడా ఆయన గుర్తుచేశారు. వనశక్తి తీర్పు ప్రకారం అలా ఇవ్వకూడదు కాబట్టి.. కట్టిన నిర్మాణాల్ని కూల్చేయాల్సి వస్తుందని.. దానివల్ల పర్యావరణ కాలుష్యం తగ్గకపోగా మరింత పెరుగుతుందని, అది ప్రజాప్రయోజనాలకు అనుకూలం కాదని సీజేఐ అభిప్రాయపడ్డారు. వనశక్తి కేసులో సైతం ద్విసభ్య ధర్మాసనం.. 'భవిష్యత్తు ప్రాజెక్టులకు' పోస్ట్ ఫ్యాక్టో అనుమతులు ఇవ్వొద్దని తీర్పునిచ్చింది తప్ప, పోస్ట్ ఫ్యాక్టో అనుమతులు పొందిన ప్రాజెక్టులను కూల్చాలని చెప్పలేదని గుర్తుచేశారు. ఆ తీర్పు వల్ల.. సాంకేతిక కారణాలతో, కోర్టు మధ్యంతర ఉత్తర్వులతో అనుమతులు పొందలేకపోయిన ప్రాజెక్టులకు తీవ్ర నష్టం వాటిల్లుతుంది కాబట్టి వనశక్తి తీర్పును రీకాల్ చేస్తున్నట్టు పేర్కొన్నారు. ఈ అంశాన్ని తగిన బెంచ్ ముందుకు పంపించాలని ఆదేశించారు. కాగా.. ధర్మాసనంలోని మిగతా ఇద్దరి (మెజారిటీ) తీర్పుతో విభేదించిన ఉజ్జల్ భయాన్.. ముందస్తు పర్యావరణ అనుమతులు తప్పనిసరి అయిన ప్రాజెక్టులకు పోస్ట్ ఫ్యాక్టో అనుమతులు ఇవ్వకూడదని, కానీ పలు కేసుల్లో సుప్రీం ధర్మాసనాలు ఆ నిబంధనను అనుసరించకుండా తీర్పునిచ్చాయని పేర్కొన్నారు. "కాబట్టి అవి వాస్తవాలను, చట్టాలను పరిగణనలోకి తీసుకోకుండా ఇచ్చిన తీర్పులు. తర్వాత అలాంటి కేసులను విచారించే సమానస్థాయి ధర్మాసనాలు ఆ తీర్పులకు కట్టుబడాల్సిన అవసరం లేదు" అని ఆయన స్పష్టం చేశారు. అలాగే.. ప్రాజెక్టులను కూల్చివేయడం వల్ల కాలుష్యం మరింత పెరుగుతుందన్న వాదనను కూడా అంగీకరించకూడదని, ఉల్లంఘనలకు పాల్పడిన వారు తమ అక్రమాలను కప్పిపుచ్చుకోవడానికి ఇలాంటి వాదనలను ముందుకు తెస్తారని ఆయన పేర్కొన్నారు.

లోకం తీరు



ప్రధాని ప్రసంగం విన్నందుకు సంతోషించా!

» మోదీ 'రాంనాథ్ గోయెంకా' స్మారక ఉపన్యాసంపై థరూర్ ప్రశంసల వర్షం

న్యూఢిల్లీ, నవంబరు 18: ప్రధాని మోదీపై కాంగ్రెస్ ఎంపీ శశిథరూర్ మరోసారి ప్రశంసలు కురిపించారు. ప్రధాని పాల్గొన్న ఓ సభకు తాను కూడా హాజరయ్యానని, ఆయన ప్రసంగం విన్న సభికులలో తానూ ఒకడిని అయినందుకు సంతోషిస్తున్నానని తెలిపారు. 'ఇండియన్ ఎక్స్‌ప్రెస్' సోమవారం నిర్వహించిన ఓ కార్యక్రమంలో మోదీ రామ్‌నాథ్ గోయెంకా స్మారక ఉపన్యాసం ఇచ్చారు. ఈ సభకు శశిథరూర్ కూడా హాజరయ్యారు. దీనిపైనే ఆయన తాజాగా స్పందించారు. ఎల్లప్పుడూ ఎన్నికల మూడ్‌లోనే ఉంటానని తన మీద విమర్శలున్నాయని.. కానీ, తాను ప్రజల సమస్యలు పరిష్కరించే ఎమోషనల్(భావోద్వేగ) మూడ్‌లో ఉన్నానని మోదీ ఈ ఉపన్యాసంలో చెప్పారు. కాగా, "మోదీ ప్రసంగం ఆర్థిక దృక్కోణానికి, జాతిని ఆచరణలోకి దింపే సాంస్కృతిక పిలుపునకూ, దేశ ప్రగతి కోసం అవిరామంగా కృషి చేయాలనే దృఢదీక్షకు అద్దం పట్టింది" అంటూ శశిథరూర్ అభిప్రాయపడ్డారు. ఈ సభకు మాజీ కాంగ్రెస్ నేత గులాంనబీఆజాద్ కూడా హాజరై, థరూర్ పక్కనే కూర్చున్నారు.

అనిల్ అంబానీపై దాఖలైన పిల్‌పై 3 వారాల్లో జవాబివ్వండి: సుప్రీం

న్యూఢిల్లీ, నవంబరు 18: రిలయన్స్ అడాగ్ పరిశ్రమలు అక్రమాలకు పాల్పడుతున్నాయంటూ దాఖలైన పిల్‌పై సమాధానం ఇవ్వాలని సుప్రీంకోర్టు మంగళవారం కేంద్రం, సీబీఐ, ఈడీలకు నోటీసులు పంపించింది. ఆ గ్రూపు చైర్మన్ అనిల్ అంబానీతో పాటు, వివిధ కంపెనీలు అక్రమాలకు పాల్పడ్డాయని, న్యాయస్థానం పర్యవేక్షణలో విచారణ జరపాలని కోరుతూ కేంద్ర మాజీ కార్యదర్శి ఈఏఎస్ శర్మ దాఖలు చేసిన ఈ పిటిషన్‌పై 3 వారాల్లో సమాధానం ఇవ్వాలని ఆదేశించింది.

రాకెట్ దాడులకు కుట్ర

డ్రోన్లను పరీక్షించిన ఫరీదాబాద్ మాడ్యూల్

» అది విఫలమవటంతో కారు బాంబు దాడి



అల్ ఫలాహ్ వర్సిటీలో ఈడీ అధికారుల సోదాలు

న్యూఢిల్లీ, నవంబరు 18: ఫరీదాబాద్ వైట్ కాలర్ ఉగ్ర ముఠా దేశంలో కొత్త తరహా దాడులకు కుట్ర పన్నినట్లు ఎన్‌ఐఏ దర్యాప్తులో బయటపడింది. ఢిల్లీలోని ఎర్రకోట వద్ద ఈ నెల 10న ఆత్మాహుతి దాడికి పాల్పడిన జైషే మహ్మద్ ఉగ్రవాది డాక్టర్ ఉమర్ నబీ అనుచరుడు జాసిర్ బిలాల్ వని అలియాస్ డానిష్‌ను అరెస్టు చేసి విచారించగా కుట్రలో కొత్తకోణం వెల్లడైంది. ఈ ఉగ్ర వైద్యుల ముఠా ఢిల్లీ, మరికొన్ని చోట్ల డ్రోన్ల ద్వారా రాకెట్ దాడులకు ప్రణాళిక వేసినట్లు జాసిర్ వెల్లడించాడు. గాజాలోని హమాస్ ఉగ్రవాద సంస్థ ఇజ్రాయెల్‌పై చేసే దాడులతో వీరు స్ఫూర్తి పొందినట్లు తెలిపాడు. ఢిల్లీలోని అత్యంత కీలకమైన ప్రాంతాల్లో రాకెట్ దాడులు చేసి మారణహోమం సృష్టించేందుకు వీరు కుట్ర చేసినట్లు వివరించాడు. అందుకోసం రాకెట్లు తయారుచేసి డ్రోన్లకు అమర్చి పేల్చే ప్రయోగాలు కూడా చేశారని, కానీ అవి విఫలమయ్యాయని వెల్లడించాడు. దీంతో కారు బాంబు దాడులు చేయాలని నిర్ణయించుకున్నట్లు తెలిపాడు.

దాడికి ముందే వీడియో రికార్డు

ఆత్మాహుతికి పాల్పడిన ఉగ్రవాది ఉమర్ నబీ.. ఆ దాడికి ముందే అల్ ఫలాహ్ యూనివర్సిటీలోని తన గదిలో రికార్డు చేసిన ఓ వీడియో తాజాగా వెలుగులోకి వచ్చింది. ఆ వీడియోలో ఆత్మాహుతి దాడిని సమర్థిస్తూ నబీ మాట్లాడాడు. 'ఆత్మాహుతి దాడులను చాలామంది తప్పుగా అర్థం చేసుకుంటున్నారు. కానీ, అది సరైన పనే. ఆత్మాహుతి దాడి అమరత్వం పొందేందుకు చేసే ఆపరేషన్' అని ఆ వీడియోలో నబీ పేర్కొన్నాడు. ఇతడు జాసిర్ బిలాల్‌ను కూడా ఆత్మాహుతి దాడికి ఒప్పించినట్లు దర్యాప్తులో తేలింది. కాగా, అల్ ఫలాహ్ మెడికల్ కాలేజీలో కశ్మీరీ ఫ్యాకల్టీ అంతా కలిసి ఉగ్రవాద భావజాలాన్ని ఒక పద్ధతి ప్రకారం వ్యాపింపజేసినట్లు పోలీసులు వైద్యురాలు షహీన్ విచారణలో వెల్లడించింది. కాలేజీలో 70% ఫ్యాకల్టీ కశ్మీర్‌కు చెందినవారేనని, వీరంతా గ్రూప్‌గా ఏర్పడి ఇతర ఫ్యాకల్టీపై ఆధిపత్యం చెలాయించేవారని తేలింది.

అల్ ఫలాహ్ వర్సిటీ వ్యవస్థాపకుడి అరెస్ట్

అల్ ఫలాహ్ వర్సిటీ వ్యవస్థాపకుడు జావేద్ అహ్మద్ సిద్దిఖీని ఈడీ అధికారులు మంగళవారం అరెస్టు చేశారు. మనీలాండరింగ్ నిరోధక చట్టం (పీఎంఎల్‌ఏ) కింద అతడిపై కేసు నమోదుచేసి, అరెస్టు చేసినట్లు అధికారులు తెలిపారు. మంగళవారం ఉదయం అల్ ఫలాహ్ వర్సిటీతోపాటు జావేద్ నివాసంలోనూ ఈడీ అధికారులు సోదాలు నిర్వహించారు. దాదాపు 9 షెల్ కంపెనీలు ఏర్పాటు చేసి ఆయన మనీలాండరింగ్‌కు పాల్పడినట్లు గుర్తించారు.

'రిసిన్' నిందితుడిపై ఖైదీల దాడి

అహ్మదాబాద్, నవంబరు 18: ఉగ్రవాద చర్యల్లో భాగంగా మంచినీటిలో 'రిసిన్' అనే విష పదార్థాన్ని కలపడానికి ప్రయత్నించడాన్న అనుమానంపై అరెస్టయిన అహ్మద్ మొహియుద్దీన్ సయ్యద్‌పై సబర్మతి జైలులో దాడి జరిగినట్టు మంగళవారం అధికారులు తెలిపారు. గాయాలయినప్పటికీ ప్రమాదమేమీ లేదని చెప్పారు. హైదరాబాద్‌కు చెందిన ఎంబీబీఎస్ వైద్యుడైన సయ్యద్‌ను ఈ నెల 8న గుజరాత్ ఏటీఎస్ అరెస్టు చేసింది. హైదరాబాద్‌లోని ఆయన ఇంట్లో సోదాలు నిర్వహించిన అనంతరం రిసిన్‌ను స్వాధీనం చేసుకుంది. అనంతరం అత్యంత భద్రత ఉండే అహ్మదాబాద్‌లోని సబర్మతి సెంట్రల్ జైలుకు తరలించింది. ఆయనతో పాటు అనుమానితులుగా ఉన్న మరో ఇద్దర్ని కూడా అదే జైలులో ఉంచింది. అయితే ఏదో విషయమై జైలు లోపల ముగ్గురు ఖైదీలు ఆయనతో గొడవ పడి దాడి చేశారని జైలు సూపరింటెండెంట్ గౌరవ్ అగర్వాల్ చెప్పారు. ఆ దాడిలో ఆయనకు గాయాలయ్యాయని, వెంటనే సమీపంలోని ఆస్పత్రికి తరలించి చికిత్స చేయించినట్టు తెలిపారు. తిరిగి జైలుకు తీసుకొచ్చామని చెప్పారు.

20 ఏళ్లు దాటిన వాహనాలకు భారీ ఫిట్‌నెస్ చార్జీలు

న్యూఢిల్లీ, నవంబరు 18: కేంద్ర ప్రభుత్వం దేశవ్యాప్తంగా వాహనాల ఫిట్‌నెస్ పరీక్షల ఫీజులను భారీగా పెంచింది. పాత వాహనాలను రోడ్ల మీదకు తెచ్చే విషయంలో ప్రజలను నిరుత్సాహపరిచే లక్ష్యంతో ఈ నిర్ణయం తీసుకున్నారు. కొన్ని వాహనాలకు ఫీజులను ఏకంగా పదిరెట్లు పెంచారు. సోమవారం ఈ ఉత్తర్వులు విడుదల అయ్యాయి. గతంలో 15 ఏళ్లు దాటిన వాహనాలకే అధిక ఫిట్‌నెస్ చార్జీలు ఉండేవి. ఇప్పుడు దాన్ని పదేళ్లకు తగ్గించారు. గతంలో పదిహేనేళ్లు దాటిన అన్ని వాహనాలకు ఒకే రకమైన ఫిట్‌నెస్ చార్జీలు ఉండేవి. ఇప్పుడు 10-15, 15-20, 20+ వయసు వాహనాలుగా విభజించారు. 15 ఏళ్లలోపు వాహనాల ఫిట్‌నెస్ చార్జీలనూ పెంచారు. ద్విచక్ర వాహనాలకు రూ.400, లైట్ మోటార్ వాహనాలకు రూ.600, భారీ, మధ్యతరహా వాహనాలకు రూ.1,000 వసూలు చేయనున్నారు.

	10 ఏళ్ల లోపు	10-15	15-20	20+	
				పాత రేట్లు	కొత్తరేట్లు
భారీ వాణిజ్య వాహనాలు	రూ.1000	5000	12,500	రూ.2,500	రూ.25,000
మధ్యతరహా వాణిజ్య వాహనాలు	రూ.1000	1300	10,000	రూ.1,800	రూ.20,000
లైట్ మోటార్ వాహనాలు	రూ.600	1000	5,000	-	రూ.15,000
త్రిచక్ర వాహనాలు	రూ.600	800	3,000	-	రూ.7,000
ద్విచక్ర వాహనాలు	రూ.400	500	1,000	రూ.600	రూ.2,000



డీఎన్ఏ పరీక్షల కోసం మృతుల కుటుంబ సభ్యులను సౌదీకి పంపించడానికి వారిని ఎయిర్‌పోర్ట్‌కు బస్సులో తరలిస్తున్న దృశ్యం

మృతుల గుర్తింపు సవాలే!

సౌదీ రోడ్డు ప్రమాదంలో పూర్తిగా కాలిపోయిన మృతదేహాలు

44 మందిని గుర్తించేందుకు డీఎన్ఏ పరీక్షలు తప్పనిసరి

మదీనా చేరుకున్న మంత్రి అజారుద్దీన్ బృందం

గల్ఫ్‌ప్రతినిధి/రాంనగర్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): సౌదీ అరేబియాలోని మదీనా సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో సజీవ దహనమైన హైదరాబాదీల గుర్తింపు సవాలుగా మారింది. ఈ ఘటనలో 44 మంది మంటలంటుకొని పూర్తిగా కాలిపోవడంతో మృతదేహాల గుర్తింపు కష్టతరంగా మారింది. దీంతో డీఎన్ఏ పరీక్షల కోసం మృతుల కుటుంబ సభ్యులను సౌదీకి పంపించడానికి రాష్ట్ర ప్రభుత్వ అధికారులు ఏర్పాట్లు చేశారు. మరోవైపు మంత్రి అజారుద్దీన్ నేతృత్వంలోని బృందం మంగళవారం మదీనా చేరుకుంది. భారత కాన్సుల్ జనరల్ ఫహద్ అహ్మద్ ఖాన్ సూరితో సమావేశమై చర్చించారు. సౌదీ అరేబియా ప్రభుత్వం కల్పించే సాధారణ బీమా పథకం కింద రోడ్డు ప్రమాద మృతులకు ఒక్కొక్కరికి లక్ష రియాళ్లు అంటే దాదాపు రూ23 లక్షలు చెల్లిస్తారు. కానీ, దానికి మరణ ధ్రువీకరణ పత్రం కావాలి. ముందు మృతులను గుర్తిస్తే.. సౌదీ అధికారులు మరణ ధ్రువీకరణ పత్రం ఇస్తారు.

సౌదీ మసీదులో ప్రార్థనలు జరిపించాలి

సౌదీలో మృతి చెందిన వారి ఆత్మకు శాంతి చేకూరేందుకు మదీనాలోని మసీదులో ప్రార్థనలు జరిపించాలని విద్యానగర్‌కు చెందిన మృతుడు నసీరుద్దీన్ బావమరిది మహ్మద్ షాహిద్ కోరారు. సౌదీలో అధికారికంగా చివరి ప్రార్థనలు చేసేలా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అక్కడి ప్రభుత్వంతో మాట్లాడి ఒప్పించాలని విజ్ఞప్తి చేశారు. కాగా, నసీరుద్దీన్ కుటుంబ సభ్యులకు సంబంధించి ఏడుగురిని సౌదీకి తీసుకెళ్లారు.

ఏసీబీని చూసి ఎస్ఐ పరార్

» వెంటబడి పట్టుకున్న ఏసీబీ అధికారులు

» మెదక్ జిల్లా టేక్మాల్‌లో ఘటన

» ఎస్ఐ అరెస్టుతో ఠాణా ముందే టపాసులతో స్థానికుల సంబురాలు



టేక్మాల్ పోలీసు స్టేషన్ ఎదుట టపాసులు కాలుస్తున్న స్థానికులు



ఏసీబీకి చిక్కిన రాజేశ్

హైదరాబాద్/ టేక్మాల్/ అడ్డగుట్ట/ రాంగోపాల్‌పేట/ గోపాల్‌పేట, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): సమస్య పరిష్కారం కోసం పోలీస్‌స్టేషన్ మెట్లెక్కాలంటే భయపడతాం. కానీ, ఓ పోలీసు స్టేషన్ వద్దకు జనం భారీగా తరలి వచ్చారు. అంతటితో ఆగలేదు. పోలీస్ స్టేషన్ ఎదుటే టపాసులు కాల్చి సంబురాలు కూడా చేసుకున్నారు. ఈ ఘటన మెదక్ జిల్లా టేక్మాల్ మండల కేంద్రంలో మంగళవారం చోటు చేసుకుంది. స్థానిక ఎస్ఐ రాజేశ్‌ను ఏసీబీ అధికారులు అరెస్టు చేయడమే దీనికి కారణం. మెదక్ ఏసీబీ డీఎస్పీ సుదర్శన్ తెలిపిన వివరాల మేరకు టేక్మాల్ మండలం అస్సద్ మహ్మద్ పల్లి తండా శివారులో ఈ నెల ఒకటో తేదీన వరికోత మిషన్ బ్యాటరీలు, గ్రీస్ మిషన్ దొంగలు ఎత్తుకెళ్లారు. దీనిపై బాధితుడు టేక్మాల్ ఎస్ఐ రాజేశ్‌కు ఫిర్యాదు చేశారు. దీని ఆధారంగా తనిఖీ చేయడంతో ఆ గ్రామంలోని కొందరి వద్ద దొరికాయి. సదరు నిందితులను పోలీస్‌స్టేషన్‌కు పిలిపించిన ఎస్ఐ రాజేశ్ విచారించడంతో వారు ఆ వస్తువులను సంబంధిత యజమానికి అప్పగించారు. కానీ, కొనసాగుతున్న కేసు రాజీ పరిష్కారం చూపుతానని.. అందుకు రూ.40 వేలు లంచం ఇవ్వాలని నిందితుల వద్ద ఎస్ఐ డిమాండ్ చేశాడు. వెంటనే వారు మధ్యవర్తికి ఫోన్‌పే ద్వారా రూ.10 వేలు చెల్లించినా.. మరునాటి నుంచే మిగతా సొమ్ము కోసం ఒత్తిడి తెస్తుండటంతో నిందితులు ఏసీబీ అధికారులను ఆశ్రయించారు. ఏసీబీ అధికారుల సూచన మేరకు ఎస్ఐ రాజేశ్‌కు పోలీస్ స్టేషన్‌లోనే నిందితులు డబ్బులు ఇచ్చారు. అక్కడే మాటు వేసి, ఎస్ఐని ఏసీబీ అధికారులు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. తాము ఏసీబీ అధికారులమని చెప్పడంతో వారిని తోసివేసి పోలీస్‌స్టేషన్ భవనంపై కెక్కి దూకిన ఎస్ఐ.. పొలాల్లోకి పరుగు తీశాడు. సుమారు 20 నిమిషాల పాటు వెంబడించిన ఏసీబీ అధికారులు అయన్ను పట్టుకుని ఠాణాకు తీసుకొచ్చారు. టేక్మాల్ ఎస్ఐ రాజేశ్‌తోపాటు రాష్ట్రంలో వేర్వేరు ప్రాంతాల్లో ఒక విద్యుత్ ఏఈ, రెవెన్యూ సర్వేయర్, చైన్‌మన్ ఏసీబీ అధికారులకు పట్టుబడ్డారు.

హోటల్ కూల్చేయకుండా 3 లక్షల ముడుపులకు సర్వేయర్ బెదిరింపులు

సికింద్రాబాద్ రెవెన్యూ మండల పరిధిలోని ఓ ప్రభుత్వ స్థలంలోని హోటల్‌ను కూల్చేయకుండా ఉండాలంటే రూ.3 లక్షలు లంచం ఇవ్వాలని దాని యజమానిని సర్వేయర్ కలువ కిరణ్‌కుమార్ బెదిరించాడు. అంత డబ్బు ఇవ్వగల శక్తి లేని బాధితుడు ఏసీబీ అధికారులను ఆశ్రయించాడు. అతడికి వారు రూ.లక్ష నగదు ఇచ్చి పంపారు. మంగళవారం సికింద్రాబాద్ తహసీల్దార్ కార్యాలయంలో చైన్‌మన్ మేకల భాస్కర్‌కు బాధితుడు రూ.లక్ష నగదు అందిస్తుండగా ఏసీబీ అధికారులు పట్టుకున్నారు. ఈ సంగతి తెలిసిన సర్వేయర్ కిరణ్ కుమార్.. నిజామాబాద్‌కు పారిపోయేందుకు ప్రయత్నించాడు. విశ్వసనీయ సమాచారం మేరకు బోయిన్‌పల్లి బస్టాప్‌లో కిరణ్‌కుమార్‌ను అదుపులోకి తీసుకున్న ఏసీబీ అధికారులు సికింద్రాబాద్ తహసీల్దార్ ఆఫీసుకు తీసుకొచ్చారు. కిరణ్‌కుమార్‌తోపాటు భాస్కర్‌పై కేసు నమోదు చేశామని ఏసీబీ డీఎస్పీ శ్రీధర్ తెలిపారు.

జీహెచ్ఎంసీ పార్కునే అమ్మకానికి పెట్టిన సబ్ రిజిస్ట్రార్

» డీఆర్‌లు, డీఐజీలతో ఐజీ సమావేశం

» పద్ధతి మార్చుకోకపోతే కఠిన చర్యలు తప్పవని హెచ్చరిక

హైదరాబాద్, నవంబరు 18 (ఆంధ్ర జ్యోతి): సబ్ రిజిస్ట్రార్ల అక్రమాలు, కాసుల కక్కుర్తి రిజిస్ట్రేషన్ శాఖలో కలకలం రేపుతున్నాయి. ఇటీవలి వరుస పరిణామాలు, ఏసీబీ దాడులు, మంత్రి తీవ్రంగా ఆగ్రహం వ్యక్తం చేయడంతో ఆ శాఖ ఉన్నతాధికారుల్లో ఆందోళన వ్యక్తమవుతోంది. దీనితో రిజిస్ట్రేషన్ శాఖ ఐజీ మంగళవారం డిప్యూటీ రిజిస్ట్రార్లు (డీఆర్), డీఐజీలతో సమావేశమై పద్ధతి మార్చుకోకపోతే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

వరుస ఘటనలతో కలకలం

వనస్థలిపురం సబ్ రిజిస్ట్రార్ ఏసీబీకి పట్టుబడటంతో ఆయన స్థానంలో ఇన్‌చార్జిగా బాధ్యతలు స్వీకరించిన సీనియర్ అసిస్టెంట్ శివశంకర్.. మూడు రోజుల్లోనే రోజూ తన కార్యాలయానికి వెళ్లే దారిలో ఉన్న జీహెచ్ఎంసీ పార్కును ప్రైవేటు వ్యక్తులకు రిజిస్ట్రేషన్ చేసేశారు. దీనిపై ఫిర్యాదు అందుకున్న ఐజీ రాజీవ్‌గాంధీ హనుమంతు మంగళవారం ఆయనపై వేటు వేశారు. ఇక సరూర్‌నగర్‌లో శ్రీలత అనే సబ్ రిజిస్ట్రార్ రెండు డాక్యుమెంట్ల రిజిస్ట్రేషన్‌కు రూ.15 లక్షలు లంచం డిమాండ్ చేయడంతో బాధితుడు కోర్టును ఆశ్రయించారు. లంచం తీసుకున్నది నిజమేనని సబ్ రిజిస్ట్రార్ కోర్టులో అంగీకరించడంతో ఆమెను సస్పెండ్ చేశారు. హైదరాబాద్‌లోని కీలక ప్రాంతంలో జిల్లా రిజిస్ట్రార్‌గా ఉన్న ఓ అధికారి.. పదేళ్లుగా వివాదంలో ఉన్న ప్రభుత్వ భూమిని రిజిస్ట్రేషన్ చేయాలని ఓ సబ్ రిజిస్ట్రార్‌పై ఒత్తిడి చేశారు. వినకపోవడంతో మరో సబ్ రిజిస్ట్రార్ ద్వారా ఆ భూమిని రిజిస్ట్రేషన్ చేయించారు. దీనిపై ఉన్నతాధికారులు ఆగ్రహం వ్యక్తం చేశారు. మరోవైపు కుత్బుల్లాపూర్‌లో ప్రభుత్వ భూమిని రిజిస్ట్రేషన్ చేసిన ఓ సబ్ రిజిస్ట్రార్‌పై ఐజీ గతంలో వేటు వేశారు. అయితే ఐజీకి, అదనపు ఐజీకి ఎలాంటి సమాచారం ఇవ్వకుండానే అక్కడి డీఆర్, ఆపై స్థాయి అధికారులు కలిసి ఆ సబ్ రిజిస్ట్రార్‌కు పోస్టింగ్ ఇచ్చారు. ఇది తెలిసి ఐజీ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.

శాఖను భ్రష్టుపట్టిస్తున్నారు

ఇటీవల ఏసీబీ అధికారులు రిజిస్ట్రేషన్ కార్యాలయాల్లో అవినీతికి సంబంధించి వరుసగా దాడులు చేస్తున్నారు. రెండు రోజుల క్రితం వైరా, భూపాలపల్లి, పెద్దపల్లి, మంచిర్యాల, నిజామాబాద్, జహీరాబాద్, మేడ్చల్, శేరిలింగంపల్లి, గండిపేట సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో సోదాలు జరిగాయి. అంతకు ముందు మిర్యాలగూడ, వనపర్తి, జడ్చర్ల, సదాశివపేట, కూకట్‌పల్లి, కుత్బుల్లాపూర్ సబ్ రిజిస్ట్రార్ల కార్యాలయాల్లో దాడులు చేశారు. దీనిపై సంబంధిత శాఖ మంత్రి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసినట్టు తెలిసింది. బాగా పని చేస్తారని ఒక జోన్ నుంచి మరో జోన్‌కు మార్చి బాధ్యతలు అప్పగించిన సబ్ రిజిస్ట్రార్లు, నగరంలోనూ, రాష్ట్రంలో కీలక జిల్లాలకు జిల్లా రిజిస్ట్రార్లుగా నియమించిన వారుకూడా శాఖ పరువు తీస్తున్నారని ఆవేదన వ్యక్తం చేసినట్టు సమాచారం. ఇంత జరుగుతున్నా శాఖ ఉన్నతాధికారులు ఏం చేస్తున్నారని మండిపడినట్టు తెలిసింది. ఈ క్రమంలో రిజిస్ట్రేషన్ల శాఖ ఐజీ మంగళవారం జిల్లా రిజిస్ట్రార్లు, డీఐజీలతో సమావేశమయ్యారు. రిజిస్ట్రార్ కార్యాలయాల్లో తనిఖీలు లేకపోవడం, అవినీతికి కొందరు డీఆర్‌లు, డీఐజీలు సహకరించడంతోనే ఈ పరిస్థితి తలెత్తిందని.. దీనికి సిగ్గుపడాలని ఈ సందర్భంగా అన్నట్టు తెలిసింది. ప్రభుత్వ స్థలాలు రిజిస్ట్రేషన్ చేయకూడదనే కనీస బాధ్యత కూడా ఎలా విస్మరిస్తున్నారని నిలదీసినట్టు సమాచారం. పనితీరు మార్చుకోవాలని, లేకుంటే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించినట్టు తెలిసింది.

నాణ్యత లేని గుడ్లు సరఫరా చేస్తే కాంట్రాక్టు రద్దు

హాస్టళ్లు, అంగన్‌వాడీలకు ఇచ్చే గుడ్లు నిబంధనల మేరకు ఉండాల్సిందే



- ఇదే మీకు చివరి అవకాశం
- కాంట్రాక్టర్లకు మంత్రి సీతక్క తీవ్ర హెచ్చరిక

హైదరాబాద్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): 'అంగన్‌వాడీ కేంద్రాలు అంటే హోటళ్లు కావు. నాసిరకం గుడ్లు, సరుకులు పిల్లల ఆరోగ్యాన్ని ప్రమాదంలోకి నెడతాయి. ఇది మీకు చివరి అవకాశం. ఇకపై నాణ్యతలేని చిన్న సైజు గుడ్లు సరఫరా చేస్తే కఠిన చర్యలు తీసుకుంటాం. పది రోజులకు ఒకసారి గుడ్లు సరఫరా చేయాలి. కుంటి సాకులు చెబితే కాంట్రాక్టు రద్దు చేస్తాం. పిల్లలు దేవుళ్లతో సమానం. వారికి అందించే ఆహారంలో రాజీ లేదు' అని మంత్రి సీతక్క కాంట్రాక్టర్లను హెచ్చరించారు. జిల్లా స్థాయిలో పర్యవేక్షించాల్సిన అధికారుల అలసత్వంపై మంత్రి సీరియస్ అయ్యారు. గురుకులాలు, అంగన్‌వాడీ కేంద్రాలు, హాస్టళ్లకు గుడ్ల సరఫరాలో అవకతవకలపై ఆంధ్రజ్యోతిలో సోమవారం 'చిన్న గుడ్డు.. పెద్ద మోసం' శీర్షికన ప్రచురితమైన కథనంపై సీఎం రేవంత్‌రెడ్డి స్పందించారు. ఆయన ఆదేశాల మేరకు సీతక్క మంగళవారం మహిళా శిశు సంక్షేమ శాఖ కమిషనరేట్లో కోడిగుడ్లు, పప్పు, పాల సరఫరాదారులు, జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారులతో సమీక్ష జరిపారు. టెండర్ మార్గదర్శకాలు అంగీకరించిన తర్వాతే గుడ్ల సరఫరా కాంట్రాక్టులు ఇచ్చామని అన్నారు. ఆ నిబంధనల ప్రకారమే సప్లై చేయాలని స్పష్టం చేశారు. మారుతున్న వాతావరణ పరిస్థితుల్లో గుడ్లు త్వరగా పాడవుతున్నాయని, అందుకే ప్రతి 10 రోజులకు ఒకసారి సప్లై చేయాలన్నారు. బాలలకు, చిన్నారులకు పౌష్టికాహారం అందించడం ప్రభుత్వ బాధ్యతని, అధికారులు పర్యవేక్షణ పెంచాలని, నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని సీతక్క హెచ్చరించారు. ఇక నుంచి కచ్చితంగా ప్రతి 3నెలలకు ఒకసారి సమీక్ష నిర్వహిస్తామన్నారు. సమీక్ష సందర్భంగా.. ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనాన్ని మంత్రి సీతక్క పలుమార్లు గుర్తు చేసినట్లు సమాచారం.

పంచాయతీ ఎన్నికలు నిర్వహించండి

- సర్కారుకు రాంచందర్‌రావు డిమాండ్

హైదరాబాద్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం, ఇప్పటికైనా గ్రామ పంచాయతీలకు ఎన్నికలు నిర్వహించాలని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు డిమాండ్ చేశారు. 21 నెలలుగా పంచాయతీలకు ఎన్నికలు నిర్వహించకపోవడంతో 15వ ఆర్థిక సంఘం నుంచి రావాల్సిన రూ.4వేల కోట్ల నిధుల విడుదల నిలిచిపోయిందని తెలిపారు. 73, 74 రాజ్యాంగ సవరణ ప్రకారం, స్థానిక సంస్థలకు పాలక వర్గాలు ఉంటేనే ఆర్థిక సంఘం నుంచి నిధులు విడుదల చేస్తారని చెప్పారు. మంగళవారం బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో రాంచందర్‌రావు మీడియాతో మాట్లాడారు. బీసీలను కాంగ్రెస్ మోసం చేసిందని దుయ్యబట్టారు. స్థానిక సంస్థల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ అమలు చేయాల్సింది పోయి, పార్టీ పరంగా మాత్రమే అమలు చేస్తామనడం దుర్మార్గమని మండిపడ్డారు. స్థానిక సంస్థల్లో బీసీలకు పెద్ద పీట వేస్తామని, వారికి 42 శాతం రిజర్వేషన్ అమలు చేస్తామని కాంగ్రెస్ కంటే ముందే తాము ప్రకటించామని ఆయన గుర్తుచేశారు. కాగా, దేశవ్యాప్తంగా తీవ్రవాద నిర్మూలనే ఆపరేషన్ కగార్ లక్ష్యమని రాంచందర్‌రావు అన్నారు.

నేనొక్కడినే!

నన్నేమైనా చేసుకోండి... పట్టించుకొనే వారులేరు

- లక్ష జీతం వచ్చినా ఇంట్లో నన్ను లెక్క చేయలేదు
- ఎలాగైనా సంపాదించాలని ఇందులోకొచ్చా
- పోలీసుల విచారణలో వెల్లడించిన ఐబొమ్మ రవి



హైదరాబాద్ సిటీ, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): చట్టానికి దొరికితే తన పరిస్థితి ఏమిటో అన్నీ తెలిసే ఐబొమ్మ రవి భారీ ఎత్తున సినిమాల పైరసీకి పాల్పడ్డాడని పోలీసులు గ్రహించారు. "నేను సింగిల్, ఏక్ నిరంజన్. నాకు ఏం జరిగినా పట్టించుకునే వారు లేరు. నన్ను ఏం చేసుకుంటారో చేసుకోండి" అని విచారణ సందర్భంగా పోలీసులకు సమాధానం ఇచ్చినట్లు తెలిసింది. ఏం చేసినా డబ్బు కోసమే చేసినట్లుచెప్పాడు. గతంలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేసిన రవికి నెలంతా కష్టపడితే లక్ష రూపాయల వరకు జీతం వచ్చేదట. వచ్చే ఆదాయం ఎటూ సరిపోక పోవడం, ఇంట్లో భార్య, అత్తామామలు తన సంపాదనను చులకన చేసి మాట్లాడటంతో సులభంగా పెద్ద మొత్తం సంపాదించాలని నిర్ణయించుకున్నాడట. తనకున్న ఐటీ పరిజ్ఞానంతో సినిమా పైరసీపై దృష్టి సారించినట్లు వెల్లడించాడు. ఆన్‌లైన్‌లో ఐబొమ్మ ప్రాచుర్యంపొందిన తర్వాత యాడ్ ఏజెన్సీల ద్వారా రవికి రూ.లక్షల్లో డబ్బు వచ్చిపడింది. ఆ డబ్బుతో ఎంజాయ్ చేసేవాడని పోలీసుల విచారణలో తేలింది. తల్లిదండ్రులతో గానీ, భార్యతో గానీ, స్నేహితులతో గానీ రవికి ఎలాంటి సంబంధాలు లేవని పోలీసులు గుర్తించారు. అమెరికాలో ఒక డొమైన్, అమీర్‌పేటలో ఒక డొమైన్‌ను రవి రిజిస్ట్రేషన్ చేసుకున్నాడని, వాటి టెక్నికల్ ఎవిడెన్స్‌తోనే అతనిపై నెలల తరబడి నిఘా పెట్టి ఎట్టకేలకు శనివారం అరెస్టు చేశారు. రవి వద్ద లభ్యమైన డేటాను విశ్లేషించినపుడు మొత్తం 10 దేశాల్లో తన నెట్‌వర్క్‌ను విస్తరించినట్లు తేలింది. ప్రతీ రెండు నెలలకు ఒక్కో దేశానికి వెళ్లి అక్కడ తనకు సహకరించే టీమ్ సభ్యులతో సమావేశం నిర్వహించేవాడని గుర్తించారు. ఇండియాకు వచ్చినపుడు కూకట్‌పల్లిలోని తన ఇంట్లో విశ్రాంతి తీసుకొని వెళ్లేవాడు. శనివారం ఫ్రాన్స్ నుంచి హైదరాబాద్‌కు రవి వచ్చినట్లు గుర్తించిన పోలీసులు కూకట్‌పల్లిలోని నివాసంలో ఉండగా ఇంటిని చుట్టుముట్టారు. తలుపు తట్టగా డోర్ తీయలేదు. రెండు గంటల పాటు శ్రమించినా తలుపులు తెరవలేదు. డోర్ బద్దలు కొట్టాలని నిర్ణయించుకొని గట్టిగా తన్నడంతో పరిస్థితి అర్థమై రవి డోర్ తీశాడు.

విదేశీయులపైనా కేసులు..

రవి నెట్‌వర్క్‌లో ఎక్కువగా విదేశీయులే ఉన్నారు. అతనితో సంబంధాలు ఉన్నట్లు తేలితే విదేశీయులపైనా కేసులు నమోదు చేస్తామని డీసీపీ కవిత తెలిపారు. రవిని వారం రోజులపాటు పోలీస్ కస్టడీకి ఇవ్వాల్సిందిగా పిటిషన్ దాఖలు చేశామన్నారు. న్యాయస్థానం నిర్ణయాన్ని బుధవారానికి వాయిదా వేసింది. చంచల్‌గూడ జైలులో రిమాండ్‌లో ఉన్న రవి బ్యారక్‌లో తోటి ఖైదీలతో మాట్లాడకుండా ముభావంగా ఉన్నట్లు తెలిసింది. 3 రోజులుగా రవిని కలిసేందుకు కుటుంబ సభ్యులెవరూ రాలేదు. తనను కలిసేందుకు ఇద్దరు న్యాయవాదులు రాగా కలిసేందుకు నిరాకరించారు.. తన స్నేహితుడు పంపించే న్యాయవాదులతోనే మాట్లాడతానని స్పష్టం చేశాడు.

విదేశాలకు పారిపోయే అవకాశం ఉన్నందునే అరెస్టు

రవి సినిమా పరిశ్రమపైనే బెదిరింపులకు పాల్పడ్డాడని, విదేశీ పౌరసత్వం ఉన్న రవి దేశం దాటి పారిపోయే అవకాశంతో పాటు ఆధారాలను నాశనం చేసే అవకాశం ఉండటంతో అరెస్ట్ చేశామని సైబర్ క్రైం పోలీసులు రిమాండ్ రిపోర్ట్‌లో పేర్కొన్నారు. రవి ఐబొమ్మ, బప్పం పేర్లతో భిన్నమైన ఎక్స్‌టెన్షన్లతో అనేక వెబ్‌సైట్‌లను, బప్పం యాప్‌లను నిర్వహించేవాడు. సినీ పరిశ్రమ వాళ్లపైనా బెదిరింపులకు దిగాడు. "నాపై ఫోకస్ ఆపండి లేదంటే మీపై ఫోకస్ చేయాల్సి ఉంటుంది" అని హెచ్చరించాడు. అమెరికా, స్విట్జర్లాండ్, నెదర్లాండ్స్‌లో సర్వర్లను పెట్టాడు. 110 డొమైన్స్‌ను కొన్నాడు. కొత్త సినిమాల పైరసీకి అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని సమకూర్చుకున్నాడు. ఐబొమ్మ, బప్పం టీవీల ద్వారా లక్షల మంది వ్యూయర్స్‌ను 1విన్, 1ఎక్స్ బెట్ వంటి అక్రమ బెట్టింగ్ వేదికలకు మళ్లించాడు. వందల కోట్ల రూపాయలు క్రిప్టో కరెన్సీ రూపంలో అతనికి బదిలీ అయ్యిందని పోలీసులు గుర్తించారు. రవిపై ఐటీ చట్టం, కాపీరైట్ చట్టంతో పాటు బీఎన్ఎస్ 318(4), 319(2), 336(3), 340(2) సెక్షన్‌లు చేర్చారు. దొంగసొత్తు దాచుకోవడం, సాంకేతిక పరిజ్ఞానాన్ని మోసానికి వాడటం, కంప్యూటర్‌తో ఫ్రాడ్‌కు పాల్పడటం, అనుమతి లేకున్నా లోపలికి వచ్చి నష్టం కలిగించడం ఈ సెక్షన్ల కిందకు వచ్చే నేరాలు.

సజ్జనార్ నుంచి వివరాలు కోరిన ఈడీ

రవి కేసుపై ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరక్టరేట్(ఈడీ) దృష్టి సారించింది. రవి కేసు వివరాలను ఇవ్వాలని హైదరాబాద్ కమిషనర్ సజ్జనార్‌కు ఈడీ అధికారులు లేఖ రాశారు. అతడి బ్యాంకు ఖాతాల్లో ఉన్న రూ.3.5 కోట్లను ఇప్పటికే స్తంభింపజేశారు. కరేబియన్ దీవుల్లో పౌరసత్వం కోసం రూ.80 లక్షలు ఖర్చుపెట్టినట్లు గుర్తించారు. పైరసీ సినిమాల ఆదాయం 20 శాతం మాత్రమేనని, 80 శాతం బెట్టింగ్ ఆదాయమేనని గ్రహించారు. విదేశీ ఖాతాల నుంచి కొంత, క్రిప్టో కరెన్సీ రూపంలో కొంత వచ్చిందని, హవాలా మార్గంలోనూ చెల్లింపులు జరిగాయని గుర్తించారు. తమకు లభించిన సమాచారం మొత్తం ఈడీకి పంపిస్తున్నామని సజ్జనార్ తెలిపారు. క్రిప్టో కరెన్సీ వాలెట్ల నుంచి రవి భారతీయ బ్యాంకు ఎన్నారై ఖాతాకు ఖాతాకు నిధులు అందాయని గుర్తించారు.

రేవంత్ ప్రభుత్వంపై రైతులకు నమ్మకం పోయింది

- మద్దతు ధరలు అమలు కావడం లేదు
- యూరియా, సన్నవడ్లకు బోనస్ ఇవ్వలేదు
- సీసీఐ కొత్త నిబంధనలతోనే సమస్యలు
- మార్కెట్ యార్డుల సందర్శనలో హరీశ్

వరంగల్ వ్యవసాయం/కే సముద్రం, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): రేవంత్ రెడ్డి సర్కారుపై రైతులకు నమ్మకం పోయిందని, ఇందుకు నిదర్శనం రైతులు ధాన్యాన్ని ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో కాకుండా తక్కువ ధరకే వ్యాపారులకు విక్రయిస్తున్నారని మాజీ మంత్రి హరీశ్‌రావు అన్నారు. రైతులు క్వింటా పత్తికి రూ.వెయ్యి, మొక్కజొన్నలకు రూ. 500 చొప్పున నష్టపోతున్నారన్నారు. రెండు రోజులుగా పత్తి కొనుగోళ్లు నిలిచిపోయిన నేపథ్యంలో హరీశ్ మంగళవారం ఉమ్మడి వరంగల్ జిల్లా బీఆర్ఎస్ నాయకులతో కలిసి మహబూబాబాద్ జిల్లా కే సముద్రం, వరంగల్ (ఏనుమాముల) వ్యవసాయ మార్కెట్ యార్డులను సందర్శించారు. రైతులు, పత్తి వ్యాపారులు, మిల్లర్లతో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీసీఐ కొత్త నిబంధనలతో సమస్యలు తలెత్తుతున్నాయని, వాటిని ఉపసంహరించుకుని పత్తి కొనుగోళ్లు చేపట్టాలని డిమాండ్ చేశారు. రాష్ట్రం నుంచి ఎన్నికైన 17 మంది ఎంపీల కంటే పొలాల్లో ఉండే దిష్టిబొమ్మలు నయమని ఎద్దేవా చేశారు. రైతులు యాసంగిలో విక్రయించిన వడ్లకు రూ.1,100 కోట్ల బోనస్ ను రాష్ట్ర ప్రభుత్వం ఇంకా ఇవ్వలేదని విమర్శించారు. రుణమాఫీ పూర్తిగా అమలు చేయలేదని, యూరియా ఇవ్వలేకపోయిందన్నారు. తెలంగాణలో 2,700 ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఇంకా ప్రారంభించలేదని, మొక్కజొన్న విక్రయించిన రైతులకు ఒక్క రూపాయి కూడా నేటికీ ఇవ్వలేదని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక 406 మంది రైతులు ఆత్మహత్య చేసుకున్నారన్నారు. ఇంటర్ విద్యార్థులకు నేటికీ పాఠ్య పుస్తకాలు ఇవ్వలేదని, ప్రభుత్వంపై నమ్మకం లేక 67 వేలమంది విద్యార్థులు సర్కారు పాఠశాలలను వీడారన్నారు. మాజీ మంత్రులు ఎర్రబెల్లి, సత్యవతి రాథోడ్, మాజీ స్పీకర్ మధుసూదనాచారి తదితరులు పాల్గొన్నారు.

రైతు సమస్యలపై పోరాడుతాం

- క్యాబినెట్‌లో ఎందుకు చర్చించలేదు? : కేటీఆర్

ఆదిలాబాద్/భైంసా, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): రైతు సమస్యల పరిష్కారానికి పోరాటాలే సరైన మార్గమని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతులకు న్యాయం చేసేంతవరకు తమ పార్టీ అండగా నిలుస్తుందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. రాష్ట్ర ప్రభుత్వానికి రైతుల మీద అంత ప్రేమ ఉంటే క్యాబినెట్‌లో వాళ్ల సమస్యలపై ఎందుకు చర్చించలేదని నిలదీశారు. పత్తి రైతులను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పట్టించుకోవడం లేదని మండిపడ్డారు. మంగళవారం కేటీఆర్ ఆదిలాబాద్ జిల్లా కేంద్రం, నిర్మల్ జిల్లా భైంసాలో పర్యటించారు. ఈ సందర్భంగా ఆదిలాబాద్, భైంసా మార్కెట్ యార్డుల్లో పత్తి, సోయా రైతులతో ఏర్పాటు చేసిన ముఖాముఖిలో పాల్గొని వాళ్ల సమస్యలను తెలుసుకున్నారు. సీసీఐ విధించిన నిబంధనలతో తీవ్రంగా నష్టపోతున్నామని పలువురు రైతులు ఆందోళన వ్యక్తంచేశారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ.. సాధ్యంకాని కపాస్ కిసాన్ యాప్‌ను తీసుకొచ్చి రైతులను ఇబ్బందులకు గురి చేస్తున్నారని మండిపడ్డారు. మద్దతు ధర ఏ ఒక్క రైతుకు దక్కడం లేదని, క్వింటాల్ పత్తికి రూ.5,900ల నుంచి రూ.6,200ల వరకు మాత్రమే దక్కుతోందన్నారు. ఈ విషయంలో కేంద్రంపై రాష్ట్రానికి చెందిన బీజేపీ ఎంపీలు, ఎమ్మెల్యేలు ఒత్తిడి తీసుకు రావాలన్నారు. ఈ నెల 21న అఖిలపక్షం ఆధ్వర్యంలో బోరజ్ వద్ద జాతీయ రహదారిపై చేపట్టనున్న ధర్నాకు వేలాది మంది రైతులు తరలిరావాలని ఆయన పిలుపునిచ్చారు.

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

భయపెడుతున్న మౌనం

దేశంలో గో రక్షకుల ఉన్మాదానికి నిలువెత్తు నిదర్శనంగా నిలిచిన మహమ్మద్ అఖ్లాఖ్ హత్యకేసులో నిందితులందరిపైనా ఆరోపణలు ఉపసంహరించుకోవాలని యోగి ఆదిత్యనాథ్ ఏలుబడిలో ఉన్న ఉత్తర్‌ప్రదేశ్ ప్రభుత్వం నిర్ణయించింది. గ్రేటర్ నోయిడా పరిధిలోని బిసహాడ గ్రామానికి చెందిన యాభైరెండేళ్ళ ఆ వృద్ధుడి మూక హత్య జరిగిన దశాబ్దం తరువాత, అతడిని కొట్టిచంపిన వారిమీద అప్పట్లో పెట్టిన అన్ని ఆరోపణలనూ ప్రభుత్వం వెనక్కుతీసుకుంటున్నట్టు స్థానిక సెషన్స్‌కోర్టులో దరఖాస్తు దాఖలైంది. ఆగస్టు 26న తయారైన ఆదేశాలను గవర్నర్ ఇప్పటికే అనుమతించిన మేరకు ప్రభుత్వ న్యాయవాది కోర్టులో ఈ అభ్యర్థన దాఖలు చేశారు. దేశాన్ని కుదిపేసిన ఈ దారుణానికి అక్కడి బీజేపీ నాయకుడి కుమారుడు నాయకత్వం వహించాడు. ఈ వర్థమాన రాజకీయనాయకుడి ఆధ్వర్యంలో అఖ్లాఖ్ ఇంటి సమీపంలో నివసిస్తూండేవారే ఈ ఘోరానికి పాల్పడ్డారు. ఘటన జరిగిన రెండుమూడేళ్ళలోనే నిందితులంతా బయటకు వచ్చేసి, పదేళ్ళుగా నత్తనడకనసాగుతూ నామమాత్రంగా మిగిలిన ఈ కేసుమీద యోగి ప్రభుత్వం సమ్మెటదెబ్బ వేసింది.

ఇంతకూ యూపీ ప్రభుత్వం ఏ కారణాలతో ఈ కేసు ఉపసంహరించుకుంది? అఖ్లాఖ్ కుటుంబం చీటికీమాటికీ తన వాదనలూ సమాధానాలూ మార్చేస్తోందట. పోనీ, నిందితులు మారణాయుధాలతో దాడి చేశారా? కానేకాదు. బాధితుడికీ, నిందితులకు మధ్య పాతకక్షలున్నాయా? లేనేలేవు. వీరంతా దశాబ్దాలుగా సయోధ్యతో ఉన్నవారే. ఈ యువ గోరక్షకులు ఎక్కడపడితే అక్కడ తంతూవుంటే, అందివచ్చినవాటిని ఆయుధాలుగా వాడి శరీరాన్ని చీల్చేస్తూంటే, పుటుక్కున ప్రాణాలు వదిలేసిన ఆ ముసలి ముసల్మాన్‌తో వీరెవ్వరికీ కక్షలూ, కార్పణ్యాలూ లేవు. అందువల్ల, ఇంతటి బలమైన కారణాలు ఉండగా కేసు ఇంకా కొనసాగించడమేమిటని యోగి ప్రభుత్వం అనుకుంది. నిందితులమీద పెట్టిన హత్య, హత్యాయత్నం వంటివే కాదు, తీవ్రంగా గాయపరచడం, భౌతికదాడితో అవమానించడం, నేరపూరిత బెదిరింపు ఇత్యాది అనేకానేక సెక్షన్లు కూడా ఎత్తివేస్తేనే తగిన న్యాయం చేసినట్టవుతుందని యోగి ప్రభుత్వం భావించింది. పకడ్బందీగా పెద్దతలకాయలందరి సంతకాలతో, 321వ సెక్షన్ వాడుకొని పూర్తిగా కేసుమూసేయడానికి సిద్ధపడింది.

గోవును చంపి, మాంసాన్ని తెచ్చి అఖ్లాఖ్ తన ఫ్రిజ్‌లో దాచుకున్నాడన్న వాదనతో అతడినీ, కుమారుడినీ ఈ మూక ఇంట్లోనుంచి బయటకు లాగి కొట్టడం ఆరంభించింది. వారు దాడికి ఉపక్రమించగానే, అక్కడే ఉన్న గుడి లౌడ్‌స్పీకర్ ద్వారా అఖ్లాఖ్ గోహత్యకు పాల్పడ్డాడంటూ అదేపనిగా ప్రచారం కొనసాగింది. ఓ ఇరవైమంది మంద, అడ్డేవారూ ఆపేవారూ లేకుండా యథేచ్ఛగా సంహారాన్ని కొనసాగించింది. పదేళ్ళక్రితం అఖ్లాఖ్ హత్య జరగ్గానే కదిలిపోయి, రగిలిపోయిన దేశం, ఇప్పుడు కేసు ఉపసంహరణ నిర్ణయంమీద మౌనంగా ఉండిపోవడం ఆశ్చర్యం కలిగిస్తుంది. మూకదాడులు, అసహనం, గోమాంసం ఇత్యాది అంశాలమీద ప్రజాక్షేత్రంలో చర్చలు, మీడియా చానెళ్ళలో వాదోపవాదాలు సాగడమే కాదు, 'నాట్ ఇన్ మై నేమ్' తరహా ర్యాలీలు, అవార్డు వాపసీలతో దేశం కదిలిపోయింది. అన్ని రంగాలకు చెందిన మేధావులు, బాలీవుడ్ నటులు గళం విప్పారు. టెలివిజన్ చానెళ్ళు ఆగ్రహంతో ఊగిపోయాయి. ప్రధాని కాస్తంత ఆలస్యంగానే అయినా, విచారం వెలిబుచ్చవలసి వచ్చింది. గోరక్షణ పేరిట ముస్లింలను లక్ష్యంగా చేసుకొనే ఇటువంటి దాడులను నియంత్రించనిపక్షంలో ఈ ఉన్మాదానికి అడ్డూఆపూ ఉండబోదన్న హెచ్చరికలు ఆ తరువాత అనేకసార్లు నిజమైనాయి. వెలిసిపోయిన పాస్‌పోర్టు సైజ్ ఫోటోలో అమాయకంగా కనిపించే అఖ్లాఖ్ మొఖం మతోన్మాదానికీ, మూకదాడులకూ ప్రతీకగా మిగిలిపోయింది. అఖ్లాఖ్ మరణం నిజం కాదా? ఆ వృద్ధుడు వీరి చేతుల్లో మరణించలేదని యోగి ప్రభుత్వం అంటోందా? వంటి ప్రశ్నలకు సమాధానాలు ఉండవు. కానీ, అఖ్లాఖ్ కుటుంబానికి కనీస న్యాయం కాదు, ఘోరమైన అవమానం, అన్యాయం చేసినా నేటి సమాజం తమను నిలదీయదన్న ధైర్యం ఈ పదేళ్ళలో పాలకులకు బాగా ఒంటబట్టిందని అర్థం.

విపక్షాల దౌర్బల్యమే మోదీ విజయం



■ ఎ. కృష్ణారావు

ఇండియాగేట్

'మీరు బిహార్‌లో ఎన్నికల కవరేజ్‌కు వెళ్లి పెద్దగా ఉపయోగం ఉండకపోవచ్చు. అక్కడ ఎన్డీఏ అధికారంలోకి రావడం ఖాయం' అని ఎన్నికల షెడ్యూలు ప్రకటించకముందే ఒక సీనియర్ జర్నలిస్టు సలహా ఇచ్చారు. ఆయన ఏ ఉద్దేశంతో ఈ సలహా ఇచ్చారో కానీ దేశంలోని పరిస్థితులు చూస్తుంటే ప్రధాని మోదీకి దేశ రాజకీయాల్లో తిరుగులేదనే అభిప్రాయం చాలా మందిలో నెలకొని ఉన్నదని తెలుస్తోంది. మోదీకి మించిన, బలమైన నాయకుడు ఇతర పార్టీల్లో లేకపోవడం మాత్రమే కాదు, భారతీయ జనతా పార్టీకున్న ఎన్నికల యంత్రాంగం, పటిష్ఠ వ్యూహరచన చేసే శక్తి, కింది స్థాయి నుంచి పరిస్థితులను అధ్యయనం చేసి అవసరమైన చర్యలు తీసుకోగల నిశిత దృష్టి, అన్నిటినీ మించి వ్యవస్థలపై ఉన్న పట్టు మూలంగా కమలనాథులను ఓడించడం కాంగ్రెస్‌కు, ఇతర పార్టీలకు సాధ్యం కాదేమోనన్న అంచనా చాలా మందికి ఉన్నది.


అయినప్పటికీ బిహార్‌లో ఫలితాలు భిన్నంగా ఉండవచ్చునేమో అన్న ఆశలు బీజేపీ వ్యతిరేకులకు చివరివరకూ మిణుకుమిణుకుమంటూనే ఉన్నాయి. దాదాపు 20 ఏళ్లు నితీశ్‌కుమార్ ముఖ్యమంత్రిగా ఉండడం, బీజేపీకి స్థానిక నాయకుడంటూ లేకపోవడం మాత్రమే కాదు, ఎన్నికల కమిషన్ అక్రమాలు చేస్తున్నదన్న విషయాన్ని ప్రజల్లోకి తీసుకువెళ్లేందుకు ప్రతిపక్షాలు ఉధృతంగా ప్రయత్నం చేయడం, బలహీనవర్గాలకు మోదీ వ్యతిరేకమని, రాజ్యాంగాన్ని తుంగలో తొక్కుతున్నారనే ప్రచారాన్ని ప్రజల్లోకి తీసుకువెళ్లేందుకు తీవ్రయత్నాలు చేయడం మూలంగా ప్రతిపక్షాలు పుంజుకోవచ్చుననే అభిప్రాయం చాలా మంది వ్యక్తం చేశారు. ముఖ్యంగా రాహుల్‌గాంధీ, తేజస్వీ యాదవ్ ఇద్దరూ చేపట్టిన ఓటర్ అధికార యాత్రకు భారీ ఎత్తున ప్రతిస్పందన లభించింది. ఒక లక్ష్యం ప్రకారం గ్రామీణ, సెమీ అర్బన్ ఏరియాలో ఈ యాత్రను చేపట్టారు. గయాలో తొక్కిసలాటలో ఒక యువకుడు కూడా మరణించాడు. ముఖ్యంగా సీమాంచల్‌లో రాహుల్ యాత్ర అన్ని రికార్డులను అధిగమించి 2 లక్షలకు పైగా జనాన్ని ఆకర్షించింది. ఎన్నికల ప్రచార సమయంలో కూడా రాహుల్, ప్రియాంక, తేజస్వి సభలకు జనం పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.

'బహిరంగ సభలకు, యాత్రలకు జనం పెద్ద సంఖ్యలో హాజరు కావడం, హాజరైన జనం ఓటర్లుగా మారడం అనేది ఒకటి కాదు' అనేది చరిత్రలో అనేకసార్లు రుజువైంది. 1994లో పీవీ నరసింహారావు ప్రధానమంత్రిగా ఉన్నప్పుడు జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ఆయన పాల్గొన్న ఏలూరు సభకు లక్షలాది మంది హాజరయ్యారు. కానీ ఆశ్చర్యకరమేమంటే ఆ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు కేవలం 26 సీట్లు రాగా, తెలుగుదేశం 216 సీట్లు గెలుచుకుంది. కాంగ్రెస్ కంటే వామపక్షాలకు ఎక్కువ(34) సీట్లు లభించాయి. 1977లో ఎమర్జెన్సీ అనంతరం ఉమ్మడి బిహార్‌లో జరిగిన ఎన్నికల్లో ఇందిరాగాంధీ రాష్ట్రంలో ఎక్కడకు వెళ్లినా పెద్ద సంఖ్యలో జనం ఆమెకు నీరాజనాలు పట్టారు. కానీ ఆ ఎన్నికల్లో కాంగ్రెస్ బిహార్‌లో అప్పుడున్న మొత్తం 54 సీట్లను కోల్పోయింది. ఈ రెండు సంఘటనలతో పాటు రాహుల్ సభలకు పెద్ద సంఖ్యలో జనం రావడాన్ని బట్టి రెండు అంచనాలకు రావచ్చని స్పష్టమవుతోంది. ప్రజా వ్యతిరేకత అనేది ఉంటే అది పైకి కనపడకుండా చాప కింద నీరులాగా పాకుతుంది. ఇందిరాగాంధీ, పీవీ నరసింహారావు ఇద్దరూ కాంగ్రెస్ పట్ల ప్రజా వ్యతిరేకతను కనిపెట్టలేకపోయారు. ప్రభుత్వంపై ప్రజావ్యతిరేకతను తమకు అనుకూలంగా మార్చుకోవడంలో రాహుల్ విఫలమయ్యారు. 2014లో ప్రధాని మోదీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచీ జనం నాడిని పసిగట్టి అందుకు తగ్గ వ్యూహరచన చేయడంలో కాంగ్రెస్ పార్టీ విఫలమవుతోంది. ప్రతికూల అంశాలను కూడా మోదీ అనుకూలంగా మార్చుకోగలిగితే, అనుకూల అంశాలను కూడా రాహుల్ వ్యతిరేకంగా మార్చుకుంటున్నారేమో!

ఆశ్చర్యమేమంటే, రాహుల్‌గాంధీ, ప్రియాంకాగాంధీ సభలకు పెద్ద సంఖ్యలో జనం వచ్చిన నియోజకవర్గాలన్నిటిలోనూ కాంగ్రెస్ చిత్తుగా ఓడిపోయింది. కాంగ్రెస్ గెలిచిన ఆరు సీట్లలో మూడు సీట్లు అతి స్వల్ప మెజారిటీతో గెలిచింది. కాంగ్రెస్ 5 సీట్లలోనూ, ఆర్‌జేడీ ఒక సీటులోనూ డిపాజిట్ కోల్పోగా ఎన్డీఏ ఎక్కడా డిపాజిట్ కోల్పోకపోవడం గమనార్హం.

ఒక యంత్రాంగం అంటూ లేకపోవడం వల్ల కాంగ్రెస్ ఓడిపోయింది. కానీ ఆర్‌జేడీ ఘోర వైఫల్యమే బిహార్ ఎన్నికల్లో అన్నిటికంటే విడ్డూరమైన విషయం. 2020 అసెంబ్లీ ఎన్నికల్లో ఆర్‌జేడీ అన్ని పార్టీల కంటే ఎక్కువగా– అంటే 75 సీట్లు గెలుచుకుంది. ఈసారి తన సీట్లు తప్పకుండా పెంచుకుంటుందని చాలా మంది ఆశించారు. బిహార్‌లో మండల్ రాజకీయాల్లో బలమైన పునాది ఉన్న రాష్ట్రీయ జనతాదళ్ 143 సీట్లలో పోటీ చేసి కేవలం 25 సీట్లు మాత్రమే గెలుచుకోవడానికి కారణం ఏమిటి? ఆర్‌జేడీకి ప్రధాన ఓటు బ్యాంక్ అయిన యాదవులకూ, ఇతర అత్యంత వెనుకబడిన సామాజిక వర్గాలు, మహిళలు, దళితులకూ మధ్య వైరుధ్యం ఈ ఎన్నికల్లో కొట్టొచ్చినట్లు కనపడిందని ఒక విశ్లేషకుడు తెలిపారు. యాదవులకు 37 శాతం సీట్లిచ్చి, అత్యంత వెనుకబడిన వర్గాలకు కేవలం 11 శాతం సీట్లు ఇవ్వడం వల్ల ఆర్‌జేడీ కొత్త సామాజిక పునాదిని ఏర్పర్చుకోలేకపోయిందని ఆయన చెప్పారు. తన సొంత కుటుంబంలోని లుకలుకలనే ఆర్‌జేడీ పరిష్కరించుకోలేకపోయింది. ఆర్‌జేడీ తన వైఫల్యానికి గతంలో లాగా కాంగ్రెస్ వంటి మిత్రపక్షాలను నిందించేందుకు వీలు లేకుండా పోయింది. తాను పోటీ చేసిన సీట్లలో నాలుగోవంతు కూడా గెలుచుకోలేనప్పుడు ఇతరులను నిందించి అర్థం లేదు.

> ఎన్డీఏ 200కు పైగా సీట్లను గెలుచుకుంటుందని, ఓట్ల లెక్కింపు మొదటి దశ నుంచీ ఆధిక్యత కనబరుస్తుందని ఏ పరిశీలకుడూ ఊహించలేదు. బిహార్ ఎన్నికల్లో విజయం సాధించి, తన నాయకత్వ సామర్థ్యాన్ని నిరూపించుకోవడానికి, తనపై ఇంటా బయటా వస్తున్న విమర్శలను తిప్పికొట్టి అజేయుడుగా మారడానికి మోదీ ఎట్టి పరిస్థితుల్లోనూ ప్రయత్నిస్తారన్న విషయం కాంగ్రెస్, ఇతర ప్రతిపక్షాలకు తెలుసు. అయినా బీజేపీ వ్యూహాల్ని అంచనా వేయడంలోను, తమ పార్టీలను పటిష్ఠంగా మార్చుకోవడంలోనూ విపక్షాలు విఫలమయ్యాయి.



ఇంకా ఆశ్చర్యకరమయిన విషయం ఏమంటే దేశంలో ఎన్నో పార్టీల తరఫున వ్యూహకర్తగా పనిచేసిన ప్రశాంత్ కిశోర్ స్వయంగా పార్టీ పెట్టి, గత ఏడాది కాలంగా జనం మధ్యలో తిరగడం ప్రారంభించారు. అనేకమంది మాజీ బ్యూరోక్రాట్లు, మేధావులకు టిక్కెట్లు ఇచ్చారు. ఆయన సభలకు కూడా జనం భారీగా హాజరయ్యారు. ఇంతకాలం తాను పార్టీల నుంచి వసూలు చేసిన కోట్లాది రూపాయలను ఆయన విచ్చలవిడిగా ఖర్చు పెట్టారు. బిహార్‌లో జన ప్రభంజనం వీస్తుందని, బొటాబొటి మెజారిటీ వచ్చినా అది తన ఓటమిగానే భావిస్తానని ఆయన చెప్పుకున్నారు. కానీ ఆయన మాటలన్నీ ప్రగల్భాలుగా మిగిలిపోయాయి. ఆయన స్థాపించిన 'జన సురాజ్ పార్టీ' 238 స్థానాల్లో పోటీ చేస్తే 236 స్థానాల్లో డిపాజిట్ కోల్పోయింది. రాజకీయ పార్టీలు ఎంతవరకు ఇలాంటి వ్యూహకర్తలను నమ్మాలో గ్రహించేందుకు ప్రశాంత్ కిశోర్ ఘోర వైఫల్యం ఒక ఉదాహరణ.

ప్రశాంత్ కిశోర్ మాత్రమే కాదు, మహాగఠ్ బంధన్‌లో ఉన్న అన్ని పార్టీలు గతంలో కంటే ఘోరంగా పరాజయం పొందడానికి రకరకాల కారణాలు చెబుతున్నారు. మండల్ రాజకీయాలకు నెలవైన బిహార్‌లో ఎవరూ ఊహించలేని మార్పు జరుగుతున్నదని కొందరు పరిశీలకులు భావిస్తున్నారు. అది బీజేపీ సీట్ల సంఖ్య ఈసారి గతంలో కంటే ఎక్కువ పెరగడమే కాక, బీజేపీతో చేతులు కలిపిన పార్టీలు కూడా తమ సంఖ్యా బలాన్ని పెంచుకోవడం కూడా. బీజేపీ హిందూత్వ రాజకీయాలు బిహార్‌లోనూ ప్రభావం చూపుతున్నాయని ఒక విశ్లేషకుడు అంటే, ప్రజలు మోదీ నాయకత్వంలో జరుగుతున్న అభివృద్ధికి స్వాగతం పలుకుతున్నారని ఎన్డీఏ భాగస్వామి పక్షమైన తెలుగుదేశం అధినేత, ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు విశ్లేషించారు. ఏమైనా బిహార్‌లో బీజేపీ సారథ్యంలో ఎన్డీఏ విజయం సాధించడం దేశ రాజకీయాల తీరుతెన్నులపై ప్రభావం చూపక తప్పదు.

ప్రతిపక్ష కూటమిలో మొదటి నుంచి పొడజూపిన అంతర్గత వైరుధ్యాలు కూడా ఈ ఫలితాలకు దారితీసి ఉండవచ్చు. ఓటర్ అధికార యాత్ర ద్వారా ప్రదర్శించిన వాపును బలుపుగా మార్చుకోవడంలో కాంగ్రెస్, ఆర్‌జేడీ విఫలమయ్యాయి. సీట్ల సర్దుబాటులో రెండు పార్టీలు చివరి వరకు ఘర్షించడం, స్నేహపూర్వక పోటీ పేరుతో దాదాపు 10 సీట్లలో కాంగ్రెస్ మిత్రపక్షాలతో తలపడడం, ముఖ్యమంత్రి అభ్యర్థి పేరును ప్రకటించడంపై అభ్యంతరాలు వ్యక్తం చేయడం, ఉమ్మడి మేనిఫెస్టో విడుదలకు రాహుల్‌గాంధీ హాజరుకాకపోవడం, ఆర్‌జేడీపై లాలూ హయాంలో పడ్డ జంగిల్ రాజ్ ప్రభావం ప్రజలు మరచిపోకపోవడం లాంటి అనేక కారణాల వల్ల మహాగఠ్ బంధన్ ఒక సమైక్య శక్తిగా ఏనాడూ కనిపించలేదు. అదే సమయంలో బీజేపీ, ఎన్డీఏ మిత్రపక్షాలు తమ మధ్య విభేదాలను ఎంతో ముందుగా పరిష్కరించుకోవడం, హోంమంత్రి అమిత్ షా ఢిల్లీని కూడా విస్మరించి దాదాపు 20 రోజులు అక్కడే మకాం వేయడం, మోదీ ఉధృతంగా ప్రచారం చేయడం, ఎస్ఐఆర్ పేరుతో ఓట్లను తొలగించలేకపోయినా హిందూ ఓట్లను సంఘటితం చేయగలగడం ఎన్డీఏ గెలుపునకు దారితీసింది.

అయినా ఎన్డీఏ 200కు పైగా సీట్లను గెలుచుకుంటుందని ఏ పరిశీలకుడూ ముందుగా ఊహించలేదు. ఎన్నికల సమయంలో మహిళలకు పెద్ద మొత్తంలో నిధులు పంపిణీ చేయడం వంటి కారణాలు ఎన్డీఏ గెలుపునకు దోహదం చేస్తాయని అంచనా వేసినవారు కూడా కొద్ది పాటి ఆధిక్యతతో ఎన్డీఏ అధికారంలోకి వస్తుందని మాత్రమే ఊహించారు. కానీ ఎన్డీఏకు అనూహ్యమైన విజయం లభించింది. ఎన్నికల అక్రమాలే కారణమని, ఎన్నికల కమిషన్ అధికార పార్టీకి అనుగుణంగా నడుచుకుందని ప్రతిపక్షాలు విమర్శించినంత మాత్రాన ఈ విజయం ప్రాధాన్యం తగ్గిపోదు. తమ ఆరోపణలు, విమర్శలు ప్రజలను కదిలించలేనప్పుడు వాటివల్ల పెద్దగా ప్రయోజనం ఉండదు. బిహార్ ఎన్నికల్లో విజయం సాధించి, తన నాయకత్వ సామర్థ్యాన్ని నిరూపించుకోవడానికి, తనపై ఇంటా బయటా వస్తున్న విమర్శలను తిప్పికొట్టి అజేయుడుగా మారడానికి మోదీ ఎట్టి పరిస్థితుల్లోనూ ప్రయత్నిస్తారన్న విషయం తెలిసినప్పటికీ బీజేపీ వ్యూహాల్ని అంచనా వేయడంలోను, తమ పార్టీలను పటిష్ఠంగా మార్చుకోవడంలోనూ కాంగ్రెస్, ఇతర ప్రతిపక్షాలు విఫలమయ్యాయన్న విషయం స్పష్టమవుతోంది. ప్రతిపక్షాల దౌర్బల్యమే మోదీకి శ్రీరామరక్ష.

(ఆంధ్రజ్యోతి ఢిల్లీ ప్రతినిధి)

అవి ఊహాజనిత వాదనలు!

విశాఖపట్టణంలో గూగుల్–అదానీ–ఎయిర్‌టెల్ నిర్మించతలపెట్టిన ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) డేటా హబ్ గురించి అక్టోబర్ 30న 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన నెల్లూరు నరసింహారావు వ్యాసంలో అనేక వాస్తవ విరుద్ధవాదనలున్నాయి. విశాఖపట్టణంలో నిర్మించదలుచుకున్నది సాధారణ డేటా సెంటర్ కాదు, ఏఐ డేటా సెంటర్. రెంటికీ ఎంతో తేడా ఉంది. గూగుల్ సంస్థకు చెందిన జీమెయిల్, యూట్యూబ్, క్రోమ్, మ్యాప్స్ లాంటివి వాడేటప్పుడు మనకు అందే సమాచారం సాధారణ డేటా సెంటర్స్‌లో ఉండే సర్వర్ల నుంచి లభిస్తుంది. అయితే గూగుల్ సంస్థ ఏఐ ఉత్పత్తులను తయారు చేయాలన్నా, పెద్దఎత్తున సమాచారం క్రోడీకరించాలన్నా వాటిని ఏఐ డేటా సెంటర్‌ల ద్వారా చేయాల్సి ఉంటుంది. క్లౌడ్ సర్వీసెస్ ఇందులో భాగమే. అందుకనే ఏఐ డేటా సెంటర్లు సాధారణ సెంటర్ల కన్నా పెద్దవిగా, సంక్లిష్టంగా ఉంటాయి. వీటిలో క్లిష్టమైన పరికరాలు వాడతారు కనుక అవసరమైన నీరు, విద్యుత్తు, కాలుష్యం సాధారణ డేటా సెంటర్ కన్నా చాలా ఎక్కువ ఉంటుంది.

ఇక, వ్యాసకర్త చెప్పినట్టు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం పునరుత్పాదక విద్యుత్తు రంగంలో దేశంలో అగ్రస్థాయిలో లేదు. మార్చి 2024 నాటికి 11 గిగావాట్ల సామర్థ్యంతో ఏడవ స్థానంలో, దక్షిణ భారతంలో మూడవ స్థానంలో ఉంది. అలాగే, చైనాలో వేల సంఖ్యలో డేటా సెంటర్లు ఏమీ లేవు. అక్కడ సాధారణ డేటా సెంటర్లు 449, ఏఐ డేటా సెంటర్లు వంద దాకా ఉన్నాయి. అమెరికాలో ఏఐ డేటా సెంటర్లు పదుల సంఖ్యలోనే (20–30 మధ్యలో) ఉన్నాయి. గూగుల్ ఏఐ డేటా హబ్ విషయానికి వస్తే, పైన పేర్కొన్నట్టు ఇందులో వాడే పరికరాలు చాలా క్లిష్టమైనవి. వీటిల్లో గ్రాఫిక్ ప్రాసెసింగ్ యూనిట్స్ వాడతారు. ఇవి సంవత్సరం పొడుగునా పనిచేస్తూనే ఉండాలి కాబట్టి తొందరగా, తీవ్రంగా వేడెక్కుతాయి. ఆ వేడిని తగ్గించడానికి ముఖ్యమైనది కూలెంట్ నీరు. ఈ సెంటర్లలో వెలువడే విపరీతమైన వేడి ఒక సమస్య అయితే, సర్వర్లను చల్లబరచడానికి అత్యధిక మోతాదులో అవసరమయ్యే నీరు మరొక సమస్య. విశాఖపట్టణం ఉష్ణోగ్రతలకు ఈ నీటి అవసరం మరింత ఎక్కువ.



ఒక ఏఐ డేటా సెంటర్‌కు ఎంత నీరు అవసరమన్నదానిపై మన దగ్గర స్పష్టమైన లెక్కలు లేవు కానీ, ఒక గిగావాట్ సామర్థ్యం కలిగిన సాధారణ డేటా సెంటర్‌కు రోజుకు ఒక కోటి 11 లక్షల గ్యాలన్ల నీరు కావాలి. అంటే విశాఖపట్టణం మొత్తానికి రోజుకు అవసరమైన నీటిలో 11శాతం అన్న మాట. 'ఇంత నీరు ఎక్కడి నుంచి తీసుకువస్తారు' అనేదానికి ప్రభుత్వం ఏమీ చెప్పలేదు. వ్యాస రచయిత మాత్రం పోలవరం ఎడమ కాలువ అని చెప్పారు. పోలవరం ఇప్పటివరకు పూర్తవ్వనే లేదు, అప్పటివరకు అంత ఎక్కువ మొత్తంలో నీరు ఎక్కడి నుంచి లభిస్తుంది? ఒకవేళ పోలవరం పూర్తి అయినా దీనికి అవసరమైన కేటాయింపు ఆ ప్రాజెక్టులో ఉందా? కేవలం నీటితోనే ఆ సర్వర్లు, పరికరాలు చల్లబడవు. అనేక రసాయనాలు కలపాలి. మరి ఆ కాలుష్యమంతా ఎక్కడికి వెళ్తుంది? పూర్తిగా రీసైకిల్ చేస్తామనే ప్రకటన అయితే ఇస్తారు కానీ, అది సాధ్యపడని విషయం. దీని గురించి మనకు సమాచారం లేదు. పర్యావరణ ప్రభావ అంచనా నివేదిక వంటిదేమీ అందుబాటులో లేదు. సమాచారం ఏమీ లేకుండా ఆశావాదం ప్రకటించడం సబబు కాదు.

ఈ సెంటర్‌కు అవసరమైన విద్యుత్తు అంతా పునరుత్పాదక విద్యుత్తు ద్వారా సమకూర్చుకుంటారని నరసింహారావు చెబుతున్నారు. అది అసాధ్యం. సంప్రదాయ విద్యుత్తు వాడవలసిందే. అందుకే, అమెరికాలోని డేటా సెంటర్ సంస్థలు తమ విద్యుత్ అవసరాల కోసం అణు విద్యుత్తు రంగంలో పెట్టుబడులు పెడుతున్నాయి. ఈ సెంటర్‌ను పూర్తిగా విశాఖపట్టణం, దాని పరిసరాలలోనే పెట్టబోతున్నారు. అంటే దానికి అవసరమయ్యే నీరు, విద్యుత్తు, కాలుష్యం అంతా కూడా ఆ నగరం, పరిసరాలపై ప్రభావం చూపెట్టే అంశం. ప్రపంచ డేటా సెంటర్ రాజధానిగా పేరున్న వర్జీనియా రాష్ట్రంలో ఉన్న డేటా సెంటర్ల మొత్తం సామర్థ్యం 2.5 గిగావాట్లు అయితే విశాఖపట్టణంలో నిర్మించదలుచుకున్న ఈ ఒక్క సెంటర్ సామర్థ్యమే 1 గిగావాట్. అంటే కేంద్రీకరణ ఏ స్థాయిలో ఉంటుందో అర్థం చేసుకోవచ్చు. 'ఈ డేటా సెంటర్ వల్ల 2 లక్షల ఉద్యోగాలు వస్తాయి' అని రచయిత తెలిపారు. ఈ సంఖ్య ప్రభుత్వం మోడలింగ్ చేసి, 1,88,000 ఉద్యోగాలు వస్తాయి అని చెప్పిన సంఖ్యకు దగ్గరగా ఉంది. ప్రభుత్వం ఏమి మోడలింగ్ చేసిందో, ఏ ఇన్‌పుట్స్ తీసుకుందో తెలియదు. ఏ అంశాలను పరిగణనలోకి తీసుకుంటున్నారనేది చాలాసార్లు పక్షపాతంతో కూడి ఉంటుంది. కాబట్టి ఈ మోడలింగ్‌కు ఒక శాస్త్రీయ పునాది ఉన్నదని నమ్మటం కష్టం. 2023లో గూగుల్ సంస్థ విడుదల చేసిన ఒక నివేదికలో అమెరికాలో యాష్‌బర్న్, లీస్‌బర్గ్‌లలో ఉన్న తమ డేటా సెంటర్లలో మొత్తం 400 మంది పనిచేస్తున్నారని తెలిపింది. అదే విధంగా మెటా సంస్థ తాము లూసియానా రాష్ట్రంలో కట్టబోతున్న ఒక అతి పెద్ద డేటా సెంటర్‌లో ఇవ్వనున్న ఉద్యోగాలు 500 అని తెలిపింది. అమెరికా మొత్తం మీద సుమారు 5,500 డేటా సెంటర్లు ఉండగా, అందులో మొత్తం ఉద్యోగులు దాదాపు 5 లక్షలు. అంటే డేటా సెంటర్‌కు వందమంది.

అయితే 'ఇక్కడ రాబోయే ఉద్యోగాలు ఈ ఒక్క సెంటర్ కారణంగా కాక, ఎకో సిస్టమ్ ఆధారంగా వస్తాయి' అని వాదించవచ్చు. కానీ ఇది ఒక ప్రోడక్ట్ డెవలప్‌మెంట్ సెంటరో, టెస్టింగ్ సెంటరో కాదు. కేవలం సర్వర్ సెంటర్. డేటా సెంటర్ చుట్టూ ఒక ఎకో సిస్టమ్ అభివృద్ధి చెందే అవకాశం ఉంటే అమెరికా టెక్నాలజీ పరిశ్రమ సిలికాన్ వ్యాలీని వదిలేసి ఎప్పుడో వర్జీనియాకు వచ్చేసి ఉండాల్సింది. ఇటువంటి పెద్ద ప్రాజెక్టుల గురించి, ప్రభుత్వం వాటికి అందిస్తున్న వేలకోట్ల రాయితీల గురించి, వాటి వెనుక ఉన్న భావజాల–రాజకీయ కారణాల గురించి అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉంది. అంతా మన మంచికే అని నమ్మే రోజులు పోయాయి.

• గుత్తా రోహిత్
మానవ హక్కుల వేదిక (హెచ్‌ఆర్ఎఫ్)

'బీఎన్‌రెడ్డి సూర్యాపేట'గా మార్చాలి

నల్లగొండ జిల్లాలో పేరుగాంచిన ఎస్సారెస్పీ ఫేజ్–2 ప్రధాన కాలువకు మాజీమంత్రి దివంగత ఆర్.దామోదర్‌రెడ్డి పేరు పెట్టేందుకు రాష్ట్ర క్యాబినెట్ ఆమోదం తెలిపింది. ఈ విషయంలో ప్రభుత్వం పునరాలోచించుకోవాలని పలువురు (ముఖ్యంగా వీర తెలంగాణ పోరాటంలో భాగస్వాములైన వారు, వారి వారసులు, వామపక్షాల కార్యకర్తలు) కోరుతున్నారు. 2008, మే 9 నాటి భీమిరెడ్డి నరసింహారెడ్డి సంస్మరణ సభలో నాటి మంత్రులు జానారెడ్డి, రాంరెడ్డి దామోదర్‌రెడ్డితో పాటు ఇతర ముఖ్య నేతలంతా కూడా ఎస్సారెస్పీ ప్రధాన కాలువకు భీమిరెడ్డి నరసింహారెడ్డి పేరు పెట్టాలని ప్రతిపాదించారు. అయితే, ఆ కాలువకు దామోదర్‌రెడ్డి పేరు పెట్టాలని ఇప్పుడు క్యాబినెట్ నిర్ణయం తీసుకున్నది. ప్రత్యామ్నాయంగా 'కొత్త జిల్లా అయిన సూర్యాపేటకు బి.ఎన్ పేరు పెట్టండి' అని ఉమ్మడి నల్లగొండ జిల్లా వాసులు విజ్ఞప్తి చేస్తున్నారు. ఉమ్మడి నల్లగొండ జిల్లాలో రెండుసార్లు ఎమ్మెల్యేగా, మూడుసార్లు ఎంపీగా పని చేశారాయన. తాగు, సాగు నీటి కోసం చట్టసభలలో పోరాటం చేశారు. అందులో భాగమే ఎస్సారెస్పీ కాలువ సాధన.

భీమిరెడ్డి నర్సింహారెడ్డి దళితుల్లో దళితుడిగా ఉన్నారు. బీసీల్లో బీసీగా ఉన్నారు. మట్టి మనుషుల్లో చెమట చుక్కలా ఉన్నారు. తానే బహుజనమయ్యారు. తాను పుట్టి పెరిగిన నల్లగొండ జిల్లా తాగు, సాగునీటి సమస్య పరిష్కారం కోసం అంతులేని పోరాటం చేశారు. శ్రీరాంసాగర్ వరద కాలువ నీటితో సూర్యాపేట ప్రాంతంలోని లక్షలాది ఎకరాల బీళ్ల నోళ్లు తడపాలని పట్టుదలతో నాటి ముఖ్యమంత్రి చంద్రబాబును ఒప్పించి పథకం సిద్ధం చేయించారు. ఈ నీటి వల్ల అత్యధికంగా ప్రయోజనం పొందేవారు కూడా బహుజనులే. ఈ మహానాయకుని గురించి పాఠ్యపుస్తకాల్లో ఎలాగూ ఉమ్మడి పాలకులు రాయలేదు. తెలంగాణ అనంతరం కూడా అలాంటి ఆలోచన చేయలేదు. కనీసం ఈ ప్రభుత్వం అయినా ఎస్సారెస్పీ కాలువకు భీమిరెడ్డి నర్సింహారెడ్డి పేరు పెట్టాలనేది తెలంగాణ ప్రజల ఆకాంక్ష. ఈ విషయమై క్యాబినెట్ తీసుకున్న నిర్ణయాన్ని ప్రభుత్వం పునరాలోచించుకోవాలి. ఆయన పోరాట కేంద్రం అయిన సూర్యాపేట జిల్లాకు బి.ఎన్ పేరు పెట్టి గౌరవించాలి. ఈ డిమాండ్లతో నేడు ఇందిరాపార్క్ వద్ద ఉదయం 10 గం.లకు ధర్నా నిర్వహిస్తున్నాం.

–ప్రొఫెసర్ కే. విద్యాసాగర్‌రెడ్డి, మిజోరం యూనివర్సిటీ

ప్రజల్ని విడిచి పెట్టుబడికి వత్తాసు!

నేడు మన దేశ స్థూల జాతీయ ఉత్పత్తి 4.19 ట్రిలియన్ డాలర్లకు చేరుకుని, దేశం ప్రపంచంలోనే నాలుగవ అతిపెద్ద మార్కెట్ ఎకనామీగా అవతరించింది. కానీ దేశ పీడిత ప్రజలకు ఒరిగింది ఏమీ లేదు. భారతదేశానికి స్వాతంత్ర్యం రాక ముందు నుంచి నేటి వరకు కూడా భారత దేశ ప్రజల ప్రధాన వృత్తి వ్యవసాయమే. దేశ భూభాగంలో 60శాతం భూమి ఉన్నది (దాదాపు 140 మిలియన్ హెక్టార్ల వ్యవసాయ యోగ్యమైన భూమి). అందులో 44శాతం భూమి నేటికీ 2 లక్షల భూస్వాముల, 3 లక్షల నయా భూస్వాముల (బడా పెట్టుబడిదారులు, బహుళ జాతి సంస్థల) చేతుల్లో ఉన్నది. మిగతా 56శాతం భూమి దేశంలోని 93.03 మిలియన్ల పెద్ద, మధ్య తరగతి, చిన్న, సన్నకారు రైతుల చేతుల్లో ఉంది.

భారతదేశంలోని 6,40,932 గ్రామాల్లో, 7,933 పట్టణాల్లో, 4,000 నగరాల్లో 140.63 కోట్ల జనాభా జీవిస్తున్నది. ఇందులో 72.2శాతం జనాభా గ్రామాల్లో జీవిస్తుండగా, 27.8శాతం జనాభా పట్టణాల్లోను, నగరాల్లోను జీవిస్తున్నది. దేశ రాజ్యాంగంలోని ఐదవ, ఆరవ షెడ్యూల్‌లోని 14 రాష్ట్రాల్లో 705 గిరిజన తెగలు సుమారు 10 కోట్ల 40 లక్షలు జీవిస్తున్నాయి. వీరి ప్రధాన వృత్తి వ్యవసాయం, అటవీ ఉత్పత్తుల సేకరణ. వీరు దేశ జనాభాలో 8.6శాతం ఉన్నారు. దేశ వ్యాప్తంగా దళిత జనాభా 20 కోట్ల 14 లక్షలు కాగా, దేశ జనాభాలో వీరిది దాదాపు 16.6శాతం. దేశంలో ముస్లిం ప్రజలు దాదాపు 20 కోట్లుండగా, ఇది దేశ జనాభాలో 14శాతం. నేటికీ దేశంలో దాదాపు 49.25 కోట్ల అసంఘటిత–సంఘటిత కార్మికులుండగా ఇందులో సంఘటిత కార్మికులు కేవలం 2 కోట్ల 60 లక్షలు మాత్రమే. మిగతా 46 కోట్ల 40 లక్షల కార్మికులు అసంఘటిత కార్మిక రంగానికి చెందినవారే. ఇందులో భూమిలేని వ్యవసాయ కూలీలు 14 కోట్ల 40 లక్షలున్నారు. ఈ వ్యవసాయ కూలీలు గ్రామాల్లోనే జీవిస్తున్నారు.

సరిగ్గా 34 ఏళ్ళ క్రితం కాంగ్రెస్ ప్రభుత్వం మొదలుపెట్టిన ప్రపంచీకరణ–సరళీకరణ–ప్రయివేటీకరణలను ఆ తర్వాత వచ్చిన ఎన్డీఏ ప్రభుత్వం వేగవంతం చేసింది. ఈ దేశ కార్మిక రంగం తమ రక్త మాంసాలను ధారపోసి పోగుచేసిన 331 ప్రభుత్వరంగ సంస్థలకు చెందిన దాదాపు 20 లక్షల కోట్ల ఆస్తులను కేవలం రూ.3,47,439 కోట్లకే దేశీయ బడా పెట్టుబడిదారులకు, బహుళ జాతి సంస్థలకు అమ్మివేసింది. ఫలితంగా గత మూడున్నర దశాబ్దాలుగా దేశ సంఘటిత కార్మిక రంగానికి చెందిన కోట్లాది కార్మికులు రోడ్డునపడ్డారు. దేశ పీడిత ప్రజలకు చెందిన ఈ ప్రభుత్వ ఆస్తులు బడా పెట్టుబడిదారుల, బహుళ జాతి సంస్థల వశమయ్యాయి. ఫలితంగా దేశీయ బడా పెట్టుబడిదారులు ముకేశ్ అంబానీ, అదానీ, టాటా గ్రూప్, రుస్తుంజీ తదితరుల ఆస్తులు దాదాపు రూ.20 లక్షల కోట్లకు చేరుకోగా, దేశంలోని 298 బడా పెట్టుబడిదారుల ఆస్తులు రూ.98 లక్షల కోట్లకు చేరుకున్నాయి.

ఈ 75 ఏళ్ళుగా స్వాతంత్ర ఉద్యమ ఫలితాలు ఈ దేశ 80శాతం ప్రజలకు అందలేదు. రోజురోజుకు ప్రభుత్వాల పని విధానం పేదలు, మరింత పేదలుగాను, ధనవంతులు మరింత కుబేరులుగాను మారేందుకు ఉపయోగపడుతున్నది. దేశ ప్రజల సకల సంపదను ప్రభుత్వాలు దేశీయ బడా పెట్టుబడిదారులకు, బహుళజాతి సంస్థలకు అప్పచెప్పాయి. ఇప్పుడు ఈ పెట్టుబడిదారులు, బహుళజాతి సంస్థలు దేశంలోని అడవి మీద, అడవిలోని ఖనిజ సంపద మీద కన్ను వేశాయి. దాన్ని దోచుకునేందుకు ప్రయత్నం చేస్తున్నాయి. వీరికి ఆ వీలు కల్పిస్తూ ప్రభుత్వాలు ప్రజా ఉద్యమాలపై అణచివేతను కొనసాగిస్తున్నాయి.

> రోజురోజుకు ప్రభుత్వాల విధానం పేదలు, మరింత పేదలుగాను, ధనవంతులు మరింత కుబేరులుగాను మారేందుకు ఉపయోగపడుతున్నది. దేశ ప్రజల సకల సంపదను ప్రభుత్వాలు దేశీయ బడా పెట్టుబడిదారులకు, బహుళజాతి సంస్థలకు అప్పచెప్పాయి. ఇప్పుడు ఈ పెట్టుబడిదారులు, బహుళజాతి సంస్థలు దేశంలోని అడవి మీద, అడవిలోని ఖనిజ సంపద మీద కన్ను వేశాయి. వీరికి వీలు కల్పిస్తూ ప్రభుత్వాలు ప్రజా ఉద్యమాలపై అణచివేతను కొనసాగిస్తున్నాయి.




భారతదేశంలోని ఉత్పత్తి సాధనాలు ఉత్పత్తి శక్తులకు దక్కి, నిజమైన ప్రజాస్వామికస్ఫూర్తితో "సమ సమాజం" ఏర్పడాలన్న లక్ష్యంతో మార్క్సిజాన్ని ఆధారం చేసుకుని ఏప్రిల్ 22, 1981న ఉద్భవించిన పీపుల్స్‌వార్ పార్టీ, కాలక్రమేణా సీపీఐ (మావోయిస్టు) పార్టీగా మారి, దేశ ప్రజలకు తానున్నానని కొంత భరోసా ఇచ్చింది. కానీ 2004 నుండి ఆ పార్టీ నిత్య నిర్బంధాన్ని అనుభవిస్తూ దేశంలోని అయిదవ షెడ్యూల్‌కు మాత్రమే పరిమితమైంది. కేంద్ర ప్రభుత్వం, వివిధ రాష్ట్ర ప్రభుత్వాలు మొదట గ్రీన్ హంట్, ఆపరేషన్ ప్రహార్, ఆపరేషన్ సమాధాన్‌లతో మావోయిస్టు పార్టీని నిర్మూలించే ప్రయత్నం చేశాయి. ఆ ప్రయత్నాలు ఫలించకపోవడం వలన, రెండు సంవత్సరాల నుండి 'ఆపరేషన్ కగార్' పేరుతో చుట్టివేత కార్యక్రమం మొదలైంది. అయిదవ షెడ్యూలులోని ఆదివాసీ ప్రాంతాలకు, అడవికి పరిమితమైన ఆ పార్టీ నాయకత్వాన్ని నిర్మూలించడానికి ప్రయత్నిస్తున్నాయి. ఈ వ్యూహం వలన అమాయక ఆదివాసులు, వారికి నాయకత్వం వహిస్తున్న మావోయిస్టు పార్టీ గత 45 సంవత్సరాలుగా మునుపెన్నడూ నష్టపోనివిధంగా నష్టపోతున్నది. ఈ అమానుష దారుణ మారణకాండ వలన దేశ పీడిత ప్రజల "సమ సమాజ ఏర్పాటు" కల చెదిరిపోతున్నది.

ఇంకొకవైపు ఈ అసాధారణ పరిస్థితుల్లో నిత్య దుర్భర జీవితాలు వెళ్ళదీస్తున్న దేశ మెజారిటీ పీడిత ప్రజలను ప్రస్తుత ప్రభుత్వం మతోన్మాదంతో నిట్టనిలువుగా చీల్చాలని చూస్తున్నది. చట్టబద్ధ పాలనకు చరమగీతం పాడి దేశాన్ని మధ్య యుగాలకు తీసుకెళ్లే ప్రయత్నం చేస్తున్నది. ఈ మొత్తం దుర్మార్గాన్ని న్యాయ వ్యవస్థ కళ్లప్పగించి చూస్తున్నది కానీ నివారించడంలేదు. దేశంలో పాలక పార్టీలకు దీటుగా గత 75 ఏళ్ళుగా దేశ అశేష ప్రజల ఆకాంక్షలకు నిజమైన ప్రాతినిధ్యం వహించే లౌకిక ప్రజాస్వామ్య పార్టీ కానీ, వామపక్ష పార్టీ కానీ ఏర్పడకపోవటం పెద్ద లోటు. కనీసం వామపక్ష, లౌకిక ప్రజాస్వామ్య బలమైన ఐక్య సంఘటన కూడ దేశంలో లేకపోవడం వలన దేశ పీడిత ప్రజలు దుర్భర పరిస్థితిని ఎదుర్కొంటున్నారు.

అయితే గతితార్కిక నియమాల ప్రకారం సమాజం నిరంతరం చలనంలో ఉంటూ మార్పు చెందుతూ పాతది నశిస్తూ కొత్తది ఉద్భవిస్తుందనేది చారిత్రక వాస్తవం. బలమైన విప్లవ, ప్రజాస్వామిక పార్టీలు లేకుండానే మొన్న శ్రీలంక, నిన్న బంగ్లాదేశ్, నేపాల్ ప్రజలు ఉద్యమించి, తమ ఆకాంక్షలకు అనుగుణంగా వ్యవహరించారు. రేపు భారతదేశం అందుకు అతీతం కాదు. కాలం ప్రశ్నలకు కాలమే సమాధానం చెపుతుంది.

■ చిక్కుడు ప్రభాకర్
హైకోర్టు న్యాయవాది
కన్వీనర్, తెలంగాణ ప్రజాస్వామిక వేదిక



స్పీకర్ నిర్ణయానికి కట్టుబడి ఉంటా: కడియం



లింగాలఘణపురం, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): పార్టీ మారిన ఎమ్మెల్యేల విషయమై శాసనసభ స్పీకర్ తీసుకునే నిర్ణయానికి కట్టుబడి ఉంటానని స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి స్పష్టం చేశారు. జనగామ జిల్లా లింగాల ఘణపురం మండలం నవాబుపేట రిజర్వాయర్‌లో మంగళవారం ఉచిత చేపపిల్లల పంపిణీ కార్యక్రమానికి హాజరైన శ్రీహరి మీడియాతో మాట్లాడారు. స్పీకర్ ఏ నిర్ణయం తీసుకున్నా తాను కట్టుబడి ఉంటానన్నారు.



వరంగల్ ఏనుమాముల మార్కెట్‌లో బీఆర్ఎస్ నాయకులతో కలిసి పర్యటిస్తున్న మాజీ మంత్రి తన్నీరు హరీష్‌రావు

మూటలు మోయడమే సీఎంకు తెలుసు

- రైతు సమస్యల పరిష్కారంలో ప్రభుత్వాలు విఫలం
- సీసీఐ అధికారులవి తుగ్లక్ నిబంధనలు
- రాష్ట్ర ఎంపీలు ఏం చేస్తున్నారు..?
- కలెక్షన్లపై ఉన్న శ్రద్ధ రైతులపై లేదు..
- బీఆర్ఎస్ నేత, మాజీ మంత్రి తన్నీరు హరీష్‌రావు ధ్వజం
- వరంగల్ ఏనుమామాముల మార్కెట్‌లో పర్యటన

వరంగల్ వ్యవసాయం, నవంబరు18 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ఢిల్లీకి మూటలు మోయడం తప్ప ఏమీ తెలియదని బీఆర్ఎస్ నేత, మాజీ మంత్రి హరీష్‌రావు ఆరోపించారు. కలెక్షన్ల మీద రివ్యూ మీటింగులు పెట్టుడు తప్ప రైతుల సమస్యలపై స్పందించడం తెలియదని విమర్శించారు. రెండు రోజులుగా రాష్ట్రవ్యాప్తంగా పత్తి కొనుగోళ్లు నిలిచిన నేపథ్యంలో పత్తి రైతులకు మద్దతుగా మంగళవారం ఆయన వరంగల్‌లోని ఏనుమాముల వ్యవసాయమార్కెట్‌ను సందర్శించారు. ఆయనతో పాటు మాజీ మంత్రులు ఎర్రబెల్లి దయాకర్‌రావు, సత్యవతి రాథోడ్, మాజీ స్పీకర్ మధుసూదనాచారి, మాజీ చీఫ్‌విప్ వినయ్‌భాస్కర్, మాజీ ఎంపీ మాలోతు కవిత, మాజీ ఎమ్మెల్యేలు పెద్ది సుదర్శన్‌రెడ్డి, నన్నపునేని నరేందర్, చల్లా ధర్మారెడ్డి, తాటికొండ రాజయ్య, గండ్ర వెంకటరమణారెడ్డి, మార్కెట్ మాజీ చైర్మన్ చింతం సదానందం మార్కెట్‌లో పర్యటించారు. చాంబర్ ఆఫ్ కామర్స్ ప్రతినిధులు, కాటన్ వ్యాపారులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. మక్కల యార్డుకు వెళ్లి రైతులతో మాట్లాడారు. పంట దిగుబడి, పెట్టుబడి, గిట్టుబాటు ధర గురించి ఆరా తీశారు. అనంతరం హరీష్‌రావు మీడియాతో మాట్లాడుతూ.. రాష్ట్రంలో 50 లక్షల ఎకరాల్లో పత్తి సాగైందన్నారు. కేంద్ర ప్రభుత్వ (మిగతా 6వ పేజీలో)

కొత్త దారుల్లో పీఏసీఎస్‌లు

- ఆదాయ వృద్ధి కోసం వ్యాపారాల నిర్వహణ
- సత్ఫలితాలతో ఆర్థికంగా బలోపేతమవుతున్న సంఘాలు

7

రక్త చరిత్ర

నాడు ఎగసి.. నేడు అలసి..



ఉక్కుపాదంతో విప్లవోద్యమం విలవిల

▪ ఆంధ్రజ్యోతి ప్రతినిధి, వరంగల్

ఆపరేషన్ కగార్‌తో మావోయిస్టుల ఉనికి సవాల్‌గా మారింది. కేంద్ర ప్రభుత్వం 'సేవ్ కర్రెగుట్టలు' పేరుతో నక్సల్స్‌పై మూకుమ్మడి దాడికి దిగింది. దండకారణ్యాన్ని జల్లెడ పడుతోంది. లొంగుబాట్లను ప్రోత్సహిస్తూనే, ఎన్‌కౌంటర్‌లతో మావోయిస్టులు ఉక్కిరిబిక్కిరి చేస్తోంది. తాజాగా మావోయిస్టుల్లో కీలకనేతగా ఉన్న హిడ్మా ఎన్‌కౌంటర్ సంచలనం సృష్టించింది. ఇప్పటికే మావోయిస్టుల ఉద్యమానికి వెన్నుదన్నుగా నిలిచిన ఓరుగల్లుకు చెందిన అనేక మంది అజ్ఞాత నేతలు ఎన్‌కౌంటర్‌లో హతం అవుతున్నారు. మరికొందరు లొంగుబాటను ఎంచుకుంటున్నారు. అయితే ములుగు ఏజెన్సీకి చెందిన మావోయిస్టు పార్టీ రాష్ట్ర కార్యదర్శి బడే చొక్కారావు అలియాస్ దామోదర్‌తో పాటు మరికొందరు అజ్ఞాతంలో ఎక్కడ ఉన్నారు.. ఎలా ఉన్నారనే ఉత్కంఠ నెలకొంది.

- మావోయిస్టు కీలక నేత హిడ్మా ఎన్‌కౌంటర్‌తో ఉమ్మడి జిల్లాలో కలకలం
- ఒకప్పుడు మావోయిస్టులకు పెట్టని కోటగా విలసిల్లిన ఓరుగల్లు
- కొంతకాలంగా వరుసగా నేలకొరుగుతున్న అగ్రనేతలు
- గాజర్ల, మోడెం, రేణుక సహా అనేక మంది ఎన్‌కౌంటర్
- లొంగిపోయిన ఆశన్న, సాంబయ్య
- 'సేవ్ కర్రెగుట్టలు' పేరుతో సరిహద్దు నుంచే ఆపరేషన్ ముమ్మరం
- ఆపరేషన్ కగార్‌తో తుది అంకానికి తుపాకుల పోరు

ముగిసిన హిడ్మా పోరుబాట

మావోయిస్టు కీలక నేత హిడ్మాకు కర్రెగుట్టలే షెల్టర్ జోన్‌గా ఉన్నాయని భావించిన కేంద్ర బలగాలు గత ఏప్రిల్ నెలలో సేవ్ కర్రెగుట్టల పేరుతో 25వేల మందితో భారీ కూంబింగ్ చేపట్టారు. వైమానిక దళం డ్రోన్లు, ఎంఐ 17 హెలికాప్టర్లతో జల్లెడ పట్టారు. కర్రెగుట్టలను దిగ్బంధించటంతో మావోయిస్టులు ఇతర ప్రాంతాలకు వెళ్లారు. అయితే కర్రెగుట్టల్లో తప్పించుకున్న హిడ్మా.. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం మారేడుమిల్లి అడవుల్లో హతం కావటం మావోయిస్టు ఉద్యమానికి భారీ దెబ్బగా భావిస్తున్నారు. 26కు పైగా మెరుపు దాడుల్లో కీలకంగా ఉండి అనేక మంది పోలీసుల మృతికి కారణమైన హిడ్మా కేంద్ర బలగాలకు మోస్ట్ వాంటెడ్‌గా ఉన్నారు.

ఎన్‌కౌంటర్‌లో అగ్రనేతలు

కేంద్ర ప్రభుత్వం మావోయిస్టు నేతలే లక్ష్యంగా చేపట్టిన ఆపరేషన్ కగార్‌తో ఉమ్మడి వరంగల్ జిల్లాకు చెందిన అనేక మంది మావోయిస్టు నేతలు ఈ ఏడాది హతమయ్యారు. వీరిలో కీలకమైన కేంద్ర కమిటీ సభ్యుడిగా ఉన్న మోడెం బాలకృష్ణ అలియాస్ మనోజ్ సెప్టెంబరు 11న చత్తీస్‌గడ్‌లో గరియాబాద్ అడవుల్లో ఎన్‌కౌంటర్‌లో మృతి చెందారు. హనుమకొండ జిల్లా మడికొండకు చెందిన బాలకృష్ణ యుక్తవయస్సులోనే అజ్ఞాతంలోకి వెళ్లారు. అలాగే మరో కేంద్ర కమిటీ సభ్యుడు, ఏవోబీ కార్యదర్శి గాజర్ల రవి అలియాస్ గణేష్ సైతం ఏపీలో రంపచోడవరం ఏజెన్సీలోని మారేడుమిల్లి అడవుల్లో జూన్ 18 జరిగిన ఎన్‌కౌంటర్‌లో (మిగతా 7వ పేజీలో)

నేటి నుంచి పత్తి కొనుగోళ్లు

వరంగల్ వ్యవసాయం, నవంబరు18 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యాప్తంగా బుధవారం నుంచి పత్తి కొనుగోళ్లు యథావిధిగా కొనసాగనున్నాయి. సీసీఐ పత్తి కొనుగోళ్లలో తలెత్తిన సమస్యలను పది రోజుల్లో పరిష్కరిస్తామని రాష్ట్ర ప్రభుత్వం తెలంగాణ కాటన్ ట్రేడర్స్ అసోసియేషన్‌కు హామీ ఇచ్చినందున ఈ నిర్ణయం తీసుకున్నారు. మంగళవారం సచివాలయంలో వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు, ప్రిన్సిపల్ సెక్రటరీ సురేంద్ర మోహన్, మార్కెటింగ్‌శాఖ అధికారులు, సీసీఐ సీఎండీలు తెలంగాణ కాటన్ ట్రేడర్స్ అసోసియేషన్ ప్రతినిధులతో మాట్లాడారు. కాటన్ జిన్నింగ్, ప్రెస్సింగ్ ఇండస్ట్రీస్ ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించారు. దేశ వ్యాప్తంగా ఉన్న పాలసీ, రాష్ట్ర ప్రభుత్వం పంపించే ప్రతిపాదనలపై వారం, పది రోజుల్లో పరిష్కరిస్తామని, రైతుల శ్రేయస్సు దృష్ట్యా బంద్‌ను విరమించుకోవాలని మంత్రి కోరారు. దీంతో అసోసియేషన్ కార్యవర్గ సభ్యులు, అన్ని జిల్లాల అధ్యక్ష, కార్యదర్శులతో అసోసియేషన్ అధ్యక్షుడు బొమ్మినేని రవీందర్‌రెడ్డి సమావేశం ఏర్పాటు చేసి చర్చించారు. ప్రభుత్వ హామీ మేరకు బంద్‌ను విరమిస్తూ ఏకగ్రీవంగా తీర్మానం చేశారు.

వ్యవసాయ శాఖలో ముగ్గురి సస్పెన్షన్

ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో అక్రమాలకు పాల్పడినందుకు సర్కారు చర్య

శాయంపేట, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): హనుమకొండ జిల్లా శాయంపేట మండలంలోని శాయంపేట, కాట్రపల్లి గ్రామాలలో ఐకేపీ ధాన్యం కొనుగోలు కేంద్రాలలో అక్రమాలకు పాల్పడిన ముగ్గురు వ్యవసాయ అధికారులపై వేటు పడింది. మండల వ్యవసాయ అధికారి గంగాజమున, శాయంపేట క్లస్టర్ ఏఈవో అర్చన, నేరేడుపల్లి క్లస్టర్ ఏఈవో సుప్రియను సస్పెండ్ చేస్తూ రాష్ట్ర వ్యవసాయశాఖ డైరక్టర్ గోపి ఉత్తర్వులు జారీ చేయగా, మంగళవారం వారికి అందజేశారు. వీరు శాయంపేట, కాట్రపల్లి సెంటర్లలో ధాన్యం లేకుండానే ఉన్నట్లుగా ట్రక్ షీట్లు రాసి, ఆన్‌లైన్ ఎంట్రీలు చేసి, నకిలీ రైతులను సృష్టించి రూ.కోట్లలో అక్రమాలకు పాల్పడ్డారు. ఈ స్కాంలో భాగస్వాములైన ఏఈవోలు టోకెన్‌లను జారీ చేయడం, విస్తీర్ణం పెంచడంతో పాటు, ఏవో తమ లాగిన్‌లలో పంపించారు.

ఈ తంతంగం మొత్తం సివిల్ సప్లై, విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారుల తనిఖీలో వెల్లడి కాగా, మొత్తం 21 మందిపై గత నెల 11న శాయంపేట పీఎస్‌లో కేసు నమోదైంది. దీనిపై ఏవో, ఏఈవోలపై జిల్లా వ్యవసాయ శాఖ అధికారులు రాష్ట్ర డైరక్టర్‌కు ఇదివరకే లేఖ రాసినట్లు సమాచారం. దీంతోపాటు ఈ కేసు విచారణ అధికారిగా ఉన్న పరకాల ఏసీపీ సతీష్ బాబు నుంచి నివేదిక స్వీకరించిన అనంతరం ముగ్గురు అధికారులను సస్పెండ్ చేసినట్లు తెలిసింది. సస్పెన్షన్‌కు ముందు ఏవో గంగాజమున సెలవులో వెళ్లగా, ఏఈవో సుప్రియ ప్రస్తుతం జైలులో, ఇంకో ఏఈవో విధులలో ఉన్నారు.

ఫలించిన జల సంరక్షణ యజ్ఞం

- వరంగల్ జిల్లాకు 'జల్ సంచయ్' అవార్డు
- కేంద్ర మంత్రి నుంచి అవార్డు స్వీకరించిన కలెక్టర్ సత్యశారద



కేంద్ర మంత్రి సిఆర్.పాటిల్ చేతుల మీదుగా అవార్డు స్వీకరిస్తున్న కలెక్టర్ సత్యశారద

వరంగల్ కలెక్టరేట్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): మరోసారి జాతీయ వేదికపై వరంగల్ జిల్లా ఖ్యాతి విరాజిల్లింది. వరంగల్ జిల్లాకు 'జల్ సంచయ్- జన్ భాగీదారి' అవార్డు లభించింది. కేంద్ర ప్రభుత్వం జల శక్తి అభియాన్ మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో 2024-25 సంవత్సరానికి సంబంధించి సల జంచాయ్-జన్ భాగీదారి 1.0 అవార్డుకు దక్షిణ భారతదేశంలో జల సంరక్షణ కేటగిరి-2లో జిల్లాకు తొలిస్థానం దక్కింది. మంగళశారం ఢిల్లీలోని విజ్ఞాన్ భవన్‌లో జరిగిన కార్యక్రమంలో కేంద్ర జలశక్తి మంత్రి సిఆర్.పాటిల్ చేతుల మీదుగా కలెక్టర్ సత్యశారద అవార్డు స్వీకరించారు. అధికారుల సమష్టి కృషి, ప్రజల విలువైన భాగస్వామ్యంతోనే ఈ ఘనత సాధ్యమైందని కలెక్టర్ తెలిపారు.

జిల్లాలో ప్రజల భాగస్వామ్యంతో 42,342 ఇంకుడు గుంతలు, 8013 సేద్యపు కుంటలు, 260 చేప పిల్లల పెంపకం కుంటలు, మట్టికట్టలు, రాక్ ఫిల్ డ్యామ్‌లు, కాంటూరు కందకాలు, రూఫ్ టాప్ రెయిన్ వాటర్ హార్వెస్టింగ్ పనులు, బోరు బావుల పునరుద్దరణ పనులు, ఫీడర్ కాలువలు, చెక్‌డ్యామ్‌లు, గ్రామాల్లో రీచార్జ్ పిట్‌లతోపాటు రైతుల భూముల్లో డ్రిప్ ఇరిగేషన్, అటవీ భూములలో కందకాలు, చిన్న ఊట కుంటలు మొదలైన నీటి సంరక్షణ చర్యలు చేపట్టామని తెలిపారు. ఫలితంగా భూగర్భ జలాలు పెరిగాయని, ఈ అవార్డుతోపాటు జిల్లాకు రూ. కోటి నగదు కూడా లభించిందని చెప్పారు. అవార్డు రావడానికి కృషి చేసిన అధికారులకు, సహకారం అందించిన ప్రజలందరికీ ఈ కలెక్టర్ కృతజ్ఞతలు తెలిపారు. అవార్డు స్వీకరించిన వారిలో కలెక్టర్‌తో పాటు జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ అధికారి రామిరెడ్డి ఉన్నారు.

లోన్ యాప్ వేధింపులు

- యువకుడి ఆత్మహత్య
- వాట్సాప్‌లో సూసైడ్ నోట్



నవీన్‌రెడ్డి (ఫైల్)

హసన్‌పర్తి, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): లోన్ యాప్ వేధింపులు భరించలేక ఓ యువకుడు తన స్నేహితులను క్షమించమని వేడుకుంటూ మేసేజ్ చేసి బావిలో దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన మంగళవారం కాకతీయ యూనివర్సిటీ పోలీసుస్టేషన్ పరిధి వడ్డేపల్లి-దేవన్నపేట శివారులోని చోటు చేసుకుంది. కాకతీయ యూనివర్సిటీ ఎస్సై నవీన్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. తండ్రి గోలి రవీందర్‌రెడ్డి మరణించడంతో కుమారుడు నవీన్‌రెడ్డి (27) తల్లితో పాటు హనుమకొండ టీవీ టవర్ కాలనీలో నివాసం ఉంటున్నాడు. డెకరేషన్ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్న అతడు జల్సాలకు అలవాటు పడి చైనాకు చెందిన ఓ లోన్ యాప్ ద్వారా డబ్బులు తీసుకున్నాడు. లోన్ యాప్ వేధింపులు భరించలేక అప్పు చెల్లించేందుకు స్నేహితుల వద్ద తిరిగి అప్పు చేశాడు. ఆ డబ్బులు స్నేహితులు తిరిగి అడగడంతో మళ్లీ లోన్ యాప్ ద్వారా డబ్బులు (మిగతా 6వ పేజీలో)

పెళ్లికి నిరాకరించిన ప్రేయసి

- యువకుడి ఆత్మహత్య

7



జనావాసాల నడుమ మద్యం షాపేల!?

హనుమకొండలోని యాదవనగర్‌లో ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల, ఇళ్ల మధ్య రహదారిని ఆనుకొని మద్యం షాపు ఏర్పాటు చేస్తుండటంపై స్థానికులు భగ్గుమన్నారు. మద్యం షాపు ఏర్పాటును వెంటనే విరమించుకోవాలంటూ మంగళవారం యాదవనగర్ జంక్షన్ వద్ద ఆందోళనకు దిగారు. షాపు ఏర్పాటు చేస్తే మందుబాబుల వల్ల తాము తీవ్ర ఇబ్బందులు పడతామని, ప్రధాన రహదారిపై ప్రమాదాలు జరుగుతాయని ఆందోళన వెలిబుచ్చారు. అసలు జనావాసాల్లో మద్యం షాపునకు అధికారులు ఎలా అనుమతి ఇచ్చారని వారు ప్రశ్నించారు. ఈ విషయంలో ఉన్నతాధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. హనుమకొండ, కేయూ పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని ఆందోళనను విరమింపజేశారు.

-ఆంధ్రజ్యోతి, రెడ్డికాలనీ (హనుమకొండ)



కేఎంసీలో అవగాహన సదస్సులో మాట్లాడుతున్న సీపీ సన్‌ప్రీత్ సింగ్

డ్రగ్స్, ర్యాగింగ్ జోలికి పోవద్దు...

పోలీసు కమిషనర్ సన్‌ప్రీత్ సింగ్

వరంగల్ మెడికల్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): యువత మత్తు పదార్థాల జోలికి పోవద్దని పోలీసు కమిషనర్ సన్‌ప్రీత్ సింగ్ వైద్య విద్యార్థులకు సూచించారు. మంగళవారం కేఎంసీలో యాంటీ ర్యాగింగ్, యాంటీ డ్రగ్స్, సైబర్ నేరాలపై నిర్వహించిన అవగాహన సదస్సులో సీపీ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ.. కళాశాలలో జూనియర్లు, సీనియర్ల మధ్య స్నేహ పూర్వకంగా ఉండాలని, జూనియర్లకు, సీనియర్ విద్యార్థులు మార్గదర్శకులుగా నిలిచి విద్యాభివృద్ధిలో సహకారం అందించాలన్నారు. ర్యాగింగ్‌కు పాల్పడితే ఆరు నెలల నుంచి జీవితకాలం జైలుశిక్ష పడవచ్చని, విద్యార్థులు భవిష్యత్‌లో ఎన్నో సమస్యలు ఎదుర్కొవాల్సి వస్తుందని తెలిపారు. విద్యార్థులు మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని, వీటిని వినియోగించడం వల్ల విద్యార్థులు తమ జీవితాలను అంధకారం చేసుకోవడంతోపాటు ఆరోగ్య, ఆర్థికపరంగా చాలా నష్టపోతారని పేర్కొన్నారు. ఎవరైనా మత్తు పదార్థాలు వినియోగిస్తున్నా, విక్రయిస్తున్నా 1908 నెంబర్‌కు తెలుపాలని కోరారు. ఈస్ట్‌జోన్ డీసీపీ అంకిత్ కుమార్, ఏఎస్పీ శుభం నాగ్, నార్కోటిక్, సైబర్ విభాగాలకు చెందిన డీఎస్పీలు రమేష్, గిరికుమార్, ప్రిన్సిపాల్ సంధ్యారాణి, ఎంజీఎం సూపరింటెండెంట్ హరీష్ చంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఊరు.. పోరు.. హుషారు..

- మళ్లీ పంచాయతీ ఎన్నికల సందడి
- పది రోజుల్లో నోటిఫికేషన్ జారీకి సన్నాహాలు
- అప్రమత్తమైన ఎన్నికల అధికారులు
- కోర్టు తీర్పుతో పాత పద్ధతిలోనే రిజర్వేషన్లు
- పార్టీ పరంగా 42శాతం ఇచ్చేందుకు కాంగ్రెస్ సిద్ధం



హనుమకొండ, నవంబర్ 18 (ఆంధ్రజ్యోతి): పంచాయతీ ఎన్నికలు నిర్వహించే విషయంలో సందిగ్ధత తొలగింది. స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణపై ప్రభుత్వం స్పష్టత నిచ్చింది. డిసెంబర్‌లోగా ఎన్నికల ప్రక్రియను పూర్తి చేయాలనే నిర్ణయానికి వచ్చింది. గతంలో తీసుకున్న నిర్ణయం కన్నా భిన్నంగా మొదట పంచాయతీ ఎన్నికలు నిర్వహించాలని భావిస్తోంది. దీంతో గ్రామాల్లో మళ్లీ పంచాయతీ ఎన్నికల సందడి మొదలైంది. సర్పంచ్ పదవులపై గురిపెట్టిన ఆశావహులు రంగంలోకి దిగుతున్నారు. ఈసారి కచ్చితంగా ఎన్నికలు జరగనున్న దృష్ట్యా పంచాయతీ ఎన్నికల్లో తమ అదృష్టాన్ని పరీక్షించుకునేందుకు అన్ని అస్త్రశస్త్రాలకు మరోసారి పదును పెడుతున్నారు. ఇంతకు ముందు ప్రభుత్వం మొదట జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికలు నిర్వహించాలని నిర్ణయించుకున్నది. దీంతో ఆ ఎన్నికలతో పాటే పంచాయతీ ఎన్నికలు జరగనున్నందువల్ల ఆశావహులు ఏ స్థానాలకు పోటీ చేయాలనే విషయంలో ఒక నిర్ణయానికి వచ్చారు. కానీ ఈ సారి తొలుత పంచాయతీ ఎన్నికలు జరగనుండడంతో సర్పంచ్‌తో పాటు జడ్పీటీసీ, ఎంపీటీసీ ఆశావహులు కూడా కార్యరంగంలోకి దూకుతున్నారు.

అప్రమత్తమైన అధికారులు

ప్రభుత్వ ఆదేశాల మేరకు అధికారులు కూడా అప్రమత్తమయ్యారు. ఎన్నికల ఏర్పాట్లపై మళ్లీ దృష్టి సారించారు. నిజానికి స్థానిక ఎన్నిలకు సంబంధించి జిల్లా పరిషత్ అధికారులు, పంచాయతీ ఎన్నికల విషయమై జిల్లా పంచాయతీ రాజ్ అధికారులు ఏర్పాట్లను ఇది వరకే పూర్తి చేశారు. ఓటర్ల జాబితాలను సవరించారు. ఓటర్ల తుది జాబితాలను ప్రకటించారు. పోలింగ్ కేంద్రాలను గుర్తించారు. ఎన్నికల సిబ్బందిని నియమించారు. వారికి రెండు విడతల శిక్షణ ఇవ్వడం కూడా పూర్తయింది. పోలింగ్ బాక్స్‌లను సిద్ధం చేశారు. గత సెప్టెంబరు 29వ తేదీన ఎన్నికల షెడ్యూల్ జారీ అయిన క్షణం నుంచి ఏర్పాట్లను మరింత ముమ్మరం చేశారు. అక్టోబర్ 9వ తేదీన స్థానిక, పంచాయతీ ఎన్నికల నోటిఫికేషన్లు జారీఅయిన తర్వాత నామినేషన్ల స్వీకరణకు రంగం సిద్ధం చేసుకున్నారు. కానీ ఇంతలోనే సుప్రీంకోర్టు, హైకోర్టుల తీర్పులతో అంతా తలకిందులైంది.

కోర్టుల తీర్పుతో బ్రేక్

గత నెల 9వ తేదీననే స్థానిక సంస్థల ఎన్నికలతో పాటు పంచాయతీ ఎన్నికలకు నోటిఫికేషన్ జారీ అయింది. స్థానిక సంస్థల ఎన్నికలు రెండు విడతల, పంచాయతీ ఎన్నికలను మూడు విడతలుగా నిర్వహించేందుకు తేదీలను ఖరారు చేశారు. పంచాయతీ ఎన్నికల మొదటి పోలింగ్‌ను అక్టోబరు 30న రెండో దశ పోలింగ్ నవంబర్ 4న మూడోదశ పోలింగ్ నవంబర్ 8న నిర్వహించాలని నిర్ణయించారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లను (మిగతా 6వ పేజీలో)



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న సిరికొండ మధుసూదనాచారి, మాజీ ఎమ్మెల్యేలు వినయ్‌భాస్కర్, నన్నపునేని నరేందర్

బీసీ రిజర్వేషన్లపై కాంగ్రెస్ మోసం

- తమిళనాడును స్ఫూర్తిగా తీసుకోవాలి
- బూటకపు హామీలతో కాంగ్రెస్ పాలన
- శాసన మండలి ప్రతిపక్ష నేత సిరికొండ

హనుమకొండ టౌన్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): తెలంగాణలో బీసీ రిజర్వేషన్లపై మోసం చేసిన కాంగ్రెస్ ప్రభుత్వంతో పోరాడుతామని శాసన మండలి ప్రతిపక్ష నేత సిరికొండ మధుసూదనాచారి అన్నారు. మంగళవారం హనుమకొండ బాలసముద్రంలోని బీఆర్ఎస్ కార్యాలయంలో ప్రభుత్వ మాజీ చీఫ్ విప్, బీఆర్ఎస్ హనుకొండ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్ భాస్కర్ ఆధ్వర్యంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సిరికొండ మధుసూదనాచారి మాట్లాడుతూ.. సోమవారం కేబినెట్ సమావేశంలో బీసీ రిజర్వేషన్లపై పార్టీ పరంగా రిజర్వేషన్ ఇస్తామని చెప్పడం కాంగ్రెస్ దుర్మార్గం బయటపడిందని అన్నారు. ప్రజలను మోసం (మిగతా 6వ పేజీలో)



ఉద్యోగులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న సీఎండీ వరుణ్‌రెడ్డి

ఉద్యోగులతో ఎన్పీడీసీఎల్ సీఎండీ ప్రతిజ్ఞ

రాంనగర్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): ముక్త భారత్ అబియాన్ పేరిట మాదక ద్రవ్యాల నిరోధక ప్రతిజ్ఞ చేయించాలని తెలంగాణ ప్రభుత్వం ఆదేశాల మేరకు టీజీ ఎన్పీడీసీఎల్ సీఎండీ వరుణ్‌రెడ్డి మంగళవారం నక్కలగుట్టలోని కార్పొరేట్ కార్యాలయంలో ఉద్యోగులతో ప్రతిజ్ఞ చేయించారు. ఏ ఒక్కరూ డ్రగ్స్ బారిన పడకుండా కృషి చేస్తామని, డ్రగ్ విక్రయాలు జరిపే వ్యక్తుల సమాచారాన్ని అధికారులకు అందజేస్తామని, ప్రభుత్వ సంకల్పంలో భాగస్వాములవుతామని ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్లు వి.మోహన్‌రావు, వి.తిరుపతిరెడ్డి, సి.ప్రభాకర్, చీఫ్ విజిలెన్స్ ఆఫీసర్ బోనాల కిషన్ తదితరులు పాల్గొన్నారు.

హనుమకొండ ఆర్టీసీ బస్టాండ్‌లో ఉద్రిక్తత



పోలీసుల పహారాలో షాపు కూల్చివేస్తున్న ఆర్టీసీ అధికారులు

హనుమకొండ టౌన్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): హనుమకొండ ఆర్టీసీ బస్టాండ్‌లో టెండర్ ముగిసిన షాపును ఆర్టీసీ అధికారులు కూల్చి వేయడంతో మంగళవారం ఉద్రిక్తత చోటు చేసుకుంది. హనుమకొండ బస్టాండ్ సమీపంలో హనుమకొండకు చెందిన బొడిగే ఇందిర 2013-2017లో టెండర్ ద్వారా బస్టాండ్ స్థలాన్ని అగ్రిమెంట్ చేసుకున్నారు. ఈ స్థలానికి సెక్యూరిటీ డిపాజిట్ ఆర్టీసీ అధికారులకు ష్యూరిటీ పెట్టి సొంత డబ్బులతో రెండు రూములు వేసి షాపును నిర్మించారు. అప్పటి నుంచి ఆర్టీసీకి అద్దె చెల్లిస్తూ ఉన్నారు. కాగా, ఆర్టీసీ అధికారులు షాపు ఖాళీ చేయాలని కోరడంతో కొద్దిరోజులుగా అధికారులకు షాపు నిర్వాహకులకు మధ్య వాగ్వాదం జరిగినట్లు తెలిపారు. గడువు ముగియడంతో ఆర్టీసీ అధికారులు నోటీసులు ఇచ్చినట్లు తెలిపారు. గడువు ముగిసిన తర్వాత ఆర్టీసీ అధికారులు మంగళవారం ఉదయం పోలీసుల పహారాలో గ్రేటర్ వరంగల్ మున్సిపాల్ సిబ్బందితో జేసీబీతో షాపును కూల్చివేశారు. ఈ కూల్చివేత జరుగుతుండడంతో విషయం తెలుసుకున్న బొడిగే ఇందిర.. తన కుటుంబసభ్యులతో అధికారులతో వాగ్వాదం చేశారు. దీంతో కొద్దిసేపు ఉద్రిక్తత నెలకొంది. తమకు రావాల్సిన సెక్యూరిటీ డిపాజిట్ చెక్కులు ఇవ్వకుండా ఎలా కూల్చివేస్తారంటూ పోలీసులను, కూల్చివేస్తున్న అధికారులతో బొడిగే ఇందిర గొడవకు దిగారు. పోలీసులు అడ్డుకొని కూల్చివేతలు పూర్తి చేసి అందులో ఉన్న సామాన్లను ఆర్టీసీ అధికారులు ఆధీనంలోకి తీసుకున్నట్లు తెలిపారు. ఈ విషయంపై ఆర్టీసీ ఆర్ఎం డి.విజయభానును వివరణ కోరగా. నిబంధనలకు విరుద్ధంగా షాపును రోడ్డుపై ఏర్పాటు చేశారని ప్రయాణికులకు సౌకర్యార్థం కూల్చివేసినట్లు తెలిపారు. డిపాజిట్ చెక్కులు నిబంధనల ప్రకారం వారికి అందిస్తామని పేర్కొన్నారు.

జాతీయ సాహస శిబిరానికి రజిన్‌కుమార్

రాంనగర్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 18 నుంచి హిమాచల్ రాష్ట్రంలోని ధర్మశాలలో 10 రోజుల పాటు జరిగే జాతీయ సాహస శిబిరానికి వాగ్దేవి కళాశాల ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ అధికారి ఎనుకంటి రజిన్‌కుమార్ ఎంపికయ్యారు. పదిరోజులపాటు రాక్ క్లైబింగ్, రివర్ రాఫ్టింగ్, జంగల్ క్యాంపు, మొదలైన కార్యక్రమాల్లో పాల్గొంటారు. ఈ సందర్భంగా రజిన్‌కుమార్‌ను కళాశాల యాజమాన్యం, అధ్యాపక బృందం అభినందించింది.

డ్రగ్స్ నిర్మూలనలో సమన్వయంతో పని చేయాలి

నగర మేయర్ గుండు సుధారాణి



కార్యక్రమంలో ప్రతిజ్ఞ చేస్తున్న మేయర్, అధికారులు

వరంగల్ కార్పొరేషన్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): వరంగల్ నగరాన్ని డ్రగ్స్ రహితంగా మార్చడానికి అందరూ సమన్వయంతో పని చేయాలని మేయర్ గుండు సుధారాణి కోరారు. నషా ముక్త్‌భారత్ అబియాన్ 5వ వార్షికోత్సవం సందర్భంగా జీడబ్ల్యూఎంసీ సౌజన్యంతో కేఎంసీ నుంచి జీడబ్ల్యూఎంసీ ప్రధాన కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం బల్దియా కార్యాలయం ఎదుట ప్రత్యేక కార్యక్రమం ఏర్పాటు చేసి ప్రతిజ్ఞ చేశారు. ఈసందర్భంగా మేయర్ గుండు సుధారాణి మాట్లాడుతూ.. యువత మాదకద్రవ్యాల బారిన పడకుండా తల్లిదండ్రులు జాగ్రత్త పడాలన్నారు. డ్రగ్స్ తీసుకోవడం వల్ల విచక్షణ కోల్పోయి మానసిక సమస్యలకు లోనవుతారని అన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కమిషనర్ చంద్రశేఖర్, ఎస్ఈ సత్యనారాయణ, సీఎంహెచ్‌వో రాజారెడ్డి, సీహెచ్‌వో రమేష్, ఇన్‌చార్జి సీపీ రవీంద్ర, డిప్యూటి కమిషనర్లు సమ్మయ్య, ప్రసన్నరాణి, వివిధ విభాగాల అధికారులు, పలు విభాగాల సిబ్బంది పాల్గొన్నారు.

ఫీజు రాయితీ అవకాశాన్ని వినియోగించుకోవాలి..

అసెస్మెంట్లకు స్వీయ కొలత తప్పుగా నమోదు చేసుకోవడం వల్ల 25 రెట్ల పెనాల్టీకి నమోదైన నగరవాసులు ఫీజు రాయితీ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని మేయర్ సుధారాణి సూచించారు. మంగళవారం జీడబ్ల్యూఎంసీ ప్రధాన కార్యాలయంలో రెవెన్యూ అధికారులతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నగరంలో కొంతమంది తప్పుగా భూములకు కొలతలు నమోదు చేసినట్టు అధికారుల పరిశీలనలో తేలిందన్నారు. దీంతో 25 రెట్లు పెనాల్టీ ఆన్‌లైన్‌లో చూపిస్తోందని, సరైన పత్రాలు చూపించి ఫీజు రాయితీ పొందాలన్నారు.

మహిళా సంఘాలకు పార్కుల నిర్వహణ

వరంగల్ నగరంలోని పార్కుల నిర్వహణ మహిళా సంఘాలకు అప్పగించనున్నట్టు మేయర్ గుండు సుధారాణి తెలిపారు. మంగళవారం జీడబ్ల్యూఎంసీ ప్రధాన కార్యాలయంలోని మేయర్ చాంబర్‌లో హార్టికల్చర్ అధికారులతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ.. నగరంలో మిడియన్లు, జంక్షన్లతో పాటు మడికొండ నుంచి హనుమకొండ వరకు చెట్ల కొమ్మలు ఏపుగా పెరిగాయని, వెంటనే కొమ్మలను ట్రిమ్మింగ్ చేసి దిద్దుబాటు చర్యలు ప్రారంభించాలన్నారు. హార్టికల్చర్, మెప్మా విభాగాలు సమన్వయంతో స్వయం సహాయక బృందాలు పార్కులు, పట్టణ వనాలను నిర్వహించాలన్నారు. ఈ ప్రక్రియ మూడు గ్రూపులుగా చేసి వారికి అప్పగించాలని సీహెచ్‌వో రమేష్‌ను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అదనపు కమిషనర్ చంద్రశేఖర్, సీహెచ్‌వో రమేష్, హెచ్‌వో లక్ష్మారెడ్డి, హార్టికల్చర్ అసిస్టెంట్లు ప్రిన్సి, అశ్విని, అనూహ్య, ప్రియాంక పాల్గొన్నారు.

వరదనీరు వెళ్లిపోవడానికి డ్రైన్‌ను ఏర్పాటు చేయాలి

వరంగల్ నగరంలో వరద నీరు సాఫీగా వెళ్లిపోవడానికి సైడ్ డ్రైన్‌లను ఏర్పాటు చేయాలని మేయర్ గుండు సుధారాణి అధికారులను ఆదేశించారు. మంగళవారం గ్రేటర్ వరంగల్ 28వ డివిజన్ సంతోషిమాత గుడి ఫేజ్-2, పోతననగర్ స్మశానవాటిక ప్రాంతంలో అకస్మికంగా రోడ్లు, డ్రైనేజీలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ.. ఇటీవల భారీగా కురిసిన వర్షాల కారణంగా పోతననగర్ స్మశానవాటిక గోడ కూలిపోవడం వల్ల ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, వెంటనే గోడ నిర్మాణం జరపాలని అధికారులను ఆదేశించారు. డివిజన్‌లో చెత్తకుప్పలను డిప్పర్ల ద్వారా వెంటవెంటనే తొలగించాలని శానిటేషన్ అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎంహెచ్‌వో రాజేశ్, ఓరుగంటి పూర్ణ, ఈఈలు రవికుమార్, మాధవిలత, డీఈ శ్రీకాంత్, ఏఈ నరేష్ పాల్గొన్నారు.



సంతోషిమాతగుడి ప్రాంతంలో సందర్శిస్తున్న మేయర్ సుధారాణి



మహిమూద్‌ను అభినందిస్తున్న ప్రిన్సిపాల్

జాతీయస్థాయి నెట్‌బాల్ పోటీలకు ఎంపిక

హనుమకొండ కలెక్టరేట్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): స్కూల్ గేమ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో మహబూబాబాద్ జిల్లా తొర్రూరు మండలంలోని గుర్తూర్‌లో ఇటీవల జరిగిన రాష్ట్రస్థాయి నెట్‌బాల్ పోటీలలో ఉత్తమ ప్రతిభ కనబరిచి త్వరలో బెంగళూరులో జరగబోయే జాతీయస్థాయి పోటీలకు హనుమకొండ హంటర్‌రోడ్‌లోని కాజీపేట మైనారిటీ జూనియర్ కళాశాల విద్యార్థి ఎస్కే మహిమూద్ ఎంపికయ్యారు. ఈ సందర్భంగా మంగళవారం కళాశాలలో విద్యార్థి మహిమూద్‌ను కళాశాల ప్రిన్సిపాల్ పెరుమాండ్ల శిరీష, కళాశాల అధ్యాపక బృందం అభినందించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ శిరీష మాట్లాడుతూ.. ఉత్తమ ప్రతిభ కనబరిచి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైన మహిమూద్ భవిష్యత్‌లో ఇంకా మరెన్నో విజయాలు సాధించాలన్నారు. ఫిజికల్ డైరెక్టర్ కాంబోజు రమేష్ నేతృత్వంలో విద్యార్థి ప్రతిభ కనబరచడం అభినందనీయమన్నారు.

కాజిపేట మీదుగా దర్భాంగ స్పెషల్ రైలు

కాజీపేట, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): కాజీపేట మీదుగా బుధవారం దర్భాంగ స్పెషల్ రైలు నడిపించనున్నట్లు రైల్వే అధికారులు తెలిపారు. ఈ రైలు (07999) చర్లపల్లి, దర్భాంగ మధ్య నడవనున్నట్లు పేర్కొన్నారు. కాజీపేట, రామగుండం, మంచిర్యాల, చిల్పూర్ కాగజ్‌నగర్, బల్లార్ష, గోండియా, రాయపూర్, బిలాష్‌పూర్, రాంచి తదితర స్టేషన్లలో ఆగుతునందని అధికారులు పేర్కొన్నారు.

రైలుకింద పడి ఒకరి ఆత్మహత్య

కాజీపేట, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): కాజీపేట రైల్వే స్టేషన్ సమీపంలోని పట్టాలపై గుర్తు తెలియని వ్యక్తి ఒకరు ఆత్మహత్య చేసుకున్నట్లు జీఆర్పీ పోలీసులు తెలిపారు. మంగళవారం ఉదయం సుమారు 7 గంటల ప్రాంతంలో రైలు పట్టాలపై గుర్తు తెలియని మృతదేహం ఉండగా గుర్తించినట్లు జీఆర్పీ హెడ్ కానిస్టేబుల్ వి.వెంకటయ్య తెలిపారు. మృతుని వివరాలు తెలిస్తే 9849198382, 9948348070కు సమాచారం అందించాలని సూచించారు.

విద్యార్థి సంఘాల ముసుగులో చందాల దందాలు

వడుప్సా జిల్లా అధ్యక్షుడు సతీష్



సమావేశంలో మాట్లాడుతున్న వడుప్సా జిల్లా అధ్యక్షుడు సతీష్‌కుమార్

వరంగల్ ఎడ్యుకేషన్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): విద్యార్థి సంఘాల ముసుగులో కొంత మంది చందాల దందాలు చేస్తూ ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలను బెదిరింపులకు గురిచేస్తున్నారని వడుప్సా హనుమకొండ జిల్లా అధ్యక్షుడు మాదాల సతీష్‌కుమార్ అన్నారు. హనుమకొండలోని రామన్ స్కూల్లో మంగళవారం విలేకరుల సమావేశంలో ఆయన మా ట్లాడారు. విద్యార్థి సంఘాల పేరుతో కొంతమం ది ప్రైవేటు స్కూళ్ల యాజమాన్యాలపై భౌతిక దాడులకు దిగడాన్ని యావత్ ప్రైవేటు స్కూల్ మేనేజ్‌మెంట్లు ఖండిస్తున్నాయన్నారు. ఒక సం ఘం పేరుతో నాలుగు వర్గాలు స్కూళ్లలో తిరుగుతూ భయానక వాతావరణాన్ని సృష్టిస్తున్నారన్నారు. ప్రభుత్వ నిబంధనలకు లోబడే ఫీజు లు వసూలు చేస్తున్నామని, తాము ఏదైనా తప్పు చేస్తే సంబంధిత విద్యాశాఖ అధికారులకు ఫిర్యాదు చేయాలని సూచించారు. చందాల కోసం వచ్చి దాడులు చేస్తున్న వారిని ఉపేక్షించేది లేదని, వారిపై చట్టపరమైన చర్యలు తీసుకునేలా ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలు ముందుకు సాగుతాయన్నారు. ఈ కార్యక్రమంలో వడుప్సా రాష్ట్ర ప్రధానకార్యదర్శి నెమరుగొమ్ముల రమేష్‌రావు, జిల్లా ప్రధానకార్యదర్శి జ్ఞానేశ్వర్, కోశాధికారి ముక్తీశ్వర్, ఆర్గనైజింగ్ సెక్రెటరీ రాజేష్‌కుమార్, శ్రీకాంత్‌రెడ్డి, గూడెపు రమేష్, ఈశ్వర్, మంద శ్రీనివాస్, పురుషోత్తం తదితరులు పాల్గొన్నారు.

గోపాల్‌పూర్‌లో వ్యభిచార ముఠా గుట్టురట్టు

హసన్‌పర్తి, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి):కాకతీయ యూనివర్సిటీ పోలీసు స్టేషన్ పరిధి గోపాల్‌పూర్ శివాజీ నగర్ కాలనీలో వ్యభిచార శిబిరంపై వరంగల్ టాస్క్ ఫోర్స్ అధికారులు, కాకతీయ యూనివర్సిటీ పోలీసులు సంయుక్తంగా దాడి చేసి నిర్వాహకురాలిని అరెస్టుచేసి రిమాండ్‌కు తరలించారు. కేయూసీ ఎస్సై నవీన్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. రెండు నెలల కిం దట ఓ మహిళ గోపాల్‌పూర్ శివాజీనగర్‌లో గది అద్దెకు తీసుకొని వ్యభిచా రం నిర్వహిస్తోంది. వరంగల్ టాస్క్‌ఫోర్స్, కేయూసీ పోలీసులు సోమవారం రాత్రి దాడులు నిర్వహించి నిర్వాహకురాలితో పాటు నలుగురిని అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద రూ.4,270 నగదుతోపాటు మూడు సెల్‌ఫోన్‌లు స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్సై నవీన్‌కుమార్ తెలిపారు.

లోన్ యాప్ వేధింపులు

(5వ పేజీ తరువాయి)

తీసుకొని మెయింటేన్ చేసేవాడు. ఈ క్రమంలోనే నవీన్ యాప్‌లో లోన్ తీసుకొని చెల్లించకపోవడంతో అతడి ఫోటోలను మార్ఫింగ్ చేసి వాట్సాప్‌లో పోస్టు చేశారు. దీంతో మనస్తాపానికి గురైన నవీన్‌రెడ్డి మంగళవారం వడ్డేపల్లి-దేవన్నపేట మధ్యలో గల వ్యవసాయ బావిలో దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. తల్లి రాణి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై నవీన్‌కుమార్ తెలిపారు. అయితే నవీన్‌రెడ్డి తన సెల్‌ఫోన్‌లో ఉన్న సమాచారాన్ని డిలీట్ చేయడంతో ఏ యాప్ ద్వారా ఎంత లోన్ తీసుకున్న విషయం తెలియరాలేదు.

మూటలు మోయడమే సీఎంకు తెలుసు

(5వ పేజీ తరువాయి)

నిర్ణయాలవల్ల పత్తి రైతులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని అన్నారు. సీసీఐ తీసుకునే తుగ్లక్ నిర్ణయాల వల్ల నానాతంటాలు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ముఖ్యంగా ఎల్1, ఎల్2, ఎల్3 విధానం తేవడం వల్ల, కపాస్ యాప్ తీసుకురావడం, గతంలో ఎకరానికి 12 క్వింటాళ్ల కొంటే ఇప్పుడు దానిని ఏడు క్వింటాళ్లకు తగ్గించారని, 8 నుంచి 12శాతం మాత్రమే తేమ ఉండాలని తదితర నిబంధనల వల్ల రైతులు ఆగమవుతున్నారని, రాష్ట్ర వ్యాప్తంగా జిన్నింగ్ మిల్లులు మూత పడ్డాయని, విధిలేక పత్తి రైతులు పత్తిని దళారులకు ఆరువేలకే అమ్ముకుంటున్నారరని అన్నారు. అకాల వర్షాల వల్ల నష్ట పోయిన రైతులను ఆదుకునేది పోయి వారిని నిలువుదోపిడీ చేస్తున్నారని మండిపడ్డారు. వెంటనే ఎల్1, ఎల్2, ఎల్3 విధానాన్ని, కపాస్ యాప్‌ను ఎత్తివేయాలని, ఎకరానికి 12 క్వింటాళ్ల కొనాలని, తేమ శాతం నిబంధనలను సడలించాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం విదేశాల నుంచి పత్తి దిగుమతి చేసుకోవడాన్ని నిలిపివేసి స్వదేశీ పత్తిని కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. రేవంత్‌రెడ్డి ప్రభుత్వంలో ఇప్పటి వరకు 406 మంది రైతులు ఆత్మహత్య చేసుకున్నారని, దీన్ని బట్టే కాంగ్రెస్ పాలన ఎలా ఉందో అర్థమవుతోందని అన్నారు.



మక్క రైతుతో మాట్లాడుతున్న హరీశ్‌రావు

రైతుల పక్షాన పోరాడుతాం..

సీసీఐ పెట్టిన కొత్త నిబంధనలను సడలించి వెంటనే పత్తి కొనుగోళ్లు చేపట్టకపోతే రైతులతో కలిసి పోరాడుతామని హరీశ్‌రావు అన్నారు. కేసీఆర్ పాలనలో సాగునీటి ప్రాజెక్టులు కట్టారని, కావాల్సినంత యూరియా ఇచ్చారని, 24 గంటలు కరెంట్ ఇచ్చారని, దేశంలో ఎక్కడా లేని విధంగా రైతు బంధు, రైతు బీమా ఇచ్చారని, చెరువులు బాగు చేశారని, పంటల ఉత్పత్తి పెంచారని వివరించారు. కాంగ్రెస్ వచ్చాక కష్టాలు మొదలయ్యాయని అన్నారు. ఇప్పటికైనా రేవంత్‌రెడ్డి మేలుకోకపోతే తెల్లబంగారాన్ని తీసుకువచ్చి జూబ్లీహిల్స్‌లో ఆయన ప్యాలెస్ ముందట పోస్తామని, రైతులతో కలిసి ఆందోళన చేస్తామని హెచ్చరించారు.

ఎంపీలు ఏం చేస్తున్నారు..?

రాష్ట్రం నుంచి 8మంది బీజేపీ ఎంపీలు, కాంగ్రెస్ నుంచి ఎనిమిది మంది ఎంపీలు గెలిచి ఏం చేస్తున్నారని హరీశ్‌రావు ప్రశ్నించారు. వారికి బాధ్యత లేదా? అని నిలదీశారు. కేంద్రంపై ఒత్తిడి తెచ్చి పత్తి రైతులకు న్యాయం చేయరా..? పత్తి రైతులు ఆత్మహత్యలు చేసుకుంటుంటే వీళ్లకు కనికరం లేదా..? బీజేపీ ఎంపీలు సంబంధిత మంత్రిని, ప్రధానమంత్రిని కలిసి రైతుల సమస్యలను పరిష్కరించరా..?"అంటూ హరీష్ ప్రశ్నల వర్షం కురిపించారు.

నష్టాలపాలవుతున్న రైతులు..

ఏనుమాముల మార్కెట్లో ములుగు జిల్లా మంగపేట మండలం చింతకుంట రైతులతో మాట్లాడామని హరీష్‌రావు వెల్లడించారు. మక్కలు క్వింటాకు రూ.1825లకు అమ్మామని రైతులు మద్దెల వెంకటేశ్వర్లు, లక్ష్మయ్య చెప్పారన్నారు. మద్దతు ధర రూ.2400లు ఉందంటే సుమారు రూ.500 తక్కువకు అమ్ముకున్నారన్నారు. వారిద్దరు కలిసి 137 బస్తాల మక్కలను అమ్మారని, అంటే దాదాపు నలభై వేల రూపాయలు నష్ట పోయారని వివరించారు. అదే మార్క్‌ఫెడ్‌తో మద్దతు ధరకు కొంటే వారికి నలభై వేల రూపాయలు మిగిలి ఉండేవని వివరించారు.

రైతులకు చెల్లింపులు లేవు..

మార్క్‌ఫెడ్ అధికారులను అడిగితే ఇప్పటి వరకు మూడు వేల 400 క్వింటాళ్ల మాత్రమే కొన్నట్లు చెప్పారని హరీష్‌రావు తెలిపారు. సంబంధిత రైతులకు ఇప్పటివరకు డబ్బులు జమ చేయలేదన్నారు. నెల నుంచి మక్కలు కొంటున్నరు కదా.. ఇప్పటి వరకు రూపాయి ఇవ్వకపోతే ఎట్లా..? ఈ కారణంగానే రైతులు దళారులకు తక్కువ ధరకు అమ్ముకుంటున్నారన్నారు. పోయిన యాసంగిలో ఇస్తామన్న బోనస్ రూ.1100 కోట్లు పెండింగ్‌లోనే ఉన్నాయన్నారు. ఈ సంవత్సరం కొన్న వడ్లకు కూడా రూ.1400 కోట్లు చెల్లించాల్సి ఉందని, వెంటనే బకాయిలన్నింటినీ చెల్లించి రైతులను ఆదుకోవాలని అని హరీష్‌రావు మాండ్ చేశారు.

ఊరు.. పోరు.. హుషారు..

(5వ పేజీ తరువాయి)

నిర్ణయిస్తూ రిజర్వేషన్లు కూడా ఖరారయ్యాయి. తీరా బీసీలకు రిజర్వేషన్ల విషయంలో కోర్టు జోక్యంతో ఎన్నికల ప్రక్రియకు బ్రేక్ పడింది. దీనితో ఆశావహులంతా ఒక్కసారిగా నిరాశకు గురయ్యారు. ముఖ్యంగా బీసీలు ఉసూరుమన్నారు. 42 శాతం రిజర్వేషన్ల వల్ల తమకు గెలుపు అవకాశాలు ఎక్కువ ఉంటాయని భావించిన నాయకులు నిరుత్సాహానికి లోనయ్యారు. అయితే తీర్పు నేపథ్యంలో బీసీలకు పార్టీ పరంగా 42 శాతం సీట్లు కేటాయించాలని మంత్రివర్గం నిర్ణయించడంతో ఇక ఎన్నికలు జరగడం ఖాయంగా తేలిపోయింది. డిసెంబరులోనే ఎన్నికలు పూర్తిచేసేందుకు ఏర్పాట్లు చేయాలని కూడా మంత్రి వర్గం అధికారులను ఆదేశించడంతో ఎన్నికలకు సమాయత్తం అయ్యేందుకు ఆశావహులు తమ వంతు ప్రయత్నాలను మొదలు పెట్టారు.

మారనున్న రిజర్వేషన్లు

బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు చేస్తూ జడ్పీటీసీ, ఎంపీటీసీ స్థానాలకు, అలాగే సర్పంచులు, వార్డు సభ్యుల స్థానాలకు రిజర్వేషన్లు ఖరారయ్యాయి. ఆ మేరకు అధికారికంగా ప్రకటించారు కూడా. మహిళల స్థానాలను లాటరీ డిప్ ద్వారా ఖరారు చేశారు. అయితే ప్రస్తుతం అమలులో ఉన్న 23 శాతం బీసీ రిజర్వేషన్, మొత్తం రిజర్వేషన్లు 50 శాతానికి లోపు ఉండేలా గ్రామాల వారీగా రిజర్వేషన్లు ఖరారు చేయాలని ప్రత్యేక కమిషన్‌ను ప్రభుత్వం కోరనున్నది. ఈ కమిషన్ రిజర్వేషన్లను ఖరారు చేయడానికి వారం పడుతుందని అంచనా వేస్తున్నారు. రిజర్వేషన్ల జాబితా అందిన రెండు మూడు రోజుల్లో ఎన్నికల నోటిఫికేషన్ జారీ చేయనున్నారు. ఈ నేపథ్యంలో ఇంతకు ముందు ఖరారు చేసిన రిజర్వేషన్లలో మార్పులుచేర్పులు ఉండే అవకాశం ఉంది. ఈ దృష్ట్యా గత రిజర్వేష్ల ఖరారుతో పోటీ విషయంలో ఒక నిర్ణయానికి వచ్చిన ఆశావహుల్లో సందేహాలు మొదలయ్యాయి. తాజా పరిణామాల వల్ల రిజర్వేషన్లలో మార్పులు, చేర్పులు జరగవచ్చునన్న అభిప్రాయం వ్యక్తం అవుతోంది.

బీసీ రిజర్వేషన్లపై కాంగ్రెస్ మోసం


(5వ పేజీ తరువాయి)

చేసేందుకే సీఎం రేవంత్‌రెడ్డి బూటకపు హామీలు ఇచ్చి పాలన కొనసాగిస్తున్నారని విమర్శించారు. బీసీ రిజర్వేషన్‌కు చట్ట బద్ధత వచ్చిన తర్వాతే ఎన్నికలు నిర్వహించాలని అన్నారు. బీసీల రిజర్వేషన్లలో తమిళనాడులో అమలు చేస్తున్న తీరును స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు.

మాజీ ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్ మాట్లాడుతూ.. బీసీ రిజర్వేషన్ల బిల్లు ఆమోదం కోసం తెలంగాణలోని బీజేపీ, కాంగ్రెస్ ఎంపీలు కేంద్రంపై ఒత్తిడి తీసుకొచ్చి కృషి చేయాలని అన్నారు. ఏకాభిప్రాయంతోనే రిజర్వేషన్ల సాధించాలని తెలిపారు. అబద్దాలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్.. బీసీల గొంతు కోస్తోందని తీవ్రంగా మండిపడ్డారు. ఈకార్యక్రమంలో బీఆర్ఎస్ వరంగల్ పశ్చిమ కన్వీనర్ తాళ్లపెల్లి జనార్ధన్‌గౌడ్, కోఆర్డినేటర్ పులి రజినీకాంత్, మాజీ కార్పొరేటర్ కుసుమ లక్ష్మీనారాయణ, నయీమొద్దీన్, శోభన్, రవీందర్ రావు, మహేందర్, ఖలీల్, చాగంటి రమేష్, మహేష్, మహమూద్, పోలెపల్లి రాంమూర్తి, జానకీ రాములు, దేవమ్మ, ప్రశాంత్ పాల్గొన్నారు.

హత్యాయత్నం కేసులో ఎనిమిదిన్నరేళ్ల జైలు శిక్ష

వరంగల్ లీగల్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): కోర్టులో పెండింగ్ ఉన్న క్రిమినల్ కేసులో తనకు వ్యతిరేకంగా సాక్ష్యం చెప్పకూడదని ఓ వ్యక్తిపై హత్యాయత్నం చేసిన కేసులో ఒకరికి ఎనిమిదిన్నరేళ్ల కఠిన కారాగారా శిక్ష, రూ.1100 జరిమానా విధిస్తూ హనుమకొండ జిల్లా సెషన్స్ జడ్జి డాక్టర్ కె.పట్టాభిరామారావు మంగళవారం తీర్పు వెలువరించారు. కేసు వివరాలు ఇలా ఉన్నాయి. హనమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం గట్ల నర్సింగాపూర్ గ్రామానికి చెందిన నిందితుడు గూళ్ల రాజు ఓ కేసులో నిందితుడిగా ఉన్నాడు. ఆ కేసులో అదే గ్రామానికి చెందిన కోల సుమలత సాక్షిగా పోలీసులు పేర్కొన్నారు. కాగా, నిందితుడు రాజు కేసు విచారణకు రావడంతో కోల సుమలతను తనకు వ్యతిరేకంగా సాక్ష్యం చెప్పకూడదని 2024 ఆగస్టు17న ఆమె ఇంటికి వెళ్లి బెదిరించాడు. ఈ క్రమంలో సుమలత కొడుకు వెంకటేశ్ అడ్డు రావడంతో అతడిపై నిందితుడు గూళ్ల రాజు గొడ్డలితో దాడి చేసి హత్యాప్రయత్నానికి పాల్పడ్డాడు. కేసులో నిందితుడిపై హత్యాయత్నం కేసు నమోదు చేసి కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు. కేసు విచారణలో నేరం రుజువైనందున నిందితుడికి ఎనిమిదిన్నరేళ్ల జైలు శిక్ష విధిస్తూ న్యాయమూర్తి తీర్పు వెలువరించారు. కోర్టు పీసీ ఎస్.నరేష్ సాక్షులను ప్రవేశపెట్టగా దర్యాప్తు అధికారులుగా ఎస్సైలు ఎస్.సాయి బాబు, ఎం. రాజు, సీఐ పులి రామేష్ వ్యవహరించారు. పబ్లిక్ ప్రాసిక్యూటర్ రాము కేసు వాదించారు.



ఐనవోలులో డీసీసీబీ సొంత భవనం కింద షాపింగ్ మార్ట్

కొత్త దారుల్లో పీఏసీఎస్‌లు

- ఆదాయ వృద్ధి కోసం వ్యాపారాల నిర్వహణ
- సత్ఫలితాలతో ఆర్థికంగా బలోపేతం అవుతున్న సంఘాలు
- మల్టీ సర్వీస్ సెంటర్లతో లాభార్జన
- సంఘాల ఆర్థిక బలోపేతంతో డీసీసీబీకి ప్రత్యేక గుర్తింపు

హనుమకొండ సిటీ, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి) : ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు (పీఏసీఎస్) కొత్త రూపాన్ని సంతరించుకుంటున్నాయి. ముఖ్యంగా ఆర్థికంగా బలపడడానికి వివిధ మార్గాల పయనిస్తూ వృద్ధి సాధిస్తున్నాయి. ఉమ్మడి జిల్లాలోని సహకార సంఘాలు ఆర్థికంగా బలపడేందుకు చేపట్టిన ప్రయోగాలు మంచి ఫలితాలను ఇస్తున్నాయి. రైతులకు రుణాల కల్పనలో ఎదురుచూపులు చూసే పరిస్థితి లేకుండా స్వయంగా రుణాల అందజేతకు అవసరమైన ఆర్థిక వృద్ధిని సాధిస్తున్నాయి. కమర్షియల్‌గా పోటీ పడుతూ వ్యాపార రంగాల్లో విస్తరిస్తూ లాభార్జనలు పొందుతున్నాయి.

ఒకప్పుడు చిన్న గదులు, స్వంత భవనాలు లేని పరిస్థితి సంఘాలది. కానీ ఇప్పుడు స్వంత భవనాల కలిగి ఉండడమే కాదు వాటిని వ్యాపారాలకు అనువుగా మార్చుకోవడం, అద్దెలకు ఇచ్చి కూడా నిధులు సమకూర్చుకునే స్థాయికి ఉమ్మడి జిల్లాలోని సంఘాలు ఎదిగాయి. ముఖ్యంగా మల్టీ సర్వీసు సెంటర్లు (ఎంయస్‌సీ) ప్రాజెక్టును వరంగల్‌లో ప్రయోగించడం ఈ మేరకు సంఘాలు కొత్త రూపంతో ఫలితాలు సాధించడంతో వరంగల్ ఉమ్మడి జిల్లా రాష్ట్రంలోనే ప్రత్యేక గుర్తింపు సొంతం చేసుకుంది. ఉమ్మడి జిల్లాలో మొత్తం 91 సహకార సంఘాలు ఉన్నాయి.

సొంత భవనాల్లో..

రుణాలతో సొంత ఆస్తులు సముపార్జించుకున్న ప్రాథమిక వ్యవసాయ సహకార సొసైటీలు ఆ భవనాల్లో బ్యాంకు కార్యకలాపాలు సాగిస్తున్నాయి. గతంలో అద్దె భవనాల్లో నిర్వహణ నుంచి ఇప్పుడు సొంతంగా భవనాల నిర్మాణమే కాకుండా వ్యాపార నిర్వహణకు సైతం అదనపు ఆస్తుల నిర్మాణం చేపట్టిన పీఏసీయస్‌లు ఆదాయ వనరుల వృద్ధిలో ముందంజలో ఉండడానికి డీసీసీ బ్యాంక్ సేవలు అభినందనీయంగా ఉన్నాయి. పీఏసీయస్‌లను ఆర్థికంగా బలోపేతం చేసి ఎంఎస్‌సీ స్కీమ్ ఫలితాలను సాధించడంలో రాష్ట్రంలోనే వరంగల్ ఉమ్మడి జిల్లా డీసీసీబీ అగ్రస్థానంలో నిలిచింది.

ఆర్థిక వృద్ధి సాధనలో..

ఒకనాడు పీఏసీయస్‌లు ఆర్థికంగా బలంగా ఉండేవి కావు. సంఘాలు పేరుకే పరిమితంగా ఉండేవి. పంట రుణాలు, వ్యవసాయ ఆధారిత రంగాలకు రుణాల కల్పన అంతంత మాత్రంగానే జరిగేవి. ఈ బాధ్యతలకే సంఘాలు పరిమితం అయ్యేవి. ఆధునికంగా వస్తున్న మార్పులకు అనుగుణంగా పీఏసీయస్‌లు కూడా కొత్త రూపాన్ని సంతరించుకున్నాయి. కమర్షియల్ బ్యాంకులపై ఆధారపడే పరిస్థితి రైతులకు తప్పింది. ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల పరిధిలో రుణాల అవసరతను సేకరించడంతో పాటు నాబార్డు ఆపై టీఎస్‌సీఏబీ ద్వారా రుణాల లక్ష్యాలు, మంజూరు ఆపై పీఏసీఎస్‌లకు రుణాల జారీ వరకు డీసీసీ బ్యాంకు వారధిగా నిలుస్తూ తన సేవలను విస్తరించింది. తద్వారా పీఏసీయస్‌లను ఆర్థికంగా బలోపేతం చేయడంతో పాటు డీసీసీ బ్యాంకు కూడా స్వీయ ఆర్థిక శక్తిని కూడగట్టుకుంటోంది.

గోదాములు, పెట్రోల్ పంపులు, మార్కెట్లు..

ఎంఎస్‌సీ ద్వారా పొందిన రుణాలతో పీఏసీఎస్‌లు మండలాల్లో పెట్రోల్ పంపులు, గోదాంలు, వ్యవసాయ ఔట్ లెట్లు, ఫంక్షన్ హాల్స్ నగర పరిధిలోని కార్పొరేట్ మాల్స్‌ను తలపించేలా మండలాలు, గ్రామాల్లో సైతం మార్కెట్స్, మాల్స్ నిర్వహణ భవనాలను నిర్మిస్తున్నాయి. ఉమ్మడి జిల్లాలో రైస్ మిల్లులు, గోదాంలు, పెట్రోల్ పంపులు ఇలా సొంత ఆస్తుల నిర్మాణం మొత్తం 129 చేపట్టగా వీటిలో 90 ఆస్తుల నిర్మాణం పూర్తయి వివిధ మార్గాల్లో ఆ భవనాల్లో ఆదాయాన్ని పీఏసీఎస్‌లు పొందుతున్నాయి. వీటిలో అత్యధికంగా 68 గోడౌన్లు, 27 అగ్రి ఔట్ లెట్స్ ఉన్నాయి. నిర్మాణం పూర్తయిన వాటిలో కొన్ని అద్దెకు ఇవ్వడంతో పాటు మరికొన్ని వ్యాపారాలను పీఏసీఎస్‌లే సొంతంగా నిర్వహిస్తూ ఆదాయాన్ని పొందుతున్నాయి. ఇలా ఆదాయ వృద్ధిని సాధిస్తూ డీసీసీ బ్యాంకు నుంచి పొందిన రుణాలను తీర్చిన తరువాత మరింత రాబడిని సృష్టించుకుంటున్నాయి. ఫలితంగా ఆర్థికంగా పటిష్ఠత సాధిస్తూ రైతులకు పంట రుణాలతో పాటు దీర్ఘకాలిక రుణాలు, విద్యా రుణాలు, బంగారు ఆభరణాలపై రుణాలు ఇలా కమర్షియల్ బ్యాంకు సేవలతో పోటీ పడుతున్నాయి.

ఒకప్పుడు ధాన్యాన్ని నిలువ చేసే స్థితి లేక ప్రతికూల పరిస్థితుల్లో నష్టపోయిన రైతులకు ధాన్యం నిల్వల కోసం పీఏసీఎస్‌ల ద్వారా నిర్మితమైన గోదాంలు ఉపయుక్తంగా మారాయి. పీఏసీస్‌లు ధాన్యాన్ని కూడా కొనుగోలు చేసి ఆర్థిక వృద్ధిని సాధిస్తున్నాయి. ఎంఎస్‌సీ స్కీమ్ ద్వారా డీసీసీ బ్యాంకు నుంచి రూ.52 కోట్లు రుణ కల్పన జరుగగా పీఏసీఎస్‌ల నుంచి రూ.45 కోట్ల రికవరి జరగడం సొసైటీ ఆర్థిక పరిపుష్టిగా నిదర్శనంగా మారింది.

ఎంఎస్సీ ద్వారా బలోపేతం

మల్టీ సర్వీసు సెంటర్ స్కీమ్ ద్వారా డీసీసీ బ్యాంకు పీఏసీఎస్‌లకు ఒక్క శాతం వడ్డీకే రుణాలను అందిస్తోంది. ఎంఎస్‌సీ ద్వారా పీఏసీఎస్‌లు తాము పొందిన రుణాలను పంట రుణాలకే పరిమితం చేయకుండా నూతన ఆదాయ వృద్ధి మార్గాలను అన్వేషించి ఆ మేరకు రుణాలను పెట్టుబడి ఆదాయ వనరులుగా మార్చుకుంటున్నాయి. గతంలో రుణాలు పొందిన పీఏసీఎస్‌లు కేవలం పంట రుణాలు, వ్యవసాయ ఆధారిత రుణాలే అందించేవి. కానీ నూతన ఒరవడిలో డీసీసీ బ్యాంక్ నుంచి పొందన రుణాలతో సొంత ఆస్తులను నిర్మించుకొని తద్వారా ఆదాయాన్ని పొందుతున్నాయి.

ప్రణాళికలు ఫలితాలిస్తున్నాయి..

టెస్కాబ్, వరంగల్ డీసీసీబీ చైర్మన్ మార్నేని రవీందర్‌రావు



ఉమ్మడి జిల్లాలోని సహకార సంఘాలు ఆర్థిక పటిష్ఠతను సాధిస్తున్నాయి. ఆర్థిక బలోపేతానికి ప్రవేశపెట్టిన ప్రణాళికలు ఫలితాలను సాధిస్తున్నాయి. తెలంగాణలో తొలిసారిగా మల్టీ సర్వీసు సెంటర్లుగా సంఘాలను రూపాంతర పరిచే ప్రాజెక్టును అమలు చేశాం. ఇది ఆర్థికంగా సంఘాలు ఎదగడానికి నిచ్చెనగా మారింది. ఎంఎస్సీ ద్వారా సంఘాలు రుణాల కల్పనతో పాటు వ్యాపార రంగంలోకి అడుగు పెట్టాయి. పెట్రోలు పంపులు, గోదాంలు, షాపింగ్ మాల్స్, ఫంక్షన్ హాల్స్ నిర్మాణం ఇలా ఇంకా అనేక వ్యాపార నిర్వహణ కేంద్రాలుగా సంఘాలు కొత్త మార్గంలో ప్రయాణం ఆరంభించాయి. కమర్షియల్ బ్యాంకులుగానూ సంఘాల సేవలు విస్తరించాయి.

ప్రశ్నించే వారు లేకుంటే ప్రజాస్వామ్యం లేదు

- ప్రజల హక్కులను కాలరాస్తున్న ప్రభుత్వాలు
- సీపీఐ నేత, మాజీ ఎమ్మెల్యే చాడ వెంకట్‌రెడ్డి



ఎల్కతుర్తిలో మాట్లాడుతున్న చాడ వెంకట్‌రెడ్డి

ఎల్కతుర్తి, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): ప్రశ్నించే వారు లేకుంటే ప్రజాస్వామ్యమే లేదని సీపీఐ సీనియర్ నాయకుడు, మాజీ ఎమ్మెల్యే చాడ వెంకట్‌రెడ్డి అన్నారు. పార్టీ వంద సంవత్సరాల ఉత్సవాల్లో భాగంగా చేపట్టిన బస్సుజాతాను మంగళవారం భీమదేవరపల్లి మండలం ముల్కనూర్‌లో ప్రారంభించారు. ముల్కనూర్, ఎల్కతుర్తి మండలాల మీదుగా బస్సుజాతా హనుమకొండకు చేరుకుంది. ఈ సందర్భంగా ఎల్కతుర్తి, ముల్కనూర్ చౌరస్తాల్లో వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ.. వలస పాలకుల చేతి నుంచి విముక్తి కలిగించడానికి సీపీఐ పుట్టిందన్నారు. ప్రజలను చైతన్య వంతులను చేయడానికి ప్రత్యేక్ష ఉద్యమాలు చేపట్టిన ఘనత సీపీఐ పార్టీదన్నారు. నరేంద్ర మోదీ ప్రభుత్వం మతం పేరుతో మారణహోమం సృష్టిస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. దళితులపై దాడులు చేస్తూ ప్రశ్నించే గొంతుకలను నొక్కుతోందన్నారు. మోదీని చంపడానికి కుట్ర చేశారంటూ వరవరరావుపై రాజద్రోహం కేసులు పెట్టారని మండిపడ్డారు. ప్రజల హక్కులను ప్రభుత్వాలు కాలరాస్తున్నాయన్నారు. మధ్యాహ్న భోజన కార్మికులు, ఆశా వర్కర్లకు జీతాలు, విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్లను ఈ నెలాఖరులోగా చెల్లించకుంటే మరో పోరాటం తప్పదని హెచ్చరించారు. బూటకపు ఎన్‌కౌంటర్లు చేసి అమాయకులను పొట్టన పెట్టుకుంటున్నారని మండిపడ్డారు. డిసెంబరు 26న ఖమ్మంలో జరిగే ఉత్సవాల ముగింపు సభను విజయవంతం చేయాలని కోరారు. సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాస్‌రావు మాట్లాడుతూ.. అట్టడుగు వర్గాల అభివృద్ధి కోసం పోరాడేది సీపీఐ పార్టీయేనని అన్నారు. కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర సమితి సభ్యుడు ఆదరి శ్రీనివాస్, రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు కలవేని శంకర్, జిల్లా కార్యదర్శి కర్రె బిక్షపతి, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు నెదునూరి జ్యోతి, రాష్ట్ర సమితి నాయకులు కరుణాకర్, సదాలక్ష్మి, తోట భిక్షపతి, మద్దే ఎల్లేష్, ఉట్కూరి రాములు, కర్రె లక్ష్మణ్, ఓదెలు, రాజుగౌడ్, సంతోష్, శనిగరం రాజ్‌కుమార్, ఆదరి రమేష్, మర్రి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

అనాలోచిత విధానాలతో ఇబ్బందులు

- రైతుల సమస్యలు ప్రభుత్వాలకు పట్టడం లేదు
- మాజీ మంత్రి హరీష్‌రావు
- మొగిలిచర్లలో పంటల పరిశీలన



పత్తి చేనులో రైతులతో మాట్లాడుతున్న హరీష్‌రావు, దయాకర్‌రావు తదితరులు

గీసుగొండ, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వ అనాలోచిత విధానాలతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని మాజీ ఆర్థికశాఖ మంత్రి తన్నీరు హరీష్‌రావు అన్నారు. గ్రేటర్ వరంగల్ 15వ డివిజన్ మొగిలిచర్ల శివారులో గల పలు పత్తిపంట క్షేత్రాలను పరిశీలించి స్థానిక రైతులతో మాట్లాడారు. ఈ సందర్భంగా శోభ అనే మహిళ రైతు ఎనిమిది ఎకరాలను కౌలుకు తీసుకొని సాగు చేస్తున్నట్లు ఆయన దృష్టికి తీసుకువచ్చారు. సరిపడా ఎరువులు లభించకపోవడం, కరెంటు సరిగ్గా లేకపోవడం, రైతుబంధు రెండుసార్లు అందలేదని, పత్తిపంటను అమ్ముకోవాలన్న సీసీఐ నిబంధనలతో ఇబ్బందులు పడుతున్నట్లు వాపోయారు. తుపాన్‌తో పత్తి వంటి పంటకు నష్టం జరిగి తీవ్రంగా నష్టపో యామని చెప్పారు. వాటిని చెడగొట్టి మొక్కజొన్న పంటలను సాగుచేస్తామంటే కరెంటు సరిగా లేదని ధనలక్ష్మి అనే మహిళ రైతు వాపోయారు. అనంతరం హరీష్‌రావు మాట్లాడుతూ రాష్ట్రంలో బీజేపీ 8, కాంగ్రెస్ 8 ఎంపీ సీట్లు పొంది కనీసం రైతుల బాధను అర్థం చేసుకోకుండా రెండు పార్టీలు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయని మండిపడ్డారు. పంట క్షేత్రాల్లో దిష్టిబొమ్మలకన్నా ఆయా పార్టీ ఎంపీలు అధ్వాన్నంగా మారారని ఆరోపించారు. బీజేపీలో కిషన్‌రెడ్డి, బండి సంజయ్‌లు ఇద్దరు కేంద్రమంత్రులు ఉన్న రైతుల సమస్యలను పట్టించుకోవడం లేదని విమర్శించారు. సీసీఐ కొనుగోలు కేంద్రాల గురించి వారు ఎందుకు మాట్లాడటం లేదని నిలదీశారు. సీసీఐ పెట్టిన పిచ్చి నిబంధనలను వెంటనే తొలగించి రైతులను ఆదుకోవాలన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి మాయమాటలు చెప్పి అధికారంలోకి వచ్చి రైతుల బాధలను విస్మరించడం సరైంది కాదన్నారు. కార్యక్రమంలో మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు, ఎమ్మెల్యేలు చల్లా ధర్మారెడ్డి, నన్నపనేని నరేందర్, వినయ్‌భాస్కర్, వరంగల్ మార్కెట్ మాజీ చైర్మెన్ చింతం సదానందం, సుంకరి శివకుమార్, డీసీసీబీ డైరెక్టర్ దొంగల రమేష్, కార్పొరేటర్ మనోహర్ పాల్గొన్నారు.

ఆర్డీవో కార్యాలయం జప్తు

- నష్ట పరిహారం అందించడంలో ఆర్డీవో నిర్లక్ష్యం
- కోర్టు ఆదేశాల మేరకు ఫర్నిచర్ తరలింపు



ఆర్డీవో కార్యాలయంలో ఫర్నిచర్‌ను స్వాధీనం చేసుకుంటున్న కోర్టు సిబ్బంది, రైతులు

తొర్రూరు, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): ఎస్సారెస్పీ కాలువ నిర్మాణం కోసం రైతుల నుంచి ప్రభుత్వం సేకరించిన వ్యవసాయ భూములకు పరిహారం చెల్లించాలని కోర్టు ఆదేశించినా, అధికారులు స్పందించక పోవడంతో ఆర్డీవో కార్యాలయంలో ఫర్నిచర్‌ను జప్తు చేశారు. ఈ సంఘటన మహబూబాబాద్ జిల్లాలోని తొర్రూరు ఆర్డీవో కార్యాలయంలో మంగళవారం చోటు చేసుకుంది. మహబూబాబాద్ జిల్లా దంతాలపల్లి మండలానికి చెందిన రైతులు సాదు ధర్మారెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, కొరిపెల్లి వెంకన్న 2000వ సంవత్సరంలో ఎస్సారెస్పీ కాలువ నిర్మాణం కోసం తమ భూములను ప్రభుత్వానికి ఇవ్వగా నష్టపరిహారం కొంత చెల్లించింది. మరింత నష్టపరిహారం కావాలని కోరుతూ సదరు రైతులు న్యాయపోరాటం కొనసాగిస్తున్నారు. 2011లో జిల్లా కోర్టు నష్ట పరిహారం చెల్లించాలని సంబంధిత అధికారులను ఆదేశించింది. కానీ వారు పట్టించుకోలేదు. దీంతో రైతులు హైకోర్టును ఆశ్రయించారు. సంబంధిత రెవెన్యూ డివిజనల్ అధికారి కూడా హైకోర్టును ఆశ్రయించారు. రైతులు ఎగ్జిక్యూటివ్ పిటిషన్ వేయగా హైకోర్టు రైతులకు నష్ట పరిహారం చెల్లించాలని ఆదేశించింది. ఈ క్రమంలో రైతులు జిల్లా కోర్టును ఆశ్రయించగా, తొర్రూరు ఆర్డీవోపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ కార్యాలయాన్ని జప్తు చేసి కంప్యూటర్‌లు, ఇతర సామగ్రి స్వాధీనం చేసుకోవాలని మహబూబాబాద్ జిల్లా ప్రధాన న్యాయమూర్తి మహ్మద్ అబ్దుల్ రఫీ ఆదేశాలు జారీ చేశారు. దీంతో కోర్టు సిబ్బంది వచ్చి కార్యాలయంలో ఉన్న బీరువాలు, ఫర్నిచర్ స్వాధీనం చేసుకుని వాహనాల్లో తరలించారు. అధికారుల నిర్లక్ష్యం వల్లే ఈ సంఘటన జరిగిందని, కోర్టు పరిహారం చెల్లించాలని ఆదేశించినా ప్రభుత్వ నిబంధనల మేరకు గత పరిహారాన్ని దృష్టిలో పెట్టుకుని రైతులకు న్యాయం చేస్తే బాగుండేదని పలువురు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ప్రేమ విఫలమై యువకుడి ఆత్మహత్య



నాగరాజు (ఫైల్)

నెక్కొండ, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): ప్రేమించిన యువతి పెళ్లికి నిరాకరించడంతో మనస్తాపానికి గురైన యువకుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన వరంగల్ జిల్లా నెక్కొండ మండలంలోని లావుడ్యావాగ్యానాయక్ గ్రామంలో మంగళవారం చోటుచేసుకుంది. ఎస్సై మహేందర్ తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన నిరుపేద కుటుంబానికి చెందిన రవి-విజయ దంపతుల ఏకైక కుమారుడు, డ్రైవర్ బానోతు నాగరాజు (25) గత ఐదేళ్ల నుంచి ఒక యువతిని ప్రేమిస్తున్నాడు. జీవితంలో స్థిరపడిన తరువాత వివాహం చేసుకుందామని అమ్మాయి తెలుపగా అందుకు నాగరాజు అంగీకరించలేదు. దీంతో అమ్మాయి నాగరాజుతో పెళ్లికి నిరాకరించడంతో ఈ నెల 16న గ్రామ శివారులోని వ్యవసాయ భూమి వద్ద జనసంచారం లేని సమయంలో గడ్డి మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడగా కుటుంబ సభ్యులు వరంగల్ ఎంజీఎంకు తరలించారు. చికిత్స పొందుతున్న నాగరాజు ఆరోగ్య పరిస్థితి విషమించడంతో మంగళవారం ఉదయం మృతి చెందాడు. మృతుడి తండ్రి రవి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. కాగా ఏకైక కుమారుడు మృతితో తల్లిదండ్రులు విలపించిన తీరు పలువురిని కంటతడి పెట్టించింది.



ఘటనాస్థలాన్ని పరిశీలిస్తున్న ఎస్సై, పశు వైద్యాధికారి

కొమ్మును కోసి.. కన్ను పీకి..

- రక్తస్రావంతో పాడి ఆవు మృతి
- క్షుద్ర పూజలు ?
- జనగామ జిల్లా శ్రీపతిపల్లిలో ఘటన

చిలుపూర్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి) : కొట్టంలో కట్టేసిన పాడి ఆవును తాళ్లతో బంధించి.. దాని కొమ్మును కోసి.. ఒక కన్నును బలవంతంగా పీకేసి గుర్తు తెలియని దుండగులు ఎత్తుకెళ్లిన అమానవీయ ఘటన మంగళవారం జనగామ జిల్లా చిలుపూర్ మండలం శ్రీపతిపల్లిలో జరిగింది. బాధిత రైతు శివరాత్రి వెంకటేశ్ కథనం ప్రకారం.

వెంకటేశ్‌కు రెండు పాడి ఆవులు, నాలుగు దూడలను సోమవారం సాయంత్రం వరకు తన పొలంలోనే మేపాడు. పాలిచ్చే వాటిని కొట్టంలో కట్టేసి, మిగతావాటిని బయటకట్టేసి ఇంటికి వెళ్లాడు. మంగళవారం ఉదయం వచ్చి చూసేసరికి ఆవు తీవ్ర రక్తస్రావంతో మృతి చెంది కనిపించింది. దుండగులు ఎడమ వైపు కొమ్ము, కుడి కన్ను కత్తితో తొలగించడాన్ని గుర్తించాడు. వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వడంతో ఎస్సై సిరిపురం నవీన్‌కుమార్, మండల పశు వైద్యాధికారి డాక్టర్ అనీషకుమార్ ఘటనాస్థలికి చేరుకుని పరిశీలించారు. దుండగులు పశువు వెనుక కాళ్లను తాళ్లతో బంధించి బలవంతంగా కత్తులతో దాడిచేసి కొమ్మును, ఓ కంటిని తొలగించడంతో తీవ్రరక్తస్రావమై మృతిచెందినట్టు ప్రాథమికంగా నిర్ధారించారు. అంతేకాదు, కన్ను, కొమ్మును ఎత్తుకెళ్లడమే కాకుండా, కొంత రక్తాన్ని తీసుకుని సమీపంలో ఉన్న ఉప్పలమ్మ గుడిముందు పోయడాన్ని చూస్తే, క్షుద్రపూజల కోసమే ఈ దారుణానికి ఒడిగట్టి ఉంటారని స్థానికులు అనుమానిస్తున్నారు. రూ.లక్ష విలువ గల పాడి పశువు దుర్మరణం చెందడంతో రైతు వెంకటేశ్ లబోదిబోమన్నారు. బాధిత రైతు ఇచ్చిన ఫిర్యాదు మేరకు చిలుపూర్ ఎస్సై నవీన్‌కుమార్ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

భవితశ్రీ చిట్‌ఫండ్ ఎండీ అరెస్ట్

- శ్రీనివాస్‌ను మధ్యప్రదేశ్‌లో పట్టుకున్న పోలీసులు

వరంగల్ క్రైం, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): భవిష్యత్ అవసరాల కోసం పైసా.. పైసా కూడబెట్టుకొని చిట్టీలు వేయగా బాధితులకు అవసరానికి ఇవ్వకుండా మోసం చేసిన భవితశ్రీ చిట్‌ఫండ్ ఎం.డి. తాటిపెల్లి శ్రీనివాస్‌ను హనుమకొండ పోలీసులు అరెస్టు చేసి మంగళవారం రిమాండ్‌కు తరలించారు. హనుమకొండ సీఐ మచ్చ శివకుమార్ కథనం ప్రకారం.. ధర్మసాగర్ మండల ఎలుకుర్తికి చెందిన భీరి లక్ష్మణ ప్రతాప్ భవితశ్రీలో రూ.3లక్షల చిట్టీ వేయగా 2022లో ముగిసింది. అప్పటి నుంచి డబ్బులు ఇవ్వకుండా నానా ఇబ్బందులు పెడుతుండటంతో హనుమకొండ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కాగా, అప్పటికే తాటిపెల్లి శ్రీనివాస్‌పై పోలీస్‌స్టేషన్‌లో ఐదు కేసులు నమోదు కాగా పరారీలో ఉన్నాడు. ప్రతాప్ ఫిర్యాదుతో శ్రీనివాస్ మధ్యప్రదేశ్‌లో తలదాచుకున్నట్లు తెలియడంతో ఆదుపులోకి తీసుకొని శ్రీనివాస్‌పై చిట్‌ఫండ్ యాక్టు కేసుతో పాటు బాధితులను భయభ్రాంతులకు గురిచేయడం, చీటింగ్ కేసులు నమోదు చేసి మంగళవారం సాయంత్రం రిమాండ్‌కు తరలించామన్నారు. కాగా, ఇటీవలే భవితశ్రీ చిట్‌ఫండ్ చైర్మన్, మాజీ మేయర్ గుండా ప్రకాశ్‌పై కేసు నమోదు చేసి హనుమకొండ పోలీసులు కోర్టులో హాజరుపరచగా న్యాయమూర్తి ఆదేశాల మేరకు జైలుకు తరలించిన విషయం తెలిసిందే.

రైతుల అభివృద్ధే సహకార వ్యవస్థ లక్ష్యం

టెస్కాబ్ చైర్మన్ మార్నేని రవీందర్‌రావు



డీసీసీబీ వారోత్సవంలో మాట్లాడుతున్న రవీందర్‌రావు

హనుమకొండ సిటీ, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): రైతుల అభివృద్ధే సహకార వ్యవస్థ లక్ష్యమని టెస్కాబ్ చైర్మన్ మార్నేని రవీందర్‌రావు పేర్కొన్నారు. ఈ నెల 14 నుంచి 20వ తేదీ వరకు 72వ అఖిల భారత సహకార వారోత్సవాల జరుగుతున్న క్రమంలో మంగళవారం హనుమకొండలోని డీసీసీ బ్యాంకులో ఉత్సవాన్ని నిర్వహించారు. టెస్కాబ్, డీసీసీ బ్యాంక్ చైర్మన్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా రవీందర్‌రావు మాట్లాడుతూ.. సహకార సంఘాలను ఆర్థికంగా బలోపేతం చేయడంతో పాటు గ్రామీణ ప్రాంత ప్రజలకు జీవనోపాధి కల్పించే బహుళ ప్రయోజనార్థక చర్యలను చేపడుతున్నట్లు వెల్లడించారు. పీఏసీఎస్ వ్యవస్థను ఆధునీకరిస్తూ రైతులకు ఉత్తమ సేవలను అందిస్తున్నట్లు చెప్పారు. సహకార వ్యవస్థ రైతులకే పరిమితం కాకుండా వివిధవర్గాల అభివృద్ధికి వారధిగా నిలుస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో హనుమకొండ జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్, డీసీవో సంజీవ్‌రెడ్డి, కో-ఆపరేటివ్ యూనియన్ ఎం.డి. అన్నపూర్ణ, డీసీసీ బ్యాంక్ సీఈవో వజీర్ సుల్తాన్, డీఆర్‌డీవో శ్రీనివాస్, డీఎఫ్‌వో శ్రీపతి తదితరులు పాల్గొన్నారు.

నాడు ఎగసి.. నేడు అలసి..

(5వ పేజీ తరువాయి)

మృతి చెందారు. భూపాలపల్లి జిల్లా టేకుమట్ల మండలం వెలిశాలకు చెందిన గణేష్ మృతి మావోయిస్టు ఉద్యమానికి తీరని లోటుగా భావిస్తున్నారు. అలాగే జనగామ జిల్లా కడివెండికి చెందిన గుమ్మడవెల్లి రేణుక అలియాస్ సరస్వతి మార్చి 31న బీజాపూర్ అడవుల్లో జరిగిన ఎన్‌కౌంటర్‌లో మృతి చెందారు. కేంద్ర కమిటీ సభ్యురాలిగా, స్పెషల్‌జోన్ కమిటీ మెంబర్‌గా రేణుక ఉన్నారు. అలాగే మావోయిస్టు పార్టీ కేంద్ర కమిటీ సభ్యుడిగా ఉన్న కాజీపేట మండలం తరాలపల్లికి చెందిన అంకేశ్వరపు సారయ్య అలియాస్ సుధీర్ అలియాస్ సుధాకర్ మార్చి 25న బీజాపూర్ అడవుల్లో జరిగిన ఎన్‌కౌంటర్‌లో మృతి చెందారు. హనుమకొండ జిల్లా హసన్‌పర్తి మండలం చింతగట్టు గ్రామానికి చెందిన బుర్రా రాకేష్ అలియాస్ యుగంధర్ మే 22వ తేదీన నారాయణపూర్ జిల్లా అంబూజ్‌మడ్ అడవుల్లో జరిగిన ఎన్‌కౌంటర్‌లో మృతి చెందారు. వీరితో ఇంకా అనే మంది మావోయిస్టులు ఆపరేషన్ కగార్‌తో ఎన్‌కౌంటర్‌లో మృత్యువాత పడ్డారు.

లొంగుబాటలో అగ్రనేతలు

ఆపరేషన్ కగార్‌తో అనేక మంది ఎన్‌కౌంటర్‌లో మృతి చెందుతుండగా, మరికొందరు లొంగుబాటును ఎంచుకుంటున్నారు. రాష్ట్రవ్యాప్తంగా అనేకమంది కీలక మావోయిస్టు నేతలు సరెండర్ అవుతున్నారు. వీరిలో మావోయిస్టు అగ్రనేత, అలిపిరిలో అప్పటి సీఎం చంద్రబాబునాయుడుపై దాడికి సూత్రధారిగా ఉన్న తక్కళ్లపల్లి వాసుదేవరావు అలియాస్ ఆశన్న పోలీసులకు లొంగిపోడటం చర్చనీయాంశంగా మారింది. ములుగు జిల్లా వెంకటాపూర్ మండలం నర్సింగాపూర్ గ్రామానికి చెందిన వాసుదేవరావు.. అక్టోబరు 18వ తేదీన ఛత్తీస్‌గఢ్‌లోని జగదల్‌పూర్‌లో 208మందితో సహచరులతో కలిసి డీజీపీ అరుణ్‌దేవ్ గౌతమ్ సమక్షంలో లొంగిపోయారు. అలాగే ములుగు జిల్లా గోవిందరావుపేట మండలం మొద్దులగూడెం గ్రామానికి చెందిన అల్లూరి జిల్లా, ఆంధ్ర ఒరిస్సా బార్డర్ కార్యదర్శిగా కొయ్యడ సాంబయ్య అలియాస్ ఆజాద్ సైతం పోలీసులకు లొంగిపోయినట్లుగా ప్రచారం జరుగుతోంది. నాలుగు రోజుల కిందటే పోలీసులకు తన సహచరులతో కలిసి సరెండర్ అయ్యారని సమాచారం. అయితే పోలీసులు అధికారికంగా ధ్రువీకరించడం లేదు.

దామోదర్ ఎక్కడో ?

మావోయిస్టు పార్టీలో కీలక నేతలు లొంగుబాటను ఎంచుకోగా, మరికొందరు ఉద్యమంలో ప్రాణాలర్పిస్తున్నారు. అయితే మావోయిస్టు పార్టీ రాష్ట్ర కార్యదర్శి బాధ్యతల్లో ఉన్న ములుగు జిల్లా తాడ్వాయి మండలం కాల్వపల్లికి చెందిన చొక్కారావు 1997లోనే అజ్ఞాతంలోకి వెళ్లారు. అంచెలంచెలుగా ఎదిగిన దామోదర్ రాష్ట్ర కార్యదర్శి బాధ్యతల్లో ఉన్నారు. ఆపరేషన్ కగార్‌లో భాగంగా జనవరి 18 దామోదర్ ఎన్‌కౌంటర్ అయ్యారని ప్రచారం జరిగింది. అయితే వారం రోజులకే దామోదర్ క్షేమంగా ఉన్నారని మావోయిస్టు పార్టీ లేఖ విడుదల చేసింది. దీంతో సానుభూతిపరులు, కుటుంబ సభ్యులు ఊపిరి పీల్చుకున్నారు. కాగా, ప్రస్తుతం ఆపరేషన్ కగార్ ఉధృతం అవుతుండడంతో పాటు కీలక నేతలు ఎన్‌కౌంటర్‌లు, లొంగుబాటులో ఉండటంతో దామోదర్ ఎక్కడ..? ఎలా ఉన్నారనే చర్చ జరుగుతోంది. ప్రస్తుతం ఉమ్మడి వరంగల్ జిల్లా నుంచి మావోయిస్టు పార్టీలో కీలక బాధ్యతల్లో ఉన్నది దామోదరే కావటంతో విప్లవకారుల్లో ఉత్కంఠ నెలకొంది.

ఎనిమిదో వేతన సంఘంలో చేర్చాలి

బీజీడీకేఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కిషన్

వడ్డెపల్లి, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ డాక్ సేవలను 8వ వేతన సంఘంలో చేర్చాలని బీజీడీకేఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ జవ్వాజి కిషన్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం హనుమకొండ ఎన్జీవోస్ కాలనీ రోడ్డులోని ప్రైవేటు సమావేశ మందిరంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పోస్టల్ డిపార్ట్‌మెంట్‌లో గ్రామీణ డాక్ సేవలకు, డిపార్ట్‌ంట్ ఉద్యోగులకు చాలా వ్యత్యాసం ఉందని పేర్కొన్నారు. డిపార్ట్‌మెంట్ ఉద్యోగులు 8 గంటల వరకు పనిచేస్తే గ్రామీణ డాక్ సేవకులు సైతం 8 గంటలు పనిచేస్తున్నారని తెలిపారు. గ్రామాలలో గ్రామీణ డాక్ సేవకులకు సరైన వేతనం చెల్లించడం లేదని పేర్కొన్నారు. 4, 5 గంటల పనికి మాత్రమే వేతనాలు చెల్లిస్తూ డిపార్ట్‌మెంట్ ఉద్యోగులకంటే ఎక్కువ చట్టాలను ఉపయోగించి జీడీఎస్‌లను టార్గెట్ల పేరుతో వేధిస్తున్నారని దుయ్యబట్టారు. ఈ సమావేశంలో బీఎంఎస్ రాష్ట్ర పదాధికారి రామోజీ, బీజీడీకేఎస్ జిల్లా నాయకులు శంకర్‌నాయక్, సత్యనారాయణ, శ్రీనివాస్, లక్ష్మీనారాయణ, కిశోర్, వినయ్, సుధీర్, లాల్‌మియా, సుధాకర్ గౌడ్, సమ్మయ్య, వేణుగోపాల్, నర్సన్న, ఇషాక్, రవీందర్ తదితరులు పాల్గొన్నారు.



ఉపాధ్యాయులు, విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న అడిషనల్ జాయింట్ కలెక్టర్ వెంకట్‌రెడ్డి

ఆరోగ్య జీవన విధానాన్ని అనుసరించాలి

జిల్లా అదనపు కలెక్టర్, డీఈవో వెంకట్‌రెడ్డి

హసన్‌పర్తి, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు ఆరోగ్యవంతమైన జీవన విధానాన్ని అనుసరించాలని జిల్లా అదనపు కలెక్టర్, జిల్లా విద్యా శాఖ అధికారి వెంకట్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని పీఎంశ్రీ హసన్‌పర్తి బాలికల ఉన్నత పాఠశాలలో నశా విముక్త భారత్ అభియాన్ కార్యక్రమం హెచ్‌ఎం సుమాదేవి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్, డీఈవో వెంకట్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులకు విలువైన సూచనలు అందించి మాట్లాడారు. మత్తు పదార్థాలకు దూరంగా ఉండి ఆరోగ్యవంతమైన జీవన విధానాన్ని అనుసరించాలన్నారు. పాఠశాల కిచెన్ గార్డెన్ అభివృద్ధికి అవసరమైన మట్టిని, కిచెన్ షెడ్ నిర్మాణానికి నిధులు ఇస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఏఎంవో మన్మోహన్, బాలుర పాఠశాల హెచ్‌ఎం విజయలక్ష్మి, ఐసీడీఎస్ ప్రతినిధులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

డ్రగ్స్ రహిత సమాజాన్ని నిర్మించుకుందాం

ఎక్సైజ్ శాఖ జిల్లా అధికారి చంద్రశేఖర్



విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న అధికారులు, ఉపాధ్యాయులు

మడికొండ, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణానికి ప్రతీ ఒక్కరు కృషి చేయాల్సిన అవసరం ఉందని జిల్లా ఎక్సైజ్ శాఖ అధికారి చంద్రశేఖర్ అన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన నషాముక్త్ భారత్ కార్యక్రమంలో భాగంగా తెలంగాణ ప్రభుత్వ ఆదేశాల మేరకు కాజీపేట మండలం కడిపికొండ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఎక్సైజ్ శాఖ ఆధ్వర్యంలో మాదక ద్రవ్యాలు, మత్తు పదార్థాల నిర్మూలనపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా చంద్రశేఖర్ మాట్లాడుతూ.. యువతను నిర్వీర్యం చేస్తున్న డ్రగ్స్‌నిర్మూలన కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ధృడ సంకల్పంతో పనిచేస్తున్నాయన్నారు. అందులో భాగంగానే మంగళవారం అన్ని రకాల పాఠశాలలు, విద్యాసంస్థలు, ప్రభుత్వ కార్యాలయాలను సమన్వయం చేస్తూ ప్రతిజ్ఞ చేశామన్నారు. పాఠశాల స్థాయి నుంచే విద్యార్థులు మాదక ద్రవ్యాల బారిన పడకుండా సన్మార్గంలో నడుకోవాలని సూచించారు. కార్యక్రమంలో కాజీపేట ఎక్సైజ్ సీఐ చంద్రమోహన్, ఎస్సై తిరుపతి, ఎన్‌ఈవో బండారు మనోజ్‌కుమార్, ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ టీచర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఘనంగా రుద్రేశ్వర కల్యాణం

ఆకట్టుకున్న నందివాహన సేవ



రుద్రేశ్వరుడి కల్యాణం జరిపిస్తున్న పూజారులు

హనుమకొండ, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి) : హనుమకొండలోని చారిత్రక వేయిస్తంభాల గుడిలో మంగళవారం మాసశివరాత్రిని పురస్కరించుకొని రుద్రేశ్వరీ, రుద్రేశ్వరుల కల్యాణం వైభవంగా జరిగింది. ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన వేదికపై అందంగా అలంకరించిన రుద్రేశ్వరీ, రుద్రేశ్వరుల ఉత్సవమూర్తులను ప్రతిష్ఠించారు. మాంగళ్య ధారణ, అక్షతారోహణ, తలంబ్రాలు, లఘూష్టికాలు, చూర్ణికా మంత్రంతో బ్రహ్మ ముడులు, పుష్పార్చనలు, నీరాజన మంత్ర పుష్పాలు, వైదిక కార్యక్రమాలను టీటీడీ, వేద పాఠశాల అధ్యాపకుడు కోమాళ్లపెల్లి సంపత్ కుమార్ శర్మ శాస్త్రోక్తంగా నిర్వహించారు. ప్రముఖ శివభక్తుడు గుజ్జా సంపత్‌రావు, సౌమ్య దంపతులు సౌజన్యంతో ఈ కల్యాణోత్సవం జరిగింది. అనంతరం నిర్వహించిన నందివాహన సేవలో వేలాది మంది భక్తులు పాల్గొన్నారు.

గట్లకానిపర్తికి చెందిన సుమారు 50మంది భజనమండలి సభ్యులు భక్తి గీతాలను ఆలపించారు. కోలాటాలు నిర్వహించారు. ఆలయ ఈవో డి.అనిల్ కుమార్ ఉత్సవ ఏర్పాట్లను పర్యవేక్షించారు. అంతకు ముందు ఉదయం ఉత్తిష్ఠ గణపతి ఆరాధన, రుద్రేశ్వరుడికి ఏకాదశ రుద్రాభిషేకం నిర్వహించారు. కాగా, బుధవారం అమావాస్య సందర్భంగా రుద్రేశ్వరుడికి ప్రత్యేక రుద్రాభిషేకాలు, కార్తీకమాసం పరిసమాప్తి సందర్భంగా సాయంత్రం వేళ ఆలయ ఆవరణలోని ప్రాచీన కోనేరులో దీపాలు వదిలిపెడతామని ప్రధాన అర్చకుడు ఉపేంద్రశర్మ తెలిపారు.

భక్తిశ్రద్ధలతో మహా పడిపూజ

వేయి స్తంభాల ఆలయం నుంచి చౌరస్తా వరకు యాత్ర

హనుమకొండ చౌరస్తా, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): శ్రీ అన్నపూర్ణ అయ్యప్ప సేవా సమితి ఆధ్వర్యంలో హరిహర సుతుడైన శ్రీ అయ్యప్ప స్వామి మహా పడి పూజ హనుమకొండ చౌరస్తాలో అత్యంత వైభవంగా నేత్రపర్వంగా జరిగింది. మంగళవారం వేద పండితుల మంత్రోచ్ఛరణతో అయ్యప్పస్వామికి అభిషేకం చేయడానికి వేయిస్తంభాల ఆలయం వద్ద సిద్ధం చేసిన 1008 కళశాలను అయ్యప్ప మాలధారులు తమ వెంట తీసుకొని హనుమకొండ చౌరస్తాలో ఏర్పాటు చేసిన మహాపడిపూజ వేదిక వరకు పెద్ద ఎత్తున పాదయాత్రగా బయలుదేరారు. అనంతరం ఆరెపల్లి సమీపంలోని అయ్యప్పస్వామి ఆలయ ప్రధాన అర్చకుడు పద్మనాభ గురుస్వామి, శరత్‌శర్మ, కొండ శ్రీనివాస్, రాచర్ల జగన్ గురుస్వాముల ఆధ్వర్యంలో ముందుగా గణపతికి పూజలు నిర్వహించి అనంతరం సుబ్రహ్మణ్యస్వామి, అయ్యప్పస్వామి ఉత్సవ విగ్రహాలకు పంచామృతతాలతో ఘనంగా అభిషేకాలు నిర్వహించారు. అదే విధంగా పదునెట్టాంబడిపూజ, మహా మంగళహారతి నిర్వహించగా మహా పడి పూజలో పాల్గొన్న అయ్యప్ప మాలధారులు భక్తిపారవశ్యంతో మునిగిపోయారు. స్వామియే శరణం అయ్యప్ప.. నామస్మరణతో వందలాది మంది అయ్యప్పస్వామి



పడిపూజలో పాల్గొన్న గురు స్వాములు

మాలధారుల శరణుఘోషతో భక్తిని ఇనుమడింపజేశారు. దీంతో ఆ ప్రదేశం అంత భక్తిపారవశంతో పులకించి పోయింది. గురుస్వాములు స్వామి వారి భక్తి గీతాలను ఆలపించారు. అనంతరం పూజలో పాల్గొన్న అయ్యప్పస్వాములకు భక్తులకు నిర్వాహకులు మహాన్నదానం వితరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో 60వ డివిజన్ కార్పొరేటర్ దాస్యం అభినవ్‌భాస్కర్, గురుస్వాములు గోపాల కృష్ణ, వెంకన్న, దొమ్మటి రవీందర్, బొల్లం అశోక్, విశ్వనాథ్ శ్రీనివాస్, ఆలేటి కరుణాకర్, సుమన్, అరుణ్ తదితరులు పాల్గొన్నారు.

మారుమోగిన అయ్యప్ప శరణు ఘోష

హనుమకొండ (ఆంధ్రజ్యోతి): హనుమకొండలోని చారిత్రక వేయిస్తంబాల గుడి ఆవరణలోని కుడా గార్డెన్ అయ్యప్ప స్వాముల శరణు ఘోషతో మారుమోగిపోయింది. మంగళవారం అయ్యప్పస్వాములు కొండా శ్రీనివాస్, సీహెచ్ శ్రీకాంతస్వామి ఆధ్వర్యంలో పదకొండ వందల ఘటాలకు ప్రత్యేక పూజలను నిర్వహించారు. పదకొండు వందల మంది అయ్యప్ప స్వాములు ఈ పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు. అయ్యప్ప స్వాముల శరణు ఘోషతో, భజనలతో ఆలయ ప్రాంగణం మారుమోగిపోయింది. అయ్యప్ప స్వాములతో గార్డెన్ కిటకిటలాడింది. అనంతరం స్వామియే శరణం అయ్యప్ప.. అంటూ వైభవంగా శోభాయాత్ర నిర్వహించారు. వేయిస్తంభాల గుడి ప్రధాన అర్చకుడు గంగు ఉపేంద్ర శర్మ ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. భక్తులకు ఘటాలను అందజేశారు.

'సౌదీ అరేబియా ప్రమాదం విచారకరం'

హనుమకొండ సిటీ, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): సౌదీ అరేబియాలో జరిగిన రోడ్డు ప్రమాదంపై హనుమకొండ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు, వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి తీవ్ర విచారం వ్యక్తం చేశారు. ఈ మేరకు ఆయన సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ప్రమాద ఘటన హృదయాన్ని కలచి వేసిందన్నారు. మృతుల కుటుంబాలకు భగవంతుడు మనోధైర్యాన్ని కల్పించాలని ప్రార్థిస్తున్నట్లు తెలిపారు. బాధితుల కుటుంబాలకు రాష్ట్ర ప్రభుత్వం అండగా ఉంటుందని పేర్కొన్నారు.

కేయూ గణిత విభాగంలో అభివృద్ధి పనులు

కేయూ క్యాంపస్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): కేయూ క్యాంపస్‌లోని గణితశాస్త్ర విభాగం నేతృత్వంలో నిరుపయోగమైన పాత సామగ్రితో అధ్యాపకులు, విద్యార్థుల సౌకర్యార్థం వాహనాల పార్కింగ్ స్టాండ్, షటిల్ కోర్టు, భోజనశాలను స్వచ్ఛందంగా ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మంగళవారం కేయూ వీసీ, రిజిస్ట్రార్‌లు ప్రొఫెసర్ కె.ప్రతాప్‌రెడ్డి, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ వల్లూరి రామచంద్రంలు రిబ్బన్ కట్ చేసి అభివృద్ధి పనుల ప్రారంభించారు. కేయూ గణితశాస్త్ర విభాగాధిపతి డాక్టర్ ఆర్.భారవీశర్మ ఆధ్వర్యంలో అధ్యాపకులు, బోధనేతర సిబ్బంది స్వచ్ఛందంగా విరాళాలను సేకరించారు. ఆయా విరాళాలు, పాత సామనులను ఉపయోగించి గణిత శాస్త్ర విభాగంలో పనులు చేపట్టడం పట్ల అధికారులు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో పి.మల్లారెడ్డి, బీఎస్ఎల్ సౌజన్య, ఎం.తిరుమలదేవి, సోమయ్య, బి.వెంకట్రామిరెడ్డి, వై.వెంకయ్య, శోభన్‌కుమార్ విద్యార్థులు పాల్గొన్నారు.

ఓవరాల్ చాంపియన్‌గా తిమ్మాపూర్ ఎంజేపీ గురుకులం

హసన్‌పర్తి, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ 65వ డివిజన్ పరిధి ఎల్లాపూర్ శివారు బావుపేట క్రాస్‌రోడ్‌లోని తిమ్మాపూర్ జ్యోతిబా పూలే బాలికల పాఠశాల, కళాశాల విద్యాలయం విద్యార్థినులు ఉమ్మడి వరంగల్ జిల్లా స్థాయి బాలికల క్రీడా పోటీల్లో ఓవరాల్ చాంపియన్‌షిప్ సాధించినట్లు ప్రిన్సిపాల్ శోభారాణి తెలిపారు. ఈ సందర్భంగా పోటీల్లో ప్రతిభ కనబర్చి విజయం సాధించిన విద్యార్థినులను ఆర్‌సీవో రాజ్‌కుమార్, ప్రిన్సిపాల్ శోభారాణి, ఉపాధ్యాయులు అభినందించారు.

మెట్టుగుట్టపై మహా రుద్ర హోమం

మడికొండ, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): మడికొండలోని మెట్టుగుట్టపై కార్తీక మాసోత్సవాల్లో భాగంగా మంగళవారం మాస శివరాత్రిని పురస్కరించుకొని మెట్టు రామలింగేశ్వర స్వామికి మహా రుద్రాభిషేకం నిర్వహించారు. అనంతరం యాగశాలలో గణపతి, నవగ్రహ పరివార దేవతా హోమములు, రుద్రహోమం, దుర్గాహోమం, మహా పూర్ణాహుతి నిర్వహించారు. అనంతరం స్వామివారికి అన్నపూజ చేసి పార్వతి పరమేశ్వరుల



హోమం చేస్తున్న పూజారులు, భక్తులు

శాంతి కల్యాణ మహోత్సవం నిర్వహించారు. ఆలయ ఈవోలు ఆర్.సునిత, ఎస్. సత్యనారాయణ ఆధ్వర్యంలో జరిగిన పూజలలో అర్చకులు రాగిచేడు అభిలాష్ శర్మ, విష్ణువర్ధనాచార్యులు, పారుపెల్లి సత్యనారాయణ శర్మ, ఆలయ సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

రాంనగర్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ మరమ్మతుల దృష్ట్యా నగరంలోని పలు ప్రాంతాల్లో నేడు విద్యుత్ సరపరాకు అంతరాయం ఉంటుందని హనుమకొండ టౌన్ డీఈ జి.సాంబరెడ్డి తెలిపారు. బాలసముద్రం సబ్‌స్టేషన్ పరిధిలోని న్యూబస్టాండ్ ఏరియాలో ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు, భీష్మనగర్, కాళోజీ కళాక్షేత్రం ఏరియా, అడ్వకేట్ కాలనీ, భవానినగర్, వికాస్‌నగర్ ఏరియాలో ఉదయం 9.30 నుంచి 11.30 వరకు విద్యుత్ సరపరా జరగదని డీఈ తెలిపారు.

'ది హార్ట్ ఆఫ్ నాలెడ్జ్'పై వ్యాసరచన పోటీలు

హనుమకొండ టౌన్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): జాతీయ గ్రంథాలయ 58వ వారోత్సవాల్లో భాగంగా 5వ రోజును పురస్కరించుకొని మంగళవారం 'లైబ్రరీస్ ది హార్ట్ ఆఫ్ నాలెడ్జ్'పై వ్యాస రచన పోటీలు నిర్వహించినట్లు గ్రంథాలయ సంస్థ కార్యదర్శి కె.శశిజాదేవి తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మహ్మద్ అజీజ్‌ఖాన్ హాజరై పాల్గొని వారోత్సవాల గురించి విద్యార్థులతో మాట్లా డారు. అనంతరం పుస్తకాలు, పఠన సంస్కృతి, గ్రంథాలయాల అంశంపై చిత్రలేఖన పోటీలు నిర్వహించారు. గ్రంథాలయ పాఠకులకు పోటీ పరీక్ష లపై క్విజ్ పోటీలు నిర్వహించినట్లు తెలిపారు. సాయంత్రం 4గంట లకు పోస్టర్స్ స్లోగన్ రైటింగ్ నిర్వహించినట్లు కార్యదర్శి కె.శశిజాదేవి పేర్కొన్నా రు. కార్యక్రమంలో లైబ్రేరియన్ మల్సూర్, పురుషోత్తం రాజు, సీనియర్ అసిస్టెంట్ ఎస్. నిఖిల్, జూనియర్ అసిస్టెంట్ పి.సంతోష్‌కుమార్, రికార్డు అసిస్టెంట్లు మమత, ఇంటర్నెట్ నిర్వాహకుడు రాజేష్ పాల్గొన్నారు.

బీసీ రిజర్వేషన్ల బిల్లును పార్లమెంట్‌లో ప్రస్తావించాలి

ఎంపీ కావ్యకు వినతిపత్రం అందజేత

వడ్డెపల్లి, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): బీసీ రిజర్వేషన్ల బిల్లుపై పార్లమెంట్‌లో ప్రస్తావించాలని బీసీ జేఏసీ ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షుడు వడ్లకొండ వేణుగోపాల్ గౌడ్ కోరారు. ఈ మేరకు మంగళవారం హనుమకొండ వడ్డెపల్లి రోడ్డులోని కనకదుర్గా కాలనీలో గల వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్యను క్యాంపు కార్యాలయంలో కలిసి వినతిపత్రాన్ని బీసీ జేఏసీ నేతలు అందజేశారు. ఈ సందర్భంగా వేణుగోపాల్ మాట్లాడుతూ.. బీసీ రిజర్వేషన్ల బిల్లు ఆమోదించేందుకు పార్లమెంటును స్తంభింపచేయాలని అన్నారు. బీసీ రిజర్వేషన్లను రాజ్యాంగ సవరణ ద్వారా 9వ షెడ్యూల్‌లో చేర్పించి, చట్టబద్ధత కల్పించేలా డిసెంబరు 1నుంచి ప్రారంభమయ్యే పార్లమెంటు సమావేశాలను కాంగ్రెస్ అధినేత రాహుల్ గాంధీ, ఇండియా కూటమిలోని 243 మంది పార్లమెంటు సభ్యులతో సభను స్తంభింప చేసి బిల్లు అమలయ్యే విధంగా చూడాలని కోరారు. బీసీ రిజర్వేషన్లకు చట్టబద్ధత కల్పించేలా కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి పెంచేందుకు సీఎం రేవంత్‌రెడ్డి అఖిల పక్షంతో ఢిల్లీకి వెళ్లి ప్రధాని నరేంద్రమోదీతో పాటు రాష్ట్రపతిని కలవాలని కోరారు. ఎంపీని కలిసిన వారిలో టీపీసీసీ ప్రధాన కార్యదర్శి, బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఈవీ శ్రీనివాసరావు, బీసీ జేఏసీ ఉమ్మడి వరంగల్ జిల్లా నాయకులు దాడి మల్లయ్య యాదవ్, బొనగాని యాదగిరి గౌడ్, తమ్మల శోభారాణి, డాక్టర్ చిర్ర రాజు, అరేగంటి నాగరాజు, వేముల మహేందర్, డ్యాగల శ్రీనివాస్, తడక సుమన్ గౌడ్, కాసగాని అశోక్ గౌడ్, పంజాల మధు, కోల ప్రతాప్, పెరుమాండ్ల అనిల్, శంకర్, తుపాకుల రవి, కడారి సురేష్ తదితరులు ఉన్నారు.



వరంగల్ ఎంపీ కడియం కావ్యకు వినతిపత్రం అందజేస్తున్న బీసీ జేఏసీ నాయకులు

'అతివేగంతోనే రోడ్డు ప్రమాదాలు'

హనుమకొండ, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): అత్యధిక రోడ్డు ప్రమాదాలు, అతి వేగం, మద్యం సేవించి వాహనాలు నడపడం వల్ల జరుగుతున్నాయని డిప్యూటీ ట్రాన్స్‌పోర్టు కమిషనర్ జి.సురేష్‌రెడ్డి అన్నారు. హనుమకొండలోని అశోకా హోటల్‌లో మంగళవారం రోడ్డు భద్రత, వివిధ చట్టాల అమలు, వినియోగదారుల హక్కులపై సదస్సు జరిగింది. ఈ సెమినార్‌కు డీటీసీ జి.సురేష్ రెడ్డి, లీగల్ మెట్రాలజీ అధికారి ఎస్.రాజేశ్వర్, మున్సిపల్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ జి.మాధవి హాజరయ్యారు. దక్షిణాది రాష్ట్రాల వినియోగదారుల సమన్వయ సమితి ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశంలో జాతీయ ప్రధాన కార్యదర్శి సాంబరాజు చక్రపాణి అధ్యక్షత వహించగా, సమన్వయ కర్తలుగా దక్షిణాది రాష్ట్రాల ప్రధాన కార్యదర్శి బూరుగుపల్లి సుదర్శన, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బూరుగుపల్లి శ్రవణ్ కుమార్ వ్యవహరించారు.

'హక్కులపై అవగాహన ఉండాలి'

వడ్డెపల్లి, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు హక్కులపై అవగాహన కలిగి ఉండాలని చైల్డ్ వెల్ఫేర్ కమిటీ (సీడబ్ల్యూసీ) మెంబర్ కె. దామోదర్ అన్నారు. హనుమకొండ వడ్డెపల్లిలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో బాలల దినోత్సవాల్లో భాగంగా మంగళవారం ఒయాసిస్ చారిటబుల్ ట్రస్టు ఫౌండర్ ఒద్దిరాజు చంద్రప్రకాష్ ఆధ్వర్యంలో విద్యార్థులకు హక్కులపై అవగాహన సదస్సును నిర్వహించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం కె.రవికుమార్, డాక్టర్ మాలిక, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రమాదేవి, ఏహెచ్‌టీవో శ్రీనివాస్, అంగన్‌వాడీ టీచర్లు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వాహనదారులకు జరిమానా

వరంగల్ క్రైం, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించిన 34 మందిని మంగళవారం కోర్టులో హాజరుపరచగా న్యాయమూర్తి ఎ.వేణుగోపాల్ 33 మందికి జరిమానా విధించగా ఒకరికి జైలు శిక్ష విధిస్తూ తీర్పు ఇచ్చినట్లు హనుమకొండ ట్రాఫిక్ సీఐ సీతారెడ్డి తెలిపారు. 33 మందిలో 26 మందికి డ్రంకెన్ డ్రైవ్‌లో రూ.30,300 జరిమానా విధించగా, లైసెన్స్ లేని కారణంగా ఏడుగురికి రూ.4,900 జరిమానా విధించడం జరిగిందన్నారు.

కల్పలత సూపర్ బజార్‌కు అవార్డు

కలెక్టర్ స్నేహ శబరీష్ చేతుల మీదుగా పురస్కారం

హనుమకొండ, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): సహకార స్ఫూర్తికి అనుగుణంగా సమర్థవంతమైన ప్రణాళికతో లాభాల బాటలో నడుస్తున్న కల్పలత సూపర్‌బజార్ కో-ఆపరేటివ్ స్టోర్‌కు ఉత్తమ సహకార సంస్థ పురస్కారం లభించింది. మంగళవారం హనుమకొండ సుబేదారిలోని జిల్లా కేంద్ర సహకార బ్యాంక్ (డీసీసీబీ) ఆవరణలో జరిగిన 75వ సహకార వారోత్సవాల్లో భాగంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ చేతుల మీదుగా కల్పలత సూపర్ బజార్ అధ్యక్షుడు వర్ధమాన్ జనార్ధన్ ఈ పురస్కారాన్ని అందుకున్నారు. జిల్లా వ్యాప్తంగా ఎంపిక చేసిన పదకొండు ఉత్తమ సహకార సంస్థల్లో కల్పలత సూపర్ బజార్ ఒకటి. ఈ కార్యక్రమంలో డీసీసీబీ చైర్మన్ మార్నేని రవీందర్‌రావు, జిల్లా సహకారాధికారి సంజీవరెడ్డి, డీఆర్‌డీవో మేన శ్రీను, కల్పలత సూపర్ బజార్ ఉపాధ్యక్షుడు షఫీ, డైరెక్టర్లు ప్రభాకర్ రెడ్డి, స్వర్ణలత, స్నేహలత, మేనేజింగ్ డైరెక్టర్ కోదండరాములు తదితరులు పాల్గొన్నారు. 8 ఏళ్లుగా కల్పలత సూపర్ బజార్ అభివృద్ధి బాటలో నడుస్తోంది. ఈ సహకార స్టోర్ ఆధ్వర్యంలో పనిచేస్తున్న పెట్రోల్ బంక్‌తో పాటు బుక్‌స్టోర్ ద్వారా 25 మందికి ప్రస్తుతం ఉపాధి లభిస్తోంది. ఈ సందర్భంగా కల్పలత సూపర్‌బజార్ అధ్యక్షుడు జనార్దన్ మాట్లాడుతూ.. భవిష్యత్తులో కల్పలత సూపర్ బజార్‌ను మరింత అభివృద్ధి చేస్తామన్నారు.



కలెక్టర్ స్నేహ శబరీష్ నుంచి జ్ఞాపిక అందుకుంటున్న జనార్దన్

షైన్‌లో ఉన్నతి సక్సెస్‌ఫుల్ సుప్రెమసి



విద్యార్థులతో షైన్ విద్యాసంస్థల చైర్మన్ మూగల కుమార్, టీచర్లు

బాలసముద్రం, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): హనుమకొండ బాలసముద్రంలోని షైన్ హైస్కూల్‌లో 'ఐవిల్ టీచ్ మై లెస్సన్' అంటూ నర్సరీ నుంచి 5వ తరగతి వరకు గల విద్యార్థులు ఉన్నతి సక్సెస్ ఫుల్ సుప్రెమసీ అనే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పిల్లలు వారిలోని సృజనాత్మకతను చక్కగా ప్రదర్శించారు. వివిధ వేషధారణలతో విద్యార్థులు ఆకట్టుకున్నారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా షైన్ పాఠశాలల చైర్మన్ మూగల కుమార్ యాదవ్ హాజరుకాగా, డైరెక్టర్ రమ, ప్రిన్సిపాల్స్ సబిత, ప్రగతిరెడ్డి, విశాల్, రాజ్‌కుమార్, రాజు, పులి శ్రీనివాస్, మానస ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

చట్టబద్ధమైన రిజర్వేషన్లు కల్పించాలి

బాలసముద్రం, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించిన తర్వాతనే ఎన్నికలకు వెళ్తామని హామీ ఇచ్చిన కాంగ్రెస్ పార్టీ ప్రస్తుతం పాత రిజర్వేషన్ల ప్రకారమే గ్రామ పంచాయతీ ఎన్నికలకు వెళ్లాలని, రాష్ట్ర కేబినెట్ నిర్ణయం తీసుకోవడంతో బీసీలకు అన్యాయం జరుగుతుందని బీసీ జాక్ రాష్ట్ర చైర్మన్ డాక్టర్ తిరునహరి శేషు అన్నారు. కేబినెట్ తీసుకున్న నిర్ణయానికి వ్యతిరేకంగా బీసీ సంక్షేమ సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు బుట్టి శ్యామ్ యాదవ్ ఆధ్వర్యంలో కాళోజీ విగ్రహం వద్ద నిరసన తెలిపిన శేషు మాట్లాడారు. చట్టబద్ధమైన రిజర్వేషన్ ఇవ్వకుండా కాంగ్రెస్ పార్టీ పరంగా రిజర్వేషన్లు ఇవ్వడమంటే బీసీలను మరోసారి మోసం చేయడమేనని అభిప్రాయపడ్డారు. బీసీ ఐక్య సంఘర్షణ సమితి జాతీయ ప్రధా న కార్యదర్శి ఏదునూరి రాజమౌళి మాట్లాడుతూ.. బీసీలకు చట్టబద్ధంగా 42 శాతం రిజర్వేషన్లు ఇవ్వలేనప్పుడు జనాభా దామా షా ప్రకారంగా 56 శాతం రిజర్వేషన్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. నిరసన కార్యక్రమంలో బీసీ జాక్ జిల్లా కన్వీనర్ దారబోయిన సతీష్, డాక్టర్ విజయలక్ష్మి, బీసీ నాయకురాలు పద్మజాదేవి, చిన్నాల యశ్వంత్ యాదవ్, కేడల ప్రసాద్, కృష్ణ కుమార్, సుధాకర్, గుండు రాజు, తిరుపతి, రాజు యాదవ్, ఆకుల విజయ, శివ, హైమావతి, రాము, గురునాథ్ తదితరులు పాల్గొన్నారు.



కాళోజీ సెంటర్‌లో నిరసన తెలుపుతున్న బీసీ జాక్ సభ్యులు

ఆంధ్రజ్యోతి
నవ్య
కుటుంబ కదంబం
బుధవారం
19 నవంబరు 2025









చలికి చెక్ పెట్టే శాలువా

చలి చంపడం మొదలుపెట్టేసింది. అలాగని స్వెటర్ వేసుకుందామంటే అది అన్ని డ్రస్సులకూ అనువుగా ఉండదు. అలాంటప్పుడు చుడీదార్ మీద చున్నీకి బదులుగా హాయిగొలిపే శాలువాను వాడుకోవచ్చు. చలికాలం అక్కరకొచ్చే వెచ్చని కశ్మీర్ శాలువాలు, వాటిలోని వెరైటీస్ ఇవే.

శాలువా అనగానే ఎవరికైనా కశ్మీర్ శాలువాలు గుర్తుకొస్తాయి. వెచ్చదనంతో పాటు ఆకర్షణను కూడా తెచ్చిపెట్టే శాలువాలు నేటి తరం అమ్మాయిలకు ఎంతో బాగా నప్పుతాయి. సుతిమెత్తగా, సౌకర్యంగా ఉండే కశ్మీరు శాలువాలు పలు రకాల ఎంబ్రాయిడరీల్లో, పలురకాల పనితనాలతో తయారవుతూ ఉంటాయి.

జర్దోజి: జర్దోజి అనే పర్షియా పదానికి, బంగారాన్ని కుట్టడమని అర్థం. ఈ పనితనంలో బంగారం, వెండి దారాలను ఉపయోగిస్తారు. ప్రారంభంలో రాజ కుటుంబాలకే పరిమితమైన ఈ పనితనం క్రమేపీ శాలువాలు, చీరలకూ విస్తరించింది. పూలు, పక్షులు, జామెట్రీ డిజైన్లలో రూపొందే ఈ తరహా శాలువాలు, సంక్లిష్టమైన పనితనానికి అద్దం పడుతూ ఉంటాయి.

క్రివెల్: ఊలుతో విభిన్నమైన డిజైన్లను రూపొందించే ప్రక్రియ ఇది. జానపద కళారూపాల నుంచి ప్రేరణ పొందిన ఈ శైలిలో తయారైన ఎంబ్రాయిడరీలో పూలు, పక్షులు, జంతువులు కనిపిస్తూ ఉంటాయి. అలాగే దీన్లో భిన్నమైన కుట్లను కూడా ఉపయోగిస్తారు. శాటిన్ స్టిచ్, స్టెమ్ స్టిచ్, ఫ్రెంచ్ నాట్ వీటిలో అత్యంత ప్రత్యేకమైనవి.

కషిద: పట్టు దారంతో త్రీడి డిజైన్లతో కూడిన కషిద పనితనంలో ప్రకృతి ప్రతిబింబిస్తూ ఉంటుంది. ఆకులు, పూలు, పండ్లు కషిద ఎంబ్రాయిడరీలో కనిపిస్తూ ఉంటాయి. ఉబ్బెత్తుగా కనిపించే ఈ తరహా ఎంబ్రాయిడరీ కోసం ఎంతో సమయం వెచ్చిస్తారు కాబట్టి కషిద శాలువాల ధర కూడా కాస్త ఎక్కువగానే ఉంటుంది.

తెల్లని దంతాల కోసం

పోషకాహార లోపం, సరైన పద్ధతిలో శుభ్రం చేసుకోకపోవడం లాంటి కారణాల వల్ల కొంతమందిలో దంతాలు పసుపురంగులోకి మారతాయి. కొన్ని చిట్కాలు పాటించి దంతాలను తెల్లగా మెరిపించుకోవచ్చని నిపుణులు చెబుతున్నారు.

- చిన్న గిన్నెలో ఒక చెంచా అల్లం పేస్టు, అర చెంచా నిమ్మరసం, పావు చెంచా ఉప్పు వేసి బాగా కలపాలి. ఈ మిశ్రమాన్ని టూత్‌బ్రష్‌తో అద్ది దానితో దంతాలపై వృత్తాకారంలో మెల్లగా తోమి, గోరువెచ్చని నీటితో పుక్కిలించాలి. ఇలా వారానికి రెండుసార్లు చేస్తూ ఉంటే క్రమంగా దంతాలపై పసుపుదనం తొలగిపోతుంది.
- తరచూ జామ, యాపిల్, స్ట్రాబెర్రీ, రేగు, నారింజ, బత్తాయి, ద్రాక్ష లాంటి పండ్లను తినడం వల్ల వాటిలోని పోషకాలు లాలాజలంతో కలిసి దంతాలను తెల్లగా మారుస్తాయి.
- అప్పుడప్పుడు నిమ్మ, నారింజ, అరటిపండు తొక్కలతో తోముతూ ఉంటే వాటిలోని సిట్రిక్ యాసిడ్, డి-లిమోనినే సమ్మేళనాలు కలిసి దంతాలను తెల్లగా మెరిపిస్తాయి.
- బొప్పాయిలోని పపైన్, అనాసలోని బ్రోమలైన్ ఎంజైమ్‌లు దంతాల పసుపుదనాన్ని తగ్గిస్తాయి. తరచూ ఈ పండ్లు తినడంతోపాటు ఈ ఎంజైమ్స్ ఉన్న టూత్‌పేస్టును ఉపయోగిస్తే మంచి ఫలితం కనిపిస్తుంది.



- కాఫీ, టీ, రెడ్‌వైన్ లాంటివి తాగినప్పుడు అలాగే బీట్‌రూట్, బ్లూ బెర్రీ లాంటి పండ్లు తిన్నప్పుడు కొద్దిసేపటి తరువాతనైనా దంతాలను శుభ్రం చేసుకోవడం మంచిది.
- వారానికి ఒకసారి దంతాలను యాక్టివేటెడ్ చార్‌కోల్‌తో తోముకున్నా ప్రయోజనం ఉంటుంది.
- ఒక గిన్నెలో రెండు చెంచాల బేకింగ్ సోడా, ఒక చెంచా హైడ్రోజన్ పెరాక్సైడ్ వేసి తగినన్ని నీళ్లు చిలకరించుకుంటూ పేస్టులా చేయాలి. ఈ పేస్టుతో తోముకుంటే వెంటనే దంతాల పసుపుదనం మాయమవుతుంది.
- యాపిల్ సైడర్ వెనిగర్ లేదా కొబ్బరినూనెలో చూపుడు వేలును ముంచి దానితో పళ్లను రుద్దితే సమస్య తీరుతుంది.

సంకల్పం

ఆసక్తిగా.. ఆలోచనాత్మకంగా

కొంతమంది విద్యార్థులు అన్నింట్లో అల్లుకుపోతారు. కానీ సైన్స్ అనగానే భయపడతారు. అలాంటి పిల్లలను గుర్తించి... వారిలో బెరుకు పోగొడుతున్నారు సరయూ గార్గ్. ఐఏఎస్ అధికారి అయిన తన భర్తతో కలిసి... సైన్స్‌ను ఒక పాఠ్యాంశంలా కాకుండా... ఆడుతూ పాడుతూ చదివేలా బోధిస్తున్నారు. చిన్నారులను ప్రయోగాల బాట పట్టించి... వారిలో ఆసక్తిని రేకెత్తించి ఆలోచన పెంచుతున్న సరయూ కథ ఇది.



"ఒక చిన్న అడుగు... ఎంతోమంది విద్యార్థుల భవితవ్యానికి బలమైన పునాదులు వేసింది. సైన్స్ అంటే అదేదో బ్రహ్మ పదార్థంలాగా భావించి దూరం పెట్టే వారి ఆలోచనా ధోరణిని మార్చేసింది. అందుకు నేను, మావారు అభిజీత్ కారణమైనందుకు ఆనందంగా ఉంది. మా ఇద్దరి నేపథ్యాలు వేరైనా మేం పుట్టి పెరిగింది చండీగఢ్‌లోనే. నేను 'పంజాబ్ టెక్నికల్ యూనివర్సిటీ'లో కంప్యూటర్ సైన్స్‌లో ఇంజనీరింగ్ చదివాను. 2018లో మొహాలీ 'ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ సైన్స్ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్' నుంచి వాతావరణ శాస్త్రంలో పీహెచ్‌డీ చేశాను. మెకానికల్ ఇంజనీరింగ్ చదివిన అభిజీత్ 2015లో సివిల్స్‌కు ఎంపికయ్యారు. ప్రస్తుతం పంజాబ్ రాష్ట్రం ముక్తసర్ డిప్యూటీ కమిషనర్‌గా ఉన్నారు. రాష్ట్ర గనుల శాఖ డైరెక్టర్‌గా అదనపు బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. ఆయనకున్న ఒకే ఒక్క, అతిముఖ్యమైన అభిరుచి... పుస్తకాలు చదవడం. అంతేకాదు... ఎక్కడ పని చేసినా కొంత సమయాన్ని విద్యార్థులతో గడుపుతుంటారు. పాఠశాలలను సందర్శించినప్పుడు తనతో పాటు నేను కూడా వెళుతుండేదాన్ని.



అక్కడ మొదలైంది...

ముక్తసర్ రావడానికి ముందు అభిజీత్ ఫాజిల్కా అదనపు కమిషనర్‌గా పని చేశారు. ఆ సమయంలో కొన్ని ప్రభుత్వ పాఠశాలలకు వెళ్లారు. విద్యార్థులతో మాట్లాడారు. అప్పుడు తను గమనించింది ఏంటంటే... చాలామంది సైన్స్ అంటే భయపడుతున్నారని. దాని వల్ల క్రమంగా వారికి ఆ సబ్జెక్ట్‌పై ఆసక్తి తగ్గిపోతోందని. టీచర్లను అడిగితే... మార్కుల రేసులో బట్టీ పట్టించడంవల్ల వారు పాఠ్యాంశాలు అర్థం చేసుకోలేకపోతున్నారని చెప్పారు. పైతరగతుల్లో సైన్స్ అత్యంత కీలకమైన పాఠ్యాంశం. అందులో వెనకబడితే అది వారి భవిష్యత్తుపై ప్రభావం చూపుతుంది. ఇదే మా ఆందోళన. దీనికి సరైన పరిష్కారం కనుగొనాలని అనుకున్నాం.

పాఠంలా కాకుండా...

మొదటి ప్రయత్నంగా నేను, మావారు స్థానిక ప్రభుత్వ పాఠశాలలు అన్నీ తిరిగాం. అక్కడి సైన్స్ ల్యాబ్‌లు పరిశీలించాం. టీచర్లతో మాట్లాడాం. పిల్లలు ఆ సబ్జెక్ట్‌ను అంత దూరం పెట్టడానికి కారణాలను తెలుసుకున్నాం. వారిని ఆవహించిన భయాన్ని పోగొట్టి, సైన్స్‌పై తిరిగి ఆసక్తి కలిగించాలని అనుకున్నాం. దాన్ని ఒక పాఠంలా కాకుండా... సరదాగా సాగిపోయే ఒక కథలా బోధిస్తే మంచి ఫలితాలు ఉంటాయని అనిపించింది. పాఠ్య పుస్తకాల్లో చూసినప్పుడు కొత్త అంశం ఏదైనా కాస్త క్లిష్టంగానే అనిపిస్తుంది. ముఖ్యంగా సైన్స్, మ్యాథమెటిక్స్ విషయంలో చాలామంది విద్యార్థులు కంగారుపడుతుంటారు. అలాంటివారిలో ఆసక్తిని రేకెత్తించి, ఆలోచన పెంచేలా బోధిస్తే మంచి ఫలితాలు వస్తాయి. మేం చేసింది అదే. చండీగఢ్‌లో 'క్యూరియస్ ప్లే ల్యాబ్స్' నెలకొల్పాం. దాని ద్వారా పిల్లలకు పాఠ్యాంశాలను ఒక సిలబస్‌లా కాకుండా ల్యాబ్‌ల్లో ప్రయోగాలతో వివరించి చెప్పాం. ఆ ప్రయోగాల్లో వారిని భాగస్వాములను చేశాం. అది విద్యార్థుల్లో ఎనలేని ఉత్సాహం నింపింది. కొత్త విషయాలు తెలుసుకోవాలన్న ఉత్సుకత పెరిగింది.

మార్పు రావాలి...

దాదాపు నాలుగేళ్ల కిందట ప్రారంభించిన 'క్యూరియస్ ప్లే ల్యాబ్స్'కు వచ్చేవారి సంఖ్య రోజురోజుకూ పెరుగుతూ వచ్చింది. దీంతో ఒకప్పుడు ఇంటికే పరిమితమైన నేను... ల్యాబ్ కోసం పూర్తి సమయాన్ని కేటాయించాను. దాన్ని ఒక రిజిస్టర్ సంస్థగా మార్చాను. ఇక్కడ కేవలం పాఠ్యాంశాల బోధనే కాదు, మానసికంగానూ విద్యార్థులను దృఢంగా తీర్చిదిద్దడంలోనూ శ్రద్ధ పెట్టాం. ఎంతటి క్లిష్టమైన సబ్జెక్ట్ అయినా అర్థం చేసుకొనేలా వారిలో ఆలోచనాశక్తిని, తద్వారా ఆత్మవిశ్వాసాన్ని పెంచుతున్నాం. ఒక్కసారి పిల్లల్లో పాతుకుపోయిన భయం పోగొడితే... విద్యాభ్యాసం ఆటలాగా ఉల్లాసంగా సాగిపోతుందనేది మా నమ్మకం. ఆ దిశగా విద్యావిధానంలో మార్పు తేవడానికి మేం కృషి చేస్తున్నాం.

ఆటలూ ముఖ్యమే...

విచ్చలవిడిగా కార్పొరేటు బడులు వచ్చాక పిల్లలు ఆటలకు దూరమైపోతున్నారు. విద్యతోపాటు క్రీడలు కూడా వారికి ఎంతో ముఖ్యం. అందుకే అభిజీత్ ప్రస్తుతం ముక్తసర్ జిల్లాలో విద్యార్థులను క్రీడల్లో కూడా ప్రోత్సహిస్తున్నారు. 'చాలామంది పిల్లలు ఆటల్లో అద్భుత ప్రతిభ కనబరుస్తున్నారు. సరైన సదుపాయాలు కల్పిస్తే వారు మెరికల్లా తయారవుతారు' అంటారు అభిజీత్. అలాంటివారిని ఒకచోటకు చేర్చి, మెరుగైన శిక్షణ ఇప్పిస్తున్నారు. ప్రభుత్వం, వివిధ సంస్థల సహకారంతో సుమారు ముప్పై లక్షల నిధులు సమీకరించి టేబుల్ టెన్నిస్, క్రికెట్, వాలీ బాల్, బ్యాడ్మింటన్ తదితర క్రీడల కోసం ఆటస్థలాలు ఆధునీకరించారు. స్విమ్మింగ్‌పూల్స్ ఏర్పాటు చేశారు. పేద విద్యార్థులకు ఆట సామగ్రి అందిస్తున్నారు. అంతేకాదు... మేం ఇద్దరు పేద పిల్లలను దత్తత తీసుకున్నాం. వారికి విద్యతోపాటు కావల్సినవన్నీ సమకూరుస్తున్నాం. ఏదిఏమైనా మేం కోరుకున్న మార్పు దిశగా విద్యార్థులు అడుగులు వేస్తున్నందుకు ఎంతో సంతృప్తిగా ఉంది."

రాత్రిపూట ఈ పండ్లు తినాలి

పలు కారణాల వల్ల పగటిపూట పండ్లు తినడం వీలు కాని వారు రాత్రిపూట తినవచ్చని నిపుణులు చెబుతున్నారు. రాత్రి సమయంలో ఏ పండ్లు తినాలో తెలుసుకుందాం...

- రాత్రి భోజనం తరువాత కివి పండ్లు తింటే ఒత్తిడి, ఆందోళన తగ్గుతాయి. శరీరంలో సెరటోనిన్ ఉత్పత్తి పెరిగి చక్కగా నిద్ర పడుతుంది. కివి పండ్లలో ఉండే పీచు పదార్థాలు జీర్ణక్రియను వేగవంతం చేసి మలబద్ధకం రాకుండా కాపాడతాయి.
- చెర్రీ పండ్లు తినడం వల్ల శరీరంలో మెలటోనిన్ ఉత్పత్తి అవుతుంది. దీంతో వెంటనే నిద్ర ముంచుకొస్తుంది. చెర్రీలలో యాంటీ ఆక్సిడెంట్లు అధికంగా ఉంటాయి. ఇవి శరీరంలో రోగనిరోధక వ్యవస్థను మెరుగుపరుస్తాయి. చలికాలంలో తరచూ వచ్చే జలుబు, దగ్గు, తలనొప్పి లాంటి సమస్యలు తగ్గుతాయి.
- అరటి పండ్లను కూడా రాత్రిపూట తినవచ్చు. అరటి పండ్లలో అధికంగా ఉండే మెగ్నీషియం, పొటాషియం లాంటి మినరల్స్ శరీరంలో రక్తప్రసరణ సజావుగా జరిగేలా చేస్తాయి. నిద్రలో కండరాలు పట్టేయకుండా, బీపీ పెరగకుండా కాపాడతాయి. రోజూ రాత్రిపూట అరటిపండు తినడం వల్ల గుండె జబ్బులు రావు.



- బ్లూ బెర్రీ, రాస్ బెర్రీలు తినడం వల్ల మనసు ప్రశాంతంగా మారుతుంది. నిద్రలేమితో బాధపడేవారికి ఇవి ఔషధంలా పనిచేస్తాయి. కేన్సర్ రాకుండా కాపాడతాయి.
- రాత్రి భోజనంలో అవకాడో చేర్చుకోవడం వల్ల అతిగా తినాలనే కోరిక తగ్గుతుంది. దీంతో శరీర బరువు నియంత్రణలో ఉంటుంది.
- పుచ్చకాయలు, తర్బూజా పండ్లను కూడా రాత్రి సమయంలో తినవచ్చు. వీటిలోని పోషకాలు జీవక్రియలను వేగవంతం చేస్తాయి. శరీరంలోని ద్రవాలు సమతుల్యంగా ఉండేలా చూస్తాయి.

పసుపులో కల్తీని గుర్తించేదెలా?

రోజూ వంటకాల్లో పసుపును ఉపయోగిస్తూ ఉంటాం. పసుపులో సి, బి6, కె విటమిన్లతోపాటు కర్క్యుమిన్ సమ్మేళనం, ప్రొటీన్, పీచుపదార్థాలు, ఇతర పోషకాలు ఉంటాయి. ఇవి ఎన్నో ఆరోగ్య సమస్యలను నివారిస్తాయి. అదే కల్తీ పసుపును వినియోగిస్తే ఆరోగ్యం పాడవుతుంది. కల్తీ పసుపును ఎలా గుర్తించాలో తెలుసుకుందాం...

- ఒక గ్లాసు నీటిలో పసుపు పొడి వేసి బాగా కలపాలి. గ్లాసులో పసుపు అడుగుకు చేరి నీళ్ల లేత పసుపు రంగులోకి మారితే దాన్ని స్వచ్ఛమైన పసుపుగా పరిగణించవచ్చు. పసుపు నీటి మీద తేలుతూ ఉన్నా, నీళ్లు పూర్తిగా ముదురు పసుపు రంగులోకి మారినా అది కల్తీ పసుపుగా నిర్ధారించుకోవాలి.
- నిజమైన పసుపును అరచేతిలో వేసి రుద్దితే అది చర్మంలోకి ఇంకడాన్ని చూడవచ్చు. అలాగే అరచేతిలో పసుపు మరక ఏర్పడుతుంది. దీన్ని నీటితో కడిగినా రెండు రోజుల వరకూ పోదు. అదే కల్తీ పసుపును తాకితే పొడిలా చేతికి తగులుతుంది.
- స్వచ్ఛమైన పసుపును నీళ్లతో కలిపి ముద్దలా చేసి పట్టిస్తే ముఖంపై పసుపు రంగు అంటదు. ముఖంపై పచ్చని మరకలు ఏర్పడితే ఆ పసుపులో రంగు కలిపారన్ని తెలుసుకోవచ్చు.
- నిజమైన పసుపుకు ఘాటైన వాసన ఉంటుంది. కల్తీ పసుపుకు వాసన ఉండదు.
- చిన్న గిన్నెలో ఒక చెంచా పసుపు, రెండు చెంచాల వెనిగర్ వేసి బాగా కలపాలి. పసుపు రంగు మారకపోతే అందులో కల్తీ లేదని గుర్తించాలి. అదే ఎరుపు లేదా గులాబీ రంగులోకి మారితే ఏదైనా పిండి లేదా పొడి కలిపినట్లు తెలుసుకోవాలి.





- బియ్యప్పిండి లేదా జొన్న పిండిని నీళ్లతో కలిపి పేస్టులా చేసి పసుపు కొమ్ములకు పట్టిస్తుంటారు. కాబట్టి పసుపు కొమ్ములను కొనేముందు వాటిపై ఏదైనా పూత ఉందేమో పరిశీలించాలి.
- పసుపు పొడి లేదా పసుపు కొమ్ములు ప్రకాశవంతంగా కనిపించవు. అలా కనిపిస్తే అవి కల్తీవని తెలుసుకోవాలి.

మూడు భాషల్లో రాసేశారు

"కష్టసాధ్యమైన కార్యాన్ని ఎంచుకున్నాను. కానీ 'నన్ను బలపరిచే క్రీస్తుద్వారా నేను సమస్తమును చేయగలను' అనే బైబిల్‌లోని వాక్యం నన్ను ముందుకు నడిపించింది" అంటున్నారు బయ్యు శాంతకుమారి. విశ్రాంత ఉపాధ్యాయిని అయిన ఆమె బైబిల్‌ను మూడు భాషల్లో... 8,843 పేజీలను చేతితో రాశారు. ఆ విశేషాలు 73 ఏళ్ల శాంతకుమారి మాటల్లోనే.



"బైబిల్‌ను పవిత్ర దినాల్లో చేతితో రాయడం కొత్త విషయం కాదు. సాధారణంగా ఏదైనా చెడు వ్యసనాన్ని దూరం చేసుకోవడానికి, ఏదైనా కోరుకున్న పనిని సాధించుకోవడానికి అలా చేస్తూ ఉంటారు. అయితే అలా రాసే వాటిలో పూర్తయ్యేవి చాలా తక్కువ. అలాంటి మూడు భాషల్లో బైబిల్‌ను చేత్తో రాయగలిగానంటే... అదంతా దేవుని సంకల్పమేనని భావిస్తున్నాను. నేను చదువుకుంటున్న రోజుల్లో చక్కటి చేతిరాతకు చాలా ప్రాధాన్యత ఉండేది. రాజమండ్రిలోని షాడే గర్ల్స్ హైస్కూల్‌లో చదువుతున్నప్పుడు... కృప, రుడా, రామకృష్ణ టీచర్లు నాకు అందమైన చేతిరాతను నేర్పారు. అందులో బహుమతులు కూడా తీసుకున్నాను.

బైబిల్ లాంటి పవిత్ర గ్రంథాలను చేతితో రాయడం మాటల్లో చెప్పినంత సులభం కాదు. అక్షరం పొల్లు పోకుండా, ఎక్కడా తప్పు రాకుండా చూసుకోవాలి. మూడు భాషల్లో చిన్న పొరపాటు కూడా రాకుండా రాయగలిగానంటే... అందులో నా గొప్పతనం ఏమీ లేదు. ఆ ప్రభువే నాతో ఈ పని చేయించుకున్నాడు. తెలుగు బైబిల్‌ను 2016 అక్టోబర్ 17 నుంచి 2018 అక్టోబర్ 17 వరకూ, ఇంగ్లీషు బైబిల్‌ను 2019 ఫిబ్రవరి 16 నుంచి 2020 నవంబర్ 3 వరకూ, హిందీలో 2023 ఏప్రిల్ 23 నుంచి 2024 జూలై 28 వరకూ రాశాను. తెలుగులో 2,414, ఇంగ్లీషులో 3,435, హిందీలో 2,994 పేజీలు రాశాను. పాత నిబంధన గ్రంథంలోని 39, కొత్త నిబంధన గ్రంథంలోని 27 అధ్యాయాలను... మూడు భాషల్లో 8,843 పేజీల్లో పూర్తి చేశాను. రోజూ ఇంటి బాధ్యతలు ముగించి, మధ్యాహ్నం రెండు గంటల నుంచి సాయంత్రం ఆరు గంటలవరకూ ఏకధాటిగా రాసేదాన్ని.



ఇంటర్మీడియెట్ చదివేటప్పుడు... పాఠ్య పుస్తకాలకు కొరతగా ఉండేది. అప్పుడు సెకెండియర్ ఫిజిక్స్ పాఠ్య పుస్తకం మొత్తం చేత్తో రాసుకున్నాను. దాన్ని చూసి లెక్చరర్లు ఆశ్చర్యపోయారు. తోటి విద్యార్థులతో చప్పట్లు కొట్టించి నన్ను అభినందించారు.

సమయం సద్వినియోగం చేస్తూ...

ఎంఏ పూర్తి చేసిన తరువాత... 1983లో కొత్తపేట సమితిలోని కొమరాజు లంక ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయురాలుగా ఉద్యోగ జీవితాన్ని ప్రారంభించాను. వాడవాడలా తిరిగి పిల్లలను బడిలో చేర్పించేదాన్ని. నా నిబద్ధతను గుర్తించిన అధికారులు... బొమ్మూరులోని ఎర్రకొండ ప్రాంతంలో పాఠశాల ఏర్పాటు చేసి, దాని బాధ్యతలు నాకు అప్పగించారు. 2006లో రాష్ట్ర స్థాయిలో, 2008లో జాతీయ స్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయురాలిగా పురస్కారాలు అందుకున్నాను. 2010లో పదవీవిరమణ చేశాను. ఖాళీగా గడపడం నాకు ఇష్టం ఉండదు. పొద్దున్నే అయిదు గంటలకు లేస్తాను. ఇంట్లో పనులన్నీ నేనే చేస్తాను. తీరిక దొరికితే న్యూస్ పేపర్లు, మ్యాగజైన్లు చదువుతాను. వాటిలో వచ్చే ఆరోగ్య చిట్కాలు, వంటలు, స్ఫూర్తిదాయక కథనాలను కట్ చేసి... పుస్తకాలుగా రూపొందిస్తాను. వాటిని ఆసక్తి కలిగినవారికి, విద్యార్థులకు ఇస్తూ ఉంటాను. సమయాన్ని సద్వినియోగం చేసుకోవడం అంటే... ఖాళీ సమయాన్ని కూడా ఉత్తమంగా వినియోగించుకోవడం అని నా అభిప్రాయం. నా భర్త జోసెఫ్ రాజు (జోషి) పేపర్ మిల్లులో కార్మిక నాయకుడిగా ఎన్నో విజయాలు సాధించారు. ఇప్పటికీ కార్మికులు ఆయనకు కష్టసుఖాలు చెప్పుకుంటారు. మా అబ్బాయి రిషి... అమెరికాలో సాఫ్ట్‌వేర్ రంగంలో పని చేస్తున్నాడు. మా అమ్మాయి ఎంఏ పూర్తిచేసి, మా దంపతులకు చేదోడుగా ఉంటోంది.

ఆ బాధ దైవానికే చెప్పుకున్నాను...

బైబిల్‌ను చేత్తో రాయాలన్న ఆలోచన ఎలా వచ్చిందంటే... నా తమ్ముడు సుధీర్‌కుమార్ ఏదో కార్యం నిమిత్తం తెలుగులో బైబిల్‌ను రాస్తూ ఉంటే చూశాను. అది నన్ను ఎంతో ఆకర్షించింది. నేను కూడా రాయాలనే ఆలోచనతో... ముందు తెలుగులో మొదలుపెట్టి పూర్తి చేశాను. తరువాత ఇంగ్లీష్, హిందీ భాషల్లో ఉన్న బైబిల్ గ్రంథాలను చూసి, చేత్తో రాశాను. దీనికి సరైన పెన్నులు ఉండడం చాలా ముఖ్యం. లేకపోతే రాత సరిగ్గా సాగదు. నాకు లావుగా రాసే పెన్నులు ఇష్టం. దానికోసం మా అమ్మాయి ఎన్నో దుకాణాలు తిరిగినా ప్రయోజనం లేకపోయింది. అయితే మా అబ్బాయి అమెరికా నుంచి పంపిన పెన్నుల్లో ఒకటి సరిపడింది. ఆ తరువాత తను అక్కడినుంచే పెన్నులు పంపేవాడు. నాకు తెలుసు... నేను చాలా పెద్ద పని తలపెట్టానని. దాన్ని ఎంతో నిష్ఠగా కొనసాగించాను. పండగలు వచ్చినా, వేడుకలు జరిగినా, ఆరోగ్యం బాగోలేకపోయినా, ఆఖరికి బంధువులతో మా ఇల్లు నిండిపోయినా... ఈ యజ్ఞాన్ని ఎన్నడూ ఆపలేదు. అయితే హిందీలో బైబిల్ రాస్తున్న సమయంలో... నా మోకాళ్ల సమస్య తీవ్రమయింది. 'ఇక రాయలేకపోతానేమో?' అని భయపడ్డాను. నా బాధను ఆ దైవానికే చెప్పుకున్నాను. ఆయన కృపతో... మూడు భాషల్లో చేతిరాతతో బైబిల్ లేఖనం పూర్తి చేశాను. దీనితో నా జీవితం ధన్యమయిందని అనుకుంటున్నాను."

- **రమేశ్ నాగేంద్ర పలస,** రాజమండ్రి

ఫర్టిలిటీ కేంద్రాలపై కొరడా

» 2 కేంద్రాలు మూసివేత.. పది కేంద్రాల్లో సేవల నిలిపివేత

హైదరాబాద్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): నిబంధనలకు విరుద్ధంగా నిర్వహిస్తున్న సంతాన సాఫల్య కేంద్రాలపై రాష్ట్ర వైద్య ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ కొరడా ఝళిపించారు. 12 కేంద్రాలపై కమిషనర్ డాక్టర్ సంగీతా సత్యనారాయణ చర్యలు తీసుకున్నారు. రెండు కేంద్రాలను శాశ్వతంగా మూసివేయించారు. మరో 10 కేంద్రాల్లో కొద్దిరోజుల పాటు సేవలు నిలిపివేయాలని ఆదేశాలు జారీ చేశారు. ఇటీవల రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 381 ఫర్టిలిటీ కేంద్రాలపై వైద్య ఆరోగ్యశాఖ తనిఖీలు చేసింది. వాటిలో నిబంధనలు పాటించని 50కు పైగా కేంద్రాలకు షోకాజ్ నోటీసులు జారీ చేసింది. 15 రోజుల్లో వివరణ ఇవ్వాలని కోరింది. వివరణపై సంతృప్తి చెందని కేంద్రాలపై వైద్య ఆరోగ్యశాఖ కమిషనర్ చర్యలకు ఉపక్రమించింది.

ముగ్గురు వ్యవసాయ అధికారుల సస్పెన్షన్

శాయంపేట, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): హనుమకొండ జిల్లా శాయంపేట మండలంలో గత రబీ సీజన్‌లో నిర్వహించిన ధాన్యం కొనుగోలు కేంద్రాలలో జరిగిన అక్రమాలపై రాష్ట్ర వ్యవసాయ శాఖ కఠిన చర్యలు తీసుకుంది. శాయంపేట, కాట్రపల్లి గ్రామాల్లోని ఐకేపీ కేంద్రాల్లో రూ.కోట్లలో అక్రమాలు జరిగినట్లు తేలడంతో ముగ్గురు వ్యవసాయ అధికారులపై వేటు వేసింది. అప్పటి మండల వ్యవసాయ అధికారి గంగాజమున, శాయంపేట క్లస్టర్ ఏఈవో అర్చన, నేరేడుపల్లి క్లస్టర్ ఏఈవో సుప్రియలను సస్పెండ్ చేస్తూ రాష్ట్ర వ్యవసాయశాఖ డైరెక్టర్ గోపి ఇటీవల ఉత్తర్వులు జారీ చేశారు. ఈ ఉత్తర్వులను మంగళవారం వారికి అందజేశారు. రెండు సెంటర్లలో ధాన్యం లేకుండానే ఉన్నట్లుగా నకిలీ ట్రక్ షీట్లు రాసి, ఆన్‌లైన్ ఎంట్రీలు చేశారు. అంతేకాక, నకిలీ రైతులను సృష్టించి రూ.కోట్లలో నిధులను స్వాహా చేశారు. సివిల్ సప్లై, విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారుల తనిఖీల్లో ఈ అక్రమాలు బయటపడ్డాయి.

10 కోట్ల విలువైన సీఎంఆర్ ధాన్యం దారి మళ్లింపు

» సంగారెడ్డి జిల్లాలోని రైసు మిల్లుల్లో విజిలెన్స్ సోదాలు

హైదరాబాద్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): సంగారెడ్డి జిల్లాలోని రెండు రైసు మిల్లుల్లో గతేడాది ఖరీఫ్, రబీ సీజన్‌కు సంబంధించి రూ. 10.26 కోట్ల విలువైన సీఎంఆర్ ధాన్యాన్ని దారి మళ్లించినట్లు విజిలెన్స్ అధికారులు గుర్తించారు. కడ్పల్ గ్రామంలోని స్మార్ట్ ఫుడ్ ఇండస్ట్రీస్‌లో సోమవారం విజిలెన్స్ అధికారులు జరిపిన తనిఖీల్లో రూ. 9.47 కోట్ల విలువైన సీఎంఆర్ ధాన్యం నిల్వలు తక్కువగా ఉన్నట్లు తేలింది. అలాగే మార్డి గ్రామంలోని వెంకటేశ్వర ఆగ్రో ఇండస్ట్రీస్‌లో జరిపిన తనిఖీల్లోనూ రూ. 76.86 లక్షల సీఎంఆర్ తక్కువగా ఉందనే విషయం బయటపడింది.

లోన్ యాప్ వేధింపులతో యువకుడి ఆత్మహత్య



నవీన్‌రెడ్డి (ఫైల్)

హసన్‌పర్తి, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): లోన్ యాప్ వేధింపులు భరించలేక మంగళవారం ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన వడ్డేపల్లి-దేవన్నపేట శివారులో చోటు చేసుకుంది. ఎస్సై నవీన్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. హనుమకొండ టీవీ టవర్ కాలనీలో తల్లితో కలిసి నివాసముంటున్న గోలి నవీన్‌రెడ్డి(27).. డెకరేషన్ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. అయితే, జల్సాలకు అలవాటు పడి చైనాకు చెందిన ఓ లోన్ యాప్ ద్వారా డబ్బులు అప్పు తీసుకున్నాడు. తిరిగి చెల్లించాలని లోన్ యాప్ నిర్వాహకులు రోజూ వేధించేవారు. ఆ అప్పు చెల్లించేందుకు తిరిగి స్నేహితుల వద్ద కూడా అప్పు చేశాడు. ఈ క్రమంలో యాప్ నిర్వాహకులు అతడి ఫోటోలను మార్ఫింగ్ చేసి వాట్సాప్‌లో పోస్టు చేశారు. దీంతో మనస్తాపానికి గురైన నవీన్‌రెడ్డి మంగళవారం వ్యవసాయ బావిలో దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు.. నవీన్ మృతదేహాన్ని పోస్టుమార్టానికి తరలించారు.

తుమ్మలను వదులుకోవడం.. కేసీఆర్ తప్పే

» ఆ ప్రభావం వల్లే బీఆర్ఎస్ ఓటమి

» పార్టీ పెడితే.. వజ్రాయుధం లాంటి పార్టీ పెడతా

» బీఆర్ఎస్‌కు నన్ను దూరం చేసిన వారిపై మాట్లాడి తీరుతా

» అందరి కృషితోనే ఖమ్మం జిల్లా అభివృద్ధి

» ఖమ్మంలో జాగృతి అధ్యక్షురాలు కవిత



ఖమ్మం, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి) : గత అసెంబ్లీ ఎన్నికల ముందు తుమ్మల నాగేశ్వరరావు వంటి సీనియర్ నేతను వదులుకొని కేసీఆర్ తప్పు చేశారని, అది రాష్ట్ర వ్యాప్తంగా ప్రభావం చూపడం వల్లే బీఆర్ఎస్ ఓటమి పాలైందని తెలంగాణ జాగృతి వ్యవస్థాపక అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత పేర్కొన్నారు. కేసీఆర్ వంటి రాజకీయ అనుభవజ్ఞులే తప్పులు చేశారని, క్షేత్రస్థాయిలో తాను అలాంటివి చేయకూడదన్న లక్ష్యంతోనే ప్రజల్లోకి వెళ్తున్నానన్నారు. హడావుడిగా పార్టీ ఏర్పాటు చేసే ఆలోచన లేదని, తొలుత రాష్ట్ర వ్యాప్తంగా పర్యటించి ప్రజా సమస్యలపై కమ్యూనిస్టు పార్టీలతో కలిసి పోరాటం సాగిస్తానని వెల్లడించారు. పార్టీ పెట్టాలనుకుంటే ప్రజల కోసం వజ్రాయుధం లాంటి పార్టీ పెడతానని వ్యాఖ్యానించారు. కాంగ్రెస్‌పై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత ఉన్నా.. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో ఆ పార్టీ గెలిచిందని, ఇది ప్రతిపక్షాల వైఫల్యమేనని అన్నారు. 'జాగృతి జనం బాట'లో భాగంగా రెండో రోజు మంగళవారం ఖమ్మం, పాలేరు నియోజకవర్గాల్లో ఆమె పర్యటించారు. ఖమ్మంలో విలేకరులతో మాట్లాడారు. జాగృతి జనం బాట ప్రారంభించిన తర్వాత తనపై నీచ స్థాయిలో దాడి చేస్తున్నారని, అయినా బెదిరేది లేదన్నారు. గతంలో తిహార్ జైలులో ఆరు నెలలున్నా తాను కుంగిపోలేదని, ఇప్పటికీ ధైర్యంగా ప్రజా సమస్యలపై పోరాడతున్నానని గుర్తు చేశారు. తెలంగాణ ఆడబిడ్డలు రాజకీయాల్లోకి ధైర్యంగా రావాలన్న ఆకాంక్షతో వారి బరువును భుజానకెత్తుకున్నానని తెలిపారు. రాజకీయ నేపథ్యంలేని యువత, మహిళలకు జాగృతి అవకాశం ఇవ్వబోతోందని తెలిపారు. తనపై కుట్ర చేసి పార్టీకి, కుటుంబానికి కొందరు దూరం చేశారని, అలాంటి వారిపై కచ్చితంగా మాట్లాడి తీరుతానని స్పష్టం చేశారు. ఆధారాల్లేకుండా మాట్లాడే వ్యక్తిని కాదని, అన్ని ఆధారాలతోనే మాట్లాడతానని స్పష్టం చేశారు. సొంత బిడ్డనైన తననే పార్టీ నుంచి బయటకు పంపారని, పార్టీలో ఉన్న చాలా మంది తమ పరిస్థితి ఏమిటో అని ప్రశ్నించుకుంటున్నారన్నారు. బీఆర్ఎస్‌లో ఉన్నప్పుడు తాను కనీసం ఒక్క టీచర్‌ను కూడా ట్రాన్స్‌ఫర్ చేయించుకోలేకపోయానని చెప్పారు. అందరి కృషి వల్లే ఖమ్మం జిల్లా అభివృద్ధి చెందిందని, మంత్రులు ఎవరికి వారు తమ పాత్ర పోషిస్తున్నారని పేర్కొన్నారు. తెలంగాణలో కవిత, ఆంధ్రాలో షర్మిల, బిహార్‌లో రోహిణి.. ఇలా ఆడబిడ్డలు సొంత పార్టీలపై తిరుగుబాటు చేయడానికి కారణామేంటని విలేకరులు ప్రశ్నించగా.. ఆడబిడ్డలను రాజకీయంగా వాడుకుని వదిలేయడం, వారి ఆత్మాభిమానం దెబ్బ తీయడమే కారణమని సమాధానమిచ్చారు.

2019 నాటి గ్రూప్-2 ఫలితాలు రద్దు

పార్ట్-బీ ట్యాంపరింగ్ చేసిన వారి ఎంపిక తప్పు.. మళ్లీ పేపర్లు దిద్ది ఫలితాలను ప్రకటించండి:హైకోర్టు

హైదరాబాద్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ హయాం నాటి 2015 గ్రూప్-2 నోటిఫికేషన్ పరీక్ష ఫలితాలను ఫలితాలను కొట్టేస్తూ హైకోర్టు సంచలన నిర్ణయం తీసుకుంది. ఓఎంఆర్ షీట్‌లో సమాధానాలు గుర్తించే కీలక భాగమైన పార్ట్-బీలో ట్యాంపరింగ్ చేసిన వారినీ ఉద్యోగాలకు ఎంపిక చేయడాన్ని హైకోర్టు తప్పుబట్టింది. పార్ట్-బీలో వైట్‌నర్, ఎరేజర్ వాడి ఓఎంఆర్ షీట్‌ను దిద్దిన వారిని అనర్హులుగా ప్రకటించాలని సాంకేతిక కమిటీ చాలా స్పష్టంగా చెప్పినప్పటికీ కీలక విషయాన్ని పట్టించుకోకుండా ట్యాపరింగ్ చేసిన వారి సమాధాన పత్రాలను సైతం టీజీపీఎస్సీ పరిగణనలోకి ఎలా తీసుకుంటుందని ప్రశ్నించింది. ఈ విషయం నోటిఫికేషన్‌లో సైతం స్పష్టంగా ఉందని గుర్తు చేసింది. ఈ మేరకు 2015లో జారీచేసిన గ్రూప్-2 నోటిఫికేషన్‌కు సంబంధించి 2019లో విడుదల చేసిన ఫలితాలను కొట్టేసింది. ట్యాంపరింగ్‌కు పాల్పడిన వారిని అనర్హులుగా ప్రకటించి, సమాధాన పత్రాలను పునర్ మూల్యాంకనం చేయాలని ఆదేశించింది. ఎంపిక ప్రక్రియను 8 వారాల్లో పూర్తిచేసి, అర్హులైన అభ్యర్థులకు నియామక పత్రాలు జారీ చేయాలని టీజీపీఎస్సీకి ఆదేశాలు జారీ చేసింది. సమాధాన పత్రాలను మూల్యాంకనం చేసే క్రమంలో నోటిఫికేషన్‌లో పేర్కొన్న నిబంధనలను అమలు చేయడంలో పారదర్శకత పాటించాలని స్పష్టం చేసింది.

1032 పోస్టులు

2015లో గ్రూప్ 2 నోటిఫికేషన్ నెంబర్ 20ని టీఎస్‌పీఎస్సీ జారీచేసింది. దీనికి అనుబంధంగా 2016లో సప్లిమెంటరీ నోటిఫికేషన్ నెంబర్ 17ను సైతం జారీ చేశారు. మొత్తంమీద 1032 పోస్టులకు దరఖాస్తులను ఆహ్వానించారు. పరీక్షల నిర్వహణ సందర్భంగా ప్రశ్నపత్రం బుక్‌లెట్ నెంబర్ విషయంలో గందరగోళం ఏర్పడటం వల్ల బుక్‌లెట్ నెంబర్ ఉండే పార్ట్-ఎలో తప్పులు జరిగాయి. ఈ సమస్యలను పరిష్కరించడానికి టీఎస్‌పీఎస్సీ ఒక సాంకేతిక కమిటీని ఏర్పాటు చేసింది. ఓఎంఆర్ షీట్‌లో బుక్‌లెట్ నెంబర్ ఉండే పార్ట్-ఎ, అభ్యర్థి వివరాలు ఉండే పార్ట్-సిలో చిన్న చిన్న తప్పులు జరిగినా పర్వాలేదని, సమాధానాలు గుర్తించే భాగమైన పార్ట్-బిలో మాత్రం ఏ మాత్రం దిద్దుబాట్లు, వైట్‌నర్, ఎరేజర్, బ్లేడ్ వాడి ట్యాపరింగ్ చేసినా సదరు అభ్యర్థులను అనర్హులుగా ప్రకటించాలని సాంకేతిక కమిటీ సిఫార్సు చేసింది. హైకోర్టు డివిజన్ బెంచ్ సైతం సాంకేతిక కమిటీ సిఫార్సులను సమర్థించింది. రెండింటినీ పట్టించుకోకుండా ట్యాంపరింగ్‌కు పాల్పడిన అభ్యర్థుల పేపర్లను సైతం టీజీపీఎస్సీ పరిగణనలోకి తీసుకుని ఫలితాలు ప్రకటించింది. దీన్ని సవాల్ చేస్తూ 2019లో పలువురు అభ్యర్థులు వేర్వేరుగా ఆరు పిటిషన్‌లు వేశారు. జస్టిస్ నగేశ్ భీమపాక ధర్మాసనం విచారణ చేపట్టింది. పిటిషనర్‌ల తరపున సీనియర్ న్యాయవాది ఎల్ రవిచందర్, న్యాయవాది చిక్కుడు ప్రభాకర్ వాదించారు. పార్ట్-ఎ, పార్ట్-బిలో జరిగిన తప్పులను క్షమించవచ్చు గానీ సమాధానాలను ట్యాపరింగ్ చేసిన అభ్యర్థులను ఎంపిక చేయడం అక్రమాలను సమర్థించినట్లేనని ఆరోపించారు. టీజీపీఎస్సీ తరఫు న్యాయవాది వాదిస్తూ, ఆటోమేటిక్ స్కానర్లను ఉపయోగించి మూల్యాకనం చేపట్టామని, ఇందులో మానవ జోక్యం లేదని తెలిపారు. ఫలితాలను కొట్టేస్తే ఇప్పటికే నియామకమై ఉద్యోగాలు చేస్తున్న వారిపై తీవ్ర ప్రభావం ఉంటుందని చెప్పారు. పార్ట్-బీలో ట్యాపరింగ్‌కు పాల్పడిన అభ్యర్థులను అనర్హులుగా ప్రకటించాలని ఇదే హైకోర్టు డివిజన్‌బెంచ్ స్పష్టంగా పేర్కొందని ధర్మాసనం గుర్తు చేసింది. ఉద్యోగాల భర్తీలో పారదర్శకత ముఖ్యమని, హైకోర్టు డివిజన్ బెంచ్ తీర్పును, సాంకేతిక కమిటీ సిఫార్సును అమలు చేయలేదని స్పష్టంచేసింది. 2019 ఫలితాలను కొట్టేస్తూ తుది తీర్పు వెలువరించింది. పునర్ మూల్యాకనం చేపట్టి, అర్హులైన వారికి 8 వారాల్లో నియామక పత్రాలు అందజేయాలని స్పష్టం చేసింది.

గ్రూప్-1 అప్పీలుపై విచారణ వచ్చే నెల 22కు వాయిదా

గ్రూప్-1పై టీజీపీఎస్సీ దాఖలు చేసిన అప్పీలుపై విచారణను హైకోర్టు డివిజన్ బెంచ్ డిసెంబర్ 22కు వాయిదా వేసింది. వాదనలు వినిపించేందుకు సమయం కావాలని అభ్యర్థులు, తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్(టీజీపీఎస్సీ) తరపు న్యాయవాదులు కోరడంతో అందుకు ధర్మాసనం అంగీకారం తెలిపింది. అప్పటి వరకు సింగిల్ జడ్జి తీర్పు నిలిపివేత ఉత్తర్వులను పొడిగించింది. గ్రూప్-1 ఫలితాలను సింగిల్ జడ్జి కొట్టేయడాన్ని సవాలు చేస్తూ టీజీపీఎస్సీ దాఖలు చేసిన అప్పీలుపై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అపరేశ్‌కుమార్ సింగ్, జస్టిస్ మొహియుద్దీన్‌ల ధర్మాసనం మంగళవారం విచారణ జరిపింది. అప్పీలులోని ఇతర అంశాలపై వాదనలు వినిపించేందుకు గడువు పెంచాలని, వరుసగా రెండు మూడు రోజులు సమయం ఇవ్వాలని ఇరుపక్షాల న్యాయవాదులు కోరారు. వీలైనంత త్వరగా విచారణ ముగించాల్సి ఉందని చెబుతూ తదుపరి విచారణను వచ్చే నెల 22కు వాయిదా వేసింది. ఇకపై ఎవరూ వాయిదా కోరవద్దని స్పష్టం చేసింది.

ఉండేదెవరో.. ఊడేదెవరో?

» హైకోర్టు తీర్పుతో నాటి ఉద్యోగుల్లో గుబులు

» 300పైగా ఉద్యోగులకు ఉద్వాసన తప్పదా?

హైదరాబాద్, నవంబరు 18(ఆంధ్రజ్యోతి):గత ప్రభుత్వ హయాంలో ఎంపికైన గ్రూప్-2ఉద్యోగులకు హైకోర్టు షాకిచ్చింది. అప్పట్లో జరిగిన అవకతవకలపై మంగళవారం ఇచ్చిన తీర్పుతో.. ఇప్పటికే ఉద్యోగులు చేస్తున్న వారిలో కొందరు తమ కొలువులు కోల్పోయే పరిస్థితి ఏర్పడింది. కేసీఆర్ నేతృత్వంలోని గత బీఆర్ఎస్ ప్రభుత్వం 2015లో గ్రూప్-2 నోటిఫికేషన్ జారీచేసింది. 1032 మందితో తుది జాబితాను 2019 డిసెంబరులో ప్రకటించింది. వీరంతా 2020 జనవరిలో వివిధ ప్రభుత్వ శాఖల్లో గ్రూప్-2 ఉద్యోగులుగా చేరారు. అయితే సమాధానపత్రాల్లో చేరిపేసేందుకు అభ్యర్థులు వైట్‌నర్ వాడారని అప్పట్లో ఆరోపణలు వెల్లువెత్తాయి. అయితే పార్ట్-ఏలోని పరీక్షలో అభ్యర్థి వివరాలు సమాధాన పత్రం పార్ట్-బీలోని వివరాలతో సరిపోలేదు. దీంతో పార్ట్-ఏ, పార్ట్-బీ వివరాలు భిన్నంగా ఉంటే వైట్‌నర్ వాడేందుకు అప్పట్లో టీజీపీఎస్సీ అధికారులు అనుమతించారు. ఇక్కడే అనేక పొరపాట్లు జరిగాయి. పార్ట్-బీలోనూ వైట్‌నర్ వాడినట్టు కొందరు కోర్టును ఆశ్రయించారు. అయితే వైట్‌నర్ వాడిన అందరి సమాధానపత్రాలను పరిగణనలోకి తీసుకుంటామని అప్పట్లో టీజీపీఎస్సీ ఛైర్మన్‌గా ఉన్న ఘంటా చక్రపాణి ప్రకటించారు. తప్పు జరిగిందని తెలిసినా పరీక్షలు రద్దుచేసి మళ్లీ నిర్వహించాల్సి ఉండగా.. తప్పులను కప్పిపుచ్చుకునేందుకు ఘంటా చక్రపాణి ప్రయత్నించారని అనేకమంది అభ్యర్థులు కోర్టును ఆశ్రయించారు. ఇదే అంశంపై మంగళవారం కోర్టు తీర్పు వెలువరించింది. పార్ట్-బీలో వైట్‌నర్ వాడిన వారి సమాధాన పత్రాలను మళ్లీ మూల్యాంకనం చేయాలని, వారిని అనర్హులుగా ప్రకటించాలని ఆదేశించింది. కోర్టు తీర్పు నేపథ్యంలో 1032మంది సమాధానపత్రాలను మళ్లీ మూల్యాంకనం చేయాలని టీజీపీఎస్సీ నిర్ణయించినట్టు తెలిసింది. ఇందులో పార్ట్-బీ సమాధాన పత్రాల్లో వైట్‌నర్ వాడిన వారిని గుర్తిస్తారు. దాదాపు 300 మంది ఉద్యోగులపై దీని ప్రభావం ఉంటుందని తెలుస్తోంది. హైకోర్టు తీర్పును అధ్యయనం చేస్తున్న టీజీపీఎస్సీ రెండు రోజుల్లో తన నిర్ణయాన్ని ప్రకటించనుంది.

చిత్రజ్యోతి

★ SINCE 1965 ★



అద్భుతంగా ఉంటుంది

అల్లరి నరేశ్

'నేను ఇప్పటిదాకా 64 సినిమాలు చేశా. అయినా, ప్రతీ చిత్రం విడుదలకు ముందు టెన్షన్ ఉంటుంది. అలాంటిది మొదటి సినిమా అయినా దర్శకుడు నాని కాసరగడ్డ చాలా కూల్‌గా ఉండడం ఆశ్చర్యం. ఈ కథపై మాకు పూర్తి నమ్మకం ఉంది. సినిమా అద్భుతంగా ఉండబోతోంది' అని అల్లరి నరేశ్ అన్నారు. ఆయన కథానాయకుడిగా నటించిన చిత్రం '12 ఏ రైల్వే కాలనీ'. శ్రీనివాస సిల్వర్‌స్క్రీన్ బేనర్‌పై శ్రీనివాస చిట్టూరి నిర్మించారు. ఈ నెల 21న చిత్రం విడుదలవుతోన్న సందర్భంగా నిర్వహించిన ప్రీ రిలీజ్ వేడుకలో ఆయన మాట్లాడుతూ 'థియేటర్లలో ప్రేక్షకులను థ్రిల్‌కు గురిచేసే చిత్రమిది. అందరినీ మెప్పిస్తుంది' అని చెప్పారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన దర్శకుడు హరీశ్ శంకర్ మాట్లాడుతూ 'ఈ సినిమా పొలిమేరలు దాటి డబుల్ ధమాకా సౌండ్ ఇవ్వాలని కోరుకుంటున్నాను' అని తెలిపారు. 'ఈ సినిమా చూశాక మంచి ఫీలింగ్‌తో థియేటర్ల నుంచి బయటకు వస్తారు' అని నాని కాసరగడ్డ పేర్కొన్నారు.

ఉస్తాద్ నుంచి పాట అప్పుడే

ఇదే ఈవెంట్‌లో 'ఉస్తాద్ భగత్‌సింగ్' గురించి అప్డేట్ ఇచ్చారు హరీశ్ శంకర్. డిసెంబరులో ఈ సినిమా నుంచి తొలి పాటను విడుదల చేస్తామని చెప్పారు. అలాగే అతి త్వరలోనే సినిమా విడుదల తేదీని కూడా ప్రకటిస్తాం అని చెప్పి పవన్ అభిమానులను ఖుషీ చేశారు. హరీశ్ శంకర్ తెరకెక్కిస్తోన్న ఈ చిత్రంలో పవన్‌కల్యాణ్ శక్తిమంతమైన పోలీస్ అధికారిగా కనిపించనున్న సంగతి తెలిసిందే.

నటనకు వీడ్కోలు పలికిన తులసి



ప్రముఖ నటి తులసి తన నట ప్రస్థానానికి వీడ్కోలు పలికారు. డిసెంబరు 31న షిరిడీ దర్శనానికి వెళ్తున్నానని, ఆ రోజు నుంచే తన రిటైర్‌మెంట్ ఉంటుందని ప్రకటించారు. ఈ మేరకు ఆమె సోషల్ మీడియాలో ఓ పోస్టు పెట్టారు. రిటైర్‌మెంట్ జీవితాన్ని సాయిబాబాకు అంకితం చేస్తున్నట్టు పేర్కొన్నారు. 1967లో తులసి సినీ రంగ ప్రవేశం చేశారు. 1974లో బాలచందర్ దర్శకత్వంలో వచ్చిన తమిళ చిత్రం 'ఆరంగేట్రం'లో బాలనటిగా ఆమెకు మంచి గుర్తింపు వచ్చింది. తెలుగు, తమిళ్, కన్నడ, మలయాళం, భోజ్‌పురి భాషల్లో సుమారు 300 చిత్రాల్లో నటించారు. కన్నడ దర్శకుడు శివమణిని వివాహం చేసుకున్న తర్వాత కొంతకాలం నటనకు విరామం ఇచ్చారు. ఆనంతరం క్యారెక్టర్ ఆర్టిస్టుగా రీ ఎంట్రీ ఇచ్చారు.



బాలకృష్ణ సినిమాలో నయనతార

నందమూరి బాలకృష్ణ కథానాయకుడిగా గోపీచంద్ మలినేని ఓ చిత్రం తెరకెక్కించనున్న సంగతి తెలిసిందే. 'ఎన్‌బీకే 111' అనే వర్కింగ్ టైటిల్‌తో రూపొందనున్న ఈ సినిమా త్వరలోనే ప్రారంభం కానుంది. వృద్ధి సినిమాస్ బేనర్‌పై వెంకట సతీశ్ కిలారు నిర్మిస్తున్నారు. మంగళవారం నయనతార పుట్టినరోజు. ఈ సందర్భంగా ఈ సినిమాలో ఆమె నటిస్తున్నారని ప్రకటించి, శుభాకాంక్షలు తెలిపారు. ఈ మేరకు ఫస్ట్ లుక్ పోస్టర్ విడుదల చేశారు. చారిత్రక కథాంశం నేపథ్యంలో తెరకెక్కనున్న ఈ చిత్రంలో ఆమె రాణి పాత్రను పోషిస్తున్నారు. ఇంతవరకూ పోషించని సరికొత్త అవతార్‌లో బాలకృష్ణ కనిపించనున్నారు. 'సింహా', 'జై సింహా', 'శ్రీరామరాజ్యం' సినిమాల తర్వాత బాలయ్యతో కలసి ఆమె నటిస్తున్న చిత్రమిది.

ఆకట్టుకొనే ఇండియన్ యానిమేషన్ ఫిల్మ్



ఇటీవలి కాలంలో యానిమేషన్ చిత్రాలు ప్రేక్షకులను విపరీతంగా ఆకట్టుకుంటున్నాయి. అయితే చిన్న పిల్లల కోసం ప్రత్యేకంగా ఆ తరహా చిత్రాలు తీయడానికి ముందుకు వస్తున్న వారి సంఖ్య తక్కువే. అది దృష్టిలో పెట్టుకుని పిల్లల్ని, పెద్దల్ని విశేషంగా ఆకట్టుకొనే రీతిలో 'కికీ అండ్ కోకో' పేరుతో ఓ యానిమేషన్ ఫిల్మ్ రూపొందించారు దర్శకుడు పి.నారాయణన్. దీని గురించి ఆయన వివరిస్తూ 'కికీ అనే పెంపుడు జంతువుకీ, కోకో అనే చిన్నారికి మధ్య ఉన్న అపూర్వమైన బంధాన్ని చెప్పే సినిమా ఇది. యానిమేషన్ రంగంలోకి అడుగుపెడుతూ మేం చేసిన తొలి ప్రయత్నం ఇది. కేవలం హాలీవుడ్ వారు మాత్రమే ఇలాంటి చిత్రాలు తీయగలరు అనుకునేవారికి మేం విజువల్‌గా చెప్పే సమాధానం 'కికీ అండ్ కోకో' అన్నారు. క్రియేటివ్ ప్రొడ్యూసర్ జీఎం కార్తికేయన్ మాట్లాడుతూ 'ఇది కేవలం సినిమా మాత్రమే కాదు స్నేహం, ప్రేమ, కథల ద్వారా పిల్లలు నేర్చుకునే విలువైన పాఠాల వేదిక. త్వరలోనే మీ ముందుకు రాబోతోంది' అని చెప్పారు.



నన్నెందుకు టార్గెట్ చేస్తున్నారు?

కయాదు లోహార్

తమిళనాడు మద్యం రీటైలర్ 'టాస్మాక్' కుంభకోణంలో తన పేరు ఉందంటూ వచ్చిన వార్తలు చూసి ఎంతో కలత చెందినట్లు 'రిటర్న్ ఆఫ్ ద డ్రాగన్' ఫేమ్, హీరోయిన్ కయాదు లోహార్ తెలిపారు. ఆ స్కామ్ విషయంలో తన పేరు రావడంపై ఆమె ఓ ఇంటర్వ్యూలో భావోద్వేగానికి గురయ్యారు. 'ఇలాంటి వార్తలు వచ్చినా ఏమీ పట్టనట్లు ముందుకు సాగడం సులువు అని అందరూ భావిస్తారు. కానీ, నాకు రాత్రిళ్లు నిద్ర కూడా పట్టడం లేదు. నాకే ఎందుకిలా జరిగిందో అర్థం కావడం లేదు. కెరీర్‌లో ముందుకు సాగుతున్న క్రమంలో ఇలాంటి ఆరోపణలు రావడం ఎంతో బాధ కలిగిస్తుంది' అని ఆవేదన వ్యక్తం చేశారు. కాగా, టాస్మాక్ కుంభకోణంలో నిందితులను ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) పట్టుకున్నప్పుడు వారు కయాదు లోహార్ పేరుని ప్రస్తావించారని.. వారు నిర్వహించిన నైట్ పార్టీలకి హాజరు కావడం కోసం కయాదు లోహార్ రూ.35 లక్షలు తీసుకున్నారని ప్రచారం జరిగిన సంగతి తెలిసిందే.



హిందీ వాళ్లకు మన దెబ్బేంటో చూపించాం

నందమూరి బాలకృష్ణ

'మన దెబ్బేంటో ముంబైలో హిందీ వాళ్లకు చూపించాం (టైటిల్ సాంగ్‌ని ముంబైలో విడుదల చేయడాన్ని ఉద్దేశించి). ఇంట గెలిచి రచ్చ గెలవాలంటారు. 'అఖండ' తొలి భాగం ఎంత హిట్ అయ్యిందో అందరూ చూసే ఉంటారు. ఇప్పుడు దానికి సీక్వెల్‌గా 'అఖండ 2' పాన్ ఇండియా స్థాయిలో బ్లాక్‌బస్టర్ కాబోతోంది' అని అన్నారు బాలకృష్ణ. ఆయన కథానాయకుడిగా బోయపాటి శ్రీను తెరకెక్కించిన చిత్రం 'అఖండ 2: తాండవం'. తేజస్విని నందమూరి సమర్పణలో 14 రీల్స్ ప్లస్ బేనర్‌పై రామ్ అచంట, గోపీ అచంట నిర్మించారు. డిసెంబరు 5న ప్రపంచవ్యాప్తంగా విడుదలవుతోంది. ఈ సందర్భంగా వైజాగ్‌లో నిర్వహించిన వేడుకలో ఈ చిత్రం నుంచి 'జాజికాయ..' అంటూ సాగే గీతాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా బాలకృష్ణ మాట్లాడుతూ 'ఇది కేవలం సినిమా కాదు. మన భారతీయ సనాతన హైందవ ధర్మం, శక్తి పరాక్రమాన్ని చాటి చెప్పే చిత్రం. మన భారతీయ మూలాలు ఏంటో తెలియజేసే సినిమా. అందుకే అన్ని భాషల్లో సినిమాను ప్రమోట్ చేస్తున్నాం' అని చెప్పారు. చిత్ర దర్శకుడు బోయపాటి శ్రీను మాట్లాడుతూ 'ఇది సినిమాలో ఉన్న ఒకే ఒక్క మాస్ పాట. అనంతపూర్‌లో జరిగే పుట్టిన రోజు వేడుకలో వచ్చే పాట ఇది. సంయుక్త మేనన్ చేసిన తొలి మాస్ సాంగ్ ఇది. నాకు ఊపిరి ఉన్నంత వరకూ, బాలయ్య బాబుకు ఓపిక ఉన్నంత వరకూ మా ఇద్దరి కాంబినేషన్ రిపీట్ అవుతూనే ఉంటుంది' అని అన్నారు.

ఐ బొమ్మ రవిని ఎన్‌కౌంటర్ చేయాలి

నిర్మాత సి. కల్యాణ్



ఐ - బొమ్మ నిర్వాహకుడు ఇమ్మడి రవిని ఎన్‌కౌంటర్ చేయాలంటూ సంచలన వ్యాఖ్యలు చేశారు నిర్మాత సి. కల్యాణ్. రవిని అరెస్ట్ చేసి, పైరసీని అరికట్టడంలో కీలకపాత్ర పోషించిన తెలంగాణ ప్రభుత్వానికి, పోలీసులకు ధన్యవాదాలు తెలిపేందుకు తెలుగు చిత్ర పరిశ్రమ తరపున మంగళవారం ప్రెస్‌మీట్ నిర్వహించారు. ఈ సందర్భంగా సి. కల్యాణ్ మాట్లాడుతూ 'రవి లాంటివాళ్ల వల్ల జనాలు థియేటర్లకు రాకుండా, ఇంట్లో పిల్లా పాపలతో కూర్చొని పకోడి తినుకుంటూ హ్యాపీగా హెచ్‌డీ క్వాలిటీలో సినిమాలు చూస్తున్నారు. ఇలాంటి దుర్మార్గులకు అరెస్టులు, శిక్షలు సరిపోవు. ఎన్‌కౌంటర్ చేయాలి. పోలీసులు చేయకపోతే కనీసం సినిమా వాళ్లైనా చేయాలి. రూ. వందల కోట్ల ఖర్చుతో వందలాది మంది శ్రమతో రూపొందిన సినిమాను పైరసీ చేసినవాడి రక్తం చూడడం అవసరం. ఇలాంటి వాళ్లని ఒకరిని ఎన్‌కౌంటర్ చేస్తే భవిష్యత్‌లో ఇలా చేయాలనుకునేవాళ్లు భయపడతారు. త్వరలో సీపీ సజ్జనార్‌ను ఘనంగా సత్కరిస్తాం' అని చెప్పారు. ఛాంబర్ అధ్యక్షుడు భరత్‌భూషణ్ మాట్లాడుతూ 'సీనియర్ పోలీస్ అధికారులు చాలా కష్టపడి రవిని పట్టుకున్నారు. ఛాంబర్ తరఫున నిర్వహిస్తున్న పైరసీ సెల్ కూడా ఈ దిశగా కృషి చేస్తోంది. పైరసీని అరికట్టేందుకు బలమైన చట్టాలు తేవాలి' అని ప్రభుత్వాన్ని కోరారు. 'క్యూబ్, యూఎఫ్‌ఓ లాంటి డిజిటల్ సినిమా పంపిణీ సంస్థలు తమ సర్వర్లను మరింత జాగ్రత్తగా చూసుకోవాలి, వారి దగ్గర కనుక సినిమాలు పైరసీ అయితే ఇకపై వారే బాధ్యత తీసుకోవాల్సి ఉంటుంది' అని చదలవాడ శ్రీనివాసరావు హెచ్చరించారు. పైరసీకి పాల్పడేవారిని పట్టుకునేందుకు ప్రత్యేకంగా ఒక విభాగాన్ని ఏర్పాటు చేయాలని పోలీస్ డిపార్ట్‌మెంట్‌ను నిర్మాత ప్రసన్న కుమార్ కోరారు.



ఆ చిత్రాలకు మించి ఉంటుంది

రవి బస్రూర్

జూనియర్ ఎన్టీఆర్ కథానాయకుడిగా ప్రశాంత్ నీల్ ఓ చిత్రాన్ని తెరకెక్కిస్తోన్న విషయం తెలిసిందే. ఈ ప్రాజెక్టు మొదలైనప్పటి నుంచి ఎన్టీఆర్ అభిమానులు అప్డేట్స్ కోసం ఎంతో ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. ఈ క్రమంలో సంగీత దర్శకుడు రవి బస్రూర్ ఓ అదిరిపోయే అప్డేట్ ఇచ్చారు. 'కేజీఎఫ్', 'సలార్'కు మించి ఎన్టీఆర్- ప్రశాంత్ నీల్ సినిమా ఉంటుందని చెప్పి అందరికీ ఆనందం కలిగించారు. తాజాగా ఓ ఆంగ్ల మీడియాకు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన మాట్లాడుతూ 'ఎన్టీఆర్‌తో నీల్ తెరకెక్కిస్తోన్న చిత్రంలో విజువల్స్‌తో పాటు సంగీతం కూడా భారీస్థాయిలో ఉండనుంది. భావోద్వేగాలకు కూడా పెద్దపీట వేశారు. ప్రశాంత్ నీల్ గత చిత్రాలు 'కేజీఎఫ్', 'సలార్'కంటే కూడా ఈ సినిమాలో సంగీతం భిన్నంగా ఉండనుంది. అందుకోసం కొత్త పరికరాలు ఉపయోగిస్తున్నాం' అని తెలిపారు. కాగా, ఈ సినిమాలో ఎన్టీఆర్ సరసన రుక్మిణి వసంత్ కథానాయికగా నటిస్తున్నారు. ఈ చిత్రానికి 'డ్రాగన్' అనే పేరు పరిశీలనలో ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది.

ప్రతి సన్నివేశంలో వినోదం

రాజ్ తరుణ్



సులువుగా డబ్బు సంపాదించాలని ఆరాటపడే ఓ కుర్రాడి జీవితంలో జరిగిన అనూహ్య సంఘటనల సమాహారంగా తెరకెక్కిన చిత్రం 'పాంచ్‌మినార్' అని హీరో రాజ్‌తరుణ్ చెప్పారు. ఆయన కథానాయకుడిగా రామ్ కడుముల దర్శకత్వంలో మాధవి ఎంఎస్ఎం రెడ్డి నిర్మించిన ఈ చిత్రం ఈనెల 21న విడుదలవుతోంది. ఈ సందర్భంగా రాజ్‌తరుణ్ సినిమా విశేషాలను మీడియాతో పంచుకున్నారు.

- క్రైమ్‌కామెడీ జానర్‌లో తెరకెక్కిన చిత్రమిది. అలాగని హింసాత్మక సన్నివేశాలు ఉండవు. ప్రతి సన్నివేశం వినోదం పంచేలా ఉంటుంది. ఈ సినిమాలో కీలక సన్నివేశంలో వినిపించే పదం 'పాంచ్‌మినార్'. క్యాచీగా ఉంటుందని దాన్నే టైటిల్‌గా పెట్టాం. ఒక కొత్త పాయింట్ చెప్పారే అనే ఫీలింగ్ ప్రేక్షకులకు కలుగుతుంది.
- దర్శకుడు స్క్రీన్‌ప్లేని అద్భుతంగా రాశారు. కథానాయిక రాశి సింగ్ ఈ సినిమా కోసం తెలుగు నేర్చుకొని డబ్బింగ్ చెప్పారు. శేఖర్ చంద్ర నేపథ్య సంగీతం సినిమాకు ప్రత్యేకాకర్షణగా నిలుస్తుంది. నిర్మాతల సహకారం వల్లే మంచి అవుట్‌పుట్ వచ్చింది.

50 మంది నక్సల్స్ అరెస్టు

ఒకేరోజు 5 జిల్లాల్లో అదుపులోకి తీసుకున్న పోలీసులు

బెజవాడలో 32 మంది మావోయిస్టుల అరెస్టు

ఏలూరు, కొప్పవరం, అమలాపురంలో 18మంది

హిడ్మా ఎన్‌కౌంటర్ రోజునే కీలక పరిణామాలు

విజయవాడ/ఏలూరు, కుక్కునూరు, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్‌లో ఒకేరోజు భారీసంఖ్యలో మావోయిస్టులు అరెస్టయ్యారు. హిడ్మా ఎన్‌కౌంటర్ జరిగిన మంగళవారమే కృష్ణా, ఎన్టీఆర్, ఏలూరు, కాకినాడ, అంబేడ్కర్ కోనసీమ జిల్లాల్లో 50 మందిని పోలీసులు పట్టుకున్నారు. ఎక్కడో దండకారణ్యంలో ఉండే మావోయిస్టుల దళం బెజవాడ సమీపాన మకాం వేసింది. వెంట ఆయుధాలను కూడా తెచ్చుకుంది. అనుమానం రాకుండా ఓ భారీ భవనంలో బసచేసింది. విజయవాడకు కూతవేటు దూరంలో ఉన్న కానూరులో ఉన్న న్యూ ఆటోనగర్‌లో తలదాచుకున్న ఈ దళాన్ని గ్రేహౌండ్స్, ఆక్టోపస్ దళాలు అదుపులోకి తీసుకున్నాయి. సోమవారం అర్ధరాత్రి రెండు గంటల నుంచి మంగళవారం ఉదయం పది గంటల వరకు జరిగిన సైలెంట్ ఆపరేషన్‌లో మొత్తం 28 మంది మావోయిస్టులు పట్టుబడ్డారు. వీరిలో 21 మంది మహిళలు, ఏడుగురు పురుషులు ఉన్నారు. పట్టుబడినవారిలో మావోయిస్టు పార్టీ కేంద్ర కమిటీ కార్యదర్శి తిప్పిరి తిరుపతి అలియాస్ దేవ్‌జీ రక్షణ దళాధిపతి జ్యోతి కూడా ఉన్నట్లు సమాచారం.

కూలీలుగా వచ్చిన మావోయిస్టులు..?

అప్పలస్వామినాయుడు అనే ఆర్కిటెక్చర్ కృష్ణా జిల్లా పెనమలూరు మండలం కానూరులోని కొత్త ఆటోనగర్ విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద ఐదో అడ్డరోడ్డులో మూడంతస్తుల భవనాన్ని నిర్మించారు. గోడౌన్‌గా అద్దెకు ఇవ్వడానికి ఏడాది క్రితం దీనిని కట్టారు. అప్పలస్వామినాయుడు ప్రస్తుతం జర్మనీ పర్యటనలో ఉన్నారు. భవనాన్ని చూసుకోవడానికి ఒక వాచ్‌మన్‌ను నియమించుకున్నారు. కొద్దిరోజుల క్రితం వాచ్‌మన్‌కు పరిచయం ఉన్న ముగ్గురు వ్యక్తులు అతడి వద్దకు వచ్చారు. ఆ తర్వాత అతడు ఈ 28 మంది మావోయిస్టులకు మూడో అంతస్తులో ఆశ్రయం ఇచ్చినట్లు తెలుస్తోంది. వారంతా పది రోజుల కిందటే ఇక్కడ దిగారని పోలీసు వర్గాలు చెబుతున్నాయి. వారికి ప్రతి రోజూ తెల్ల కారులో ఉదయం టీ, అల్పాహారం.. మధ్యాహ్నం, రాత్రిపూట భోజనాలు వచ్చేవి. క్యాటరింగ్ చేసే వారి మాదిరిగా వాటిని తీసుకొచ్చేవారు. పెద్ద కెటిల్‌లో టీ, పెద్దపెద్ద క్యారేజీల్లో టిఫిన్లు, భోజనాలు వచ్చేవి. ఈ తతంగాన్ని పక్క భవనంలో ఉన్న వ్యక్తులు నాలుగు రోజుల క్రితం గమనించారు. వాచ్‌మన్‌ను పిలిచి భవనంలో ఉన్నవారెవరో కారులో వచ్చినవారిని అడిగి తెలుసుకోవాలని పురమాయించారు. అతడు అలాగే అడుగగా.. కూలీలు ఉన్నారని వారు చెప్పినట్లు విశ్వసనీయంగా తెలిసింది. ఈ భవనంలో ఎందుకున్నారని ప్రశ్నించగా.. పనులు ఇంకా దొరకలేదని, మంచి ఉపాధి దొరకగానే వెళ్లిపోతారని వారు బదులిచ్చినట్లు తెలియవచ్చింది. కాగా.. న్యూ ఆటోనగర్‌లో సోమవారం అర్ధరాత్రి దాటాక 2 గంటల నుంచి మంగళవారం ఉదయం పది గంటల వరకు పోలీసుల ఆపరేషన్ సాగింది. బలగాలు అత్యంత చాకచక్యంగా వ్యవహరించాయి. ముందుగా భవనంవైపు ఉన్న రోడ్లన్నీ బారికేడ్లతో మూయించి.. భవనాన్ని చుట్టుముట్టాయి. షట్టర్ల వద్ద అత్యాధునిక ఆయుధాలతో మాటు వేశాయి. పోలీసుల హెచ్చరికలు, సందేశాలను అర్థం చేసుకున్న మావోయిస్టులు లొంగిపోయారు. వారిని ప్రత్యేక వాహనాల్లో కట్టుదిట్టమైన భద్రత మధ్య రహస్య ప్రదేశానికి తరలించారు. ఆ తర్వాత డాగ్ స్క్వాడ్ పరిసరాలను క్షుణ్ణంగా పరిశీలించింది. తర్వాత బాంబ్ స్క్వాడ్ తుపాకులు, మారణాయుధాలు, పేలుడు పదార్థాలను గుర్తించింది. వాటన్నిటినీ పోలీసులు సీజ్ చేసి తీసుకెళ్లారు. అలాగే విజయవాడ పరిధిలోని రామవరప్పాడులో మరో నలుగురు నక్సల్స్‌ను అదుపులోకి తీసుకున్నారు.

ఏలూరులో 15 మంది..

ఏలూరు జిల్లాలో 15 మంది మావోయిస్టులను పోలీసులు అరెస్టుచేశారు. మావోయిస్టులపై నిఘా వర్గాల నుంచి సమాచారం రావడంతో.. పోలీసులు మంగళవారం విస్తృత తనిఖీలు చేపట్టారు. ఏలూరు మినీ బైపాస్ పక్కనే ఉన్న కేకేఆర్ గ్రీన్‌సిటీలోని ఒక భవనంలో నక్సల్స్ మకాం వేసినట్లు గుర్తించారు. డ్రోన్ల సాయంతో వారి కదలికలను పసిగట్టారు. ఉదయం 11 గంటల సమయంలో పోలీసులు మఫ్టీలో ఆ ప్రాంతాన్ని చుట్టుముట్టారు. మరోవైపు.. విజయవాడ నుంచి ప్రత్యేకంగా 30 మంది బుల్లెట్‌ప్రూఫ్ జాకెట్లు ధరించిన గ్రేహౌండ్స్ సిబ్బంది వచ్చారు. ఒక్కసారిగా ఆ భవనంపై దాడి చేసి 14 మంది మావోయిస్టులను అదుపులోకి తీసుకున్నారు. వీరిలో ఐదుగురు మహిళలు, తొమ్మిది మంది పురుషులు ఉన్నారు. 45 నిమిషాల్లో ఈ ఆపరేషన్ పూర్తయింది. వీరందరినీ ఏలూరులో నూతనంగా నిర్మించిన మహిళా పోలీసు స్టేషన్ భవనంలో ఉంచారు. ఈ ఘటనపై ఏలూరు రూరల్ పోలీసు స్టేషన్‌లో కేసు నమోదు చేసినట్లు సమాచారం కాగా.. ఏలూరు సమీపంలోని వట్లూరు వేణుగోపాల స్వామి గుడి ఎదురుగా ఉన్న ఒక ప్రైవేటు హాస్టల్‌పై స్పెషల్ పార్టీ పోలీసులు దాడి చేసి ఓ యువకుడిని అదుపులోకి తీసుకున్నారు. అతడి వద్ద ఆయుధాలు ఉన్నట్లు తెలుస్తోంది. అతడు మావోయిస్టు అని తెలియడంతో విద్యార్థులంతా అవాక్కయ్యారు. పది రోజుల క్రితమే అతడు పేయింగ్ గెస్టుగా చేరాడు. అతడితో పాటు హాస్టల్ నిర్వాహకుడినీ అదుపులోకి తీసుకున్నారు. మరోవైపు.. కాకినాడ జిల్లా పోలీసులు ఇద్దరు మహిళా మావోయిస్టులను అదుపులోకి తీసుకున్నారు. హిడ్మాకు గన్‌మెన్‌గా ఉన్న వీరిని మంగళవారం సామర్లకోట మండలం కొప్పవరంలో అరెస్టు చేసి.. ఏలూరు రేంజ్ పోలీసులకు అప్పగించారు. అలాగే డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో ఓ మావోయిస్టును అరెస్టుచేశారు. కాగా.. పట్టుబడిన మావోయిస్టుల నుంచి సమాచారం సేకరించడానికి.. వారు మాట్లాడేదేంటో తెలుసుకోవడానికి ఏలూరు జిల్లా కుక్కునూరు మండలం కొత్తలంకాలపల్లి నుంచి పది మంది ఆదివాసీలను ఏలూరు తరలించినట్లు సమాచారం. 20 ఏళ్ల క్రితం ఛత్తీస్‌గఢ్ నుంచి వచ్చిన వీరంతా.. కుక్కునూరు, వేలేరుపాడు మండలాల్లో స్థిరపడ్డారు. వారిలో చాలా మంది తెలుగు మాట్లాడగలరు. ఈ క్రమంలోనే పట్టుబడిన నక్సల్స్ మాట్లాడే భాషను తెలుగులో చెప్పడానికి వారిని ఉపయోగించుకోనున్నట్లు తెలుస్తోంది.

ఫైరింగ్ ఎందుకు జరగలేదంటే!

మావోయిస్టులు, కూంబింగ్ దళాలు ఎదురుపడితే పరస్పర కాల్పులు తప్పవు. కానీ.. విజయవాడ కొత్త ఆటోనగర్‌లో మావోయిస్టులు ఉన్న భవనం వద్ద మాత్రం అలాంటిదేమీ జరుగలేదు. ఎందుకంటే.. భవనంలో నక్సల్స్ మకాం వేశారని ముందే తెలుసుకున్న పోలీసులు.. తొలుత కొంతమంది మావోయిస్టు సానుభూతిపరులను వారి వద్దకు పంపారు. భవనాన్ని బలగాలు చుట్టుముట్టాయని.. ప్రతిఘటిస్తే కాల్చేస్తామని.. లొంగిపోవడమే మేలని సందేశం పంపారు. బాక్సుల్లో భద్రపరచిన ఆయుధాలను బయటకు తీసే అవకాశాన్ని బలగాలు ఇవ్వలేదని తెలుస్తోంది.

ఏపీలో దాడులకు నక్సల్స్ ప్రణాళిక!?

- ముందుగానే పసిగట్టిన ఇంటెలిజెన్స్
- మూడు ప్రాంతాల్లో ఏకకాలంలో అరెస్టులు

అమరావతి/విజయవాడ, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్‌లో ఎవరో ఒక ప్రముఖుడిని హతమార్చడం ద్వారా తమ ఉనికిని చాటుకోవడమే లక్ష్యంగా మావోయిస్టుల బెటాలియన్ రాష్ట్రంలో మకాం వేసినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. రాష్ట్రంలో దాడులకు ప్రణాళిక రూపొందించినట్లు భావిస్తున్నారు. 'ఆపరేషన్ కగార్'తో ఛత్తీస్‌గఢ్ నుంచి కకావికలమైన మావోయిస్టులు చాలా మంది లొంగిపోయారు. కొద్దిమంది మాత్రమే పోరాట పంథాలో కొనసాగుతున్నారు. ఈ నేపథ్యంలో 'ఏదో ఒకటి' చేసి తమ ఉనికి చాటుకోవడానికి దళాలు ఏపీలోకి ప్రవేశించాయని పోలీసులు భావిస్తున్నారు. అందుకే ఒక పూర్తి బెటాలియన్‌ను రాష్ట్రంలోకి పంపారని అభిప్రాయపడుతున్నారు. మావోయిస్టు కేంద్ర కమిటీలో కీలక నాయకుడిగా భావిస్తున్న 'దేవ్‌జీ', రక్షణ విభాగానికి నాయకత్వం వహిస్తున్న జ్యోతితో పాటు మరికొంద రు విజయవాడ శివారులోని కొత్త ఆటోనగర్‌లో మకాం ఏర్పాటు చేసుకున్నారు. ఏలూరులోనూ పోలీసుస్టేషన్ సమీపంలోనే ఇంకొందరు దిగారు. కాకినాడలో మరో ఇద్దరి ఆచూకీని పోలీసులు గుర్తించారు. రాష్ట్ర ఎస్ఐబీ పోలీసుల అప్రమత్తతతో దాదాపు అందరూ దొరికిపోయారు. కాగా, హిడ్మా ఎన్‌కౌంటర్ తర్వాత అతని వద్ద లభించిన డైరీలో కొత్త ఆటోనగర్‌లో మావోయిస్టులు తలదాచుకున్న భవనం పేరు, చిరునామా రాసి ఉన్నట్లు కొందరు చెబుతున్నారు. ఆ సమాచారంతోనే గ్రేహౌండ్స్, ఆక్టోపస్ బలగాలు ఈ భవనాన్ని చుట్టిముట్టినట్టు తెలుస్తోంది.

ఛత్తీస్‌గఢ్‌లో ప్రతికూలతలతో ఏపీకి!

రంపచోడవరం, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): 'ఆపరేషన్ కగార్'తో ఛత్తీస్‌గఢ్‌లో ఎదురవుతున్న ప్రతికూల పరిస్థితుల కారణంగా అక్కడి మావోయిస్టులు ఏపీ వైపు చూస్తున్నారని ఏపీ పోలీసు నిఘా విభాగం అధిపతి, అదనపు డీజీపీ మహేశ్‌చంద్ర లడ్డా తెలిపారు. నెలన్నర రోజులుగా సాగిస్తున్న గాలింపుల్లో భాగంగా వారి కదలికలను పక్కాగా పసిగట్టామని అన్నారు. అల్లూరి సీతారామరాజు జిల్లా మారేడుమిల్లి అడవుల్లో జరిగిన ఎన్‌కౌంటర్లో ఆరుగురు మావోయిస్టులు మృతిచెందిన నేపథ్యంలో ఆయన మీడియాతో మాట్లాడారు. ఛత్తీస్‌గఢ్‌లో మనుగడ సాగించలేని పరిస్థితుల్లో అక్కడి మావోయిస్టులంతా ఆంధ్రాకు చేరుకున్నారని చెప్పారు. వారిలో కొందరు సాయుధులుగా ఇక్కడి అడవుల్లోకి చేరితే, మరికొందరు నగరాల్లోకి చొరబడ్డారని పేర్కొన్నారు. ఎన్‌కౌంటర్లో మృతి చెందిన హిడ్మా, ఆయన భార్య రాజే సహా మరో నలుగురు అడవుల్లోకి చేరారని తెలిపారు. ఈ సాయుధ దళాల కదలికలపై స్పష్టమైన సమాచారంతో తమ బలగాలు చుట్టుముట్టాయని, వారితో జరిగిన ఎదురుకాల్పుల్లో ఈ ఆరుగురు మృతి చెందగా, మరికొందరు పరారయ్యారని ఆయన వివరించారు. సాయుధ పోరాటం వైపు మళ్లిన గిరిజన యువతలో మంగళవారం ఛత్తీస్‌గఢ్ నుంచి వచ్చినవారిలో 31 మందిని కృష్ణా, విజయవాడ, కాకినాడ తదితర జిల్లాల్లో అరెస్టు చేశామని, మరో 20మందికి పైగా మావోయిస్టుల కోసం రాష్ట్రం నలుమూలలా బలగాలు గాలిస్తున్నాయని చెప్పారు.

మావోయిస్టు కార్యదర్శి దేవ్‌జీ ఎక్కడ?

రాష్ట్రంలో భారీ సంఖ్యలో మావోయిస్టులు పట్టుబడ్డారు. వీరిలో మావోయిస్టు పార్టీ కేంద్ర కమిటీ కార్యదర్శి, తెలంగాణలోని జగిత్యాల జిల్లాకు చెందిన తిప్పిరి తిరుపతి అలియాస్ దేవ్‌జీ రక్షణ సిబ్బంది కూడా ఉన్నారు. ఈ నేపథ్యంలో దేవ్‌జీ జాడపై సర్వత్రా ఉత్కంఠ నెలకొంది. దేవ్‌జీ రక్షణ దళంలో తొమ్మిది మంది ఉంటారు. వీరికి జ్యోతి నాయకత్వం వహిస్తున్నారు. మంగళవారం విజయవాడలో ఆమెతోపాటు పదుల సంఖ్యలో మావోయిస్టులను పోలీసులు అరెస్టు చేశారు. వీరిలో దేవ్‌జీ రక్షణ సిబ్బంది 9 మంది కూడా ఉన్నారు. ఈ నేపథ్యంలో దేవ్‌జీ ఎక్కడున్నారన్న ప్రశ్న ఉత్పన్నమవుతోంది. వాస్తవానికి మావోయిస్టు నేత, ఆయన రక్షణ బృందం వేర్వేరుగా ఉండవు. దేవ్ జీ ఎక్కడుంటే ఆయనకు భద్రత కల్పించే బృందం కూడా అక్కడే ఉంటుంది. దీంతో దేవ్‌జీ భద్రత బృందం విడిగా ఇతర బృందం(హిడ్మా టీమ్)తో కలిసి పోలీసులకు పట్టుబడడం ఇప్పుడు సందేహాలకు తావిస్తోంది. దేవ్‌జీ కూడా ఏపీ పోలీసుల అదుపులో ఉన్నారా?. లేక ఆయన తప్పించుకున్నారా?. అన్న ప్రశ్నలు తెరమీదికి వచ్చాయి.



రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేతులమీదుగా అవార్డు తీసుకుంటున్న రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ కమిషనర్ సృజన

జల సంరక్షణలో తెలంగాణ టాప్!

జల్ సంచయ్ జన్ భాగీదారీలో రాష్ట్రానికి అవార్డుల పంట

న్యూఢిల్లీ, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): జల సంరక్షణలో తెలంగాణ రాష్ట్రం జాతీయ స్థాయిలో సత్తా చాటింది. కేంద్ర జలశక్తి శాఖ 6వ జాతీయ జల అవార్డులు-2024, జల్ సంచయ్ జన్ భాగీదారీ అవార్డుల్లో దేశంలోనే అగ్రస్థానంలో నిలిచింది. మొత్తం 5,20,362 పనులు పూర్తి చేసిన తెలంగాణకు అవార్డుల పంట పండింది. కేంద్ర జలశక్తి శాఖ ఆధ్వర్యంలో న్యూఢిల్లీలో మంగళవారం నిర్వహించిన కార్యక్రమంలో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేతులమీదుగా రాష్ట్ర అధికారులు ఆయా అవార్డులు అందుకున్నారు. జలసంరక్షణలో ప్రజలు, పౌర సంఘాలు, కార్పొరేట్ సంస్థలను క్షేత్రస్థాయిలో భాగస్వాములను చేసే లక్ష్యంతో కేంద్రం.. జల్ సంచయ్ జన్ భాగీదారీ కార్యక్రమానికి కేంద్రం శ్రీకారం చుట్టింది. ఇందులో రాష్ట్రాలను ఐదు జోన్లుగా విభజించింది. ప్రతి ఒక్కరూ కనీసం 10 వేల కృత్రిమ రీచార్జి, స్టోరేజీల నిర్మాణాలను లక్ష్యంగా నిర్దేశించింది. ఇందులో రూఫ్‌టాప్ వాన నీటి సంరక్షణ, చెరువులు, కుంటలు, బావుల పునరుద్ధరణ కార్యక్రమాలను చేర్చింది. మొదటి కేటగిరీలో ఎంపికైన వాటికి అవార్డుతోపాటు రూ.2 కోట్లు నగదు బహుమతి, రెండో కేటగిరీ కింద కోటి రూపాయలు, మూడో కేటగిరీకి ఎంపికైతే రూ.25 లక్షలు అందజేసింది. ఇందులో జిల్లాల విభాగంలో కేటగిరీ-1 కింద దక్షిణ జోన్ నుంచి మూడు జిల్లాలను ఎంపిక చేయగా ఆ మూడింటిని తెలంగాణ కైవసం చేసుకుంది. ఆదిలాబాద్, నల్లగొండ, మంచిర్యాల జిల్లాలు అత్యుత్తమ ప్రతిభ కనబరచగా.. ఆ జిల్లాలకు అవార్డుతోపాటు రూ.2కోట్లు చొప్పున నగదు బహుమతి దక్కింది.

హైదరాబాద్ జలమండలికి రెండో స్థానం

గ్రేటర్ హైదరాబాద్ మునిసిపల్ కార్పొరేషన్(జీహెచ్ఎంసీ) పరిధిలో చేపట్టిన జలసంరక్షణ చర్యలకు గాను మునిసిపల్ కార్పొరేషన్ల విభాగంలో హైదరాబాద్ జలమండలి రెండో ర్యాంకు సాధించింది. అవార్డుతో పాటు రూ.2 కోట్ల నగదు బహుమతి సొంతం చేసుకుంది. మునిసిపల్ కార్పొరేషన్ల విభాగం కేటగిరీ-2లో వరంగల్, నిర్మల్, జనగామ జిల్లాలు దక్షిణ జోన్‌లో తొలి మూడు స్థానాల్లో నిలిచి రూ.కోటి చొప్పున బహుమతి గెలుచుకున్నాయి. అలాగే, కేటగిరీ-3లో భద్రాద్రి కొత్తగూడెం మొదటి ర్యాంకు సాధించగా మహబూబ్‌నగర్‌కు మూడో స్థానం దక్కింది. ఈ రెండు జిల్లాలకు చెరో రూ.25 లక్షల చొప్పున నగదు బహుమతి లభించింది. ఇక, అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన నోడల్ అధికారులకు ఇచ్చిన అవార్డు.. ఆదిలాబాద్, జగిత్యాల, కామారెడ్డి, కుమురం భీం ఆసిఫాబాద్, మెదక్, నిర్మల్, నిజామాబాద్, సంగారెడ్డి జిల్లాలకు నోడల్ అధికారిగా వ్యవహరించిన కేంద్ర జల సంఘానికి చెందిన ఎ.సతీష్‌ను వరించింది. కాగా, రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ కమిషనర్ గుమ్మళ్ల సృజన, హైదరాబాద్ మెట్రోపాలిటన్ వాటర్ సప్లై, సీవరేజ్ బోర్డ్ ఎండీ అశోక్ కుమార్ రెడ్డి, ఆదిలాబాద్ కలెక్టర్ రాజర్షి షా, నల్లగొండ అడిషనల్ కలెక్టర్ జే శ్రీనివాస్, మంచిర్యాల కలెక్టర్ కుమార్ దీపక్, వరంగల్ కలెక్టర్ సత్యశారద, నిర్మల్ కలెక్టర్ అభిలాష అభినవ్, జనగామ కలెక్టర్ రిజ్వాన్ భాషా షేక్, భద్రాద్రి కొత్తగూడెం కలెక్టర్ జితేష్ వీ పాటిల్, మహబూబ్‌నగర్ కలెక్టర్ విజయేందిర తదితరులు రాష్ట్రపతి చేతులమీదుగా ఆయా అవార్డులు అందుకున్నారు.

బిజినెస్

బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	1,23,660 ▼	1,13,350 ▼	1,70,000 ▼
విజయవాడ	1,27,000 ▼	1,19,000 ▼	1,60,000 ▲
విశాఖపట్నం	1,25,440 ▼	1,14,950 ▲	1,70,000 ▼
రాజమండ్రి	1,23,650 ▼	1,13,350 ▼	1,55,000 ▼
ప్రొద్దుటూరు	1,23,400 ▼	1,13,530 ▼	1,55,800 ▼
ముంబై	1,22,180 ▼	1,11,917 ▼	1,53,706 ▼

2030 నాటికి జీసీసీల్లో కొత్తగా 13 లక్షల ఉద్యోగాలు

మొత్తం ఉద్యోగులు 34.6 లక్షలకు చేరే చాన్స్ ● ఎన్‌ఎల్‌బీ సర్వీసెస్ నివేదిక వెల్లడి



హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): ఐటీ, టెక్నాలజీ రంగాల్లో ఉద్యోగాలు మందగిస్తున్నాయి. కొన్ని ఐటీ కంపెనీలైతే పునర్ వ్యవస్థీకరణ లేదా నైపుణ్యాల లేమి పేరుతో ఉద్యోగులపై వేటు వేస్తున్నాయి. అయితే అంతర్జాతీయ కంపెనీలు మన దేశంలో ఏర్పాటు చేస్తున్న గ్లోబల్ క్యాపబిలిటీ సెంటర్స్ (జీసీసీ) మాత్రం పెద్దఎత్తున ఉద్యోగుల నియామకాలు చేస్తున్నాయి. ఏఐ ప్రభావం ఉన్నా జీసీసీల్లో కొలువుల నియామకాలు జోరుగా సాగుతున్నాయి. వచ్చే ఏడాదికల్లా దేశంలోని జీసీసీల్లో పని చేసే ఉద్యోగుల సంఖ్య 11 శాతం పెరిగి 24 లక్షలకు, 2030 నాటికి 30 శాతం పెరిగి 34.6 లక్షలకు చేరుకుంటుందని గ్లోబల్ టెక్నాలజీ, డిజిటల్ టాలెంట్ సొల్యూషన్స్ సంస్థ ఎన్‌ఎల్‌బీ సర్వీసెస్ ఒక నివేదికలో తెలిపింది. ప్రస్తుతం జీసీసీలో పనిచేస్తున్న 21.6 లక్షల ఉద్యోగులతో పోలిస్తే 2030 నాటికి మన దేశంలోని జీసీసీల్లో పనిచేసే ఉద్యోగుల సంఖ్య 13 లక్షలు పెరుగుతుందని అంచనా వేసింది.

చిన్న నగరాల్లోనూ జీసీసీలు: నిన్న మొన్నటి వరకు మెట్రో నగరాలపైనే ఆసక్తి చూపిన జీసీసీలు ఇప్పుడు దేశంలోని అహ్మదాబాద్, కోయంబత్తూర్, భువనేశ్వర్ వంటి ద్వితీయ, తృతీయ శ్రేణి నగరాలపైనా ఆసక్తి చూపిస్తున్నాయి. ఈ నగరాల్లో జీసీసీలు ఏర్పాటు చేస్తే ఉద్యోగాలు మారే ఉద్యోగులు మెట్రో నగరాల్లోని జీసీసీలతో పోలిస్తే 10-12 శాతం మాత్రమే ఉండడం, ఆఫీస్ నిర్వహణ ఖర్చులు 30 నుంచి 50 శాతం తక్కువగా ఉండడం, 20 నుంచి 35 శాతం తక్కువ జీతాలకే నిపుణులైన ఉద్యోగులు దొరకడం ఇందుకు కలిసి వస్తోందని ఎన్‌ఎల్‌బీ సర్వీసెస్ తెలిపింది. 2030 నాటికి దేశంలోని జీసీసీల్లో పనిచేసే ఉద్యోగుల్లో 39 శాతం మంది ద్వితీయ, తృతీయ శ్రేణి నగరాల్లోని జీసీసీల్లోనే పనిచేస్తారని కూడా ఈ నివేదిక పేర్కొంది. అప్పటికి మెట్రో నగరాల్లోని జీసీసీలు నాయకత్వం, పరిపాలన, ఆర్ అండ్ డీ కేంద్రాలుగా పనిచేస్తే ద్వితీయ, తృతీయ శ్రేణి నగరాల్లోని జీసీసీలు స్పెషలైజ్డ్ డెలివరీ కేంద్రాలుగా పని చేయనున్నాయి. దీంతో 2030 నాటికి ద్వితీయ, తృతీయ నగరాల్లోనే జీసీసీల్లోనే 7.5 లక్షల మందికి ఉద్యోగ అవకాశాలు ఏర్పడతాయని ఎన్‌ఎల్‌బీ సర్వీసెస్ (ఆసియా,పసిఫిక్ రీజియన్) సీనియర్ వైస్ ప్రెసిడెంట్ వరుణ్ సచ్‌దేవ చెప్పారు.

వాల్యూల్యాబ్స్‌పై పీఈ సంస్థల కన్ను!

రేసులో ఈక్వ్యాటీ, పీఏజీ, బ్లాక్‌స్టోన్, సీవీసీ సంస్థలు

మెజారిటీ వాటా కోసం చర్చలు

హైదరాబాద్: హైదరాబాద్ కేంద్రంగా ఉన్న సాఫ్ట్‌వేర్ సర్వీసెస్ కంపెనీ వాల్యూలాబ్స్ ఈక్విటీలో మెజారిటీ వాటా చేజిక్కించుకునేందుకు అంతర్జాతీయ ప్రైవేట్ ఈక్విటీ (పీఈ) సంస్థలు సన్నాహాలు చేస్తున్నాయి. ఈక్వ్యాటీ, పీఏజీ, సీవీసీ సహా బ్లాక్‌స్టోన్ వంటి పీఈ సంస్థలు.. వాల్యూల్యాబ్స్‌లో మెజారిటీ వాటా కోసం సంస్థను ప్రమోట్ చేసిన దొనకంటి కుటుంబ సభ్యులతో చర్చిస్తున్నట్లు సమాచారం. ఇందులో భాగంగా కంపెనీ విలువ రూ.8,800 కోట్లు (100 కోట్ల డాలర్లు)గా లెక్కకట్టినట్లు తెలుస్తోంది. డీల్ విషయంలో అంతర్జాతీయ ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంక్ గోల్డ్‌మన్ శాక్స్.. వాల్యూల్యాబ్స్ ప్రమోటర్లకు సహకరిస్తున్నట్లు సమాచారం. పీఈ సంస్థలతో చర్చలు పూర్తయితే ఈ నెలాఖరులోనే తొలి దశ బిడ్స్‌ను ఆహ్వానించే అవకాశం ఉందని తెలుస్తోంది. వాల్యూల్యాబ్స్ వాల్యుయేషన్‌పై స్పష్టత వస్తే మరికొన్ని పీఈ సంస్థలు, వ్యూహాత్మక ఇన్వెస్టర్లు కూడా రంగంలోకి దిగే అవకాశం కనిపిస్తోంది.

1997లో ప్రారంభం

వాల్యూలాబ్స్ సంస్థను 1997లో దొనకంటి అర్జున రావు, ఆయన కుటుంబసభ్యులు ప్రమోట్ చేశారు. ఈ మధ్య స్థాయి ఐటీ కంపెనీ 300కు పైగా కంపెనీలకు ఏఐ ఆధారిత ఎంటర్‌ప్రైజ్ సొల్యూషన్స్ అందిస్తోంది. ప్రస్తుతం వాల్యూలాబ్స్‌లో 7,000 మందికిపైగా ఇంజనీర్లు పని చేస్తున్నారు. ప్రొడక్ట్ డెవలప్‌మెంట్, క్వాలిటీ ఇంజనీరింగ్, సైబర్ సెక్యూరిటీ, డేటా అండ్ అనలిటిక్స్‌లో కంపెనీకి మంచి పట్టుంది. దీంతో పీఈ సంస్థలు వాల్యూల్యాబ్స్ ఈక్విటీలో మెజారిటీ వాటా తీసుకునేందుకు ఆసక్తితో ఉన్నట్టు తెలుస్తోంది.

సీక్వెంట్ సైంటిఫిక్‌లో వియాష్ లైఫ్ సైన్సెస్ విలీనం

▸▸ ఎన్‌సీఎల్‌టీ నుంచి గ్రీన్ సిగ్నల్

ముంబై: హైదరాబాద్ కేంద్రంగా ఉన్న వియాష్ లైఫ్ సైన్సెస్.. సీక్వెంట్ సైంటిఫిక్ కంపెనీలో విలీనమవుతోంది. జాతీయ కంపెనీ లా ట్రిబ్యునల్ (ఎన్‌సీఎల్‌టీ) ఇందుకు ఆమోదం తెలిపింది. ఇరు కంపెనీల విలీనంతో రూ.8,000 కోట్ల కంపెనీ ఏర్పడనుంది. గత ఏడాది సెప్టెంబరులో రెండు కంపెనీలు ఈ విలీనాన్ని ప్రకటించాయి. అయితే ఎన్‌సీఎల్‌టీ నుంచి ఇందుకు ఆమోదం మంగళవారమే లభించింది. సీక్వెంట్ సైంటిఫిక్ వాటాదారుల్లో 99.98 శాతం మంది ఇప్పటికే ఈ విలీనానికి ఆమోదం తెలిపారు. ఇందులో సీక్వెంట్ సైంటిఫిక్.. యానిమల్ హెల్త్ కేర్ రంగంలో, వియాష్ లైఫ్ సైన్సెస్ హ్యూమన్ హెల్త్‌కేర్ రంగంలో ఉన్నాయి. వియాష్ లైఫ్ సైన్సెస్ కంపెనీ ఉత్పత్తులకు అమెరికా ఎఫ్‌డీఏ ఆమోదం ఉంది.

ఆర్థిక మోసాల నిరోధానికి నేషనల్ ఫైనాన్షియల్ గ్రిడ్

ఏర్పాటు చేయాలన్న ఎస్‌బీఐ చైర్మన్ చల్లా శ్రీనివాసులు శెట్టి

ముంబై: దేశంలో ఆర్థిక మోసాలను నిరోధించడంతో పాటు రిస్క్ నిర్వహణ కోసం ఆర్థిక సేవల రంగానికి చెందిన కీలక విభాగాలను అనుసంధానిస్తూ నేషనల్ ఫైనాన్షియల్ గ్రిడ్ (ఎన్‌ఎఫ్‌జీ)ను ఏర్పాటు చేయాలని భారతీయ స్టేట్ బ్యాంక్ (ఎస్‌బీఐ) చైర్మన్ చల్లా శ్రీనివాసులు శెట్టి కోరారు. క్రెడిట్ రేటింగ్ బ్యూరోలు, ఫ్రాడ్ రిజిస్ట్రీలు, ఈ-కేవైసీ వసతులు, యూనిఫైడ్ పేమెంట్ ఇంటర్‌ఫేస్ (యూపీఐ), అకౌంట్ అగ్రిగేటర్లతో పాటు ఈ మధ్యనే ప్రవేశపెట్టిన యూనిఫైడ్ లెండింగ్ ఇంటర్‌ఫేస్ (యూఎల్‌ఐ)ను ఈ గ్రిడ్‌తో అనుసంధానించాలని శెట్టి అన్నారు. ముంబైలో జరుగుతున్న సీఐఐ ఫైనాన్షియల్ సమ్మిట్‌లో మంగళవారం పాల్గొన్న సందర్భంగా ఆయన ఈ సూచన చేశారు. ఆర్థిక రంగ వర్గాలు ఏకమై లాభాపేక్ష లేని సంస్థ ఇండియన్ డిజిటల్ పేమెంట్ ఇంటెలిజెన్స్ కార్పొరేషన్‌ను ఏర్పాటు చేశాయి. వినియోగదారుల ప్రయోజనాలను రక్షించడమే అంతిమ లక్ష్యంగా రియల్ టైం డేటాను ఇచ్చిపుచ్చుకునేందుకు వీలుగా ఏర్పాటైన డిజిటల్ మౌలిక సదుపాయం ఇది.

చిన్న వ్యాపారుల కోసం డిజిటల్ ట్విన్: చిన్న వ్యాపారులు సులభంగా రుణాలు తీసుకునేందుకు వీలుగా 'డిజిటల్ ట్విన్'ను ఏర్పాటు చేయాలని కూడా ఎస్‌బీఐ చైర్మన్ శెట్టి సూచించారు. ఈ డిజిటల్ ట్విన్ వ్యాపార సంస్థకు సంబంధించిన పూర్తి సమాచారాన్ని నిక్షిప్తం చేస్తుంది. ఆ సమాచారం వ్యాపార సంస్థ ఆర్థిక పరిస్థితిని సమగ్రంగా తెలియజేయడంతో పాటు ఆ సంస్థ సులభంగా ఆర్థిక సేవలందుకునేందుకు దోహదపడుతుంది. అందరికీ ఆర్థిక సేవలను అందుబాటులోకి తెచ్చేందుకు ఇప్పటికే పలు చర్యలు చేపట్టినప్పటికీ, అది పూర్తిగా నెరవేరలేదు.

దాంతో చిన్న వ్యాపారాలు అసంఘటిత, అనియంత్రిత సంస్థల నుంచి అధిక వడ్డీకి రుణాలు తీసుకోవాల్సి వస్తోందని శెట్టి పేర్కొన్నారు. సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల (ఎంఎస్‌ఎంఈ)కు రుణాలిచ్చే విషయంలో సత్సంబంధాల ఆధారిత విధానానికి బదులు పూర్తిగా డేటా ఆధారిత విధానాన్ని అనుసరించేందుకు డిజిటల్ ట్విన్ తోడ్పడుతుందన్నారు.

ఆరు రోజుల ర్యాలీకి బ్రేక్

లాభాల స్వీకరణతో సెన్సెక్స్ 278 పాయింట్లు డౌన్

ముంబై: స్టాక్ మార్కెట్లో ఆరు రోజుల వరుస ర్యాలీకి అడ్డుకట్ట పడింది. అంతర్జాతీయ మార్కెట్ల బలహీన ట్రెండ్ నేపథ్యంలో దేశీయంగా మదుపరులు ఐటీ, మెటల్, రియల్టీ, క్యాపిటల్ గూడ్స్ రంగ షేర్లలో లాభాల స్వీకరణకు పాల్పడటంతో ప్రామాణిక సూచీలు మంగళవారం నష్టాలు చవిచూశాయి. ఒక దశలో 393 పాయింట్ల వరకు పతనమైన సెన్సెక్స్.. చివరికి 277.93 పాయింట్ల నష్టంతో 84,673.02 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 103.40 పాయింట్లు కోల్పోయి 25,910.05 వద్ద ముగిసింది. ఈక్విటీ వర్గాల సంపదగా భావించే బీఎస్‌ఈ నమోదిత కంపెనీల మొత్తం మార్కెట్ విలువ రూ.2.52 లక్షల కోట్లు తగ్గి రూ.474.62 లక్షల కోట్లకు జారుకుంది.

రేపటి నుంచి ఇన్ఫీ బైబ్యాక్

దేశీయ ఐటీ దిగ్గజం ఇన్ఫోసిస్ రూ.18,000 కోట్ల సొంత షేర్ల తిరిగి కొనుగోలు (బైబ్యాక్) ప్రక్రియ ఈ నెల 20 (గురువారం)న ప్రారంభమై 26న ముగియనుంది. కంపెనీ చరిత్రలో ఇదే అతిపెద్ద బైబ్యాక్. ఇందులో భాగంగా కంపెనీ 2.41 శాతం వాటాకు సమానమైన 10 కోట్ల ఈక్విటీ షేర్లను ఒక్కొక్కటీ రూ.1,800 చొప్పున చెల్లించి తిరిగి కొనుగోలు చేయనుంది. అర్హులైన షేర్‌హోల్డర్లు ఈ నెల 20-26 మధ్య కాలంలో తమ వద్దనున్న షేర్లను కంపెనీకి ఆఫర్ చేయవచ్చు.

భారీగా తగ్గిన బంగారం, వెండి

న్యూఢిల్లీ: అంతర్జాతీయ ట్రెండ్‌కు అనుగుణంగా దేశీయంగానూ విలువైన లోహాల ధరలు భారీగా తగ్గాయి. ఢిల్లీ మార్కెట్లో 99.9% స్వచ్ఛత బంగారం ధర 10 గ్రాములపై రూ.3,900 తగ్గి రూ.1,25,800కు దిగివచ్చింది. 99.5% స్వచ్ఛత లోహం రేటు కూడా అదే స్థాయిలో తగ్గి రూ.1,25,200గా నమోదైంది. కిలో వెండి ఏకంగా రూ.7,800 తగ్గుదలతో రూ.1,56,000కు జారుకుంది. వచ్చే నెలలో ఫెడ్ రేట్లు మరింత తగ్గేందుకు అవకాశాలు సన్నగిల్లడంతో ఇంటర్నేషనల్ మార్కెట్లో ఔన్స్ (31.10 గ్రాములు) బంగారం 4,042 డాలర్లు, సిల్వర్ 50 డాలర్లకు తగ్గాయి.

- టైర్ల తయారీ సంస్థ మిచెలిన్ ఇండియా.. హైదరాబాద్‌లో తన కార్యకలాపాలు విస్తరించింది. కొత్తగా బంజారాహిల్స్, కొల్లూరుల్లో రెండు మిచెలిన్ టైర్స్, సర్వీస్ సెంటర్‌ను ప్రారంభించింది. ఈ స్టోర్లతో హైదరాబాద్‌లో మొత్తం నెట్‌వర్క్‌కు ఐదుకి చేరింది.
- ఐసీఐసీఐ బ్యాంక్..హైదరాబాద్‌లోని నానక్‌రామ్‌గూడలో కొత్త శాఖను ప్రారంభించింది. బ్యాంక్‌కు హైదరాబాద్‌లో ఇది 260వ శాఖ. ప్రైవేట్ బ్యాంకింగ్, ఫ్యామిలీ ఆఫీస్ సొల్యూషన్స్, ఎన్‌ఆర్‌ఐ ఖాతాదారులకు ఈ శాఖ సేవలందించనుంది. కాగా ఐసీఐసీఐ బ్యాంక్.. తెలంగాణలో మొత్తం 370 శాఖలను నిర్వహిస్తోంది.
- ఏఐ ఆధారిత, డిజిటల్ ట్రాన్స్‌ఫర్మేషన్ సొల్యూషన్స్ సంస్థ క్వాలిజీల్.. రీసెర్చ్, అడ్వైజరీ సంస్థ ఎవరెస్ట్ గ్రూప్‌తో కలిసి 'రీఇమాజినింగ్ ఎంటర్‌ప్రైజెస్ క్వాలిటీ: లెవరేజింగ్ ఏఐ ఇన్ఫ్యూజ్డ్ క్వాలిటీ ఇంజనీరింగ్ ప్లాట్‌ఫామ్స్ ఫర్ కాంపిటీటివ్ అడ్వాంటేజ్' పేరుతో ఒక వైట్‌పేపర్‌ను విడుదల చేసింది. ఆధునాతన సాఫ్ట్‌వేర్ డెలివరీ విధానాలు, క్లౌడ్ నేటివ్ అప్లికేషన్స్, ఏఐ ఆధారిత విధానాల్లో నాణ్యతా ప్రమాణాలను ఈ పేపర్ నిశితంగా పరిశీలించి నివేదిక రూపొందించింది.
- యాక్సిస్ బ్యాంక్.. న్యూ ఎకానమీ గ్రూప్ (ఎన్‌ఈజీ) కింద స్టార్టప్స్‌లోని ఉద్యోగుల కోసం క్యురేటెడ్ కార్పొరేట్ సాలరీ ప్రోగ్రామ్‌ను ప్రారంభించినట్లు ప్రకటించింది. స్టార్టప్స్.. వృద్ధి దశ నుంచి ఐపీఓకి చేరేంత వరకు అవసరమైన బ్యాంకింగ్ సొల్యూషన్స్‌ను అందించటమే కాకుండా ప్రెఫర్డ్ బ్యాంకింగ్ భాగస్వామిగా ఉంటుందని యాక్సిస్ బ్యాంక్ వెల్లడించింది.

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు) 19వ తేదీ			
హైదరాబాద్	625	విజయవాడ	650
వరంగల్	627	గోదావరి	630
చిత్తూరు	663	విశాఖపట్నం	615
		డజను గుడ్లు రూ. 90	

ఫామ్‌గేట్ ధర	వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్		
హైదరాబాద్	117	విజయవాడ	111
వరంగల్	117	గుంటూరు	115
కరీంనగర్	117	ఒంగోలు	115
మహబూబ్‌నగర్	117	చిత్తూరు	112
కర్నూలు	117	నెల్లూరు	117
విశాఖపట్నం	110	అనంతపురం	117
గోదావరి	111		

స్పోర్ట్స్

భారత్-బంగ్లా మహిళల సిరీస్ వాయిదా

న్యూఢిల్లీ: భారత్-బంగ్లాదేశ్ మహిళల క్రికెట్ జట్ల మధ్య డిసెంబరులో జరగాల్సిన పరిమిత ఓవర్ల సిరీస్ వాయిదా పడింది. ఐసీసీ ఎఫ్‌టీపీ ప్రకారం ఇరు జట్లు మూడు వన్డేలు, మూడు టీ20ల సిరీస్‌లు ఆడాల్సి ఉంది. కోల్‌కతా, కటక్‌లో ఈ మ్యాచ్‌లను నిర్వహించాలనుకున్నారు. అయితే భారత్‌లో తలదాచుకున్న బంగ్లా మాజీ ప్రధాని షేక్ హసీనాకు అక్కడి కోర్టు సోమవారం మరణ శిక్ష విధించిన విషయం తెలిసిందే. దీంతో ఇరు దేశాల మధ్య రాజకీయ సంబంధాలు సున్నితంగా మారాయి. కానీ వాయిదా నిర్ణయం వెనుక కారణాన్ని మాత్రం బీసీసీఐ చెప్పలేదు. 'డిసెంబరులో మేం ప్రత్యామ్నాయ సిరీస్ కోసం ప్రయత్నిస్తున్నాం. ప్రస్తుతానికి బంగ్లాతో మాత్రం మ్యాచ్‌లు ఉండవు' అని బోర్డు వర్గాలు పేర్కొన్నాయి. అటు బీసీసీఐ నుంచి ఈ మేరకు లేఖ అందిందని బంగ్లా క్రికెట్ బోర్డు తెలిపింది.

టైబ్రేక్‌కు అర్జున్

క్వార్టర్స్ రెండో గేమూ డ్రా ● చెస్ వరల్డ్‌కప్



పనాజీ: చెస్ వరల్డ్‌కప్‌లో తెలుగు జీఎం అర్జున్ ఇరిగేసి క్వార్టర్స్ ఫలితం టైబ్రేక్‌కు మళ్లింది. మంగళవారం జరిగిన క్లాసిక్ గేమ్‌లో కూడా ప్రత్యర్థి వి యి (చైనా)తో అర్జున్ పాయింట్ పంచుకొన్నాడు. తెల్ల పావులతో ఆడిన అర్జున్ 32 ఎత్తుల అనంతరం ప్రత్యర్థితో డ్రాకు అంగీకరించాడు. తొలి గేమ్ కూడా డ్రా కావడంతో అర్జున్, వి యిలు 1-1తో సమంగా నిలిచారు. బుధవారం జరిగే టైబ్రేక్‌లో గెలిచిన వారు సెమీస్‌కు చేరుకొంటారు. జోస్ మార్టినెజ్‌తో జొవోరిక్ షిండరోవ్, సామ్ షెంక్‌లాండ్‌తో ఆండే ఎసిపెంకు కూడా 1-1తో డ్రా చేసుకొన్నారు. కాగా, నోడిర్‌బెక్ 1.5-0.5తో అలెగ్జాండర్ డాన్‌చెంకోపై గెలిచి సెమీస్‌లోకి అడుగుపెట్టాడు.

సెమీస్‌లో భారత్-ఎ

ఒమన్‌పై గెలుపు ● రైజింగ్ స్టార్స్ ఆసియాకప్

దోహా: రైజింగ్ స్టార్స్ ఆసియాకప్‌లో భారత-ఎ జట్టు సెమీస్ బెర్త్‌ను ఖరారు చేసుకొంది. హర్ష్ దూబే (53 నాటౌట్) అదరగొట్టడంతో.. గ్రూప్-బిలో మంగళవారం జరిగిన మ్యాచ్‌లో భారత్ 6 వికెట్లతో ఒమన్‌ను చిత్తు చేసింది. దీంతో 3 మ్యాచ్‌ల నుంచి భారత్-ఎ 4 పాయింట్లతో గ్రూప్‌లో రెండో స్థానంలో నిలిచింది. ఒమన్, యూఏఈ టోర్నీ నుంచి అవుటయ్యాయి. తొలుత ఒమన్ 20 ఓవర్లలో 135/7 స్కోరు చేసింది. వసీం అలీ (54 నాటౌట్) హాఫ్ సెంచరీ చేశాడు. సుయాన్ష్, గుర్‌ప్రీత్ చెరో 2 వికెట్లు తీశారు. ఛేదనలో భారత్ 17.5 ఓవర్లలో 138/4 స్కోరు చేసి గెలిచింది. నమన్ (30), నేహల్ (23) రాణించారు.

ధనుష్ డబుల్ ధమాకా

బధిర ఒలింపిక్స్‌లో రెండో స్వర్ణం కైవసం



మహిత్

టోక్యో: తెలుగు షూటర్ ధనుష్ శ్రీకాంత్ తన గురి తప్పదని మరో సారి నిరూపించాడు. బధిర ఒలింపిక్స్ (డెఫ్లింపిక్స్)లో రెండో స్వర్ణం కొల్లగొట్టి డబుల్ ధమాకా సృష్టించాడు. రెండ్రోజుల క్రితం 10 మీటర్ల ఎయిర్ రైఫిల్ వ్యక్తిగత ఈవెంట్‌లో విజేతగా నిలిచిన ఈ హైదరాబాద్ స్టార్.. మంగళవారం మిక్స్‌డ్ విభాగంలోనూ పసిడి దక్కించుకున్నాడు. 10 మీటర్ల ఎయిర్ రైఫిల్ మిక్స్‌డ్ టీమ్ ఈవెంట్ ఫైనల్లో భారత ద్వయం ధనుష్/మహిత్ సంధు 17-7తో దక్షిణ కొరియా జోడీ జియోన్ డెయిన్/కిమ్ వూరిమ్‌ను ఓడించి బంగారు పతకం అందుకుంది. ఇక, భారత్‌కే చెందిన మహ్మద్ ముర్తజా వానియా/కోమల్ మిలింద్ జంట 16-12తో ఉక్రెయిన్ ద్వయంపై గెలిచి కాంస్య పతకం సొంతం చేసుకుంది. 23 ఏళ్ల ధనుష్ శ్రీకాంత్‌కు ఇది ఓవరాల్‌గా నాలుగో డెఫ్లింపిక్స్ స్వర్ణం కావడం విశేషం. 2022లో బ్రెజిల్ వేదికగా జరిగిన టోర్నీలోనూ వ్యక్తిగత, మిక్స్‌డ్ ఈవెంట్లలో చాంపియన్‌గా నిలిచాడు. కొన్నాళ్లుగా అంతర్జాతీయస్థాయిలో అద్భుత విజయాలు సాధిస్తోన్న ధనుష్.. మాజీ షూటర్, ఒలింపిక్ కాంస్య పతక విజేత గగన్ నారంగ్ అకాడమీలో శిక్షణ పొందుతున్నాడు.



టీమిండియా కోచ్‌ల సమాలోచన

స్పిన్, పేస్ మిశ్రమం..

గువాహటి పిచ్ సిద్ధం

22 నుంచి సఫారీలతో రెండో టెస్టు

కోల్‌కతా: ఈడెన్ గార్డెన్స్‌లో స్పిన్ ట్రాక్‌పై ఎదురైన పరాభవంతో భారత జట్టు రెండో టెస్టుపై ప్రత్యేకంగా దృష్టి సారించింది. దక్షిణాఫ్రికాతో ఈనెల 22 నుంచి గువాహటిలో జరిగే ఈ మ్యాచ్ కోసం స్పిన్‌తో పాటు పేస్‌కు అనుకూలంగా ఉండేలా వికెట్‌ను కోరుకుంటోంది. అక్కడి పిచ్ కూడా ఎర్ర మట్టితో రూపొందించనుండడంతో పేసర్లకు చక్కటి బౌన్స్ లభించే అవకాశం ఉంది. బర్సాపర స్టేడియంలో జరిగే తొలి టెస్టు ఇదే కావడంతో విమర్శలకు తావీయకూడదనే ఆలోచనలో బీసీసీఐ ఉంది. అందుకే బోర్డు హెడ్ క్యురేటర్ ఆశిష్ భౌమిక్ కూడా పిచ్‌ను పర్యవేక్షిస్తున్నారు. 'ఇక్కడి పిచ్‌ను ఎర్రమట్టితో తయారుచేశారు. దీంతో ఇది ఎక్కువ పేస్, బౌన్స్‌ను అందించే తత్వం కలిగి ఉంటుంది. హోమ్ సీజన్‌కు ముందే భారత్ తమ డిమాండ్‌ను స్పష్టంగా చెప్పింది. అయితే అస్థిర బౌన్స్ మాత్రం ఉండకూడదనే క్యురేటర్ ప్రయత్నిస్తున్నాడు' అని బీసీసీఐ వర్గాలు పేర్కొన్నాయి. తొలి టెస్టు జరిగిన కోల్‌కతా పిచ్ మొదటి రోజే అదనపు బౌన్స్‌తో పాటు స్పిన్‌కు అనుకూలంగా మారిన విషయం తెలిసిందే. దీంతో ఇరు జట్ల బ్యాటర్లకు పరుగులు తీయడం కష్టంగా మారింది.

ప్రాక్టీస్ అలా..



జురెల్

ఈడెన్‌లో స్పిన్నర్లను దీటుగా ఆడలేక విమర్శల పాలైన భారత బ్యాటర్లు నెట్ సెషన్‌లో ఆ దిశగా దృష్టి సారించారు. ప్రస్తుతం కోల్‌కతాలోనే ఉన్న ప్లేయర్లు నెట్ ప్రాక్టీస్ చేశారు. ఇది ఆప్షనల్ కావడంతో కొంతమందే బరిలోకి దిగారు. ముఖ్యంగా సాయి సుదర్శన్‌తో పాటు ధ్రువ్ జురెల్ సింగిల్ ప్యాడ్‌ను ధరించి ప్రాక్టీస్‌లో పాల్గొన్నారు. ఇది రిస్క్‌తో కూడుకున్నదైనప్పటికీ ఎడమచేతి బ్యాటర్ సుదర్శన్ సులువుగా ఫ్రంట్ ఫుట్ షాట్ ఆడేందుకు.. కుడి కాలి ప్యాడ్‌ను తొలగించాడు. ఈ సందర్భంలో డిఫెన్స్ ఆడాలంటే కాలును కాకుండా బ్యాట్‌ను అడ్డుగా పెట్టాల్సి ఉంటుంది. జట్టులోని లెఫ్ట్ హ్యాండర్లు స్పిన్‌ను ఎదుర్కొనే క్రమంలో బ్యాక్ ఫుట్ తీసుకుంటూ ఇబ్బంది పడుతున్నారు. అందుకే ముందుకు వచ్చి ఆడేలా సింగిల్ ప్యాడ్‌తో ప్రాక్టీస్ చేస్తున్నారు. జురెల్ రివర్స్ స్వీప్ షాట్లు ఎక్కువగా ఆడాడు. ఇదిలావుండగా.. సఫారీ ఆఫ్ స్పిన్నర్లు సైమన్ హార్మర్, లెఫ్టామ్ స్పిన్నర్ కేశవ్ మహరాజ్‌లను దీటుగా ఎదుర్కొనేందుకు స్థానిక స్పిన్నర్ కౌశిక్ మైటీతో బ్యాటర్లు ప్రాక్టీస్ చేశారు. ఎందుకంటే 26 ఏళ్ల కౌశిక్ తన రెండు చేతులనూ ఉపయోగిస్తూ.. లెఫ్ట్ హ్యాండర్లకు ఆఫ్ బ్రేక్, కుడి చేతి బ్యాటర్లకు లెఫ్టామ్ స్పిన్‌తో బంతులు వేయగల నైపుణ్యం కలిగి ఉన్నాడు.

బ్యాకప్‌గా నితీశ్

తొలి టెస్టుకు ముందు ఆల్‌రౌండర్ నితీశ్ కుమార్‌ను వదిలేసిన బీసీసీఐ తిరిగి గువాహటి మ్యాచ్‌కు జట్టులో చేర్చింది. కెప్టెన్ గిల్ గాయపడడంతో అతడికి బ్యాకప్‌గా నితీశ్‌ను పిలిపించారు. కోల్‌కతా నుంచి జట్టుతో పాటు వెళ్లనున్న గిల్ ఈ టెస్టు ఆడే విషయమై స్పష్టత లేదు. అందుకే సోమవారం సాయంత్రమే నితీశ్ జట్టులో చేరాడు.

'హాకీ అంపైర్ ఆఫ్ ద ఇయర్' రఘు



లాసన్నే: అంతర్జాతీయ హాకీ సమాఖ్య (ఎఫ్‌ఐహెచ్) 2025కు గాను పురుష 'అంపైర్ ఆఫ్ ద ఇయర్' అవార్డు భారత్‌కు చెందిన రఘు ప్రసాద్‌కు దక్కింది. 2003లో అంపైర్‌గా కెరీర్ ఆరంభించిన ప్రసాద్ (కర్ణాటక).. గడచిన 23 ఏళ్లలో 198 మ్యాచ్‌లకు రెఫరీగా పని చేశాడు. ఈ నెల 23 నుంచి జరగనున్న సుల్తాన్ అజ్లాన్ షా కప్‌తో 200 మ్యాచ్‌ల మైలురాయిని అందుకొన్న తొలి ఆసియా అంపైర్‌గా అరుదైన ఘనతను సాధించనున్నాడు. హాకీ వరల్డ్‌కప్‌లు, మూడు ఒలింపిక్స్ ఆసియా క్రీడల్లో రెఫరీగా రఘు సేవలందించాడు. కాగా ఈ ఏడాదికిగాను అత్యుత్తమ మహిళా అంపైర్‌గా అర్జెంటీనాకు చెందిన ఇరెనె ప్రెసెన్‌క్వీ ఎంపికైంది.

ఓటమి దిశగా హైదరాబాద్

- లక్ష్యం 472.. ప్రస్తుతం 169/7
- జమ్మూ రెండో ఇన్నింగ్స్ 422

జమ్మూ: బ్యాటర్లు మరోసారి చేతులెత్తేయడంతో.. గ్రూప్-డిలో జమ్మూ కశ్మీర్‌తో రంజీ మ్యాచ్‌లో హైదరాబాద్ ఓటమి బాటలో పయనిస్తోంది. ప్రత్యర్థి నిర్దేశించిన 472 పరుగుల లక్ష్య ఛేదనలో.. ఆటకు మూడో రోజు హైదరాబాద్ రెండో ఇన్నింగ్స్‌లో 169/7తో కష్టాల్లో పడింది. మంగళవారం ఆట ముగిసే సమయానికి అనికేత్ (35 బ్యాటింగ్), రక్షణ్ (0 బ్యాటింగ్) క్రీజులో ఉన్నారు. తన్మయ్ అగర్వాల్ (47), కెప్టెన్ రాహుల్ సింగ్ (30) చెప్పుకోదగ్గ స్కోర్లు సాధించారు. ముస్తాక్ నాలుగు వికెట్లు, సాహిల్ లోత్రా రెండు వికెట్లు దక్కించుకొన్నారు. ఆఖరి రోజు విజయానికి హైదరాబాద్‌కు 303 పరుగులు కావాల్సి ఉండగా.. చేతిలో మూడు వికెట్లు మాత్రమే ఉన్నాయి. అంతకుముందు ఓవర్‌నైట్ స్కోరు 275/4తో రెండో ఇన్నింగ్స్ కొనసాగించిన జమ్మూ 422 పరుగులకు ఆలౌటైంది. అబ్దుల్ సమద్ (125), కన్హయ్య వాద్వాన్ (95) రాణించారు. తనయ్ నాలుగు, రక్షణ్ మూడు వికెట్లు పడగొట్టారు. తొలి ఇన్నింగ్స్‌లో జమ్మూ 170, హైదరాబాద్ 121 పరుగులు చేశాయి.

సాత్విక్ జోడీ ముందంజ

- గాయత్రి ద్వయం పరాజయం
- ఆస్ట్రేలియన్ ఓపెన్ బ్యాడ్మింటన్



సిడ్నీ: ఆస్ట్రేలియన్ ఓపెన్‌లో వరల్డ్ నెం:3 సాత్విక్ సాయిరాజ్ జోడీ రెండు రౌండ్‌కు చేరుకోగా.. గాయత్రి జంట ఓటమితో ఇంటిముఖం పట్టింది. మంగళవారం జరిగిన పురుషుల డబుల్స్ తొలి రౌండ్‌లో సాత్విక్-చిరాగ్ షెట్టి ద్వయం 25-23, 21-16తో చైనీస్ తైపీకి చెందిన చాంగ్ కో చి-పో లి విపై పోరాడి గెలిచింది. అయితే, మహిళల డబుల్స్‌లో ట్రీసా జాలీ-గాయత్రి గోపీచంద్ జంట 10-21, 14-21తో ఇండోనేసియాకు చెందిన కుసుమ-పుష్పితా సరి చేతిలో ఓడింది. లక్ష్యసేన్, కిడాంబి శ్రీకాంత్, హెచ్‌ఎస్ ప్రణయ్, ఆయుష్ షెట్టి తలపడే సింగిల్స్ మ్యాచ్‌లు బుధవారం నుంచి జరగనున్నాయి.

జింబాబ్వే వణికించినా.. పాక్‌దే గెలుపు

రావల్పిండి: జింబాబ్వే భయపెట్టినా..ముక్కోణపు టీ20 సిరీస్‌లో పాకిస్థాన్ బోణీ కొట్టింది. మంగళవారం జరిగిన సిరీస్ ఆరంభ మ్యాచ్‌లో పాక్ 5 వికెట్లతో జింబాబ్వేపై గెలిచింది. తొలుత జింబాబ్వే 20 ఓవర్లలో 8 వికెట్లకు 147 పరుగులు చేసింది. ఓపెనర్ బ్రియాన్ బెన్నెట్ (49), కెప్టెన్ సికందర్ రజా (34 నాటౌట్), మరుమణి (30) టాప్ స్కోరర్లు. ఛేదనలో పాక్ 19.2 ఓవర్లలో 151/5 స్కోరు చేసి గెలిచింది. 54/4తో కష్టాల్లో పడిన సమయంలో.. ఫఖర్ జమాన్ (44), ఉస్మాన్ ఖాన్ (37 నాటౌట్), నవాజ్ (20 నాటౌట్) కౌంటర్ ఎటాక్‌తో జట్టును గెలిపించారు.

అభిషేక్ ద్విశతకం

- ఆంధ్ర 567/6 డిక్లేర్ ● 239 పరుగుల ఆధిక్యం

జంషెడ్‌పూర్: అభిషేక్ (247) ద్విశతకం నమోదు చేయడంతో.. జార్ఖండ్‌తో రంజీ మ్యాచ్‌లో ఆంధ్ర తొలి ఇన్నింగ్స్ ఆధిక్యాన్ని సాధించింది. ఆటకు మూడో రోజు ఓవర్‌నైట్ స్కోరు 224/2తో తొలి ఇన్నింగ్స్ కొనసాగించిన ఆంధ్ర 567/6 వద్ద డిక్లేర్ చేసి 239 పరుగుల ఆధిక్యాన్ని అందుకుంది. కరణ్ షిండే (94) దూకుడుగా ఆడాడు. అనంతరం రెండో ఇన్నింగ్స్‌లో జార్ఖండ్ 34/2 స్కోరు చేసింది.

దళాలకు టీచర్!

భర్తకు వ్యూహకర్త.. ఇదీ రాజే ప్రస్థానం



చింతూరు, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): మారేడుమిల్లిలో జరిగిన ఎన్‌కౌంటర్‌లో మావోయిస్టు అగ్రనేత హిడ్మాతోపాటు ఆయన భార్య రాజే అలియాస్ రాజక్క కూడా మరణించారు. రాజే స్వస్థలం సుక్మా జిల్లా గొల్లపల్లి పోలీస్ స్టేషన్ పరిధి లోని వీరాపూర్ గ్రామం. మావోయిస్టు పార్టీ డివిజనల్ కమిటీ సభ్యురాలిగా(డీవీసీఎం) కొనసాగుతున్న రాజే దళాలకు రాజకీయ తరగతులు బోధించే వారు. అదేవిధంగా భర్త హిడ్మా రచించే భీకర దాడులకు సహాయకురాలిగా వ్యవహరించారు. దీంతో రాజేకు మావోయిస్టు పార్టీలో మంచి గుర్తింపు లభించింది. హిడ్మా, రాజేలు ఇద్దరిదీ సుక్మా జిల్లానే కావడం, ఇద్దరూ ఆదివాసీలే కావడంతో దండకారణ్యంలోని ఆదివాసీ యువతకు పార్టీ సిద్ధాంతాలను గోండు భాషలో వివరించి ఇట్టే ఆకర్షించేవారని పోలీసులు తెలిపారు. ఈ క్రమంలో దళంలో కొత్తగా చేరే సభ్యులకు రాజకీయ తరగతులు బోధించడంలో దిట్టగా ఆమెకు పేరు లభించింది. ఇక, గురిత ప్పని హిడ్మా విధ్వంసాల మిలిటెంట్ చర్యల్లో కూడా రాజే వెన్నంటే ఉండే వారని పోలీసులు వివరించారు.

'డెడ్‌లైన్'కు ముందే హిడ్మా ఎన్‌కౌంటర్

- ఈనెల 30లోపే పని ముగించాలన్న అమిత్‌షా
- లొంగిపోతారా..పరిణామాలను ఎదుర్కొంటారా?
- మావోయిస్టులకు మరోసారి బస్తర్ ఐజీ హెచ్చరిక



న్యూఢిల్లీ, నవంబరు 18 : మావోయిస్టు పార్టీ అగ్రనేత, మిలిటరీ వ్యూహకర్త మాద్వి హిడ్మాను కేంద్ర హోం శాఖ అమిత్‌షా పెట్టిన డెడ్‌లైన్‌కు ముందే భద్రతాబలగాలు ఎన్‌కౌంటర్ చేసినట్టు పోలీసు వర్గాలు చెబుతున్నాయి. ఈ నెల 30వ తేదీ లోపు హిడ్మా పని ముగించాలని అమిత్‌షా ఆదేశించినట్టు సమాచారం. అయితే, ఆ తేదీకి ముందే భద్రతాబలగాలు తమ లక్ష్యాన్ని ఛేదించాయని తెలిసింది. హిడ్మా ఎన్‌కౌంటర్ విషయం తెలియగానే అమిత్‌షా ఈ ఆపరేషన్‌ను పర్యవేక్షించిన ఉన్నతస్థాయి అధికారులతో మాట్లాడారు. కాగా, హిడ్మా ఎన్‌కౌంటర్ నేపథ్యంలో, మావోయిస్టులకు ఛత్తీస్‌గఢ్‌లోని బస్తర్ ఐజీ సుందర్‌రాజ్ మరోసారి హెచ్చరికలు జారీచేశారు. లొంగిపోవడం లేదా తీవ్ర పరిణామాలను ఎదుర్కోవడం తప్ప మావోయిస్టులకు మరోదారి లేదని స్పష్టంచేశారు. హిడ్మా మృతితో ఒక్క బస్తర్‌లోనే కాకుండా మొత్తం భారతదేశ వ్యాప్తంగా భద్రతా బలగాలు నిర్ణయాత్మక ముందంజను సాధించాయని తెలిపారు.

హిడ్మా అంతం చరిత్రాత్మక విజయం: బీజేపీ

న్యూఢిల్లీ, నవంబరు 18:నక్సలిజానికి వ్యతిరేకంగా మోదీ ప్రభుత్వం చేపట్టిన పోరాటంలో హిడ్మా అంతం ఒక చరిత్రాత్మక విజయమని బీజేపీ అభివర్ణించింది. వచ్చే ఏడాది మార్చి 31 నాటికి వామపక్ష తీవ్రవాదం నుంచి దేశం పూర్తిగా విముక్తమవడం తథ్యమని పేర్కొంది. దశాబ్దాలుగా హింసను, భయాందోళనలను వ్యాపింపచేస్తున్న హిడ్మాను భద్రతా దళాలు 'పక్కా ప్రణాళిక, సాహసోపేతమైన ఆపరేషన్' ద్వారా అంతమొందించాయని బీజేపీ జాతీయ ప్రధానకార్యదర్శి వినోద్ తావ్డే మంగళవారం 'ఎక్స్'లో కొనియాడారు. 'ప్రధానమంత్రి మోదీ పటిష్ఠ నాయకత్వం, హోం మంత్రి అమిత్‌షా విధానాల ద్వారా దేశం నక్సల్ విముక్తం దిశగా స్థిరంగా పురోగమిస్తోంది. 2026 మార్చి 31 నాటికి భారతదేశం తప్పకుండా నక్సలిజం నుంచి పూర్తిగా విముక్తమవుతుంది' అని పేర్కొన్నారు. కాగా, హిడ్మా అంతాన్ని నక్సలిజంపై పోరాటంలో భారీ వ్యూహాత్మక విజయంగా బీజేపీ జాతీయ అధికార ప్రతినిధి ప్రదీప్ భండారీ అభివర్ణించారు.

మావోయిస్టులూ..
అర్బన్ నక్సల్స్ మాటలు నమ్మొద్దు

- మీ అందరి చావుకు వాళ్లే అసలు కారకులు: సంజయ్



సిరిసిల్ల, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): 'మీ చావుకు అర్బన్ నక్సల్సే కారకులు. ఏ పార్టీ అధికారంలో ఉన్నా పైరవీలు చేసుకుంటూ ఆస్తులు కూడగట్టుకుని కార్లలో తిరుగుతున్న అర్బన్ నక్సల్స్ మాయలో పడి ప్రాణాలు కోల్పోవద్దు' అని కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ మావోయిస్టులకు సూచించారు. 'తుపాకీతో అసలు మీరు సాధించేదేమిటి? తుపాకీ పట్టుకుంటే క్షమించే ప్రసక్తే లేదు. కలం పట్టి చదువుకునే అమ్మాయిలకు మాయమాటలు చెప్పి తుపాకులు ఇచ్చి అడవుల్లోకి పంపితే... వారు తిండితిప్పలు లేక తిరుగుతున్నారు. దేశ సరిహద్దులో జవాను వద్ద, పోలీసుల వద్ద మాత్రమే తుపాకీ ఉండాలి. తుపాకులను వదిలి జన జీవన స్రవంతిలో కలవాలి' అని పిలుపునిచ్చారు. మంగళవారం సిరిసిల్లలో ఆయన మీడియాతో మాట్లాడారు. మావోయిస్టులు జన జీవన స్రవంతిలో కలవడానికి 4 నెలల సమయం మాత్రమే ఉందని, 2026 మార్చి నాటికి మావోయిజాన్ని అంతం చేసి తీరుతామని పునరుద్ఘాటించారు. 'మావోయిస్టులు తుపాకీ వీడాల్సిందే.. జన జీవన స్రవంతిలో కలవాల్సిందే.. అలా వచ్చే వారికి కేంద్రం పూర్తిగా సహకరిస్తోంది' అని అన్నారు.

కేంద్రం అమానవీయంగా వ్యవహరిస్తోంది

మావోయిస్టులతో చర్చలకు నో చెప్పడం అన్యాయం

పౌరసమాజ మౌనం.. ప్రమాదం: ప్రొఫెసర్ హరగోపాల్

హైదరాబాద్ సిటీ/హైదరాబాద్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): మావోయిస్టు పార్టీతో శాంతి చర్చలకు అంగీకరించకుండా, కార్పొరేట్ శక్తులకు ఖనిజ వనరులను అప్పగించాలన్న లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం అత్యంత అమానవీయంగా వ్యవహరిస్తోందని ప్రొఫెసర్ హరగోపాల్ ధ్వజమెత్తారు. ఆదివాసీల జీవన సంస్కృతిని, ఆత్మగౌరవాన్ని ధ్వంసం చేసే విధానాలకు స్వస్తి చెప్పకుండా, వారి సమస్యలను పరిష్కరించకుండా శాంతి నెలకొంటుందని భావించడం పొరపాటేనని అభిప్రాయపడ్డారు. విప్లవోద్యమ పోరాటాన్ని అణచివేస్తే.. వేరే రూపం దాల్చుతుందే తప్ప ఆగదన్న విషయాన్ని పాలకులు గ్రహించాలని హితవు పలికారు. ఆదివాసీల ఉద్యమాన్ని ఆయుధంతో అణచివేయడం, ఎన్‌కౌంటర్ల పేరుతో రక్తపాతం సృష్టించడం.. రాజ్యాంగ విలువలకు విరుద్ధమని ఆందోళన వ్యక్తం చేశారు. కేంద్రం తీరుపై పౌర సమాజం స్పదించాల్సినంతగా స్పందించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. అణచివేత చర్యలను పౌర సమాజం ఉపేక్షిస్తే.. ప్రజాస్వామ్యానికే ప్రమాదం వాటిల్లుతుందని అన్నారు. ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం ఆదివాసీల గొంతు వినాలని, అడవి బిడ్డల హక్కులను గౌరవించాలని విజ్ఞప్తి చేశారు. మావోయిస్టులను చంపుకుంటూ పోవడమంటే మానవ హననం తప్ప మరొకటి కాదని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అభిప్రాయపడ్డారు. కేంద్రం అనుసరిస్తున్న విధానాలు జంగిల్ రాజ్ పాలనకు పరాకాష్ఠ అని మండిపడ్డారు.

హిడ్మాను పట్టుకొని కాల్చిచంపారు: ప్రజాసంఘాలు

అమరావతి/హైదరాబాద్, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): మావోయిస్టు పార్టీ కేంద్ర కమిటీ సభ్యుడు హిడ్మాది బూటకపు ఎన్‌కౌంటర్ అని సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ, రాజకీయ ఖైదీల విడుదల కమిటీ ఆరోపించాయి. హిడ్మా, ఆయన భార్య, మరి కొందరిని పోలీసులు ఎక్కడో పట్టుకొని మారేడుమిల్లి అటవీప్రాంతంలో కాల్చిచంపి ఎన్‌కౌంటర్ కథ అల్లుతున్నారని న్యూడెమోక్రసీ రాష్ట్ర అధికార ప్రతినిధులు పి.ప్రసాద్, చిట్టిపాటి వెంకటేశ్వర్లు, రాజకీయ ఖైదీల విడుదల కమిటీ కన్వీనర్ బల్లా రవీంద్రనాథ్ వేర్వేరు ప్రకటనల్లో ఆరోపించారు. పోలీసుల చర్యను వారు ఖండించారు. ఎన్‌కౌంటర్‌పై న్యాయ విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. మావోయిస్టు నేత తిప్పిరి తిరుపతి కూడా పోలీసుల అదుపులో ఉన్నట్టు తమకు అనుమానం ఉందని న్యూడెమోక్రసీ నేతలు పేర్కొన్నారు. ఆయన ప్రాణానికి హాని ఉన్నందున పోలీసులు వెంటనే ఆయన ఉనికిని బయటపెట్టాలని కోరారు.

గెరిల్లా గుండెలయ హిడ్మా



దండకారణ్యంలో అలజడి రేపిన ఆదివాసీ నేత.. సాధారణ వ్యక్తిగా మొదలై మిలిటరీ చీఫ్‌గా ఎదిగి

- 17 ఏళ్లకే దళంలోకి..మిలిటరీపై గట్టి పట్టు.. వ్యూహం పన్నాడంటే రక్తపుటేరులే
- పీఎల్‌జీఏ సేనానిగా దయలేకుండా దాడులు
- తాడిమెట్లలో 73 మంది జవాన్ల హత్య.

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

మడివి హిడ్మా..ఈ పేరు నిన్నటిదాకా కేంద్ర హోం మంత్రిత్వ శాఖకు ఓ పెద్ద సవాల్. దండకారణ్యంలో మావోయిస్టుల ఏరివేత కోసం పనిచేస్తున్న సీఆర్పీఎఫ్, గ్రేహౌండ్స్, డీఆర్‌జీ, ఇతర బలగాలకు ఈ ఆదివాసీ నేత వేసే వ్యూహాలంటే వెన్నులో వణుకు. దండకారణ్యం ఆయనకు ఇల్లు లాంటిది. ఎక్కడి నుంచి మొదలుపెట్టి..ఎక్కడ ముగించాలో ఆయనకు తెలుసు. 2004 నుంచి 2025 ఏప్రిల్ వరకు దండకారణ్యంలో జరిగిన వరుస సంఘటనలతో హిడ్మా వణుకు పుట్టించాడు. గెరిల్లా యుద్ధరంగంలో సుదీర్ఘకాలం ప్రభుత్వ బలగాలతో పోరాడుతున్న పీపుల్స్ లిబరేషన్ గెరిల్లా ఆర్మీ (పీఎల్‌జీఏ) ముఖ్యనేత హిడ్మా. చివరకు ఏపీ గ్రేహౌండ్స్‌తో జరిగిన ఎన్‌కౌంటర్‌లో హతమయ్యాడు. దండకారణ్యంలో మావోయిస్టు పార్టీ ఉనికి పీఎల్‌జీఏ కార్యకలాపాలపైనే ఎక్కువగా ఆధారపడింది. దాన్ని ముందుండి నడిపించే సేనానే ఎన్‌కౌంటర్ కావడం ఆ పార్టీకి కోలుకోలేని షాక్ ఇచ్చిందని పోలీసు వర్గాలు చెబుతున్నాయి.

ఎవరీ హిడ్మా?

2017లో మావోయిస్టు పార్టీలో నాయకత్వ మార్పిడి భారీగా జరిగింది. కేంద్ర కమిటీ కార్యదర్శిగా గణపతి తప్పుకొని ఆ బాధ్యతలను బస్వరాజ్‌కు (నంబాల కేశవరావు) అప్పగించారు. బస్వరాజ్ అప్పటివరకు సెంట్రల్ మిలిటరీ కమిషన్ బాధ్యతలను చూశారు. ప్రధాన నాయకత్వంలోకి వెళుతూ...ఆ బాధ్యతలను తిప్పరి తిరుపతి అలియాస్ దేవ్‌జీకి ఆయన అప్పగించారు. ఇదే సమయంలో.. అప్పటిదాకా దండకారణ్య స్పెషల్ జోనల్ కమిటీ సభ్యుడిగా ఉన్న హిడ్మాను కేంద్ర కమిటీలోకి తీసుకున్నారు. ఈ ఏడాది మే 21వ తేదీన బస్వరాజ్ ఎన్‌కౌంటర్ తర్వాత దేవ్‌జీ ఆయన స్థానంలో ప్రధాన కార్యదర్శి అయ్యారని, అప్పటివరకు ఆయన చూసిన బాధ్యతలను హిడ్మాకు పార్టీ అప్పగించిందని ప్రచారం జరిగింది. హిడ్మా అసలు పేరు హిడ్మాలు. నిజానికి మధ్కం హిడ్మా పేరుతో దండకారణ్య రీజనల్ కమిటీలో ఓ సభ్యుడు ఉండేవాడు. ఆయన మరణం తర్వాత హిడ్మాలు పేరును హిడ్మాగా పార్టీ మార్చింది. 1981లో ఛత్తీస్‌గఢ్‌లోని దక్షిణ సుకుమా జిల్లా పువర్తిలో హిడ్మా జన్మించాడు. తల్లి బిజ్జు ప్రస్తుతం వృద్ధాప్యంలో ఉండగా, హిడ్మా చిన్నతనంలోనే తండ్రి మృతి చెందాడు. హిడ్మా ఐదో తరగతి వరకే చదివాడు. 17 ఏళ్ల వయసులో హిడ్మా సాయుధ బాట పట్టాడు. నాటి దండకారణ్య స్పెషల్ జోనల్ కమిటీ నేత రామన్నకు శిష్యుడిగా ఎదిగాడు. 2004లో మావోయిస్టు పార్టీ ఆవిర్భావం అనంతరం, పీపుల్స్ లిబరేషన్ గెరిల్లా ఆర్మీలో (పీఎల్‌జీఏ) క్రియాశీల వ్యక్తిగా మారాడు. దండకారణ్యంలో కీలక దాడుల కోసం మెరికల్లాంటి మిలీషియాతో పీఎల్‌జీఏ విభాగంలో ఏర్పాటుచేసిన బెటాలియన్-1కు ఆయనను తీసుకున్నారు. ఈ బెటాలియన్‌లో 185 మంది గెరిల్లా సభ్యులు ఉండేవారు. దాడుల్లో పాల్గొనే స్థాయి నుంచి చివరకు దాడులకు వ్యూహాలు రచించి అమలు చేసే స్థాయికి హిడ్మా ఎదిగాడు. చివరకు దానికి చీఫ్ కమాండర్‌గా ఎదిగాడు.

బలగాలపై భయంకర దాడులు

బెటాలియన్-1తో దండకారణ్యం పరిధిలో ఛత్తీస్‌గఢ్, జార్ఖండ్, ఒడిశా, బీజాపూర్, దంతేవాడలో హిడ్మా దారుణమైన సంఘటనలకు తెగించాడని పోలీసువర్గాలు చెబుతున్నాయి. బాంబులను ఉపయోగించే స్థాయి నుంచి వాటిని తయారు చేసే దాకా నైపుణ్యం పొందాడని అంటున్నారు. 2010లో మావోయిస్టులు డీకే పరిధిలోని తాడిమెట్లలో భద్రతా బలగాలపై దాడులు జరిపి 73 మంది సీఆర్పీఎఫ్ జవాన్లు, అధికారులను అంతమొందించారు. 2013లో సల్వాజుడుం అధినేత, కాంగ్రెస్ నేత మహేంద్ర కర్మతోపాటు మరో 23 మందిని హతమార్చారు. 2017లో బుర్కాపూల్ అంబుష్ దాడిలో 23 మంది సీఆర్పీఎఫ్ జవాన్లను చంపేశారు. దండకారణ్యంలో మావోయిస్టు గెరిల్లా చర్యలు, ప్రత్యేకించి హిడ్మా నేతృత్వంలోని బెటాలియన్-1 చర్యల వల్ల 2015లో 120 మంది, 2017లో 160 మంది, 2018లో 87 మంది, 2019లో 65 మంది, 2020లో 42 మంది సీఆర్పీఎఫ్ బలగాలు మరణించాయని రికార్డులు చెబుతున్నాయి. పెద్దగా అక్షర జ్ఞానం లేకపోయినా ఆయుధాల వినియోగం, తయారీతోపాటు బాంబుల తయారీలో హిడ్మా దిట్ట. నాటు బాంబుల నుంచి ఐఈడీల వరకు ఎలా తయారు చేయాలి? ఎలా పేల్చాలన్న అంశాలపై అతను నిరంతరం పీఎల్‌జీఏ బలగాలకు టెక్నికల్ శిక్షణ ఇస్తుంటాడని చెబుతున్నారు. ఏడేళ్ల క్రితం డీకేలో సీఆర్పీఎఫ్‌పై జరిగిన ల్యాండ్‌మైన్, ఆపై ఫైరింగ్ దాడిని మావోయిస్టులు వీడియో తీశారు. ఆ దాడి చాలా ఉగ్రరూపంలో కొనసాగింది. 14 మంది సీఆర్పీఎఫ్ సిబ్బందితోపాటు ఎనిమిది మంది పోలీసులు మరణించారు. దీనికి సంబంధించిన ప్రత్యక్ష మార్గనిర్దేశం హిడ్మానే ఇచ్చాడని సీఆర్పీఎఫ్... కేంద్రానికి సమర్పించిన ఓ నివేదికలో పేర్కొంది. గిరిజనులు వాడే సంప్రదాయ విల్లంబులు, ఆయుధాలను టెక్నికల్‌గా సూపర్‌ఫైన్ చేసి వాటిని మినీ రాకెట్ లాంచర్లుగా ఆయన అభివృద్ధి చేశాడని తెలిసింది.

భీకర దాడులకు వ్యూహకర్త

తాడిమెట్లలో ఐఈడీ బాంబులు పేల్చి 2010లో 76 మంది సీఆర్‌పీఎఫ్ జవాన్లను చంపేసిన ఘటనతో హిడ్మా పేరు బయటకొచ్చింది. అప్పటినుంచి హిడ్మా ఎలా ఉంటాడు...ఎలా ఉనికి కనిపెట్టాలన్నదానిపై సీఆర్పీఎఫ్‌తోపాటు ఛత్తీస్‌గఢ్, జార్ఖండ్, ఒడిశా, ఏపీ, తెలంగాణ బలగాలు చేయని ప్రయత్నం లేదు. ఆ తర్వాత 2013లో కాంగ్రెస్ నేత మహేంద్ర కర్మతోపాటు 23మంది నేతల హత్య తర్వాత ఈ వేట మరింత ఎక్కువయింది. లొంగిపోయిన నేతలు ఇచ్చిన సమాచారం ఆధారంగా పోలీసు బలగాలు హిడ్మా ఆనుపానులపై కొన్ని స్కెచ్‌లు వేశాయి. ఒక దశలో హిడ్మా లొంగిపోతున్నాడని, మరో సందర్భంలో అరెస్టు అయ్యాడనే ప్రచారం కూడా చేశారు. అవీ ఫలితమివ్వలేదు. ఆదివాసీలు, గిరిజనుల్లో ఆయనకు బాగా పట్టుంది. పోలీసులు అంత సులువుగా ఆయన వద్దకు చేరుకోలేరు. ఫీల్డ్ కూంబింగ్ ద్వారా ఆయనను చేరుకోవడం ఇప్పటిదాకా జరగలేదు. చివరకు 14 ఏళ్ల సుదీర్ఘ విరామం తర్వాత ఆంధ్రప్రదేశ్‌లోని మరేడుమిల్లి అటవీప్రాంతంలో జరిగిన భారీ ఎన్‌కౌంటర్‌లో హిడ్మా పోలీసు బలగాల చేతుల్లో హతమయ్యాడు.



స్వాధీనం చేసుకున్న ఆయుధాలను పరిశీలిస్తున్న పోలీసు అధికారులు

కర్రెగుట్టలో మిస్ అయినా ఏపీలో చిక్కాడు..

తెలంగాణ - ఛత్తీస్‌గఢ్ అటవీప్రాంతంలోని కర్రెగుట్టలు గత కొంతకాలంగా హిడ్మాకు అడ్డాగా మారాయి. అయితే, భద్రతా బలగాలు ఆ ప్రాంతాన్ని కూడా ఛేదించడంతో ఆయన తన మకాంను తొలుత ఏఓబీకి, అక్కడి నుంచి ఏపీకి మార్చినట్లుగా తెలుస్తోంది. ఏపీలోకి గత నెల 28నే వచ్చినట్లుగా పార్టీ వర్గాలు చెబుతున్నాయి. ఈ క్రమంలోనే వారి కదలికలపై పోలీసులకు సమాచారం అంది ఉంటుందని ఆ వర్గాలు చెబుతున్నాయి. ఏపీలో గత 14 ఏళ్లుగా మావోయిస్టు ఉద్యమం లేదు. కూంబింగ్ ఆపరేషన్స్ కూడా బాగా తగ్గిపోయాయి. ఈ నేపథ్యంలో ఏపీని సేఫ్‌జోన్‌గా భావించి హిడ్మా వచ్చి ఉంటాడని భావిస్తున్నారు. కర్రెగుట్టల ఆపరేషన్ నుంచి తప్పించుకున్నా ఆయన ఏపీలో పోలీసులకు చిక్కడం అంతుచిక్కని అంశంగా ఉందని ప్రజాసంఘాలు అంటున్నాయి.

సుకుమా ప్రాంతంలో క్రియాశీలక ఆదివాసీ గ్రామ ఆర్గనైజర్‌గా మొదలైన హిడ్మా ప్రస్థానం ఆ తర్వాత దళ సభ్యుడిగా, యాక్షన్ టీమ్ ఇన్‌చార్జి దాకా ఎదిగాడు. హిడ్మాకు గోండి, హిందీ, బెంగాలీ, కోయ, ఒడియా, కోయ భాషలు వచ్చు. దండకారణ్యంలోని 18 ఆదివాసీ తెగల భాషల్లో అనర్గళంగా మాట్లాడగలడని ఆ పార్టీ వర్గాలు చెబుతున్నాయి. పైగా కేంద్ర కమిటీకి ఎదిగిన తొలి ఆదివాసీ కూడా హిడ్మాయే. మావోయిస్టుల ఏరివేత కోసం కూంబింగ్ జరుగుతోందంటే ఆ ప్రాంతాలను ఖాళీ చేయడం సర్వసాధారణం. హిడ్మా శైలినే వేరు. తాము ఫలానా అటవీ ప్రాంతంలో ఉన్నామని

అగ్రనేతగా ఎదిగిన తొలి ఆదివాసీ

భద్రతా బలగాలకు లీకులు పంపించి వారిని మాటువేసి చంపుతాడని పోలీసువర్గాలు చెబుతున్నాయి. దంతేవాడ (2010) బీజాపూర్ (2011) జైరామ్ ఘాటీ (2013), బీజాపూర్-సుకుమా ఏరియా దాడులు(2021)ఈ కోవకు చెందినవే. కూంబింగ్ ఆపరేషన్లలో ఉన్న భద్రతా బలగాలను దారి మళ్లించి, వారికి తనే ఓ అడ్డాను చూపించి, వారు అక్కడికి చేరుకునే క్రమంలో మాటువేసి విల్లంబులు, బాంబులు, ఐఈడీలతో విరుచుకుపడి ఊచకోతలు కోసినసందర్భాలు అనేకం ఉన్నాయి. అందుకే హిడ్మా ఉన్నాడన్న సమాచారం చేరిందంటే ఒకటికి పది సార్లు తనిఖీ చేసుకున్నాకే ఆ దిశగా బలగాలు కదిలేవి. 2023 జనవరిలో బీజాపూర్ అటవీ ప్రాంతంలో జరిగిన ఎన్‌కౌంటర్‌లో బెటాలియన్ 1లోని 11 మంది ఎన్‌కౌంటర్‌లో చనిపోయారు. అందులో హిడ్మా ఉన్నాడని ప్రచారం జరిగింది. కానీ, దాడికి కొద్ది నిమిషాల ముందే అక్కడి నుంచి ఆయన తప్పించుకున్నట్లు ఆ తర్వాత బలగాలు గుర్తించాయి. మవోయిస్టు పార్టీకి సొంత క్యాడర్, ప్రజాసంఘాల ద్వారా డీకే పరిధిలో సొంత నిఘా వ్యవస్థ ఉంటుంది. అవి కాకుండా హిడ్మాకు ప్రత్యేక నిఘా వ్యవస్థ ఉందని చెబుతున్నారు. తనకోసం బలగాలు రాబోతున్నాయని ముందుగానే తెలుసుకొని ప్రతి దాడులకు సిద్ధమయ్యేలా ఆయన దండకారణ్యంలో ఎదిగారు.


7 నెలలు.. 3 ఎన్‌కౌంటర్లు!

- 11 మంది మావోయిస్టులు మృతి
- వారిలో మోస్ట్ వాంటెడ్ హిడ్మా
- అచ్చిరాని మారేడుమిల్లి.. 18వ తేదీ

(చింతూరు- ఆంధ్రజ్యోతి)

తుపాకీ పేలుళ్ల శబ్దాలు, బూట్ల చప్పుళ్లతో మారేడుమిల్లి అడవి దద్దరిల్లుతోంది. గత ఏడు నెలల్లోనే ఇక్కడ మూడు ఎన్‌కౌంటర్లు జరిగాయి. మొత్తం 11 మంది మావోయిస్టులు మృతిచెందారు. మవోయిస్టు అగ్రనేత, మోస్ట్ వాంటెడ్ హిడ్మా ఎన్‌కౌంటర్ మారేడుమిల్లి అడవుల్లో జరగడం ఓ పెను సంచలనం. అల్లూరి సీతారామరాజు జిల్లా మారేడుమిల్లి, వై.రామవరం మండలాల అడవుల్లో ఇటీవల జరుగుతున్న వరుస ఎన్‌కౌంటర్లతో ఆందోళన నెలకొంది. మావోయిస్టు పార్టీకి మారేడుమిల్లి అడవులతో పాటు 18 తేదీ అచ్చిరాలేదు. ఆపరేషన్ కగార్‌లో భాగంగా ఇద్దరు కేంద్ర కమిటీ సభ్యులు ఈ అడవుల్లోనే మృతి చెందారు.ఈ ఏడాది వై.రామవరం మండలం అటవీ ప్రాంతంలో జరిగిన ఎన్‌కౌంటర్‌లో ఆంధ్ర- ఒడిశా బోర్డర్ స్పెషల్ జోనల్ కమిటీ సభ్యుడు టకూరి పండన్న అలియాస్ జగన్, ఏవోబీ డివిజన్ కమిటీ సభ్యుడు రమేశ్ మృతి చెందారు. ఈ ఘటనలో ఏకే 47, 303 రైఫిల్‌ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఇక ఇదే ఏడాది జూన్ 18న మారేడుమిల్లి మండలం కింటుకూరు అడవుల్లో జరిగిన ఎన్‌కౌంటర్‌లో ముగ్గురు మావోయిస్టులు మృతి చెందారు. వీరిలో మావోయిస్టు పార్టీ కేంద్ర కమిటీ సభ్యుడు గాజర్ల రవి అలియాస్ ఉదయ్, కేంద్ర కమిటీ సభ్యుడు చలపతి భార్య, ఏవోబీ స్పెషల్ జోనల్ కమిటీ సభ్యురాలు రావి వెంకట చైతన్య, కొవ్వాసి అంజు అలియాస్ మాసే ఉన్నారు. తాజాగా నవంబరు 18న మంగళవారం జరిగిన ఎన్‌కౌంటర్‌లో మావోయిస్టు కేంద్ర కమిటీ సభ్యుడు, సౌత్ బస్తర్ బెటాలియన్ నాయకుడు హిడ్మా అలియాస్ సంతోష్, అతడి భార్య, రాష్ట్ర కమిటీ సభ్యురాలు రాజే అలియాస్ రాజక్క, దేవె, లఖాల్ అలియాస్ చైతు, మల్ల అలియాస్ మల్లాలు, కమ్లు అలియాస్ కమలేశ్ మరణించారు. ఈ ఘటనలో కూడా మావోయిస్టుల నుంచి పలు ఆయుధాలను స్వాధీనం చేసుకున్నారు.

ఒంటరైన హిడ్మా తల్లి



సాయుధ పోరాటంలో హిడ్మా కుటుంబం మొత్తం అసువులు బాసింది. హిడ్మా చిన్నప్పుడే తండ్రి మృతి చెందాడు. తల్లి, ఇద్దరు అన్నలు, అక్కతో హిడ్మా కుటుంబం పూవర్తి గ్రామంలో జీవనం సాగించేది. పీపుల్స్ వార్ పార్టీ గ్రామాల్లో జననాట్య మండలి వారు సభలు సమావేశాలు నిర్వహించేవారు. ఈ క్రమంలో హిడ్మా సోదరులు పార్టీ వైపు ఆకర్షితులై అందులో చేరారు. 2008లో హిడ్మా అక్క మృతి చెందగా, 2015లో హిడ్మా అన్న ఎన్‌కౌంటర్‌లో మరణించాడు. ఆయనకు గుర్తుగా పూవర్తిలో హిడ్మా భారీ స్థూపం నిర్మించాడు. ఆ తర్వాత గ్రామంలో క్యాంప్ పెట్టిన భద్రతా బలగాలు ఆ స్థూపాన్ని కూల్చివేశాయి. ప్రస్తుతం హిడ్మా తల్లి ఒక్కరే పూవర్తిలో ఉన్నారు.

కథ ముగిసినట్టేనా?!

- హిడ్మా మృతితో మావోయిస్టు పార్టీకి కోలుకోలేని దెబ్బ
- కీలక సభ్యుల ఎన్‌కౌంటర్లతో కుదేలు
- మిగిలినవారి లొంగుబాట్లతో డీలా

హైదరాబాద్/చర్ల, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): మావోయిస్టు అగ్రనేత హిడ్మా ఎన్‌కౌంటర్‌లో మరణించడంతో మావోయిస్టు పార్టీ కథ ముగిసిందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఈ నేపథ్యంలో 'ఆపరేషన్ కగార్' చివరి దశకు చేరుకున్నట్టేనని భావిస్తున్నారు. రెండేళ్లుగా సాగుతున్న వరుస ఎన్‌కౌంటర్లు, లొంగుబాట్లతో మావోయిస్టు పార్టీ ఇప్పటికే డీలా పడింది. ఐదు నెలల్లో ఐదుగురు కేంద్ర కమిటీ సభ్యులు మృతి చెందారు. వారిలో సుధాకర్, బాలకృష్ణ, కదారి సత్యనారాయణరెడ్డి, కె.రామచంద్రారెడ్డి, అంజు దాదా ఉన్నారు. మల్లోజుల వేణుగోపాల్, ఆశన్న, చంద్రన్న తదితర కీలక సభ్యులు లొంగిపోవడంతో పార్టీని నడిపించే నాయకుడు కరువయ్యారు. ఈ పరిస్థితుల్లో పార్టీ మనుగడపై నీలి నీడలు కమ్ముకున్నాయి. హిడ్మా ఎన్‌కౌంటర్‌తో ఇంకా అడవిలో ఉన్న వివిధ క్యాడర్ల మావోయిస్టులు కూడా లొంగిపోతారనే ప్రచారం జరుగుతోంది. అదే జరిగితే జనవరి లోపే ఆపరేషన్ కగార్ ముగుస్తుందని అంచనా వేస్తున్నారు. మావోయిస్టు పార్టీ కేంద్ర కమిటీలో మిగిలినవారిలో కొందరు పశ్చిమ బెంగాల్‌లో ఆశ్రయం పొందుతున్నారని తెలుస్తోంది. ప్రస్తుతం పార్టీలో గణపతి, మల్లా రాజిరెడ్డి, మరో ఐదుగురు కేంద్ర కమిటీ సభ్యులు మిగిలి ఉన్నారని సమాచారం. వీరు మాత్రమే సాయుధ పోరాటాన్ని నమ్ముకున్నవారని, మరో నలుగురు సీసీ సభ్యులు లొంగిపోయేందుకు సిద్ధంగా ఉన్నారని పోలీసు వర్గాలు చెబుతున్నాయి. షెల్టర్ జోన్‌లుగా ఉన్న ప్రాంతాలను గుర్తించి ఏరివేత చర్యలు ప్రారంభించిన నేపథ్యంలో మరిన్ని అరెస్టులు లేదా ఎన్‌కౌంటర్‌లు జరిగే అవకాశం ఉందని పేర్కొన్నాయి. ఇప్పటికే దండకారణ్యంలోని పీఎల్‌జీఏ బృందాల్లో 12 లొంగిపోయాయి. మరో 6 బృందాలు ఉండొచ్చని చెబుతున్నారు. అవి కూడా త్వరలో లొంగిపోతాయని పోలీసు వర్గాల సమాచారం. అందులోనే తెలంగాణకు చెందిన ముగ్గురు, మరో ఏపీ నేత ఉంటారని చెబుతున్నారు.

తెలుగు వారెక్కడ?

మావోయిస్టు పార్టీ కేంద్ర కమిటీలో తెలుగువారు ఐదుగురు ఉండగా, దేవ్‌జీ అలియాస్ తిప్పిరి తిరుపతి తిప్పిరి అదుపులో ఉన్నారనే వార్తలు వస్తున్నాయి. మిగిలిన వారిలో కేంద్ర కమిటీ సభ్యుడు ముప్పాళ్ల కేశవరావు (75) వయోభారంతో కదిలే పరిస్థితిలో లేరని తెలుస్తోంది. ఇక పాక హన్మంతు అలియాస్ గణేశ్ ఒడిశాలో యాక్టివ్‌గా ఉన్నారని పోలీసు వర్గాలు పేర్కొంటున్నాయి. మరో సభ్యుడైన మల్లా రాజిరెడ్డి అలియాస్ సంగ్రామ్(73) వృద్ధాప్య సమస్యలు ఎదుర్కొంటుండగా, పసునూరి నరహరి ఈఆర్‌బీలో యాక్టివ్‌గా ఉన్నారని తెలుస్తోంది.



విజయవాడలోని న్యూ ఆటో నగర్‌లో మావోయిస్టులు ఉన్న భవంతి వద్ద ఆక్టోపస్ బలగాలు

భర్తీ చేయలేని లోటు

పీపుల్స్ వార్ దళాలకు అడవిలో దారి చూపించే గైడ్ స్థాయి నుంచి దళ సభ్యుడిగా, దళ నాయకుడిగా, అడవిని అసాంతం అర్థం చేసుకున్న గెరిల్లా వీరుడిగా ఎదిగిన హిడ్మా మరణం ఆ పార్టీకి భర్తీ చేయలేని లోటుగా మాజీ మావోయిస్టులు, పౌరహక్కుల సంఘాల నేతలు పరిగణిస్తున్నారు. పీఎల్‌జీఏ సైన్యంలో ఫస్ట్ బెటాలియన్ కమాండర్‌గా దళాలను ముందుకు నడిపిన హిడ్మా ఎన్‌కౌంటర్ ఆ పార్టీకి తీవ్రనష్టం కలిగిస్తుందని పోలీసులు సైతం పేర్కొంటున్నారు. వాస్తవానికి హిడ్మా తన చుట్టూ సైన్యం లేకుండా ఎక్కడకూ వెళ్లడని, ఆయన రంపచోడవరం అడవిలో ఎన్‌కౌంటర్‌లో మరణిస్తే ఆయన సైన్యం విజయవాడలో పట్టుబడిందని పోలీసులు చెబుతున్న విషయాలు అత్యంత అనుమానాస్పదంగా ఉన్నాయని పౌరహక్కుల సంఘం నేత లక్ష్మణ్ అన్నారు.

నేడు పూవర్తిలో హిడ్మా అంత్యక్రియలు?

హిడ్మా దంపతులు ఎన్‌కౌంటర్‌లో మృతి చెందడంతో ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని హిడ్మా సొంత గ్రామం సుకుమా జిల్లా పూవర్తిలో విషాద ఛాయలు అలుముకున్నాయి. కుమారుడు చనిపోయినట్టు హిడ్మా తల్లికి పోలీసులు సమాచారం అందించారు. దీంతో 80 ఏళ్ల వయసున్న ఆమె ఓ చెట్టు కింద కూలబడి భోరున విలపించిందని స్థానికులు తెలిపారు. పోస్టుమార్టం అనంతరం హిడ్మా కుటుంబసభ్యులకు మృతదేహాలను అప్పగించనున్నారు. అన్నీ సవ్యంగా సాగితే బుధవారం పూవర్తిలో హిడ్మా దంపతుల అంత్యక్రియలు జరగనున్నాయి. మావోయిస్టులు ప్రతీకార దాడులకు పాల్పడే అవకాశం ఉందన్న అనుమానాలతో ఛత్తీస్‌గఢ్‌లో పోలీసులు పటిష్ఠ బందోబస్తు ఏర్పాటు చేస్తున్నారు.

హిడ్మా ఎన్‌కౌంటర్

(మొదటిపేజీ తరువాయి)

దట్టమైన దండకారణ్యం దాటారు. పోలీసు బలగాలు పెద్దగా దృష్టిసారించని మారేడుమిల్లి అడవుల్లో తలదాచుకోవాలని భావించారు. మావోయిస్టు అగ్రనేత హిడ్మా మరికొందరితో కలిసి ఏపీ సరిహద్దుల్లోకి ప్రవేశించాడు. అయితే... హిడ్మా మారేడుమిల్లి అడవుల్లో తలదాచుకున్నాడన్న సమాచారంతో... పోలీసులు 4 రోజులుగా కూంబింగ్ ముమ్మరం చేశారు. ఈ క్రమంలో మంగళవారం ఉదయం 5 గంటల సమయంలో గుజ్జిమామిడివలస పంచాయతీలోని నెల్లూరు శివార్లలో పోలీసు బలగాలకు హిడ్మా దళం తారసపడింది. వెంటనే పోలీసులకు, మావోయిస్టులకు మధ్య ఎదురుకాల్పులు జరిగాయి. అటువైపు నుంచి కాల్పులు ఆగిపోవడంతో... పోలీసులు గాలింపు జరిపారు. అక్కడ ఆరు మృతదేహాలు లభ్యమయ్యాయి. వారి మృతదేహాల చిత్రాలను ఛత్తీస్‌గఢ్ పోలీసులకు పంపించి... వారిలో హిడ్మా ఉన్నట్లు నిర్ధారించుకున్నారు. దీనిపై ప్రకటన వెలువడగానే... ఏపీ, తెలంగాణ, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల్లో ఒక్కసారిగా కలకలం రేగింది. ఇదే ఎన్‌కౌంటర్‌లో హిడ్మా భార్య, స్పెషల్ జోనల్ కమిటీ సభ్యురాలు రాజే అలియాస్ మడకం రాజక్క... సాయుధ మావోయిస్టులు దేవే, లక్మల్ అలియాస్ చేతు, మల్ల ఎలియాస్ మల్లలు, కమ్లు ఎలియాస్ కమ్లేశ్ ఉన్నారు. ఎన్‌కౌంటర్ సమయంలో ఘటనా స్థలం నుంచి మరికొందరు మావోయిస్టులు పరారయ్యారు. వీరికోసం పోలీసులు గాలింపు కొనసాగిస్తున్నారు. పరారైన వారిలో ఎవరికైనా గాయాలయ్యాయా, లేక ఎక్కడైనా మృతి చెంది ఉంటారా అనేది తేలాల్సి ఉంది. సంఘటనా స్థలం నుంచి రెండు ఏకే 47 రైఫిళ్లు, ఒక పిస్టల్, ఒక రివాల్వర్, ఒక సింగిల్ బోర్ తుపాకీ, పలు ఎలక్ట్రిక్ డిటోనేటర్లు, 150 వరకూ నాన్ ఎలక్ట్రిక్ డిటోనేటర్లు, 25 మీటర్ల ఫ్యూజ్ వైరు, ఒక విద్యుత్ వైర్ బండిల్, ఏడు కిట్ బ్యాగులు, 28 ఏకె 47 రౌండ్లు, ఐదు పిస్టల్ రౌండ్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఎన్‌కౌంటర్ నుంచి తప్పించుకున్న వారి కోసం పోలీసులు గాలింపు మొదలుపెట్టారు. మావోయిస్టుల మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం రంపచోడవరం ఏరియా ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనలో మృతి చెందినవారి బంధువులకు ఛత్తీస్‌గఢ్ పోలీసుల ద్వారా సమాచారం ఇచ్చామని, గాలింపు చర్యలను మరింత ముమ్మరం చేశామని ఇంటెలిజెన్స్ ఐజీ లడ్డా తెలిపారు.

అక్కడ కష్టమని ఇటువైపు...

ఛత్తీస్‌గఢ్ దండకారణ్యంలో పోలీసు బలగాలు ఇటీవలకాలంలో ఆపరేషన్ కగార్ పేరుతో భారీగా కూంబింగ్ కొనసాగిస్తున్నారు. ఈ క్రమంలో చోటుచేసుకున్న పలు ఎన్‌కౌంటర్లలో పలువురు మావోయిస్టు అగ్ర నేతలు మరణించారు. ప్రస్తుతం ఉన్న ప్రతికూల పరిస్థితుల్లో సురక్షిత ప్రాంతాలకు వెళ్లాలని మావోయిస్టులు ప్రణాళిక రచించారు. ఇందులో హిడ్మాతోపాటు ఆయన దళం కూడా ఉంది. ఈ నేపథ్యంలో మారేడుమిల్లి అడవుల మీదుగా ఒడిసా వైపు వెళ్లాలని ప్రణాళిక రచించినట్లు తెలుస్తోంది. ఈ క్రమంలో... మారేడుమిల్లి అడవుల్లో అడుగుపెట్టగానే హిడ్మా ఆచూకీని నిఘా వర్గాలు కనిపెట్టాయి.

డ్రగ్స్‌కు దూరంగా ఉండండి

» చెడు అలవాట్లు జీవితాన్ని నాశనం చేస్తాయి: మంత్రి అడ్లూరి

హైదరాబాద్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు, యువకులు డ్రగ్స్‌కు దూరంగా ఉండాలని, సరదాలతో మొదలయ్యే చెడు అలవాట్లు జీవితాన్ని నాశనం చేస్తాయని మంత్రి అడ్లూరి లక్ష్మణ్ అన్నారు. పిల్లలపై తల్లిదండ్రులు ఎన్నో ఆశలు పెట్టుకుంటారని, వాళ్ల గురించి ఆలోచించాలని, యువకులు తప్పుదారి పట్టొద్దని సూచించారు. 'డ్రగ్స్‌కు దూరంగా.. జీవిత లక్ష్యాలకు దగ్గరగా' అనే సందేశాన్ని ప్రతి విద్యార్థి, యువకుడి వద్దకు చేరేలా అవగాహన కార్యక్రమాలు కొనసాగిస్తున్నట్లు చెప్పారు. మంగళవారం గాంధీ మెడికల్ కళాశాల ఆడిటోరియంలో నిర్వహించిన 'నషా ముక్త్ భారత్ అభియాన్ 5వ వార్షికోత్సవంలో పాల్గొన్న మంత్రి అడ్లూరి మాట్లాడారు. తెలంగాణను మత్తు పదార్థాల బారి నుంచి బయటపడే రాష్ట్రంగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం కఠిన చర్యలు చేపట్టిందని తెలిపారు. రాష్ట్రంలో డ్రగ్స్ సరఫరాను నిర్మూలించడానికి ఈగల్ స్పెషల్ యూనిట్ కీలక పాత్ర పోషిస్తోందన్నారు.

పట్టణ పీహెచ్‌సీల్లో స్పెషాలిటీ వైద్య సేవలు

» రాష్ట్ర వ్యాప్తంగా 144 కేంద్రాల్లో అందుబాటులోకి..

హైదరాబాద్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో(యూపీహెచ్‌సీ) తొలిసారిగా ఆరు రకాల స్పెషాలిటీ వైద్య సేవలు అందుబాటులోకి రానున్నాయి. ఇందుకోసం సీనియర్ రెసిడెంట్(ఎ్ ఎఆర్) వైద్యులను రంగంలోకి దించుతున్నారు. రాష్ట్రవ్యాప్తంగా 24 క్లస్టర్లను వైద్య ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ ఏర్పాటు చేసింది. వాటి పరిధిలోకి 144 యూపీహెచ్‌సీలను తీసుకువచ్చారు. వాటిలో గైనకాలజీ, ఆర్థోపెడిక్, పిడియాట్రిక్, జనరల్ మెడిసిన్, జనరల్ సర్జన్, ఆఫ్తాల్మాలజీ ఎస్‌ఆర్‌లను నియమిస్తారు. ఏడాదిపాటు వీరు వాటిలో సేవలందిస్తారు. ఏడాది తర్వాత కొత్త ఎస్‌ఆర్‌లను అక్కడ నియమిస్తారు. ఇటీవలే పీజీ వైద్య ఫలితాలు వచ్చాయి. వాటిలో ఉత్తీర్ణులైన వారు ఏడాది పాటు విధిగా ప్రభుత్వ బోధనాస్పత్రుల్లో పని చేయాలి. రాష్ట్రవ్యాప్తంగా 1,300 మందిని ఎస్‌ఆర్‌లుగా నియమించనున్నారు. ఈ నెల 24, 25 తేదీల్లో వారికి కౌన్సెలింగ్ నిర్వహించి పోస్టింగ్‌లు ఇవ్వనున్నట్లు వైద్యవిద్య సంచాలకులు(అకడమిక్) డాక్టర్ శివరాం ప్రసాద్ 'ఆంధ్రజ్యోతి'కి తెలిపారు.

సాగుకు బ్యాంకు రుణాలు మరింత పెరగాలి: భట్టి

హైదరాబాద్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): రైతులకు దీర్ఘకాలిక వ్యవసాయ రుణాలు అవసరానికి తగినట్లుగా అందటంలేదని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అన్నారు. వ్యవసాయ రంగానికి బ్యాంకు రుణాలు మరింత పెంచాల్సిన అవసరం ఉన్నదని పేర్కొన్నారు. హైదరాబాద్‌లో మంగళవారం నిర్వహించిన రాష్ట్రస్థాయి బ్యాంకర్ల కమిటీ సమావేశంలో భట్టి విక్రమార్క మాట్లాడారు. వ్యవసాయరంగం ద్వారానే తెలంగాణ గ్రామీణ ఆర్థిక వ్యవస్థ బలోపేతం అవుతుందని చెప్పారు. రైతులకు పంట సాగుకు ముందు, పంట హార్వెస్టింగ్ తర్వాత కూడా బ్యాంకులు సహకరించాలని సూచించారు. వ్యవసాయ మౌలిక వసతుల నిధితో మంచి పురోగతి సాధించినట్లు తెలిపారు. బ్యాంకర్లు వ్యవసాయ రుణాల లోటును భర్తీచేయాలని సూచించారు.

గల్ఫ్ కార్మికులు, ఉద్యోగుల కోసం నైస్ యాప్

పంజాగుట్ట, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): గల్ఫ్ దేశాల్లో పనిచేస్తున్న తెలుగు రాష్ట్రాలకు చెందిన కార్మికులు, ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం సరికొత్త యాప్ అందుబాటులోకి వచ్చిందని తెలంగాణ ఎన్‌ఆర్‌ఐ అడ్వైజరీ కమిటీ ఛైర్మన్ బీఎం వినోద్‌కుమార్ తెలిపారు. మంగళవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో నైస్ యాప్‌ను కమిటీ వైస్ ఛైర్మన్ మంద భీమ్‌రెడ్డి, సౌదీ తెలుగు అసోసియేషన్ రియాద్ అధ్యక్షుడు ఎం.శ్రీనివాస్, సంస్థ వ్యవస్థాపకుడు మాధవ్‌తో కలిసి ఆవిష్కరించారు. గల్ఫ్ కార్మికులు, వారి కుటుంబ సభ్యులకు ఈ యాప్ ఒక వేదికగా ఉంటుందని వినోద్ అన్నారు.

కేసు కోర్టులో ఉన్నప్పుడు ఓపిక పట్టొచ్చు కదా!

» హైడ్రాకు హైకోర్టు సూచన..సంధ్య కన్వెన్షన్ కూల్చివేతపై విచారణ

హైదరాబాద్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): గచ్చిబౌలిలోని ఎఫ్‌సీఐ లేఅవుట్‌లో సంధ్య కన్వెన్షన్‌లో కూల్చివేతలపై కౌంటర్ దాఖలు చేయాలని హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్‌కు మంగళవారం హైకోర్టు ఆదేశాలు జారీచేసింది. కోర్టు ఇప్పటికే ఇచ్చిన ఉత్తర్వులను ఉల్లంఘిస్తూ హైడ్రా కమిషనర్ రంగనాథ్ నిర్మాణాల కూల్చివేతలకు ఆదేశాలు జారీచేశారని పేర్కొంటూ సంధ్య హోటల్స్ యజమాని శ్రీధర్‌రావు కోర్టు ధిక్కరణ పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై జస్టిస్ బీ విజయ్‌సేన్‌రెడ్డి ధర్మాసనం విచారణ కొనసాగించింది. 'వివాదం కోర్టులో ఉన్నప్పుడు కొంచెం ఓపిక పట్టొచ్చు కదా! కోర్టు ధిక్కరణ కేసుల్లో ఇప్పటికే హైడ్రా కమిషనర్ రంగనాథ్ వ్యక్తిగతంగా వివరణ ఇచ్చారు. మరోసారి కోర్టుకు పిలిచే అవసరం రాకుండా చూడాలని ఆయనకు చెప్పాం. ఇప్పటి వరకు జీహెచ్‌ఎంసీ, హెచ్‌ఎండీఏ వంటి సంస్థలు కోరితే హైడ్రా రంగంలోకి దిగుతోంది.. ప్రస్తుత కేసులో ఎవరు పిలిస్తే వచ్చింది?' అని ధర్మాసనం ప్రశ్నించింది. 'హైడ్రా వల్ల ప్రజలకు మంచి జరిగితే సరే. ఆ మంచిని ప్రజలు సెలబ్రేట్ చేసుకోవచ్చు. కానీ చట్టబద్ధపాలనను, ప్రజాభద్రతను విస్మరించరాదు' అని పేర్కొంది.

మెట్రోలో భాగస్వామిగా కేంద్రం

» మూసీ పునరుజ్జీవంలో తొలివిడత 9 కిలోమీటర్ల పనులు

» కేంద్ర పట్టణాభివృద్ధి శాఖ మంత్రి ఖట్టర్ వెల్లడి

హైదరాబాద్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ మెట్రో రైలును ఇకపై కేంద్రం, తెలంగాణ ప్రభుత్వం భాగస్వామ్యంలో నిర్వహిస్తాయని కేంద్ర పట్టణాభివృద్ధి శాఖ మంత్రి మనోహర్‌లాల్ ఖట్టర్ అన్నారు. ఇప్పటి దాకా తెలంగాణ ప్రభుత్వం, ఎల్‌అండ్‌టీ సంయుక్త భాగస్వామ్యంతో మెట్రో కార్యకలాపాలు కొనసాగగా.. ఇటీవల ఎల్‌అండ్‌టీ తప్పుకొన్న విషయాన్ని ఆయన గుర్తు చేశారు. రెండో దశ కింద 165 కిలోమీటర్ల మేర మెట్రో విస్తరణకు ప్రతిపాదనలు ఉన్నాయని, రానున్న మార్చికల్లా దీనిపై సాధ్యాసాధ్యాల నివేదిక తెప్పించుకుని తగిన నిర్ణయం తీసుకుంటామని అన్నారు. మెట్రో విస్తరణ వ్యయంలో కేంద్రం, తెలంగాణ ప్రభుత్వం చెరి సగం చొప్పున భరిస్తాయన్నారు. ఇక ఆంధ్రప్రదేశ్‌లోనూ విశాఖపట్నం, విజయవాడలో మెట్రో డిమాండ్ అధికంగా ఉందని, ఆ ప్రతిపాదనల్ని పరిశీలిస్తున్నామని తెలిపారు. మంగళవారం హైదరాబాద్‌లో జరిగిన దక్షిణ-పశ్చిమ రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల పట్టణాభివృద్ధి మంత్రుల ప్రాంతీయ సమావేశంలో పాల్గొన్న సందర్భంగా కేంద్ర మంత్రి ఖట్టర్ మీడియాతో మాట్లాడారు. ప్రపంచవ్యాప్తంగా మెట్రో పరంగా భారత్ మూడో స్థానంలో ఉందని అన్నారు. ఇక దేశవ్యాప్తంగా 10వేల బస్సుల కోసం టెండర్లు పిలుస్తున్నామని ఖట్టర్ వెల్లడించారు. స్వచ్ఛభారత్ మిషన్‌లో భాగంగా దేశవ్యాప్తంగా 214 డంపింగ్ యార్డులను సరిచేస్తామని, ఇందుకు కేంద్ర ప్రభుత్వం నిధులు ఇస్తుందని అన్నారు.తెలంగాణలో మరికొన్ని కొత్త డంపింగ్ యార్డులు ప్రారంభిస్తామన్నారు. తెలంగాణలో 55 కిలోమీటర్ల మూసీ నదిని శుద్ధి చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రతిపాదనలు పంపిందని కేంద్ర మంత్రి తెలిపారు. తొలిదశలో 9 కిలోమీటర్ల మేర రివర్ ఫ్రంట్ పనులు చేస్తామని ప్రకటించారు. సీవరేజీ నీటిని శుద్ధి చేయడానికి ఎస్టీపీలు, ప్రతి ఐదు కిలోమీటర్ల మధ్యలో నీటి పరీక్షా కేంద్రాలు పెడతామన్నారు. మూసీ పునరుజ్జీవ పథకానికి అమృత్, అర్బన్ చాలెంజ్ ఫండ్ నుంచి నిధులిస్తామని చెప్పారు.

ప్రభాకర్‌రావుకు మధ్యంతర రక్షణ పొడిగింపు

» ఫోన్ ట్యాపింగ్ కేసు విచారణ వచ్చే నెల 9వ తేదీకి వాయిదా

న్యూఢిల్లీ, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): ఫోన్‌ట్యాపింగ్ కేసులో ప్రధాన నిందితుడు, తెలంగాణ ఇంటెలిజెన్స్ మాజీ చీఫ్ ప్రభాకర్‌రావుకు మధ్యంతర రక్షణను సుప్రీంకోర్టు పొడిగించింది. బీఆర్‌ఎస్ హయాంలో ఫోన్ ట్యాపింగ్‌కు పాల్పడినట్లు ఆరోపణలు రావడంతో 2023 మార్చి 10న పంజాగుట్ట పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. అప్పట్లో ఎస్ఐబీకి నేతృత్వం వహించిన ప్రభాకర్‌రావును ప్రధాన నిందితుడిగా చేర్చారు. ఈ క్రమంలోనే ప్రభాకర్‌రావు అమెరికా వెళ్లిపోయారు. ముందస్తు బెయిల్ కోసం ఆయన పెట్టుకున్న పిటిషన్‌ను హైకోర్టు తిరస్కరించగా.. సుప్రీంకోర్టులో సవాల్ చేశారు. సుప్రీంకోర్టు మధ్యంతర రక్షణ కల్పించడంతో దేశానికి వచ్చి సిట్ విచారణకు హాజరవుతున్నారు. ఈ నేపథ్యంలో సదరు పిటిషన్ మంగళవారం జస్టిస్ బీవీ నాగరత్న, జస్టిస్ మహదేవన్ ధర్మాసనం ఎదుట విచారణకు వచ్చింది. తదుపరి విచారణను డిసెంబరు 9వ తేదీకి వాయిదా వేసిన ధర్మాసనం.. అప్పటిదాకా ప్రభాకర్‌రావుకు మధ్యంతర రక్షణ కొనసాగుతుందని తెలిపింది.

నేడు పత్తి కొనుగోళ్లు పునఃప్రారంభం

» జిన్నింగ్ మిల్లర్లతో తుమ్మల చర్చలు సఫలం

హైదరాబాద్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): కాటన్, జిన్నింగ్ మిల్లర్లతో రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మంగళవారం జరిపిన చర్చలు ఫలించాయి. పలు డిమాండ్లతో పత్తి కొనుగోళ్లు నిలిపివేసిన జిన్నింగ్ మిల్లర్లు... బుధవారం కొనుగోళ్లను పునఃప్రారంభించేందుకు అంగీకరించారు. సచివాలయంలో సీసీఐ సీఎండీ లలిత్ కుమార్ గుప్తా, జిన్నింగ్ మిల్లర్ల అసోషియేషన్ ప్రతినిధులతో మంత్రి తుమ్మల మావేశం ఏర్పాటుచేశారు. ఈ సమావేశంలో జన్నింగ్ మిల్లర్లు ఎదుర్కొంటున్న సమస్యలను అసోసియేషన్ ప్రతినిధులు వివరించారు. మిల్లర్లు సమ్మెకు దిగితే రైతుల సమస్యలు రెట్టింపు అవుతాయని, ఇలాకాకుండా సామరస్యంగా కేంద్రంతో పోరాడుదామని, ఇందుకు రాష్ట్ర ప్రభుత్వం సహకరిస్తుందని తుమ్మల పేర్కొన్నారు. జిన్నింగ్ మిల్లర్ల సమస్యలపై నివేదిక తయారుచేసి... కేంద్ర జౌళిశాఖకు పంపించాలని వ్యవసాయ శాఖ కార్యదర్శి సురేంద్ర మోహన్‌ను మంత్రి ఆదేశించారు. కేంద్రం తీసుకొచ్చిన కపాస్ కిసాన్ యాప్, మొబైల్ ఓటీపీతో ఇబ్బందులు ఎదురవుతున్నాయని తుమ్మల అన్నారు. ఒక వేళ యాప్‌లో నమోదు చేసుకున్నప్పటికీ... సీసీఐ కొనుగోలు కేంద్రానికి పత్తి తీసుకెళ్తే ఇప్పుడు 7 క్వింటాళ్లు మాత్రమే తీసుకుంటున్నారని అన్నారు. మునుపు 12 క్వింటాళ్లు తీసుకునేవారని, ఫలితంగా మిగిలిన 5 క్వింటాళ్లు ఎక్కడ అమ్ముకోవాలో రైతులకు అర్థం కావటంలేదని పేర్కొన్నారు. 8 శాతం నుంచి 12 శాతం వరకు తేమ ఉంటేనే సీసీఐ పత్తి తీసుకుంటున్నదని, అకాల వర్షాలు, మొంథా తుఫానుతో పత్తి పంట దెబ్బతిన్నదని, ఇలాంటి పరిస్థితుల్లో కూడా తేమ నిబంధనను సడలించకపోవటం ఆందోళన కలిగిస్తోందన్నారు. జిన్నింగ్ మిల్లులను ఎల్-1, ఎల్-2 గా విభజించటంతో కొన్ని మిల్లుల్లో కొనుగోళ్లు జరగటంలేదని, కేంద్ర ప్రభుత్వం, సీసీఐ నిబంధనలు పత్తి రైతులకు శాపంగా మారాయని అన్నారు. అయితే జిన్నింగ్ మిల్లర్లు తమ సమస్యలపై కేంద్రంతో పోరాడాలని, రైతులను ఇబ్బందిపడితే రాష్ట్ర ప్రభుత్వం చూస్తూ ఊరుకోదని హెచ్చరించారు. కాగా రాష్ట్ర ప్రభుత్వం చొరవ తీసుకొని, జిన్నింగ్ మిల్లర్లతో చర్చలు జరిపి పత్తి కొనుగోళ్లను ప్రారంభిస్తే... తాము ప్రశ్నిస్తేనే ఇదంతా జరిగినట్లు బీఆర్ఎస్ నాయకులు ప్రగల్భాలు పలుకుతున్నారని తుమ్మల విమర్శించారు. మొక్కజొన్న కొనుగోళ్ల పరిమితిని 18 క్వింటాళ్ల నుండి 25 క్వింటాళ్లకు పెంచినట్లు తుమ్మల తెలిపారు. కేంద్ర ప్రభుత్వ నిబంధనల ప్రకారం నాఫెడ్ సేకరించే 25శాతం సోయా చిక్కుడు పరిమితిని కూడా ఎకరానికి 6.72 క్వింటాళ్ల నుంచి 10 క్వింటాళ్లకు పెంచి సేకరించాల్సిందిగా మార్క్‌ఫెడ్ అధికారులను ఆదేశించినట్లు తెలిపారు. కౌలు రైతులకు ఇబ్బందులు కలగకుండా నాఫెడ్ తీసుకొచ్చిన ఆధార్ బయోమెట్రిక్‌తోపాటు మొబైల్ ఓటీపీతో కూడా కొనుగోళ్లు జరపాలని మార్క్ ఫెడ్ అధికారులను ఆదేశించినట్లు వెల్లడించారు. ఇందిరా గాంధీ జయంతి సందర్భంగా బుధవారం రాష్ట్రవ్యాప్తంగా కోటిమంది మహిళలకు చీరలు పంపిణీ చేయనున్నట్లు తుమ్మల తెలిపారు. సీఎం రేవంత్‌రెడ్డి ఈ కార్యక్రమాన్ని ప్రారంభిస్తారని తెలిపారు. మహిళలకు రాష్ట్ర ప్రభుత్వం కానుకగా ఈ చీరలు పంపిణీ చేస్తోందని తెలిపారు.

హైదరాబాద్ అభివృద్ధికి సహకరించండి

» పనులకు అనుమతులు వేగంగా మంజూరు చేయండి

» దక్షిణ-పశ్చిమ ప్రాంతాల ప్రాంతీయ సమావేశంలో కేంద్ర ప్రభుత్వానికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి విజ్ఞప్తి



కేంద్ర మంత్రి ఖట్టర్‌కు జ్ఞాపికను అందజేస్తున్న సీఎం రేవంత్, చిత్రంలో ఏపీ మంత్రి నారాయణ

హైదరాబాద్ అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం సహకరించాలని సీఎం రేవంత్‌రెడ్డి కోరారు. వివిధ అభివృద్ధి పనులకు అనుమతులు వేగంగా జారీ చేయాలని విజ్ఞప్తి చేశారు. మెట్రో విస్తరణ, రీజినల్ రింగ్‌రోడ్డు, గోదావరి జలాల తరలింపు, మూసీ ప్రక్షాళనకు సహకరించాలన్నారు. మంగళవారం హైదరాబాద్‌లోని ఐటీసీ కోహినూర్‌లో దక్షిణ-పశ్చిమ రాష్ట్రాల పట్టణాభివృద్ధి శాఖ మంత్రుల ప్రాంతీయ సమావేశం జరిగింది. కేంద్ర పట్టణాభివృద్ధి శాఖ మంత్రి మనోహర్ లాల్ ఖట్టర్ నేతృత్వంలో జరిగిన ఈ సమావేశంలో సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడారు. రాబోయే ఏడాదిలో 3వేల విద్యుత్తు బస్సులను హైదరాబాద్ నగరంలో అందుబాటులోకి తెచ్చేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు తెలిపారు. డిసెంబరు 9న తెలంగాణ రైజింగ్-2047 విజన్ డాక్యుమెంట్‌ను విడుదల చేస్తున్నామన్నారు. 2034 నాటికి తెలంగాణను ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా, 2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్ల ఎకానమీగా తీర్చిదిద్దే లక్ష్యంతో పని చేస్తున్నామని చెప్పారు. దేశ ఆర్థిక వ్యవస్థలో 10 శాతం తెలంగాణ నుంచే అందించాలని భావిస్తున్నామన్నారు. హైదరాబాద్ నగర అభివృద్ధితోపాటు భారత్ ఫ్యూచర్ సిటీని అభివృద్ధి చేయబోతున్నామని, రాష్ట్రంలో డ్రై పోర్టు ఏర్పాటుకు ప్రణాళికలు రూపొందిస్తున్నామని తెలిపారు. తమ పోటీ.. దేశంలోని ఇతర రాష్ట్రాల నగరాలతో కాదని, సింగపూర్, టోక్యో, న్యూయార్క్ నగరాలతో పోటీ పడుతున్నామని అన్నారు. ఇందుకు కేంద్ర ప్రభుత్వ సహకారం అవసరమన్నారు. నగరాలు వికసిత్ భారత్‌కు అద్దాల వంటివని కేంద్ర మంత్రి మనోహర్‌లాల్ ఖట్టర్ అన్నారు. సమష్టిగా ముందుకు సాగేందుకు ఈ తరహా సమావేశాలు దోహదపడతాయని తెలిపారు. స్వచ్ఛభారత్ మిషన్-అర్బన్ కింద చేపట్టిన డంప్‌సైట్ రెమెడియేషన్ యాక్సిలరేటర్ ప్రోగ్రామ్ (డీఆర్‌ఏపీ), లెగసీ వేస్ట్ డంప్‌సైట్ల స్థితిగతులపై కేంద్ర మంత్రి ఆరా తీశారు. వంద శాతం ఫలితాలు సాధించేందుకు వీలుగా ఈ స్థలాలను దత్తత తీసుకునేందుకు మంత్రులు ముందుకు రావాలన్నారు. డీఆర్‌ఏపీ కింద 214 ప్రాంతాల్లో నిరంతర పర్యవేక్షణ చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఉదయం 11 గంటలకు ప్రారంభమైన ఈ సమావేశం సాయంత్ర 5 గంటల వరకు కొనసాగింది. ఈ సందర్భంగా పట్టణాభివృద్ధికి కేంద్రం అమలు చేస్తున్న పథకాలు, నిధుల విడుదల, రాష్ట్ర ప్రభుత్వాల మ్యాచింగ్ గ్రాంట్ తదితర అంశాలపై చర్చించారు. అమృత్ పథకం కింద మంచి నీటి సరఫరా మెరుగుపరచడం, శుద్ధి చేసిన నీటి పునర్వినియోగ ప్రణాళికలు, వర్షపునీటి నిల్వ, జల వనరుల పునరుజ్జీవంపై చర్చించారు. ప్రధాన మంత్రి ఆవాస్ యోజన- అర్బన్ కింద చేపట్టిన గృహ నిర్మాణ పురోగతిపైనా సమీక్షించారు. తొలి విడత చర్చల్లో హైదరాబాద్ పట్టణ ప్రాథమ్యాలను ప్రదర్శిస్తూ తెలంగాణ రైజింగ్-2047 విజన్‌పై చర్చించినట్లు కేంద్ర పట్టణాభివృద్ధి మంత్రిత్వ శాఖ విడుదల చేసిన ప్రకటనలో తెలిపింది. రెండో విడత చర్చల్లో రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లో కేంద్ర పథకాలు, వాటి పురోగతిపై సమీక్ష నిర్వహించారు. సమావేశంలో తెలంగాణ, గుజరాత్, మహారాష్ట్ర, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల పురపాలకశాఖ మంత్రులు, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

అసెంబ్లీలోనూ సెంట్రల్ హాల్!

» అసెంబ్లీ అధికారులకు సీఎం సూచన

పార్లమెంటు తరహాలో అసెంబ్లీలోనూ సెంట్రల్ హాల్ ఏర్పాటు చేయాలని సీఎం రేవంత్‌రెడ్డి.. అసెంబ్లీ కార్యదర్శికి, అధికారులకు సూచించారు. అసెంబ్లీలో ప్రస్తుతం ఉన్న ఎమ్మెల్యే లాంజ్‌ను విస్తరించి.. సెంట్రల్ హాల్‌గా పునర్‌నిర్మించాలన్నారు. దీనిని పూర్తిగా మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలకే పరిమితం చేయాలని అన్నారు. అసెంబ్లీ భవనంలో ఉన్న పాత శాసనసభా మందిరాన్ని శాసన మండలి సమావేశాలకు వినియోగించాలని నిర్ణయించిన ప్రభుత్వం.. ఆగాఖాన్ ట్రస్టు ఆధ్వర్యంలో ఆ భవనాన్ని పునరుద్ధరిస్తున్న విషయం తెలిసిందే. ఈ పునరుద్ధరణ పనులను ముఖ్యమంత్రి మంగళవారం పరిశీలించారు. త్వరితగతిన పనులు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. అసెంబ్లీ లాబీలు, ఎమ్మెల్యే లాంజ్‌ను కూడా పరిశీలించిన సీఎం.. ఆ లాంజ్‌ను విస్తరించి సెంట్రల్ హాల్‌గా అభివృద్ధి చేయాలన్నారు. ఇందుకు సంబంధించి ప్రణాళిక రూపొందించాలని నిర్దేశించారు. కాగా, స్పీకర్ ప్రసాద్‌కుమార్‌తో సీఎం రేవంత్‌రెడ్డి కొద్దిసేపు ముఖాముఖి సమావేశమైనట్లు తెలిసింది. ఎమ్మెల్యేల అనర్హత పిటిషన్లపై విచారణకు సంబంధించి సుప్రీంకోర్టు తీవ్ర వ్యాఖ్యలు చేసిన నేపథ్యంలో వీరి భేటీ ఆసక్తికరంగా మారింది.



బనకచర్లకు అనుమతులు ఇవ్వొద్దు

» ఆల్మట్టి ఎత్తు పెంచకుండా ఆదేశాలివ్వండి

» సమ్మక్క-సారక్క ప్రాజెక్టుకు అనుమతులివ్వండి

» కేంద్ర జల్‌శక్తి మంత్రి పాటిల్‌కు ఉత్తమ్ విజ్ఞప్తి

న్యూఢిల్లీ, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): పోలవరం- బనకచర్ల ప్రాజెక్టుకు అనుమతులు ఇవ్వొద్దని కేంద్ర జల్‌శక్తి మంత్రి సీఆర్ పాటిల్‌ను రాష్ట్ర మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి కోరారు. ఈ మేరకు ఢిల్లీలో కేంద్ర మంత్రిని కలిసి వినతి పత్రం అందజేశారు. అనంతరం సీడబ్ల్యూసీ ఛైర్మన్ అతుల్ జైన్‌తో సమావేశమయ్యారు. ఆ వివరాలను ఉత్తమ్ మీడియాకు వివరించారు. గోదావరిలో వరద జలాల తరలింపును సహించేది లేదని అన్నారు. బనకచర్ల ప్రాజెక్టు పేరును మార్చి గోదావరి జలాలను తరలించేందుకు ఏపీ కుట్ర చేస్తోందని, ఇది ముమ్మాటికీ చట్ట విరుద్ధమని తెలిపారు. గోదావరి బేసిన్‌లో సమ్మక్క-సారక్క ప్రాజెక్టుకు సంబంధించిన డీపీఆర్‌ను ఇప్పటికే సీడబ్ల్యూసీకి అందజేశామని, వెంటనే అనుమతి ఇవ్వాలని కోరినట్లు చెప్పారు. ఏపీ-తెలంగాణ మధ్య 811 టీఎంసీల కృష్ణా నీటిని ఇరు రాష్ట్రాలకు కేటాయించే అంశంపై బ్రిజేశ్ ట్రిబ్యునల్ విచారణను వేగవంతం చేసేలా చొరవ చూపాలని విజ్ఞప్తి చేసినట్లు చెప్పారు. ఆల్మట్టి డ్యామ్ ఎత్తు పెంపుపై సుప్రీంకోర్టులో స్టే ఉన్నప్పటికీ.. కర్ణాటక ప్రభుత్వం సన్నాహాలు చేస్తోందని ఆరోపించారు. ఆల్మట్టి డ్యామ్ ఎత్తు పెంచితే..తెలంగాణకు అన్యాయం జరుగుతుందని చెప్పారు. ప్రాణహిత-చేవేళ్ల, నారాయణపేట-కొడంగల్, సీతారామ ప్రాజెక్టులతోపాటు పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకం, చిన్న కాళేశ్వరం, మోదికుంట వాగు ప్రాజెక్టులకు నిధులివ్వాలని కోరామన్నారు. కృష్ణా నుంచి ఏపీ తరలించుకుపోతున్న నీటి లెక్కలు తీసేందుకు 18 టెలిమెట్రీ స్టేషన్లు ఏర్పాటు చేశామని, మరో 20 చోట్ల ఏర్పాటు చేసే చర్యలను వేగవంతం చేయాలని కోరినట్లు చెప్పారు.

ప్రజల సమాచారం.. బీఆర్ఎస్ పరం!

» రాజకీయ లబ్ధికి వాడుకున్న గత సర్కారు

» ఇది తీవ్ర నేరం.. విచారణ చేపడతాం

» బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటాం

» 'ఆంధ్రజ్యోతి'తో ఐటీ మంత్రి శ్రీధర్‌బాబు



హైదరాబాద్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రజల వ్యక్తిగత సమాచారాన్ని గత బీఆర్ఎస్ సర్కారు తస్కరించిందని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు అన్నారు. ఆ సమాచారాన్ని రాజకీయ లబ్ధికి ఉపయోగించుకుందని ఆరోపించారు. ఇది తీవ్రమైన నేరమన్నారు. ప్రజల వ్యక్తిగత సమాచారాన్ని భద్రంగా ఉంచాల్సిన ప్రభుత్వమే దుర్వినియోగం చేసిందని.. దీనిపై సమగ్ర విచారణ జరిపిస్తామని స్పష్టం చేశారు. బాధ్యులపై కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. మంగళవారం మీసేవ వాట్సాప్ సేవలను ప్రారంభించిన అనంతరం మంత్రి 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడారు. కేసీఆర్ నేతృత్వంలోని గత ప్రభుత్వం ప్రజల సమాచారాన్ని దుర్వినియోగం చేసిందని రాష్ట్ర ఎన్నికల సంఘం పేర్కొనడాన్ని ప్రస్తావించగా.. మంత్రి స్పందించారు. పదేళ్లపాటు రాష్ట్రాన్ని పాలించిన బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన అవినీతి, కుంభకోణాలు, అధికార దుర్వినియోగానికి పాల్పడిందని ధ్వజమెత్తారు. ఈ క్రమంలో ప్రజల వ్యక్తిగత సమాచారాన్నీ దుర్వినియోగం చేసిందని, ఇది తీవ్రమైన అంశమని చెప్పారు. రాజకీయ ప్రయోజనాల కోసం గత ప్రభుత్వం రాష్ట్రంలోని కోట్లాది మంది ప్రజల వ్యక్తిగత సమాచారాన్ని దుర్వినియోగం చేసినట్లు ఇటీవలే వెలుగులోకి రాగా.. అదే విషయాన్ని రాష్ట్ర ఎన్నికల సంఘం సైతం చెప్పిందని, దీన్ని తీవ్రమైన నేరంగా పరిగణిస్తున్నామని శ్రీధర్‌బాబు తెలిపారు. సంక్షేమ పథకాల పేరు చెప్పి గత ప్రభుత్వం రాష్ట్ర ఎన్నికల సంఘం నుంచి ప్రజల వ్యక్తిగత సమాచారాన్ని సేకరించిందన్నారు. ఎస్ఈసీ చెప్పిన ప్రతి అంశంపై ప్రభుత్వం సమగ్ర విచారణ జరిపిస్తుందని చెప్పారు. ఎవరినీ ఉపేక్షించబోమని, బాధ్యులైన వారిపై కఠిన చర్యలు తప్పవని మంత్రి శ్రీధర్‌బాబు తెలిపారు.

త్వరలో విచారణకు ఆదేశం..

ప్రజల సమాచారాన్ని దుర్వినియోగం చేయడంపై రాష్ట్ర ప్రభుత్వం సమగ్ర విచారణ జరిపించాలని నిర్ణయించింది. ప్రాథమిక వివరాలు సేకరిస్తున్న ప్రభుత్వం దీనిపై త్వరలోనే విచారణకు ఆదేశించనుంది. 'రాష్ట్రంలో సంక్షేమ పథకాల అమలు కోసం ఓటర్ల వివరాలు ఇవ్వాలన్న గత ప్రభుత్వ విజ్ఞప్తి మేరకు సమాచారం అందించాం. అయితే గత సర్కారు దాన్ని దుర్వినియోగం చేసింది' అని రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి సుదర్శన్‌రెడ్డి గత నెలలో చెప్పిన విషయం తెలిసిందే.

కోటి మంది మహిళలకు చీరలు

నాణ్యతలో రాజీపడొద్దు.. పారదర్శకంగా పంపిణీ.. నేడు ఇందిరాగాంధీ జయంతి సందర్భంగా ప్రారంభం

» ఇందిరమ్మ చీరలపై సమీక్షలో సీఎం రేవంత్‌రెడ్డి

» రాష్ట్రంలో విద్యా ప్రమాణాలు పెంచుతాం: సీఎం

» అంబేడ్కర్ ఓపెన్ వర్సిటీలో డిజిటల్ అకాడమీ

హైదరాబాద్/హైదరాబాద్ సిటీ, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కోటి మంది మహిళలకు ఇందిరమ్మ చీరలు అందజేయాలని ప్రభుత్వం నిర్ణయించిందని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తెలిపారు. బుధవారం మాజీ ప్రధాని ఇందిరాగాంధీ జయంతి సందర్భంగా చీరల పంపిణీని ప్రారంభించనున్నట్లు పేర్కొన్నారు. ఇందిరమ్మ చీరలకు సంబంధించి మంగళవారం మంత్రి సీతక్కతో కలిసి ఉన్నతాధికారులతో సీఎం సమీక్ష నిర్వహించారు. ఇందిరమ్మ చీరలను పూర్తిగా సిరిసిల్ల చేనేత కార్మికులు తయారు చేస్తున్నారని, ఉత్పత్తి ఆలస్యమవుతున్న నేపథ్యంలో రెండు దశల్లో పంపిణీ చేపట్టాలని అధికారులకు సూచించారు. ఈ మేరకు తొలి దశలో గ్రామీణ ప్రాంతాల్లో పంపిణీ చేయాలన్నారు. ఇందిరాగాంధీ జయంతి రోజు మొదలుపెట్టి.. తెలంగాణ తల్లి అవతరణ దినోత్సవం (డిసెంబరు 9) నాటికి గ్రామీణ ప్రాంతాల్లో చీరల పంపిణీ ప్రక్రియను పూర్తి చేయాలని ఆదేశించారు. రెండో దశలో పట్టణ ప్రాంతాల్లో మార్చి 1 నుంచి 8న అంతర్జాతీయ మహిళా దినోత్సవం వరకు పంపిణీ పూర్తి చేయాలన్నారు. చీరల నాణ్యత విషయంలో ఎట్టి పరిస్థితుల్లోనూ రాజీ పడొద్దని, నాణ్యమైన చీరలు అందించాలని అన్నారు. సాంకేతికతను వినియోగించుకుని చీరల పంపిణీ పారదర్శకంగా జరిగేలా చూడాలని, ఈ ప్రక్రియను నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. కాగా, బుధవారం ఇందిరాగాంధీ జయంతి సందర్భంగా మధ్యాహ్నం 12 గంటలకు సీఎం రేవంత్‌రెడ్డి నెక్లెస్ రోడ్‌లోని ఇందిరాగాంధీ విగ్రహానికి నివాళులర్పించిన అనంతరం ఇందిరమ్మ చీరల పంపిణీని ప్రారంభిస్తారు. అనంతరం సచివాలయం నుంచి గ్రామీణ ప్రాంత మహిళలతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ముఖాముఖి మాట్లాడుతారు. రాష్ట్ర మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు అందుబాటులో ఉన్న కలెక్టరేట్ల నుంచి వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొంటారు.

విద్యా ప్రమాణాలు పెంచుతాం..

రాష్ట్రంలో విద్యా ప్రమాణాలు పెంపొందించడంతోపాటు విద్యా వ్యవస్థలో సమూల మార్పులు తెచ్చేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. రాష్ట్రంలోని విశ్వవిద్యాలయాలను బలోపేతం చేయడమే కాకుండా అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీని నాలెడ్జ్ హబ్‌గా తీర్చిదిద్దడంలో ప్రభుత్వం అంకితభావంతో పనిచేస్తుందని తెలిపారు. ఇందులో భాగంగా అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీలో ఇంటిగ్రేటెడ్ డిజిటల్ ఎడ్యుకేషన్ అకాడమీ (ఐడీఈఏ)ని స్థాపించనున్నట్లు పేర్కొన్నారు. దీనికి సంబంధించి యూనివర్సిటీ వీసీ ప్రొఫెసర్ ఘంటా చక్రపాణి.. కామన్వెల్త్ ఆఫ్ లెర్నింగ్ (సీఓఎల్) అధ్యక్షుడు ప్రొఫెసర్ పీటర్ స్కాట్‌తో మంగళవారం సీఎం రేవంత్‌రెడ్డి సమక్షంలో జూబ్లీహిల్స్‌లోని సీఎం అధికారిక నివాసంలో అవగాహన ఒప్పందం కుదుర్చుకున్నారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ సలహాదారు కె.కేశవరావు, అంబేడ్కర్ వర్సిటీ రిజిస్ట్రార్ ఎల్వీకే రెడ్డి, సీఎం ప్రత్యేక కార్యదర్శి అజిత్‌రెడ్డి, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

దేశానికే తలమానికంగా ఎర్త్ సైన్సెస్ వర్సిటీ

» 54 ప్రయోగశాలలు.. ఒక్కో ల్యాబ్‌కు రూ.30లక్షలు

» హాస్టళ్లకు 14 బ్లాకులు.. అడ్మినిస్ట్రేషన్‌కు మరో ఆరు

» రూ.వెయ్యి కోట్లతో అధికారుల ప్రతిపాదనలు

» డిసెంబరులో సీఎం చేతుల మీదుగా ప్రారంభోత్సవం

» ముఖ్యమంత్రిని ఆహ్వానించిన తుమ్మల


ప్రస్తుతం ఎర్త్ సైన్స్ యూనివర్సిటీ కొనసాగుతున్న భవనం

కొత్తగూడెం, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): కొన్ని నెలల క్రితం వరకు అది ఒక సాధారణ ఇంజనీరింగ్ కళాశాల.. కానీ ప్రస్తుతం మన్మోహన్‌సింగ్ ఎర్త్‌సైన్స్ యూనివర్సిటీగా మారింది. దేశంలోనే ఈ తరహా సాంకేతిక విద్యనందించే తొలి విద్యా సంస్థగా అవతరించిన ఈ కేంద్రాన్ని అత్యాధునిక సాంకేతిక, మౌలిక సదుపాయాలతో తీర్చిదిద్దేలా సర్కారు మాస్టర్ ప్లాన్ రూపొందించింది. మంత్రి తుమ్మల చొరవతో 300 ఎకరాల్లో దేశానికే తలమానికంగా ఉండేలా వర్సిటీని నిర్మించేందుకు సిద్ధమవుతున్నారు. దానికి సంబంధించి రూ.వెయ్యి కోట్లతో అధికారులు ప్రతిపాదనలు పంపించారు. వచ్చే మూడేళ్లలో నిర్మాణాలన్నీ పూర్తిచేయాలన్న లక్ష్యంతో పనిచేస్తున్నారు. కాగా, డిసెంబరు మొదటివారంలో సీఎం చేతులమీదుగా ఈ యూనివర్సిటీని ప్రారంభించనున్నారు. దానికి సంబంధించి మంగళవారం మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సీఎంను కలిసి ఆహ్వానం పలికారు. సీఎం రాక ఖరారైన వెంటనే మంత్రి తుమ్మల విద్యాశాఖ కార్యదర్శి శ్రీధర్, కొత్తగూడెం జిల్లా అధికారులు, సంబంధిత శాఖలను అప్రమత్తం చేశారు. డిసెంబరు మొదటి వారంలో వర్సిటీని ప్రారంభించేందుకు అన్నీ సిద్ధం చేయాలని ఆదేశించారు.

సీఎస్ఆర్ ఫండ్స్ ద్వారా నిధుల సమీకరణ

దేశంలోనే మొట్టమొదటి ఎర్త్ సైన్స్ వర్సిటీని కొత్తగూడెంలో ఏర్పాటు చేశారు. బీఎస్సీలో జియాలజీ, ఎన్విరాన్‌మెంటల్ సైన్స్‌తోపాటు ఎమ్మెస్సీలో జియాలజీ, ఎన్విరాన్‌మెంటల్ సైన్స్, ఓషనోగ్రఫీ, అట్మాస్ఫియర్ సైన్స్, జియో ఇన్ఫర్మేషన్ సైన్సెస్ వంటి కోర్సులను అందిస్తున్నారు. ఈ యేడాది అడ్మిషన్లు ప్రారంభించగా.. బీఎస్సీ జియాలజీలో 60 సీట్లకుగాను 14 మంది, ఎన్విరాన్‌మెంటల్ సైన్స్‌లో 37 మంది చేరారు. కాగా, యూనివర్సిటీ అభివృద్ధి కోసం రూ.వెయ్యి కోట్లతో ప్రతిపాదనలు పంపించగా.. అందులో తరగతి గదులు, హాస్టల్ భవనాలు, గ్రంథాలయం, సమావేశ మందిరం ఆట స్థలాలు, రిసెర్చ్ సెంటర్ లాంటి నిర్మాణాలకు రూ.500 కోట్ల వరకు ఉండగా.. మరో రూ.500 కోట్లతో ప్రింటింగ్ మెషీన్లు, ఇంటర్నెట్, కంప్యూటర్లు, ఏసీల వంటి వాటితోపాటు.. ల్యాబ్‌లపై ప్రత్యేకంగా దృష్టి సారించారు. అండర్ గ్రాడ్యుయేషన్‌కు సంబంధించి 24, పోస్టు గ్రాడ్యుయేషన్‌కు సంబంధించి 30 ప్రయోగశాలలు ఏర్పాటు చేయనున్నారు. ప్రతీ ప్రయోగశాలకు రూ.30 లక్షల చొప్పున ఖర్చు చేయనున్నారు. కాగా, యూనివర్సిటీకి సంబంధించి సీఎస్ఆర్ ఫండ్స్ ద్వారా నిధులు సమకూరేలా మంత్రి తుమ్మల సమన్వయం చేస్తున్నారు.

హాస్టళ్లకు 14 బ్లాకులు.. 1300 గదులు..

యూనివర్సిటీలో విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా ఉండేలా హాస్టళ్ల నిర్మాణాలను చేపడుతున్నారు. ప్రస్తుతం కొనసాగుతున్న ఇంజనీరింగ్ కళాశాలకు సంబంధించి 1800 మంది, ఎర్త్‌సైన్స్ విద్యార్థులు 2,500 మందిని అంచనా వేసి భవనాల నిర్మాణాల ప్లాన్‌ను రూపొందించారు. మొత్తం 14 బ్లాకుల్లో 1,300 గదులు ఏర్పాటు చేసి.. ఒక్కో గదికి ఇద్దరు విద్యార్థులు మాత్రమే ఉండేలా హాస్టళ్లకు ప్రణాళికలు సిద్ధం చేశారు. డిపార్ట్‌మెంట్లు, అడ్మినిస్ట్రేటివ్, స్పోర్ట్ కాంప్లెక్స్‌లకు సంబంధించి మరో ఆరు బ్లాకుల్లో నిర్మాణాలు చేపట్టనున్నారు.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda press, Sy no.1054, Andhrajyothi Building, Madikonda Village, Khazipet Mandal, Hanamkonda (Dist), Pin. 506142, Editor: N.Rahul Kumar. Ph. No. (0870) 2100480/84, RNI No:APTEL/2003/9741, Managing Director : Vemuri Radha Krishna Founder: K.L.N.Prasad.